సత్యమేవ జయతే

సాక్షి

'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 230

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

ఇదీ రక్తబంధమే...



నవంబర్ 14 బాలల దినోత్సవం నేపథ్యంలో హైదరాబాద్‌లోని 'తలసేమియా సికిల్ సెల్ సొసైటీ'కి బాలతారలను తీసుకువెళ్లింది సాక్షి. బాల తారలు మోక్షజ్ఞ, తనస్వీ, అనన్యలు తలసేమియా బారిన పడిన చిన్నారులను ఆత్మీయంగా పలకరించారు. వారిలో ఆత్మస్థైర్యం నింపారు. ఈ విశేషాలు 'సాక్షి ఫ్యామిలీ'లో....

వివరాలు 13లో ▶

సాక్షి SAKSHI TV — నేటి మధ్యాహ్నం 12.30 గంటలకు సాక్షి టీవీలో

నిధులు.. నియామకాలు!

యూనివర్సిటీల్లో నాణ్యత మెరుగుకు కావాల్సినవి ఇవే

- ఆర్థిక సమస్యలతో కునారిల్లుతున్న రాష్ట్ర వర్సిటీలు
- 72 శాతం అధ్యాపక పోస్టులు ఖాళీ
- తాత్కాలిక సిబ్బందితోనే బోధన మమ.. అడుగంటిపోతున్న విద్యా ప్రమాణాలు
- న్యాక్ 'ఎ' ప్లస్ ప్లస్ గుర్తింపు ఒక్క వర్సిటీకి లేని వైనం
- వేతనాలకూ ఇబ్బంది పడుతున్న కొన్ని వర్సిటీలు
- సీఎం నివేదికలు కోరిన నేపథ్యంలో వీసీల తర్జనభర్జనలు



రాష్ట్రంలోని 11 ప్రభుత్వ వర్సిటీల్లో రెండింటికి ఇప్పటికీ జాతీయ మదింపు, గుర్తింపు కౌన్సిల్ (న్యాక్) ఉత్తమ గ్రేడ్ రాలేదు. కేవలం రెండింటికే 'ఎ' ప్లస్ దక్కింది. జేఎన్‌టీయూహెచ్ ఎన్ని ప్రయత్నాలు చేసినా 'ఎ' గ్రేడ్ స్థాయికి రాలేకపోతోంది.

- వివరాలు 16లో

నూతన సీజేఐ జస్టిస్ ఖన్నా



సుప్రీంకోర్టు 51వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా సోమవారం ప్రమాణం చేయనున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనతో ప్రమాణ స్వీకారం చేయిస్తారు.

- వివరాలు 6లో

నాపై కక్ష సాధించుకోండి

పాలమూరు అభివృద్ధిని అడ్డుకోకండి: సీఎం రేవంత్‌రెడ్డి



- తెలంగాణ వచ్చి పదేళ్లయినా పాలమూరు నుంచి ఆగని వలసలు
- వాటిని ఆపేందుకు ప్రయత్నిస్తుంటే కొందరు చిల్లర రాజకీయాలతో అడ్డుకుంటున్నారు
- అలా చేసినవారిని పాలమూరు బిడ్డలు క్షమించబోరని వ్యాఖ్య
- కురుమూర్తి స్వామిని దర్శించుకున్న ముఖ్యమంత్రి
- రూ.110 కోట్లతో ఎలివేటెడ్ కారిడార్, ఘాట్ రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన

2లో



సూర్యాపేటలో మూతపడిన ఐటీ హబ్

పట్టణాల్లో ఐటీ వెలవెల!

అట్టహాసంగా ఐటీ హబ్‌లు ఏర్పాటు చేసినా చేకూరని ప్రయోజనం | పెద్దగా ముందుకురాని కంపెనీలు.. వచ్చిన వాటిలోనూ కొన్ని వెనక్కి | అద్దెలు భారీ స్థాయిలో ఉండటంతో కార్యకలాపాలకు సంస్థల విముఖత | కనీసం స్కిల్ సెంటర్ల కోసమైనా వినియోగిస్తే మేలంటున్న ప్రజాప్రతినిధులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రాష్ట్రంలోని ద్వితీయశ్రేణి పట్టణాలు, నగరాలకు ఐటీ రంగాన్ని విస్తరించే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐటీ హబ్‌లు వెలవెలబోతున్నాయి. లక్ష చదరపు అడుగుల నుంచి 1.75 లక్షల చదరపు అడుగుల్లో రూ. 50 కోట్ల నుంచి రూ. 90 కోట్ల వ్యయంతో నిర్మించిన భవనాలన్నీ కంపెనీలు పెద్దగా రాకపోవడంతో ఎక్కువ శాతం ఖాళీగా దర్శనమిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో అట్టహాసంగా వాటిని ఏర్పాటు చేశారు. కానీ ఆ తరువాత సరైన నిర్వహణ లేదు. గతేడాది అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఐటీ హబ్‌లపై దృష్టిపెట్టకపోవడంతో మొదట్లో కార్యకలాపాలు ప్రారంభించిన కంపెనీల్లో చాలా వరకు వివిధ కారణాలతో వెనక్కి వెళ్లిపోతున్నాయి.

సంప్రదింపులు జరిపే వారేరీ?

తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) నేతృత్వంలో 2019 నుంచి ఒక్కో పట్టణంలో ఐటీ హబ్‌ను ఏర్పాటు చేసినా కంపెనీలతో సంప్రదింపులు జరిపే వారు లేక ప్రధాన కంపెనీలేవీ ముందుకు రావడం లేదు. నల్లగొండ, మహబూబ్‌నగర్, సిద్దిపేట, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, సూర్యాపేట పట్టణాల్లోని ఐటీ హబ్‌లకు చిన్నాచితక కంపెనీలు వచ్చినా యువతకు పెద్ద ఎత్తున వేతనాలు ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో వాటిల్లో చేరే వారు కరువయ్యారు. ఇక హనుమకొండలోని మడికొండలో ఏర్పాటు చేసిన ఐటీ హబ్‌లో దిగ్గజ ఐటీ సంస్థ టెక్ మహీంద్ర ఒక బ్రాంచీని ఏర్పాటు చేసినా ఆ తర్వాత అనివార్య కారణాలతో దాన్ని మూసేసింది. రాష్ట్రవ్యాప్తంగా మొదట్లో కార్యకలాపాలు ప్రారంభించిన కంపెనీల్లో చాలా వరకు వెనక్కి వెళ్లిపోవడంతో ఐటీ హబ్‌లు అలంకారప్రాయంగా మారుతున్నాయి. ఫలితంగా జిల్లా కేంద్రాల్లో నివసించే యువతకు స్థానికంగానే ఐటీ కొలువులు అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.


నల్లగొండలోని ఐటీ హబ్

ప్రాంతం	మొదలైన ఏడాది	వచ్చిన కంపెనీలు	మొత్తం ఉద్యోగులు	ప్రస్తుత కంపెనీలు	ప్రస్తుత ఉద్యోగులు
నల్లగొండ	2022	17	1,200	7	240
నిజామాబాద్	2023	13	350	12	250
ఖమ్మం	2021	19	-	12	432
సిద్దిపేట	2023	20	-	11	148
కరీంనగర్	2020	18	-	10	240
ఆదిలాబాద్	2022	-	-	2	-
మహబూబ్‌నగర్	2023	9	-	2	44
హనుమకొండ	2023	6	440	3	320


నల్లగొండ ఐటీ హబ్‌లో ఖాళీగా ఉన్న కుర్చీలు

అడ్డగోలుగా అద్దెలు..

ప్రభుత్వ స్థలాల్లో, ప్రభుత్వ నిధులతో ఐటీ హబ్‌ల నిర్మాణం జరిగింది. వాటి నిర్వహణ బాధ్యతను ప్రైవేటు సంస్థలకు అప్పగించడంతో వారు ఇష్టానుసారంగా భవనాల అద్దెలను నిర్ణయిస్తున్నారు. దీంతో వాటిలో కార్యాలయాల ఏర్పాటుకు కంపెనీలు ముందుకు రావడం లేదు. నల్లగొండ తదితర పట్టణాల్లో నిర్మించిన ఐటీ హబ్‌లలో ఒక చదరపు అడుగుకు (ఎస్ఎఫ్‌టీ) అద్దె రూ. 1,400కుపైగా నిర్ణయించడంతో అప్పట్లో పలు కంపెనీలు ముందుకు రాలేదన్న విమర్శలు ఉన్నాయి. హైదరాబాద్ లాంటి ప్రాంతాల్లోనే ఎస్ఎఫ్‌టీకి రూ.2 వేలు మొదలు 7 వేల వరకు ఉండగా జిల్లాల్లోని ఐటీ హబ్‌లలో అంతమొత్తం వెచ్చించేందుకు కంపెనీలు ముందుకురావట్లేదు.

స్కిల్ సెంటర్లన్నా ఏర్పాటు చేయాలి..

ఐటీ హబ్ భవనాల్లో ఇప్పటివరకు సగం అంతస్తుల్లోనూ కంపెనీలు ఏర్పాటు కాలేదు. ఈ నేపథ్యంలో వాటిని సద్వినియోగపరచుకునేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం రూ. కోట్లు వెచ్చించి స్కిల్ సెంటర్ల నిర్మాణానికి చర్యలు చేపడుతుండటంతో ఐటీ టవర్లను స్వాధీనం చేసుకొని స్కిల్ సెంటర్లకు వినియోగించుకోవాలని ప్రజాప్రతినిధులు సూచిస్తున్నారు.



పేరొందిన కంపెనీలు రావాలి

యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడాలంటే పేరొందిన ఐటీ కంపెనీలను పట్టణాలకు తీసుకురావాలి. ప్రభుత్వం అందుకు కృషి చేయాలి.
- దుర్గాప్రసాద్, కట్టంగూరు

‘సర్వే’ను బహిష్కరించిన ఐలాపూర్ ఆదివాసీలు


గ్రామంలో సమగ్ర సర్వేను బహిష్కరించి అధికారులకు తీర్మాన పత్రం ఇస్తున్న మాజీ సర్పంచ్ మల్లెల లక్ష్మయ్య, గ్రామస్తులు

కన్నాయిగూడెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను ఆదివారం ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని ఆదివాసీ గ్రామమైన ఐలాపూర్‌లో ప్రజలు బహిష్కరించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేసి సర్వేకు వచ్చిన అధికారులకు అందజేశారు. స్వాతంత్ర్యానికి ముందు నుంచి ఉన్న తమ గ్రామానికి సరైన రోడ్డు మార్గం లేక ఇబ్బంది పడుతున్నామని, ప్రభుత్వాలు, పాలకులు మారినా ఇప్పటి వరకు తమ గ్రామాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. ఐటీడీఏ నుంచి కూడా గ్రామానికి మేలు జరగలేదని మాజీ సర్పంచ్ మల్లెల లక్ష్మయ్య అన్నారు. అర్హులైన రైతుల పొలాల్లో బోర్లు వేసి సుమారు ఏడేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు విద్యుత్ లైన్ వేయలేదని, వేసిన బోర్లు నిరుపయోగంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామానికి ఏటూరు నాగారానికి మధ్యలో ఉన్న సుమారు 10 కిలోమీటర్ల రోడ్డు మార్గానికి 2018లో ప్రభుత్వం నిధులు ఇచ్చినా అటవీ శాఖ అనుమతులు లేవంటూ పనులను నిలిపివేశారని లక్ష్మయ్య మండి పడ్డారు. గ్రామానికి రోడ్డు, విద్యుత్, తాగు, సాగు నీరు, వైద్య సదుపాయాలు అందించాకే సమగ్ర కులగణన చేయాలని డిమాండ్ చేశారు.

ఇంటింటి సర్వేలో అనవసర ప్రశ్నలు: కూనంనేని



సాక్షి, హైదరాబాద్: ఇంటింటి సర్వేలో భాగంగా సేకరిస్తున్న సమాచారంతో వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, దీనిపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కులగణన సర్వే మంచిదే అయినప్పటికీ అందుకు సంబంధించిన అంశాలకే పరిమితం కావాలని సూచించారు. రాష్ట్రంలో సైబర్ నేరాలు పెరిగిన నేపథ్యంలో కులగణనలో అవసరం లేని ప్రశ్నలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆయన సూచించారు.


ఈ శాఖతో అభివృద్ధి చేసిన జనాభాను యుద్ధంలో చనిపోయిన సైనికుల స్థానంలో నింపుతారు అంతేగా సార్!

నాపై కక్ష సాధించుకోండి



కురుమూర్తి స్వామి ఆలయంలో సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు కోమటిరెడ్డి, దామోదర • సభకు హాజరైన ప్రజలు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధిని అడ్డుకోకండి: సీఎం రేవంత్
- కురుమూర్తి స్వామిని దర్శించుకున్న ముఖ్యమంత్రి
- రూ.110 కోట్లతో ఎలివేటెడ్ కారిడార్, ఘాట్ రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన

సాక్షి ప్రతినిధి, మహబూబ్ నగర్: ‘‘ఉమ్మడి రాష్ట్రంలోనైనా, తెలంగాణలోనైనా వలసలకు మారుపేరు పాలమూరు జిల్లా. అలాంటి జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి కాకపోవడానికి కారణం గత పాలకుల నిర్లక్ష్యమే. తెలంగాణ వచ్చి పదేళ్లయినా వలసలు కొనసాగుతున్నాయి. పాలమూరు జిల్లా బిడ్డగా సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయకపోతే నన్ను చరిత్ర క్షమించదు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు పూర్తిచేసి పాడి పంటలతో విలసిల్లేలా మా ప్రభుత్వ నిర్ణయాలుంటాయి..’’అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఆదివారం ఆయన రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర రాజనర్సింహలతో కలసి మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం అమ్మాపురంలో కురుమూర్తి స్వామిని దర్శించుకున్నారు. అక్కడ రూ.110 కోట్ల వ్యయంతో చేపట్టిన ఎలివేటెడ్ కారిడార్, ఘాట్ రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడారు.

చిల్లర మల్లర రాజకీయాలు చేస్తున్నారు

నారాయణపేట– మక్తల్– కొడంగల్ ప్రాజెక్ట్ పూర్తి చేసి త్వరలోనే ఆయా నియోజకవర్గాలకు కృష్ణా జలాలు పారిస్తామని సీఎం రేవంత్ చెప్పారు. ఆరేడు దశాబ్దాలుగా వెనుకబడ్డ ఈ ప్రాంతంలో వలసలు ఆపాలని తాను చేస్తున్న అపర భగీరథ ప్రయత్నాన్ని అడ్డుకునేందుకు కొందరు ఆరోపణలతో, చిల్లర మల్లర రాజకీయాలు చేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తనపై కోపం ఉంటే రాజకీయంగా కక్ష సాధించుకోవాలని.. అంతేతప్ప ప్రాజెక్టులను, జిల్లా అభివృద్ధిని అడ్డుకోవద్దని పేర్కొన్నారు. అలా చేస్తే చరిత్రహీనులుగా మిగిలిపోక తప్పదని వ్యాఖ్యానించారు. కాళ్లలో కట్టెలు పెట్టి, కుట్రలు చేసి ఎవరైనా అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తే పాలమూరు బిడ్డలు క్షమించబోరని హెచ్చరించారు.

అన్ని గ్రామాలకు బీటీ రోడ్లు..

పాలమూరు జిల్లాలోని అమర్ రాజా బ్యాటరీస్ కంపెనీలో రెండు వేల మంది స్థానిక నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇవ్వడానికి అంగీకరించారని సీఎం రేవంత్ చెప్పారు. ఈ ప్రాంతంలో ఏ కంపెనీలు వచ్చినా ఇక్కడి నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలు ఇప్పించే బాధ్యత తమదని తెలిపారు. జిల్లాలో అన్ని గ్రామాలు, తండాలకు బీటీ రోడ్లు వేస్తామన్నారు. ఈ మేరకు అంచనాలు రూపొందించాలని ఉమ్మడి జిల్లా పరిధిలోని కలెక్టర్లను ఆదేశిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు జీఎమ్మార్, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మాకు అవకాశం వచ్చింది.. అభివృద్ధి చేసుకోవద్దా..?

నాడు పాలమూరు జిల్లా ప్రజలు పార్లమెంట్‌కు పంపినా, రాష్ట్రానికి రెండు సార్లు సీఎం అయినా ఈ జిల్లాను పట్టించుకోలేదని మాజీ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి రేవంత్ విమర్శలు గుప్పించారు. ‘‘మీ ప్రాంతానికి నిధులు తీసుకెళ్లినా, మీ నియోజకవర్గాలను అభివృద్ధి చేసుకున్నా మేం ఏనాడూ ఏడవలేదు. ఈ రోజు మాకు అవకాశం వచ్చింది. ఈ జిల్లా ప్రజలు 12 మంది ఎమ్మెల్యేలు, ఒక పార్లమెంట్ సభ్యుడిని ఇచ్చారు. సీఎంగా కూడా అవకాశం ఇచ్చారు.. ఈ జిల్లాను అభివృద్ధి చేసుకునే బాధ్యత మాకు లేదా.. నేను ఎక్కడికి వెళ్లినా, ఏ పనిచేస్తున్నా నిరంతరం పాలమూరు జిల్లాను అభివృద్ధి చేయాలన్నదే నా ఆకాంక్ష’’అని పేర్కొన్నారు.

నయా పెట్టుబడిదారుల నుంచి జార్ఖండ్‌ను రక్షించాలి

- ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించి ప్రజాస్వామ్యాన్ని కాపాడండి
- జార్ఖండ్ ఎన్నికల ప్రచారంలో భట్టి విక్రమార్క


జార్ఖండ్‌లో కాంగ్రెస్ బూత్ స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: అదానీ, అంబానీ లాంటి నయా పెట్టుబడిదారుల నుంచి జార్ఖండ్ రాష్ట్రానికి విముక్తి కల్పించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. జార్ఖండ్‌లో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాని ఆయన ప్రజలను కోరారు. ఆదివారం భట్టి జార్ఖండ్‌లోని రాంఘర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి సమావేశం, చిత్తార్పూర్ బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో మాట్లాడుతూ, కొద్ది మంది పెట్టుబడిదారుల చేతుల్లో రాష్ట్రాన్ని పెట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని, చైతన్యంగల కాంగ్రెస్ కార్యకర్తలు జార్ఖండ్ రాష్ట్రాన్ని, వనరులను దోపిడీదారుల నుంచి కాపాడాలని పిలుపునిచ్చారు. భారత్ జోడో యాత్రలో భాగంగా దేశంలో విద్వేషం ఉండకూడదని, సంపద అందరికీ సమానంగా పంచాలని రాహుల్ గాంధీ ఇచ్చిన సందేశాన్ని స్ఫూర్తిగా తీసుకుని పనిచేయాలని కోరారు. అన్ని స్థాయిల్లో కాంగ్రెస్ పార్టీ నేతలు విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించాలని, ఇండియా కూటమి హామీలను, మేనిఫెస్టోను పెద్ద ఎత్తున ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో ఏఐసీసీ నేతలు గులాం అహ్మద్‌మీర్, సిరివెళ్ల ప్రసాద్, జార్ఖండ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కేశవ్ కమలేశ్ మహతో, మైనార్టీ సెల్ అధ్యక్షుడు తారిఖ్ అన్వర్‌లతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర ఎన్నికలకు తెలంగాణ డబ్బు!

- ఆ పనిలోనే సీఎం రేవంత్ బిజీగా ఉన్నారు.. మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్
- రుణమాఫీపై మహారాష్ట్రలో రేవంత్ చెప్పినవన్నీ అబద్ధాలే
- రైతుబంధు, వరికి బోనస్, ఉద్యోగాల కల్పన వంటివన్నీ బోగస్
- రోడ్ల మీదున్న వడ్ల కుప్పలే రేవంత్ అసమర్థ పాలనకు నిదర్శనం


మీడియాతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ డబ్బును మహారాష్ట్రకు పంపే పనిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బిజీగా ఉన్నారని.. కాంగ్రెస్‌కు మహారాష్ట్ర ఎన్నికల కోసం డబ్బులు రేవంతే సమకూర్చుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఆరోపించారు. తెలంగాణలో రుణమాఫీ చేశామని, రైతు బంధు, వరికి బోనస్ ఇచ్చామంటూ మహారాష్ట్రలో సీఎం రేవంత్ చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలని మండిపడ్డారు. రాష్ట్రంలో రోడ్ల మీద ఉన్న వడ్ల కుప్పలే రేవంత్ అసమర్థ పాలనకు నిదర్శనమని విమర్శించారు. రాష్ట్ర మంత్రులు రాష్ట్రంలో పాలనను గాలికి వదిలేసి, గాలిమోటార్లలో రాష్ట్రాలు పట్టి తిరుగుతున్నారని మండిపడ్డారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

‘‘సీఎం రేవంత్ నోరు విప్పితే అన్నీ అబద్ధాలే. ఆ అబద్ధాల ప్రవాహాన్ని మహారాష్ట్రలో కొనసాగించారు. తెలంగాణలో మోసం చేసినట్టు అక్కడి ప్రజలనూ మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. రెండు లక్షల ఉద్యోగాల కల్పనపై మహారాష్ట్రలో పచ్చి అబద్ధాలు చెప్పారు. విద్యార్థులను వీపులు పగలకొట్టించిన చరిత్ర కాంగ్రెస్ సర్కార్‌దే. తెలంగాణలో 40 లక్షల మందికి రుణమాఫీ చేశామని రేవంత్ అవాస్తవాలు చెప్పారు. 2023 డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తామని చెప్పి మాట తప్పారు. 42 లక్షల మందికి రూ.31 వేలకోట్లు రుణమాఫీ చేస్తామని రూ.17 వేల కోట్లు మాత్రమే మాఫీ చేశారు. అది కూడా 7 నెలలు ఆలస్యం చేసి రైతులపై వడ్డీల భారం మోపారు. ఇంకా 22 లక్షల మంది రైతుల రుణాలు మాఫీ చేయాల్సి ఉంది. తెలంగాణలో పోలీసు కానిస్టేబుళ్లు రోడ్ల మీదికి వచ్చే పరిస్థితి నెలకొంది. హాస్టళ్లలో విద్యార్థులు ఆస్పత్రుల పాలవుతున్నారు.

గ్యారంటీలు గ్యారేజ్‌కు పోయాయి

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి దాదాపు ఏడాది పూర్తవుతున్నా ఆరు గ్యారంటీలు అమలు చేయలేదు. ఎన్నికల ముందు ఇచ్చిన గ్యారంటీలు గెలిచాక గ్యారేజీకి పోయాయి. ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని బాండ్ పేపర్ ఇచ్చారు. ఏ హామీలు అమలు చేశారో, ఎక్కడ చర్చిద్దామో చెప్పండి. బహిరంగ చర్చకు నేను సిద్ధం.

మహిళలకు అభయ హస్తం ఏదీ?

మహిళలకు నెలకు రూ.2,500 చొప్పున ఇస్తామని అభయ హస్తంలో చెప్పిన మొదటి హామీకే దిక్కులేదు. మహారాష్ట్రలో మాత్రం కోతలు కోస్తున్నారు. ఆ హామీ మేరకు ప్రభుత్వం ఒక్కో మహిళకు రూ.27,500 బాకీ ఉంది. రైతు భరోసా ఎకరానికి రూ.15 వేలు, రైతుకూలీలకు రూ.12 వేలు, వరికి రూ.500 బోనస్ వంటి ఎన్నో హామీలిచ్చారు. ఒక్కటి కూడా అమలు చేయలేదు. హామీలను ఎగవేయటమే కాంగ్రెస్ నైజంగా మారింది. సోనియమ్మ మాట.. రాహుల్ గాంధీ మాట అంటూ కాంగ్రెస్ నాయకులు హామీలిచ్చారు. ఇప్పుడా గాంధీలు ఎక్కడికి పోయారో తెలియదు.

రైతుల ధాన్యం కొనేదెవరు?

రాష్ట్రంలో మద్దతు ధరకు వరి ధాన్యం కొనకపోవటంతో రైతులు నష్టపోతున్నారు. క్వింటాల్ వడ్లు రూ.1,900కే వడ్లు అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది. రేవంత్‌రెడ్డి అసమర్థ పాలనకు రోడ్లపై వరికుప్పలే సాక్ష్యం. పైగా బోనస్ ఇచ్చామంటూ మహారాష్ట్రలో బోగస్ మాటలు మాట్లాడారు. అన్ని వర్గాలను మోసం చేసిన వ్యక్తి రేవంత్. జీవో 29 పేరుతో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం చేశారు. ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని మాటతప్పారు. ప్రశ్నించిన నిరుద్యోగులను పోలీసులతో అణచివేసే ప్రయత్నం చేశారు. ఉద్యోగాల భర్తీలో వైఫల్యంపై మహారాష్ట్రలో ఎందుకు మాట్లాడలేదు. పైగా కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలను తాను ఇచ్చినట్టు రేవంత్ చెప్పుకోవడం సిగ్గుచేటు..’’అని హరీశ్‌రావు మండిపడ్డారు.

ప్రధాని ప్రోత్సాహంతోనే క్రీడాకారుల రాణింపు

కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

గోల్కొండ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచనలు, ప్రోత్సాహంతోనే పదేళ్లుగా భారత క్రీడాకారులు వివిధ క్రీడా అంశాల్లో అంతర్జాతీయ వేదికలపై విశేషంగా రాణిస్తున్నారని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం గుడిమల్కాపూర్ డివిజన్ రాజలింగయ్య కబడ్డీ స్టేడియంలో బీజేవైఎం నేత దేవర వంశీ నిర్వహిస్తున్న దివంగత దేవర కరుణాకర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌లో వివిధ టీమ్‌ల క్రికెటర్లను కలుసుకున్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ శిక్షణ కేంద్రాల్లో క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు కల్పించనున్నట్టు హామీ ఇచ్చారు. ఒకప్పుడు ఒలింపిక్స్, ఆసియా క్రీడల పతకాల పట్టికలో మన దేశం పేరును వెతుక్కోవలసి వచ్చేదని.. ఇప్పుడు స్వర్ణ పతకాల జాబితాలో క్రీడాకారులు చోటు సాధిస్తున్నారని ప్రశంసించారు. అనంతరం రాజలింగయ్య కబడ్డీ స్టేడియంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించే కార్మికులను ఆయన సన్మానించి వారి సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో బీజేవైఎం నేత దేవర వంశీ, బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవర శ్రీనివాస్, రాధాకిషన్, అశ్విన్‌మోదీ తదితరులు పాల్గొన్నారు.


దేవర కరుణాకర్ మెమోరియల్ టోర్నమెంట్‌లో క్రికెట్ బ్యాట్ పట్టిన కిషన్‌రెడ్డి

తెలంగాణ బియ్యాన్ని దిగుమతి చేసుకుంటాం

మంత్రి శ్రీధర్‌బాబుకు మలేసియా వ్యాపారుల హామీ


మలేసియా వ్యాపారవేత్తలతో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం నుంచి ఉత్పత్తి అయ్యే బియ్యాన్ని దిగుమతి చేసుకుంటామని మలేసియా వ్యాపారవేత్తలు హామీ ఇచ్చారు. మలేసియా తెలంగాణ అసోసియేషన్ (ఎంటీఏ) ఆధ్వర్యంలో జరుగుతున్న దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగిన మలేసియా వ్యాపార సదస్సులో.. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ ఉత్పత్తుల ప్రోత్సాహానికి ప్రవాస భారతీయులు సహకరించాలని కోరారు. తెలంగాణలో సాగు చేస్తున్న వరి పంట రకాలు, ధాన్యం నాణ్యతల గురించి వివరించారు. ఇందుకు స్పందించిన వ్యాపారవేత్తలు తెలంగాణ నుంచి బియ్యాన్ని దిగుమతి చేసుకునేందుకు స్పష్టమైన హామీ ఇచ్చారు. సదస్సులో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్స్) చైర్మన్ శివసేనారెడ్డి, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆల్దాస్ జానయ్య, ఉస్మానియా యూనివర్సిటీ ఉపకులపతి కుమార్‌లతో పాటు పలువురు ప్రవాస తెలంగాణవాసులు, మలేసియా బియ్యం ఎగుమతిదారులు పాల్గొన్నారు.

రెండు రోజులపాటు డెడికేటెడ్ కమిషన్ వినతుల స్వీకరణ

సోమ, మంగళవారాల్లో కమిషన్ కార్యాలయంలో ఏర్పాట్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల ఖరారు కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ సోమవారం నుంచి అధ్యయన ప్రక్రియను వేగవంతం చేయనుంది. ఇందులో భాగంగా ఈనెల 11, 12వ తేదీల్లో వివిధ వర్గాల నుంచి అభిప్రాయ సేకరణ, సలహాలు, సూచనలు, విజ్ఞాపనల స్వీకరణ తదితర చర్యలు మొదలుపెట్టనుంది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలు, వెనుకబాటుతనం, స్థితి తదితర అంశాలపై లోతైన పరిశీలన చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంత ఐఏఎస్ అధికారి బుసాని వెంకటేశ్వరరావు అధ్యక్షతన డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. నెలరోజుల వ్యవధిలో నిర్దేశించిన అంశాలపై పరిశీలన చేపట్టడంతో పాటు అధ్యయనం నిర్వహించి రిజర్వేషన్ల ఖరారుకు రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు ఇవ్వాలని స్పష్టం చేస్తూ ఈ నెల 4వ తేదీన ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా ఈ కమిషన్‌కు మాసబ్‌ట్యాంక్‌లోని దామోదరం సంజీవయ్య సంక్షేమ భవన్‌లోని నాలుగో అంతస్తులో కార్యాలయాన్ని కూడా కేటాయించింది. ఈక్రమంలో డెడికేటెడ్ కమిషన్ సోమ, మంగళవారాల్లో క్షేత్రస్థాయి నుంచి వినతులు, విజ్ఞాపనలు స్వీకరించాలని నిర్ణయించినట్లు డెడికేటెడ్ కమిషన్ కార్యదర్శి బి.సైదులు వెల్లడించారు. ఈనెల 11వ తేదీ ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్గాల నుంచి వినతులు స్వీకరించనుంది. ప్రజలు ఇచ్చే వినతులు, విజ్ఞాపనలను రికార్డు చేసుకోనుంది. అదేవిధంగా మంగళవారం ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 3 వరకు కమిషన్ కార్యాలయంలో స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, కులసంఘాలు, సంక్షేమ సంఘాలు, అసోసియేషన్ల ప్రతినిధుల నుంచి వినతులు స్వీకరించనుంది. ఆయా కేటగిరీలకు చెందిన వారు కమిషన్ ఎదుట హాజరై వినతులు సమర్పించాలని సూచించింది.

క్లుప్తంగా...

బీఆర్‌ఎస్ పాలనలో విద్యారంగం విధ్వంసం

- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



సాక్షి, హైదరాబాద్: పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో విద్యారంగం విధ్వంసం అయ్యిందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. భారత విద్యాశాఖ తొలి మంత్రిగా పనిచేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవలను మంత్రి స్మరించుకున్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాత పదేళ్ల పాటు సాగిన బీఆర్‌ఎస్ పాలనలో విద్యారంగం పూర్తిగా నాశనమైందని, నిరుద్యోగులు, యువత, విద్యార్థులు తీవ్ర గందరగోళంలో ఉన్నారని ఆమె పేర్కొన్నారు. వారందరికీ బాసటగా నిలిచిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకువస్తోందన్నారు. సంక్షేమ గురుకుల విద్యార్థులకు మెరుగైన డైట్ అందించడంతో పాటు కాస్మెటిక్ చార్జీలను పెంచామని, స్కిల్ యూనివర్సిటీతో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేశామని తెలిపారు. విద్యా సంస్థల్లో ఉపాధ్యాయ ఖాళీల భర్తీ, పదోన్నతులు, కొత్తగా సమీకృత గురుకులాలు తదితర కార్యక్రమాలను యుద్ధప్రాతిపదిన చేపట్టామన్నారు.

ఖమ్మం మహిళకు అమెరికాలో కీలక బాధ్యతలు

- ఒహాయో రాష్ట్రంలో సలహాదారుగా నియామకం



ఖమ్మం అర్బన్: ఖమ్మం నగరానికి చెందిన రామసహాయం బుచ్చిరెడ్డి, నిర్మల దంపతుల కుమార్తె రామసహాయం రాధిక అమెరికాలోని కొలంబస్‌లో ఉంటూ ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. కాగా, రాధికను అమెరికాలో ఒహాయో రాష్ట్ర మైనార్టీ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ అడ్వయిజరీ బోర్డు సలహాదారుగా నియమిస్తూ రాష్ట్ర గవర్నర్ మైక్ డివైన్ శనివారం ఉత్తర్వులు ఇచ్చారని ఆమె తండ్రి బుచ్చిరెడ్డి తెలిపారు. రాధికకు మహబూబాబాద్ జిల్లా బయ్యారం గ్రామానికి చెందిన రఘురాంరెడ్డితో 2006లో వివాహం జరగగా, ఆయనతోపాటు అమెరికా వెళ్లారు. అక్కడ ఓ ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇంజనీర్‌గా చేరి అంచెలంచలుగా కంపెనీలో డైరెక్టర్ స్థాయికి చేరుకున్నారు. 2009 నుంచి వివిధ కంపెనీల్లో ఉన్నత హోదాల్లో పనిచేస్తూ గుర్తింపు తెచ్చుకోవడంతో రాధికకు ఈ అవకాశం వచ్చిందని బుచ్చిరెడ్డి తెలిపారు. 2026 వరకు అమె ఈ పదవిలో కొనసాగుతారని చెప్పారు.

టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా టి.లచ్చిరాం



ఆదిలాబాద్ టౌన్: తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) రాష్ట్ర 6వ మహాసభలు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, డీఈవో ప్రణీత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా టి.లచ్చిరాం (ఆదిలాబాద్), కార్యనిర్వాహక అధ్యక్షుడిగా దామోర శ్రీనివాస్ (సూర్యాపేట), ప్రధాన కార్యదర్శిగా పి.రఘునందన్‌రెడ్డి (రంగారెడ్డి), ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎం.గోపాల్ (వికారాబాద్), గౌరవ అధ్యక్షులుగా మురళీమనోహర్‌రెడ్డి (నిర్మల్)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

13న శ్రీవారి ఆలయంలో కైశిక ద్వాదశి ఆస్థానం

తిరుమల: కైశిక ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 13న శ్రీవారి ఆలయంలో సాలకట్ల కైశిక ద్వాదశి ఆస్థానాన్ని టీటీడీ ఘనంగా నిర్వహించనుంది. వేంకటతురైవార్, స్నపనబేరంగా పిలిచే ఉగ్రశ్రీనివాసమూర్తిని శ్రీదేవి, భూదేవి సమేతంగా ఒక్క కైశిక ద్వాదశి రోజు మాత్రమే సూర్యోదయానికి ముందు తిరుమల మాడవీధుల్లో ఊరేగిస్తారు. అనంతరం ఆలయం లోపల ఉదయం 6 నుంచి ఉదయం 7.30 గంటల వరకు కైశిక ద్వాదశి ఆస్థానాన్ని పురాణ పారాయణం ద్వారా ఘనంగా నిర్వహిస్తారు. దీనితో సాలకట్ల కైశిక ద్వాదశి ఉత్సవం పూర్తవుతుంది.

'ఎండీఎం బకాయిలు ఇవ్వాలి'

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం (ఎండీఎం) కార్మికులకు తక్షణమే పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఏఐటీయూసీ అధ్యక్షులు పి.ప్రేమ్‌పావని డిమాండ్ చేశారు. నెలల తరబడి బిల్లులు చెల్లించకుంటే విద్యార్థులకు భోజనం ఎలా అందించాలని ప్రశ్నించారు. ఆదివారం ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ప్రేమ్‌పావని మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేసి, ఎండీఎం కార్మికులకు గౌరవ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 22న మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత సమస్యల సాధన కోసం భవిష్యత్ కార్యాచరణ కూడా ప్రకటిస్తామని వెల్లడించారు.

రైతు భరోసా మళ్లీ హుళక్కేనా?

యాసంగి సీజన్‌లోనూ అనుమానమే అంటున్న అధికారులు

- అంతకుముందు వానాకాలం సీజన్‌లో సర్కారు ఎగనామం
- ప్రస్తుతం సీజన్ మొదలై నెల దాటినా మార్గదర్శకాలపై కొరవడిన స్పష్టత
- ఒక్కో సీజన్‌కు ఎకరానికి రూ.7,500 ఇస్తామన్న హామీ నెరవేరని వైనం



సాక్షి, హైదరాబాద్: రైతు భరోసా అమలుపై అస్పష్టత నెలకొంది. ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో రైతులకు భరోసా సాయం చేయకుండా వాయిదా వేసిన ప్రభుత్వం, ప్రస్తుత యాసంగి సీజన్‌లోనైనా ఇస్తుందా లేదా అన్నదానిపై సందిగ్ధత ఏర్పడింది. వానాకాలం సీజన్‌లో అదిగో ఇస్తాం, ఇదిగో చేస్తాం అంటూ ప్రభుత్వం కాలయాపన చేసిందని, యాసంగిలోనూ అలాగే చేసే అవకాశం ఉందని కొందరు వ్యవసాయ శాఖ అధికారులే వ్యాఖ్యానిస్తుండటం గమనార్హం. సీజన్ మొదలై నెల రోజులు దాటిందని, ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎటువంటి స్పష్టత రాలేదని, పైగా ఈసారి కూడా భరోసా సాయం ఉండక పోవచ్చనే సంకేతాలు తమకు వస్తున్నాయని వారు చెబుతున్నారు. ప్రభుత్వం రుణమాఫీనే పూర్తి చేయలేదని, ఇంకా చాలామందికి మాఫీ నిధులు జమ చేయాల్సి ఉన్నందున, అప్పటివరకు రైతు భరోసా ఉండకపోవచ్చని అంటున్నారు. ఈ నేపథ్యంలో రైతుల్లో నైరాశ్యం నెలకొంది.

రుణమాఫీ అందక.. భరోసా రాక

సీజన్‌కు ముందే రైతుకు సహాయం చేయాలనేది రైతు భరోసా (గతంలో రైతుబంధు) పథకం ఉద్దేశం. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చు వంటి వాటి కోసం పెట్టుబడిని అందించాలన్నది లక్ష్యం. 2018 నుంచి ప్రతి ఏడాదీ రెండు సీజన్లలో నిరాటంకంగా కొనసాగిన ఈ పథకం గత వానాకాలంలో సీజన్‌లో మాత్రం ఆగిపోయింది. రైతుబంధు పథకంలో మార్పులు చేర్పులు చేసి కొత్త మార్గదర్శకాలతో రైతుభరోసా తీసుకురావాలని కొత్త ప్రభుత్వం భావించింది. ఆ మేరకు ఈ ఏడాది జులై 2వ తేదీన రైతుభరోసాపై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటైంది. జిల్లాల్లో అభిప్రాయ సేకరణ చేసింది. అనంతరం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో చర్చించి రైతుభరోసాపై నిర్ణయం తీసుకోవాలని భావించింది. జూలైలో సమావేశాలు జరిగినా రైతు భరోసా ఊసెత్తలేదు. ఇప్పటివరకు కూడా ఏమీ తేల్చలేదు. ఒకవైపు రుణమాఫీ అందరికీ సరిగ్గా జరగక, మరోవైపు భరోసా సాయం కూడా అందక పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

అధికారంలోకి వచ్చాక రూ.5 వేలే అందజేత

గతేడాది వానాకాలం సీజన్ వరకు మొత్తంగా రైతుబంధు కింద రైతులకు రూ. 72,815 కోట్లు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో సీజన్‌కు ఎకరానికి రూ.5,000 నుంచి రూ.7,500కు పెంచి ఇస్తామని హామీ ఇచ్చింది. రెండు సీజన్లకు కలిపి రూ.15 వేలు ఇస్తామని పేర్కొంది. అయితే అధికారంలోకి వచ్చాక యాసంగి సీజన్‌లో మాత్రం పెరిగిన సొమ్మును కాకుండా పాత పద్ధతిలోనే ఎకరాకు రూ.5 వేలు అందజేసింది. వానాకాలం సీజన్ నుంచి రూ.7,500 ఇస్తామని పేర్కొంది.

రుణమాఫీపై రైతుల్లో అసంతృప్తితో సందిగ్ధత

ఈ క్రమంలోనే రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ పథకాన్ని ఈ ఏడాది ఆగస్టు 15వ తేదీ నాటికి అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రైతులకు రూ.31 వేల కోట్లు ఇస్తామని చెప్పి చివరకు రూ.18 వేల కోట్లలోపే ఇచ్చారు. నిబంధనలు, కొర్రీలతో వేలాది మంది రైతులకు ఇవ్వకపోవడం, చాలామంది అర్హులైన రైతులకు కూడా అందకపోవడంతో వారి ఆగ్రహాన్ని చవిచూడాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలోనే రైతుభరోసా పథకాన్ని తొలుత అనుకున్నట్టుగా అనేక మార్పులతో అమలు చేస్తే రైతుల నుంచి ఏ విధమైన స్పందన వస్తుందోనన్న సందిగ్ధతలో సర్కారు ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి తోడు అంతంత మాత్రంగా ఉన్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నేపథ్యంలోనే రైతు భరోసాపై సాగతీత ధోరణిలో వ్యవహరిస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మహారాష్ట్రలో లబ్ధి కోసమే ఇక్కడ కులగణన డ్రామా

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌పై కేటీఆర్ ధ్వజం
- కులగణనలో ప్రశ్నలపై ప్రజలు నిలదీస్తున్నారు
- ధాన్యానికి బోనస్ ఇచ్చినట్టు చూపిస్తే రాజీనామా చేస్తాం



సిరిసిల్లలో ఆత్మహత్యకు పాల్పడిన నేత దంపతుల పిల్లలను పరామర్శిస్తున్న కేటీఆర్

హనుమకొండ/యాదగిరిగుట్ట రూరల్: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి కోసమే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాష్ట్రంలో కులగణన డ్రామా ఆడుతున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు ధ్వజమెత్తారు. కులగణనలో ఆస్తులు, రిఫ్రిజిరేటర్లు, ఏసీలు, ఆదాయం వంటి వివరాలు ఎందుకంటూ ప్రజలు అధికారులను నిలదీస్తున్నారని విమర్శించారు. ఆదివారం ఆయన హనుమకొండలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ముందు కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించి ఏడాది అవుతున్నా దానిపై ఒక్క అడుగు ముందుకు పడలేదన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించి ఆరు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 11 నెలలవుతున్నా దానిని అమలు చేయలేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో తెలంగాణలో ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తున్నామని అబద్ధాలు ఆడుతున్నారని, ఏ ఒక్కరికైనా బోనస్ ఇచ్చినట్లు చూపిస్తే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలందరం రాజీనామా చేస్తామని సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది అవుతున్న సందర్భంగా వారోత్సవాలు నిర్వహించాలా..? విజయోత్సవాలు నిర్వహించాలా అనే ఆలోచన చేస్తున్నారని, వారు విజయోత్సవాలు నిర్వహిస్తే.. తాము కాంగ్రెస్ పరిపాలనా వైఫల్యాలపై వారోత్సవాలు నిర్వహిస్తామని అన్నారు. రేవంత్‌రెడ్డి రాగానే బీసీబంధు, రైతుబంధు, దళిత బంధు.. ఇలా అన్నీ బందయ్యాయని కేటీఆర్ అన్నారు. కులగణన పూర్తయిన తర్వాత బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించి స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ బాంబులు.., ఆ బాంబులు పేలుతాయంటున్న ఆ మంత్రి ఏ ఒక్క బాంబు పేల్చేది లేదని, ఆయన ఏ మంత్రి ఏమోకాని బాంబుల మంత్రి అని పేరు పెట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఉద్దేశించి అన్నారు.

పగ నామీదే అయితే పదవిని వదిలేస్తా: కేటీఆర్

సిరిసిల్లటౌన్: 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నామీద పగ ఉంటే.. సిరిసిల్ల ఎమ్మెల్యే పదవిని రేపే వదిలేస్తా'అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 11 నెలల్లో 34 మంది చేనేత కార్మికులు చనిపోయారని, ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి కళ్లు తెరవాలని, చేనేత కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సిరిసిల్లలో శనివారం ఆత్మహత్యకు పాల్పడిన నేత దంపతులు బైరి అమర్‌నాథ్, స్రవంతి పిల్లలు లహరి, శ్రీవల్లి, దీక్షిత్‌నాథ్‌లను ఆదివారం ఆయన పరామర్శించారు. పిల్లలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 34 మంది నేత కార్మికులు బలవన్మరణాలకు పాల్పడినా ప్రభుత్వానికి సోయి రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా సర్కారు సిగ్గు తెచ్చుకోవాలని, ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రంజాన్, క్రిస్మస్, బతుకమ్మ, కేసీఆర్ కిట్ల ఆర్డర్లు రాక సిరిసిల్లలో నేతన్నలు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే చోద్యం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిరిసిల్ల వస్త్రపరిశ్రమకు ఆర్డర్లు ఇచ్చే దాకా బీఆర్‌ఎస్ తరఫున ప్రభుత్వంపై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

అధైర్యపడొద్దు.. మళ్లీ వచ్చేది కేసీఆర్ సారే

రైతులు అధైర్యపడవద్దని, మళ్లీ కేసీఆర్ సారే వస్తారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆదివారం ఆయన వరంగల్ జిల్లాలో పర్యటించేందుకు వెళ్తుండగా, భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామం వద్ద ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులతో కలసి కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చొల్లేరు గ్రామానికి చెందిన తోటకూరి వెంకటమ్మ అనే వృద్ధురాలు కేటీఆర్ వద్దకు వెళ్లి.. 'కేసీఆర్ సారు పాలననే బాగుండేది, మాకు రైతుబంధు క్రమం తప్పకుండా వేసేవాడు,



కేటీఆర్‌తో మాట్లాడుతున్న వృద్ధురాలు

ఆ డబ్బులతో వ్యవసాయం చేసుకుని సంతోషంగా ఉండేవాళ్లం, ఇప్పుడు రైతుబంధు రావడం లేదు, చాలా ఇబ్బందులు పడుతున్నాం'అని అన్నారు. దీనిపై స్పందించిన కేటీఆర్.. బాధపడవద్దని, రాబోయేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే అని, కేసీఆర్ సారే మళ్లీ సీఎం అవుతారని భరోసా ఇచ్చారు.



భూమి పూజ చేస్తున్న హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే. చిత్రంలో న్యాయమూర్తులు జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ వినోద్‌కుమార్, జస్టిస్ పుల్లా కార్తీక్, జస్టిస్ శ్రీనివాసరావు, జస్టిస్ విజయసేన్‌రెడ్డి, మాజీ జడ్జి జస్టిస్ నవీన్‌రావు

కరీంనగర్ రాయితో | నూతన హైకోర్టు నిర్మాణం

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే వెల్లడి
- జిల్లా కోర్టు ఆవరణలో 12 కోర్టు భవనాల నిర్మాణానికి భూమిపూజ
- జిల్లాలోని వివిధ కోర్టుల్లో పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించాలని సూచన

కరీంనగర్ క్రైం: రాష్ట్ర నూతన హైకోర్టు నిర్మాణంలో కరీంనగర్ నుంచి తెప్పించిన బండను వాడుతున్నామని.. ఉమ్మడి కరీంనగర్ జిల్లా గొప్ప చరిత్ర కలదని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే తెలిపారు. కరీంనగర్ జిల్లా కోర్టు ఆవరణలో నిర్మించనున్న 12 నూతన కోర్టు భవనాల సముదాయానికి ఆదివారం ఆయన భూమిపూజ చేశారు. అలాగే సీతారాంపూర్ రోడ్డులో జడ్జీల నూతన నివాస భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే మాట్లాడుతూ జిల్లాలోని వివిధ కోర్టుల్లో పెండింగ్ కేసులను తగ్గించాలన్నారు. అందుకు న్యాయవాదులు సహకరించాలని సూచించారు. కేసుల విచారణలో అనవసర వాయిదాలను నివారించాలన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా కోర్టు పరిపాలనా జడ్జిగా వ్యవహరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్‌తో పాటు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి.వినోద్ కుమార్, జస్టిస్ విజయసేన్‌రెడ్డి, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్, జస్టిస్ ఈవీ వేణుగోపాల్, జస్టిస్ పుల్ల కార్తీక్, జస్టిస్ శ్రీనివాసరావు, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు కాసుగంటి లక్ష్మణకుమార్ మాట్లాడారు. అనంతరం కరీంనగర్ జిల్లాకు చెందిన హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ పి.నవీన్‌రావుతోపాటు వృత్తిలో 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సీనియర్ న్యాయవాదులు పి.గోపాలకృష్ణ, కె.మాధవరావు, జి.నారాయణరెడ్డి, వి.వెంకటేశ్వరరావు, జి.హనుమంతరావును చీఫ్ జస్టిస్ సన్మానించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్‌రెడ్డి, న్యాయమూర్తులు, అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ ఆర్డీవో మహేశ్వర్, బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యే ముందు చీఫ్ జస్టిస్ సహా ఇతర న్యాయమూర్తులంతా మంకమ్మ తోటలోని జస్టిస్ ఈవీ వేణుగోపాల్ నివాసంలో తేనీటి విందుకు హాజరయ్యారు.

సిబ్బందిని ఇవ్వకుంటే డిజిటల్ సర్వే చేయం

- రాష్ట్ర వ్యవసాయ విస్తరణ అధికారుల ఐక్య వేదిక స్పష్టీకరణ
- జనగామలో రాష్ట్రస్థాయి సదస్సు.. అడహక్ కమిటీ ప్రకటన

జనగామ: రాష్ట్రంలో వ్యవసాయ పంటల డిజిటల్ సర్వేకు తాము వ్యతిరేకం కాదని.. ప్రభుత్వం సరిపడా సిబ్బందిని కేటాయిస్తేనే ముందుకు వెళ్తామని తెలంగాణ వ్యవసాయ విస్తరణ అధికారుల (ఏఈవో) ఐక్య వేదిక రాష్ట్ర అడహక్ కమిటీ అధ్యక్షుడు బధావత్ రాజ్‌కుమార్ స్పష్టం చేశారు. అడహక్ కమిటీకి అధికారిక గుర్తింపు వచ్చిన సందర్భంగా ఆదివారం జనగామ జిల్లా కేంద్రంలో రాష్ట్ర కార్యదర్శి బూర కల్యాణి అధ్యక్షతన తెలంగాణ వ్యవసాయ విస్తరణ ఐక్యవేదిక (టీవీ-వీఏఏవీ) సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు 33 జిల్లాలకు చెందిన 2 వేల మంది ఏఈఓలు హాజరయ్యారు. సమావేశంలో రాష్ట్ర కమిటీతోపాటు 33 జిల్లాలకు అధ్యక్షులను ప్రకటించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 16 వేల మందితో నిర్వహించాల్సిన వ్యవసాయ పంటల డిజిటల్ సర్వేను కేవలం 2,600 మంది ఏఈఓలతో చేయాలని ఒత్తిడి చేయడం సమంజసం కాదన్నారు. సహాయకులను ఇవ్వకుంటే సర్వే చేయబోమని తేల్చి చెప్పారు. దీనిపై ప్రభుత్వంతో చర్చించినా ఎటువంటి భరోసా, హామీ ఇవ్వలేదన్నారు. డిజిటల్ పంటల సర్వేపై ప్రభుత్వం పునరాలోచించాలన్నారు.

ఏఈఓల సంఘం అడహక్ నూతన కమిటీ

కాగా, అధికారుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులుగా బధావత్ రాజ్‌కుమార్ (నిర్మల్), ప్రధాన కార్యదర్శిగా బూర కల్యాణి (జనగామ), రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్‌గా జనయ్య (సూర్యాపేట) రాష్ట్ర కోశాధికారిగా పాలు ప్రవీణ్ (భూపాలపల్లి), రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మెండ్ అశోక్ (వరంగల్), లకావత్ సునీత (సిద్దిపేట) మరో 25 మందిని వివిధ విభాగాలకు ప్రతినిధులుగా నియమించారు.

త్వరలో కొత్త మత్స్య విధానం

- చేపల పెంపకం, మార్కెటింగ్ అధ్యయనానికి కర్ణాటకకు రాష్ట్ర ప్రతినిధి బృందం
- నేటినుంచి మూడు రోజుల అధ్యయన యాత్ర

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో చేపల పెంపకం, మార్కెటింగ్ కోసం కొత్త విధానాన్ని తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకోసం ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను అధ్యయనం చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి బృందం సోమవారం నుంచి మూడు రోజుల పాటు కర్ణాటక రాష్ట్రంలో పర్యటించనుంది. బెంగళూరు, మైసూర్ ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటన జరిపి.. అధ్యయనం అనంతరం సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందించనుంది. ఇందుకోసం రూపొందించిన అధ్యయన యాత్రకు తెలంగాణ ప్రతినిధి బృందం బయలుదేరి వెళ్లింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఫిషరీస్ సొసైటీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ విలేకరులతో మాట్లాడుతూ.. అన్ని రాష్ట్రాల కంటే తెలంగాణలో ఆదర్శవంతమైన మత్స్య విధానం ఉండాలన్న సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు కర్ణాటకకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. కర్ణాటక రాష్ట్ర పర్యటన అనంతరం నివేదికను ప్రభుత్వానికి ఇస్తామని చెప్పారు. ఆ తర్వాత మరికొన్ని రాష్ట్రాల్లో అధ్యయనం చేసి సమగ్ర విధానం రూపొందిస్తామని పేర్కొన్నారు. మత్స్యకారుల శాశ్వత అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మెట్టు సాయికుమార్ వెల్లడించారు.

మైనారిటీ డిక్లరేషన్ అమలేది?

- ఊసే లేని సబ్‌ప్లాన్
- నేడు జాతీయ మైనారిటీ సంక్షేమ దినోత్సవం
- హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రకటించిన 'మైనారిటీ డిక్లరేషన్'ఎప్పుడు అమలు చేస్తారని మైనారిటీ వర్గాలు ఎదురుచూస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలో వస్తే మైనారిటీల సంక్షేమం, అభివృద్ధికి ప్రత్యేక మైనారిటీ సబ్‌ప్లాన్ అమలు చేస్తుందని ప్రకటించింది. అప్పట్లో టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి, కేంద్ర మాజీమంత్రి సల్మాన్ ఖుర్షీద్, సీడబ్ల్యూసీ సభ్యులు నాసీర్, షకీల్ అహ్మద్, కర్ణాటక మంత్రి జమీరుద్దీన్ అహ్మద్, మాజీ మంత్రి షబ్బీర్‌అలీతో కలిసి హైదరాబాద్‌లో మైనారిటీ డిక్లరేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మైనారిటీలపై హామీల వర్షం గుప్పించారు. అధికారంలోకి వచ్చి సరిగ్గా 11 నెలలు దాటినా.. ఏ ఒక్కటి కూడా ఊసెత్తక పోవడంతో మైనారిటీ వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

- మైనారిటీ సంక్షేమ బడ్జెట్ రూ.4,000 కోట్లకు పెంచుతామని ప్రకటించినా.. మొదటి ఏడాది 2024–25లో కేవలం రూ. 3,003 కోట్లకు పరిమితమైంది.
- నిరుద్యోగ మైనారిటీ యువత, మహిళలకు సబ్సిడీ రుణాలు అందించడానికి సంవత్సరానికి ప్రత్యేకంగా రూ.1,000 కోట్లు కేటాయిస్తామని డిక్లరేషన్‌లో వెల్లడించినా మొత్తం బడ్జెట్‌లోనే వాటా కేవలం రూ.432 కోట్లకు పరిమితమైంది.
- అబ్దుల్ కలాం తౌఫా-ఎ-తలీమ్ పథకం కింద ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, ఇతర మైనారిటీ యువతకు అందించాల్సిన ఆర్థికసాయం కాగితాలకు పరిమితమైందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

స్పెషల్ ఉర్దూ డీఎస్సీ ప్రకటించండి

కాంగ్రెస్ మైనారిటీ డిక్లరేషన్ హామీ మేరకు ఉర్దూ మీడియం ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది. ఇటీవల నిర్వహించిన డీఎస్సీ–2024లో ఉర్దూ మీడియానికి మొత్తం 1,183 పోస్టులు కేటాయించినా, ఎస్సీ, ఎస్టీ ఇతరత్రా రిజర్వేషన్ కేటగిరి కారణంగా అర్హులైన అభ్యర్థుల లేక సుమారు 666 పోస్టులు భర్తీకి నోచుకోలేదని విద్యాశాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఎప్పటి మాదిరిగానే ఈసారి డీఎస్సీలో కూడా ఉర్దూ మీడియం రిక్రూట్‌మెంట్‌లో సగానికి పైగా పోస్టులు బ్యాక్‌లాగ్‌లో పడిపోయాయి. ప్రభుత్వం డీఎస్సీలు నిర్వహిస్తున్నా, ఉర్దూ మీడియం పాఠశాలల్లో ఖాళీల భర్తీ మాత్రం పూర్తిస్థాయిలో జరగడం లేదన్న విమర్శలు వ్యక్తవుతున్నాయి. దీంతో ఉర్దూ మీడియం బ్యాక్‌లాగ్ పోస్టులన్నింటిని డీ-రిజర్వేషన్ ద్వారా ఓపెన్ కేటగిరీ కింద చేర్చి, ఖాళీలతో కలిపి స్పెషల్ డీఎస్సీ తక్షణమే ప్రకటించాలంటున్నారు. మరోవైపు డీఎస్సీ–2024 మెరిట్ అభ్యర్థులు మాత్రం రెండవ జాబితా ప్రకటించి బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు రవీంద్రభారతిలో అవార్డుల అందజేత

భారతరత్న, తొలి కేంద్ర విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని ఉర్దూ అకాడమీ, టెమ్రీస్ ఆధ్వర్యంలో సోమవారం రవీంద్రభారతిలో జరగనున్న మైనారిటీ సంక్షేమ దినోత్సవానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు. ఈ సందర్భంగా మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ నేషనల్ అవార్డు 2019–2023, మగ్దూమ్ అవార్డు–2024, లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు 2021–23 లను అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ పాల్గొంటారు.

పెండింగ్‌లో గౌరవ వేతనాలు

డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా మసీదుల ఇమామ్, మౌజమ్‌లు, దర్గాల ఖాదీమ్‌లు, చర్చిల పాస్టర్ల గౌరవ వేతనాల పెంపు సంగతేమోగానీ ...వేతనాల పెండెన్సీ పెరిగిపోతుందని వారు ఆరోపిస్తున్నారు. తక్షణమే నిధులు విడుదల చేయాలని ఇమామ్, మౌజమ్‌లు డిమాండ్ చేస్తున్నారు. వక్ఫ్‌బోర్డు పరిరక్షణ, ఆక్రమణకు గురైన ఆస్తుల స్వాధీనం, ఆస్తుల రికార్డుల డిజిటలైజేషన్, ముస్లిం, క్రిస్టియన్ శ్మశాన వాటికల కోసం భూమి కేటాయిస్తామన్న హామీ కనీసం ప్రణాళికలను కూడా నోచుకోలేదు.

కల్లు తాగిన 'బండి'



హుస్నాబాద్: గీత కార్మికులు తాటి చెట్టు నుంచి గీసిన నీర కల్లును మంత్రి బండి సంజయ్ రుచి చూశారు. వారితో సహపంక్తి భోజనం కూడా చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణ శివారులోని తాటి వనంలో.. సొంత డబ్బుతో వేసిన బోర్ మోటార్లను ఆదివారం కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రారంభించారు. అంతకుముందు పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వర స్వామి, రేణుకా ఎల్లమ్మ ఆలయాల్లో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. తాటి వనం వద్ద గౌడ కార్మికులు డప్పు చప్పుళ్లతో మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం సంజయ్ మాట్లాడుతూ గతంలో తాటి వనం అడవిని తలపించేదని గుర్తు చేసుకున్నారు. వనానికి నీటి వసతి కల్పించడమేకాకుండా.. మొత్తం శుభ్రం చేయించినట్లు పేర్కొన్నారు. హుస్నాబాద్ నుంచి స్టేషన్ జనగామ వరకు నాలుగు లేన్ల రహదారి కోసం కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.



"అరుదైన జ్ఞానం ఉన్న ఒక మనిషి మనకు తారసపడితే, ఆయన ఏ పుస్తకాలు చదువుతారని మనం తప్పకుండా అడగాలి.
– రాల్ఫ్ వాల్డో ఎమర్సన్

సాక్షి
సోమవారం, 11 నవంబర్ 2024

సాహిత్య సందడి

సాహిత్యం వార్త కావడం అరుదు. కానీ సాహిత్యం వార్తగా మారిన ప్రతిసారీ సమాజం ఇంకొంత సానుకూలంగా కనబడుతుంది. మనుషుల్లోని చీకటి వెలుగుల మీద, రక్తమాంసపు ఉద్వేగాల మీద చూపు ప్రసరిస్తుంది. విచికిత్సకూ, నెమ్మదితనానికీ వీలు చిక్కుతుంది. సాహిత్యం వార్తగా మారకపోవడానికి ప్రధాన కారణం, సాహిత్యంలో ఏమీ జరుగుతున్నట్టు కనబడకపోవడం. ఒక రచయిత తన పుస్తకంలోని మొదటి అధ్యాయం అయిందని ప్రెస్ మీట్ పెట్టడు. ఇందాకే ఈ వాక్యం తట్టిందని బహిరంగ ప్రకటన చేయడు. అదంతా ఎప్పటికో తుదిరూపు దిద్దుకునే వ్యవహారం. అప్పుడు మాత్రం హడావిడి ఏముంటుంది? అయితే సాహిత్యమే వార్తగా మారే సందర్భాలు లిటరేచర్ ఫెస్టివల్స్ కలిగిస్తాయి. పదుల కొద్దీ రచయితలు, వందల కొద్దీ పుస్తకాలు, చర్చోపచర్చలు, ముఖాముఖి సంభాషణలు, ఇన్ ఫోకస్ అంశాలు, వెరసి విస్మరించలేని వార్త అవుతాయి. సాహిత్యం సందడిని కోరదు. ఏకాంతమే దానికి తగినది. కానీ రణగొణ ధ్వనుల్లో చిక్కుకున్నవారిని ఏకాంతపు ఒడ్డును చేర్చడానికి అవసరమైనంత సందడిని సాహిత్య వేడుకలు పుట్టిస్తాయి.

సంవత్సరంలో పతాక శీర్షికలకెక్కేంత వార్త నోబెల్ పురస్కార ప్రకటన. అక్టోబర్ నెలలో దక్షిణ కొరియా రచయిత్రి హాన్ కాంగ్‌కు నోబెల్ ప్రకటించడంతో సాహిత్య వాతావరణం చురుగ్గా మారిపోయింది. ఆమె పుస్తకాల మీద ఎనలేని ఆసక్తి మొదలైంది. దీనికంటే ముందు సెప్టెంబర్ నెల చివర్లో, 28, 29 తేదీల్లో రెండ్రోజుల 'సౌత్ ఏసియన్ ఆర్ట్ అండ్ లిటరేచర్ ఫెస్టివల్' అమెరికాలో జరిగింది. 'సమాజంలో బహుళత్వం' థీమ్‌తో జరిగిన ఈ వేడుకలో శశి థరూర్ సహా ప్రపంచవ్యాప్త రచయితలు పాల్గొన్నారు. అక్టోబర్ 16–20 వరకు ఐదు రోజుల పాటు వివిధ దేశాలకు చెందిన సుమారు నాలుగు వేల స్టాళ్లతో జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ నగరంలో 'ఫ్రాంక్‌ఫర్ట్ బుక్ ఫెయిర్' జరిగింది. గెస్ట్ ఆఫ్ హానర్: ఇటలీ. పొరుగునే ఉన్న 'కర్ణాటక తుళు సాహిత్య అకాడెమీ' తుళు భాష మీద మరింత అవగాహన కలిగించేలా, కొత్త తరానికి దాన్ని చేరువ చేసేలా అక్టోబర్ నెలలోనే ఒక కార్యక్రమం చేపట్టింది. కశ్మీర్ సాహిత్యం, సంస్కృతిని ఉత్సవం చేసే లక్ష్యంతో 'మారాజ్ అద్బీ సంగం' జరిపే వార్షిక సాహిత్య సదస్సు కూడా అక్టోబర్‌లోనే జరిగింది. అక్టోబర్‌లోనే 25 లక్షల రూపాయలతో దేశంలో అత్యంత ఖరీదైన పురస్కారంగా ఉన్న జేసీబీ ప్రైజ్ కోసం ఐదు నవలల షార్ట్ లిస్ట్ వచ్చింది. భారతీయ భాషల సాహిత్యాన్ని వేడుక చేస్తున్న ఈ పురస్కారం కోసం రెండు ఆంగ్ల నవలలతో సహా మలయాళీ, బెంగాలీ, మరాఠీ రచనలు తుది జాబితాలో ఉన్నాయి. పురస్కార ప్రకటన నవంబర్ 23న జరగనుంది. 'ఆటా గలాటా బెంగళూరు లిటరేచర్ ఫెస్టివల్' కూడా పిల్లల పుస్తకాల అవార్డుల కోసం షార్ట్ లిస్ట్ ప్రకటించింది. విజేతలను డిసెంబర్ 14, 15 తేదీల్లో జరిగే వేడుకల్లో ప్రకటిస్తారు. అక్టోబర్ నెల ఇచ్చిన ఊపును ఏమాత్రం తగ్గించకుండా నవంబర్‌లో 'ద డెహ్రాడూన్ లిటరేచర్ ఫెస్టివల్' ఆరవ ఎడిషన్ 8–10 తేదీల వరకు జరిగింది. 'సాహిత్యం, సమాజం, సినిమా' పేరుతో జరిగిన ఇందులో రజిత్ కపూర్, సల్మాన్ ఖుర్షీద్, జెర్రీ పింటో, ఇంతియాజ్ అలీ లాంటివాళ్లు పాల్గొన్నారు. ఒక్కోసారి ఊరికే వార్తలు వల్లెవేసుకోవడం కూడా ఉత్సాహంగా ఉంటుందని ఈ సాహిత్య ఉత్సవాలు తెలియజెబుతున్నాయి.

ఇక, 'ముంబయి లిటరేచర్ ఫెస్టివల్' నవంబర్ 15–17 వరకు జరగనుంది. 2010 నుంచి జరుగుతున్న ఈ ఉత్సవంలో ఈసారి గుల్జార్, విలియం డాల్రింపుల్ సహా 13 దేశాలకు చెందిన రచయితలు పాల్గొంటున్నారు. ఇంకా ప్రత్యేకం మహా కథకుడు ఫ్రాంజ్ కాఫ్కా 'ద మెటమార్ఫసిస్'ను ఫోకస్ పుస్తకంగా తీసుకోవడం. నలభై ఏళ్లకే కన్నుమూసిన చెక్ రచయిత కాఫ్కా (1883–1924) నూరవ వర్ధంతి సంవత్సరం ఇది. 'ద మెటమార్ఫసిస్'లోని మొట్టమొదటి వాక్యమే తన సాహిత్య ప్రస్థానానికి ఎలా స్ఫూర్తినిచ్చిందో ఆరాధనగా చెబుతారు లాటిన్ అమెరికా రచయిత గాబ్రియేల్ గార్సియా మార్క్వెజ్. "ఒక ఉదయం కలత నిదురతో మేల్కొన్న గ్రెగర్ జాంజా, మంచంలో తానొక పెద్ద పురుగుగా మారిపోయి ఉండటం గుర్తించాడు...' ఆ వాక్యం చదవగానే, ఎవరైనా ఇలాంటి విషయాలు కూడా రాయవచ్చని నాకు ఇంతకుముందు తెలీదే అని నాకు అనిపించింది. తెలిసివుంటే, నేను ఎప్పుడో రాయడం మొదలుపెట్టేవాడిని. వెంటనే నేను కథలు రాయడం మొదలుపెట్టాను" అంటారు. అలాంటి మెటమార్ఫసిస్‌కు డిజిటల్ రిక్రియేషన్ ఈ ఉత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఇక, నేరము–సినిమా నేపథ్యంలో విభిన్నమైన 'క్రైమ్ లిటరేచర్ ఫెస్టివల్' నవంబర్ 29 నుంచి మూడ్రోజుల పాటు డెహ్రాడూన్‌లో జరుగుతుండటం దీనికి కొనసాగింపు. ప్రకాశ్ ఝా, సుజయ్ ఘోష్, హుస్సేన్ జైదీ లాంటివాళ్లు మాట్లాడుతారు.

లోకంలో ఇంత జరుగుతున్నప్పుడు, కోట్ల జనాభా ఉన్న రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏమీ జరగట్లేదని నిందించడానికి అవకాశం ఉందిగానీ, రవి మంత్రి తొలి నవల 'అమ్మ డైరీలో కొన్ని పేజీలు' లక్ష కాపీలు అమ్మిన మైలురాయిని ఈమధ్యే చేరుకుంది. 'అజు పబ్లికేషన్స్' ప్రచురించిన ఈ నవలతో పుస్తకాలు చదవడం మరిచిపోయిందనుకున్న 'ఇన్‌స్టా తరం' కొత్త ఆశలను రేపింది. ఇక, పది రోజుల పుస్తకాల పండుగలైన 'హైదరాబాద్ బుక్ ఫెయిర్' వచ్చే నెలలో మొదలవుతుంది. అది పూర్తవుతూనే 'విజయవాడ బుక్ ఫెయిర్' జరుగుతుంది. దాని అనంతరం 'హైదరాబాద్ లిటరేచర్ ఫెస్టివల్' ఉండనేవుంది. ఈ సద్దు ఆగేది కాదు. ఈ సందడిలో భాగం కావడమే మన వంతు.

వ్యక్తిగా టాటా ఎలా ఉండేవారు?

కామెంట్



కరణ్ థాపర్

అత్యంత ప్రభావవంతుల జీవితాలు ఎలా ఉంటాయో మనకు ఎప్పుడూ తెలీదు. కేవలం వారి కంపెనీల గురించిన ఉత్థాన పతనాలే తప్ప వ్యక్తిగత జీవితంలోని ఎగుడుదిగుళ్లు బయటికి రావు. ఇటీవల మరణించిన దేశంలోని అతి పెద్ద పారిశ్రామికవేత్తల్లో ఒకరైన రతన్ టాటా చిన్నతనంలో తల్లితండ్రులు విడాకులు తీసుకున్న కారణంగా అభద్రతకు గురయ్యారు. దానివల్లే పాఠశాలలో హేళన ఎదుర్కొన్నారు. ప్రేమించినప్పటికీ పెళ్లికి దూరంగా ఉండిపోయిన రతన్‌కు తన చివరి జీవితంలో తోడుగా ఉన్నది టిటో అనే కుక్క. టిటోతో గడిపే సమయమే ఆయనకు రోజులో అత్యుత్తమంగా ఉండేదట. ఇలాంటి ఎన్నో అంశాలను 'రతన్ టాటా: ఎ లైఫ్' పుస్తకం వెల్లడిస్తుంది.

మనందరికీ పారిశ్రామికవేత్త రతన్ టాటా తెలుసు. ఒక పారిశ్రామికవేత్తగా ఆయన ప్రత్యేకత కలిగివున్నారు. కానీ ఒక వ్యక్తిగా ఆయన ఎలా ఉండేవారు? ఆయనకు ఎలాంటి బాల్యం ఉండేది? ఆయన ప్రేమించినప్పటికీ పెళ్లి చేసుకోని స్త్రీలు ఉన్నారా? ఆయన వ్యక్తిగత జీవితంలో అత్యంత ముఖ్యమైన విషయాలు ఏమిటి? ఇలాంటి అంశాలను సాధారణంగా మనం ఎప్పటికీ తెలుసుకోలేం. కానీ థామస్ మాథ్యూ ఇటీవల ప్రచురించిన పుస్తకం 'రతన్ టాటా: ఎ లైఫ్' కలిగించే మహదానందం ఏమిటంటే, ఆయన ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు సమాధానాలను వెల్లడించారు.


రతన్ టాటా పదేళ్ల వయసులో ఉండగా ఆయన తల్లితండ్రులు విడాకులు తీసుకున్నారు. అందువల్ల వాళ్ల నానమ్మ (నవాజ్‌బాయి టాటా) వద్ద పెరిగాడు. లేడీ టాటా వైభవంగా ఒక పెద్ద భవంతిలో యూనిఫారం ధరించిన పనివాళ్లతో నివసించారు. ఆమెకు రోల్స్ రాయిస్ కారు ఉండేది. నేను 'బీబీసీ' కోసం రతన్ టాటాను ఇంటర్వ్యూ చేసినప్పుడు, తాను చెడిపోలేదని టాటా నొక్కి చెప్పారు; కాకపోతే ఎంతో గారాబంగా పెరిగానని ఒప్పుకున్నారు. అయితే ఆ విషయాన్ని కనుగీటి మరీ చిరునవ్వుతో చెప్పారు.

తమ తల్లితండ్రుల విడాకులు రతన్ పై, ఆయన సోదరుడు జిమ్మీపై తీవ్ర ప్రభావాన్ని చూపాయని థామస్ మాథ్యూ మనకు చెబుతారు. అది వారిలో అభద్రతా భావాన్ని కలిగించింది. వారు పాఠశాలలో చదువుతున్నప్పుడు ర్యాగింగ్‌కు గురయ్యారు, హేళనకు గురయ్యారు. ఈ సమయంలో టాటా తన నాన్నమ్మకు మరింత దగ్గరయ్యారు. నిజం చెప్పాలంటే, ఆమెను ఆరాధించారు.

సీనియర్ కేంబ్రిడ్జ్ విద్య పూర్తి చేసిన తర్వాత టాటా అమెరికా వెళ్లారు. కుమారుడు చార్టర్డ్ అకౌంటెన్సీ చదవడానికి బ్రిటన్ వెళ్లాలని ఆయన తండ్రి కోరుకున్నారు. కానీ రతన్ ఆర్కిటెక్చర్‌పై మనసు పడ్డారు. చివరికి ఆయన నిర్ణయమే గెలిచింది. చాలా ఏళ్ల తర్వాత రతన్ టాటా బొంబాయిలో హలేకై (సముద్రం పక్కని ఇల్లు అని అర్థం) అని పిలిచే తన సొంత ఇంటిని తానే డిజైన్ చేసుకున్నారు.

అయితే టాటా అమెరికాతో ప్రేమలో పడ్డారు. వృద్ధురాలైన నానమ్మ ఆయన్ని తిరిగి రమ్మని గట్టిగా కోరుకోకపోతే, "ఆయన అమెరికాలోనే ఉండి పని చేస్తూ తన జీవితాన్ని అక్కడే గడిపేవారు. దానిని ఆయన తన రెండవ ఇల్లు అని పిలుస్తారు" అని మాథ్యూ వెల్లడించారు.





లాస్ ఏంజిల్స్‌లో ఆయన తన మొదటి ప్రియురాలు కరోలిన్ ఎమ్మన్స్‌ను కలుసుకున్నారు. ఆమె తండ్రి ఫ్రాంక్ ఆయన మొదటి బాస్. ఆయనే వారిని పరస్పరం పరిచయం చేశారు. రతన్ జీవితంలో మరో మూడు ప్రేమలు ఉన్నాయి కానీ ఎవరినీ పెళ్లి చేసుకోలేదు. 'బీబీసీ'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో, తాను ఇతర విషయాలకు ప్రాధాన్యం ఇచ్చాను గానీ ఎన్నడూ పెళ్లిపై దృష్టి పెట్టలేదని చెప్పారు.

అయినప్పటికీ, కరోలిన్‌తో టాటా టచ్‌లో ఉండేవారు. 2017లో జరిగిన ఆయన 80వ పుట్టినరోజుకు ఆమె హాజరయ్యారు. రతన్ అమెరికాలో ఉన్న ప్రతిసారీ కరోలిన్‌ను డిన్నర్‌కి తీసుకువెళ్లేవారని మాథ్యూ పేర్కొన్నారు. అందుకే దీన్ని చేదైన తీపి కథగా నేను భావించడంలో పొరబడలేదు కదా? ఇది కచ్చితంగా నిజమని కూడా అనిపిస్తుంది.

టాటా వ్యక్తిత్వంలోని ఆకర్షణీయమైన అంశాలను థామస్ పుస్తకం వెల్లడిస్తుంది. ఉదాహరణకు, ఆయన చెక్స్ షర్టులను ఇష్టపడేవారు. "ఆయన బాలుడిగా లేదా పెద్ద వయస్సులో ఉన్నప్పుడు తీసిన ఫొటోలలో దాదాపు 90 శాతం వరకు ఆయన ఫార్మల్ దుస్తులు కాకుండా చెక్స్ షర్టు ధరించి ఉన్నట్లు చూపుతాయి." ఆయనకు కార్లంటే కూడా మోజు ఉండేది. వాటిని హాలెకైలో ప్రత్యేకంగా నిర్మించిన నేలమాళిగలో భద్రపరిచారు. అమెరికన్ 'మజిల్ కార్లు' అంటే ఆయనకు ఎంతో ఇష్టం.

టీవీలో రతన్ టాటా అంత్యక్రియలను చూసిన మీకు, ఆయన పెంచిన కుక్క గోవా ఎలా దూకి శవపేటిక పక్కన కూర్చుందో గుర్తుకు వస్తుంది. టాటా తన కుక్కలకు ఎంత సన్నిహితంగా ఉండేవారో ఇది తెలియజేస్తుంది. మాథ్యూ దీనిపై పూర్తి కథను వెల్లడించారు.

ఆయన కుక్కలను తనకు లేని పిల్లలుగా చూసుకున్నారన్న భావన మీకు వస్తుంది. వీటిలో చాలా కుక్కలను టిటో, ట్యాంగో అని పిలిచేవారు. మాథ్యూ అదే పేరుతో ఉన్న మూడు తరాల కుక్కల గురించి చెబుతారు.

2008లో ట్యాంగోలలో ఒకదానికి కాలు విరిగింది. అప్పుడు టాటా ఆ కాలిని రక్షించగల పశువైద్యుని కోసం ప్రపంచాన్ని జల్లెడ పట్టారు. చివరికి ట్యాంగోను చికిత్స కోసం మిన్నెసోటా (యూఎస్ నగరం) తీసుకెళ్లారు.

తన చివరి జీవితంలో టిటో ఆయన ప్రధాన సహచరుడు. "ఇప్పుడు టాటాకు టిటో మాత్రమే ఉంది" అని మాథ్యూ రాశారు. "ప్రతి సాయంత్రం టిటో కోసం ఏ అవాంతరం లేకుండా ఒక సమయం రిజర్వ్ చేయబడేది. ఆ షెడ్యూల్‌కు ఎవరైనా, లేదా ఏ కార్యక్రమమైనా భంగం కలిగించడం టాటాకు ఇష్టం ఉండేది కాదు. టిటోతో గడిపే సమయమే ఆయనకు రోజులో అత్యుత్తమ సమయం" అని మాథ్యూ వివరిస్తారు.

బహుశా నమ్మశక్యం కాని విధంగా, టాటాలో చిలిపిగుణం కూడా ఉండేది. బోర్డ్ మీటింగ్‌లలో వృద్ధ డైరెక్టర్లు తమ బూట్లను తీసేస్తారని గమనించిన తర్వాత, ఆయన నిశ్శబ్దంగా వాటిని వీలైనంత దూరంలోకి తన్నేవారు. ఆ బూట్లు ఎక్కడ ఉన్నాయో వారికి కనిపించనప్పుడు అల్లరిగా నవ్వుతూ ఉండేవారు. మాథ్యూ పుస్తకంలోని అన్ని విశేషాల్లోకీ ఇది నాకు రసవత్తరమైన సంగతిగా అనిపించింది.

అయితే, సైరస్ మిస్త్రీ, టెట్లీ టీ, కోరస్, జాగ్వార్ అధ్యాయాలతో సహా ఇంకా చాలానే ఈ పుస్తకంలో ఉన్నాయి. ఆ వివరాలు ఉండకుండా ఎలా ఉంటాయి? కానీ వ్యక్తిగత వివరాలే నా దృష్టిని ఆకర్షించాయి. అవి మిమ్మల్ని కూడా ఆకర్షిస్తాయని నేను ఆశించవచ్చా?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పరీక్ష అవసరమేనా?



దాగివున్న వ్యాధుల కోసం చేసే స్క్రీనింగ్ టెస్టులు పైకిచూస్తే ఆకర్షణీయంగానే కనబడతాయి. కానీ ఒక్కోసారి అవి పొగ తాగడంలాగా ఆరోగ్యానికి హానికరం. అందులో ఏమీలేదని తేలితే మళ్లీ టెస్ట్ చేయాలనిపిస్తుంది. లేని ఆందోళనకు కారణమవుతుంది. అందుకే ఈ పరీక్ష నిజంగా ఆరోగ్యానికి మేలు చేసేదేనా అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి.

– ఎస్.పి. కాలంత్రి, ఎంజిఐఎంఎస్ డైరెక్టర్

స్నేహానికి అడ్డంకేమిటి?



మీ రకమైన మనుషులను గుర్తించండి. రాజకీయాల కారణంగా స్నేహితులను కోల్పోవడం గురించి ఎక్కువగా చింతించవద్దు. బయట చాలామంది మంచివాళ్లున్నారు. ఏ వయసులోనైనా, ఎక్కడైనా స్నేహాలు చేసుకోవచ్చు. ఇది నా అనుభవంతో చెబుతున్నా. బలమైన బంధాలు విశ్వాసం, న్యాయవర్తన నుంచి వస్తాయి. ఉమ్మడి గతాల నుంచి కాదు!

– అన్నే జైదీ, రచయిత్రి

పుస్తకం పాత స్నేహితుడు



నేను మళ్లీ పాత పుస్తకాలను ఆశ్రయించాను. ఇప్పుడు వస్తున్న పుస్తకాలు నిరాశ కలిగిస్తున్నాయి. పాత పుస్తకాలు చదవడం ఒక కళ. అది ఒక పాత స్నేహితుడిని మళ్లీ కలవడం లాంటిది. వాళ్ల అందమైన మనసు, వివిధ అంశాల మీద వాళ్ల వైఖరులు, దానికి వారిచ్చే సమర్థనలు, వారి దయ; జీవితపు సమస్యలను, వరాలను ఎలా ఎదుర్కోవాలో చెప్పే వారి వివేకం– అన్నీ గుర్తు తెచ్చుకోవడం అది.

– హెంద్ ఫైజల్ అల్ ఖసీమీ, యూఏఈ యువరాణి

మేధకు పరిమితి



ఒకరి అవగాహన మెరుగుపడినప్పుడు ప్రజ్ఞ అనేది వాస్తవంగా విస్తరిస్తుంది. కానీ అత్యంత తెలివైన మనిషి త్వరగానే మేధకు ఉన్న పరిమితులను అర్థం చేసుకుని దాన్ని దాటి వెళ్లేందుకు ప్రయత్నిస్తాడు.

– శ్రీ ఎం, ఆధ్యాత్మిక గురువు

పోయేదాకా పోరాడుదాం!



నాకు (కూడా) చాలాసార్లు జీవితం మీద నిరాశ పుడుతుంటుంది. కానీ బతుకుదాం. మృత్యువు అనేది ఒకరోజు నిశ్చయం. ఎవరమూ ఎప్పటికీ ఉండిపోం కదా!

– ఒన్యేకా నువేల్యూ, నైజీరియా రచయిత

పోరాడితేనే...



1804లో హైతీ భూమ్మీద మొదటి నల్ల రిపబ్లిక్‌గా అవతరించింది. వాళ్లు తమ బానిస యజమానులతో పోరాడారు, మరణించారు, తమను తాము విముక్తం చేసుకున్నారు. బ్రిటన్ ఎక్కడా కూడా బానిసత్వాన్ని అంతం చేయలేదు.

– అడేమోలా, పాన్ ఆఫ్రికనిస్ట్

ఇన్ బాక్స్

నడిచే గ్రంథాలయం

ఊరూరా తిరుగుతూ... పుస్తకాలు పంచుతూ, విజ్ఞానం పెంచుతూ సామాజిక సేవా కార్యక్రమాలతో వార్తల్లోకెక్కిన పాత్రికేయుడు ఎస్.కె. సాదిక్ అలీ అంటే తెలియని వారుండరు. అంతకు మించి ఆయన 'తోపుడుబండి సాదిక్'గా సుప్రసిద్ధులు. ఖమ్మం జిల్లా కల్లూరుకు చెందిన ఆయన ఉభయ తెలుగు రాష్ట్రాల సాహితీ ప్రియులకు చిర పరిచితులే. జర్నలిస్టుగా పనిచేస్తూనే కథలు, కవితలు, వ్యాసాలు అనేకం రాసి అక్షర సేద్యం కొనసాగించారు. అంతటితో ఆగకుండా విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచాలని భావించారేమో తోపుడుబండిపై పుస్తకాలు పెట్టుకుని హైదరాబాద్‌లోని గల్లీ గల్లీ తిరిగారు. మళ్లీ పుస్తకాలు అచ్చేసుకోవచ్చన్న ధైర్యాన్ని రచయితలు సాదిక్ ద్వారా అందిపుచ్చుకోవడం విశేషం. రంగారెడ్డి, మెదక్, నల్గొండ, వరంగల్ జిల్లాల్లోని ఊళ్లకు తోపుడుబండితో పాదయాత్రగా వెళ్లారు. తొలినాళ్లలో పిల్లలకు పుస్తకాలు ఉచితంగా అందించారు. తర్వాత యువ కవుల కవితా సంపుటాలను విక్రయించి 'తోపుడుబండి పబ్లికేషన్స్'ను నెలకొల్పారు. పాత పుస్తకాలను సేకరించి పంచారు. కొత్త పుస్తకాలను అచ్చేసి విక్రయించి ఆ ధనాన్ని ప్రజోపయోగానికి ఉపయోగించాయు

అనేక ప్రైవేటు వ్యాపారాలు చేస్తూ, ఎన్నారై మిత్రుల నుంచి విరాళాలు సేకరిస్తూ విద్యార్థుల ఉన్నత చదువుల కోసం పాటుబడ్డారు. ఇందుకోసం 'తోపుడుబండి ఫౌండేషన్'ను ఏర్పాటుచేశారు. సొంత ఖర్చుతో పలు పాఠశాలల్లో గ్రంథాలయాలను నెలకొల్పారు. అందుకే ఆయన చిరస్మరణీయుడు.

– చెన్నాప్రగడ వీఎస్‌ఎస్ శర్మ, సీనియర్ జర్నలిస్ట్
(నవంబర్ 7న హైదరాబాద్‌లో కన్నుమూసిన సాదిక్‌కు నివాళిగా)

ఖమ్మం ఈస్తటిక్స్ సాహిత్య పురస్కారాలు

'ఖమ్మం ఈస్తటిక్స్' సాహిత్య పోటీకి 120కి పైగా కవితా సంపుటులూ, 140కి పైగా కథలూ వచ్చాయి. కవిత్వ విభాగంలో జూకంటి జగన్నాథం కవితా సంపుటి 'ఒక కప్పు చాయ్ నాలుగు మెసేజ్‌లు' రూ. 40 వేల బహుమతిని గెలుచుకుంది. మరో ఇద్దరికి ప్రత్యేకప్రశంసా అవార్డులు దక్కాయి. రాళ్లబండి శశిశ్రీ కవితా సంపుటి 'అనుమంద్రం', తెలుగు వెంకటేష్ కవితా సంపుటి 'కబోధి చేపల కబుర్లు' ప్రత్యేక ప్రశంసకు అర్హమైనవిగా ఎంపికయ్యాయి. ప్రముఖ కవి ఎన్. గోపి కవితా సంపుటి 'క్రియ ఒక జీవన లయ' విశిష్ట పురస్కారం పొందింది. కథల విభాగంలో ఉత్తమ కథగా కేవీ మన్‌ప్రీతమ్ 'నూరేళ్ల మోసే తల్లి కథ' రూ. 25 వేలు గెలుచుకుంది. ద్వితీయ ఉత్తమ కథగా సయ్యద్ గఫార్ 'న్యూ బాబాయిజం' రూ. 15 వేలు సొంతం చేసుకుంది. తృతీయ ఉత్తమ కథగా కరీం 'ఝూజా' రూ. 10 వేలు గెలిచింది. బహుమతులు గెలుచుకున్న కథలతో సహా పోటీకి వచ్చిన కథలలో 12 కథలను ఒక సంపుటిగా ప్రచురిస్తున్నాం. డిసెంబర్ 15న ఖమ్మంలో అవార్డుల ప్రదాన సభ జరుగుతుంది.

– ఖమ్మం ఈస్తటిక్స్ కమిటీ

వామపక్ష ఐక్య ఉద్యమమే దారి!

సందర్భం



చాడ వెంకటరెడ్డి

మానవ సమాజ పరిణామ క్రమంలో పుట్టుకు వచ్చిన పెట్టుబడిదారీ వ్యవస్థలో... యజమాని, కూలి వంటి వర్గాలు ఏర్పడ్డాయి. వర్గాల మధ్య అంతర్గతమైన అణచివేతలు, దోపిడీ కొనసాగింది. రైతులు, కూలీలు చేసిన ఉత్పత్తులను యాజమానులు సంపదగా మలుచుకొని దోపిడీకి తెగబడ్డారు. మానవ సమాజాన్ని కారల్ మార్క్స్ అధ్యయనం చేసి దోపిడీ చేసే వర్గం సమాజంలో తక్కువగా ఉన్నదనీ, దోపిడీకి గురయ్యే వర్గం ఎక్కువగా ఉన్నదనీ చెప్పాడు. దోపిడీకి గురైన వారు ఐక్యంగా ఉండి తిరగబడినప్పుడు మాత్రమే దోపిడీ రహిత సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపాడు. దానికి మొదటగా 1848లో మొదటి 'కమ్యూనిస్టు ప్రణాళిక'ను ప్రవేశపెట్టాడు. మానవ కల్యాణానికి వర్గ రహిత సమాజ నిర్మాణానికి కారల్ మార్క్స్ కృషి చేశాడు.

1895 అమెరికాలోని షికాగో నగరంలో అణచి వేయబడిన కార్మికులు... తడిచిన రక్తంలో తడిచిన కండువాను ఎర్రజెండాగా ఎగురవేసి కార్మికుల హక్కులకై పోరాటం చేశారు. ఈ ఉద్యమం అణచివేత, ఆవేదన, దోపిడీ నుండి పుట్టుకొచ్చింది. ప్రపంచవ్యాప్తంగా వామపక్ష పార్టీలు విస్తరించాయి. ఈ విస్తరణలో భాగంగా శ్రీలంకలో వామపక్ష పార్టీ అధికార పగ్గాలు చేపట్టింది. ఈ క్రమంలోనే భారత్‌లోని అన్ని వామపక్షాలూ ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరాన్ని గుర్తించాలి.

భారతదేశం విభిన్న కులాలు, మతాలు, సంస్కృతుల సమ్మేళనం. ఇక్కడ వామపక్ష భావజాలానికి స్థానం ఉంది. అయితే విస్తరించడానికి అడ్డంకులు ఉన్నాయి. భారతదేశంలో 1925లో కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) స్థాపన జరిగింది. అయితే సిద్ధాంతపరమైన విభేదాల వలన ఇది అనేక పార్టీలుగా చీలిపోయింది. 1952లో సాధారణ ఎన్నికలు జరిగాయి. ప్రజల చేత, ప్రజల కొరకు ప్రభుత్వం ఏర్పడాలి. కానీ కుల, మత పార్టీలు పుట్టుకొచ్చాయి. భారతదేశంలో కమ్యూనిస్టులు శ్రమజీవుల పక్షాన, కార్మికుల పక్షాన నిలబడ్డారు. కమ్యూనిస్టులు పోరాటాల ద్వారా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ప్రజాస్వామ్య పద్ధతులలో హక్కులను పొందాలని ప్రయత్నిస్తున్నారు. అయితే వామపక్ష పార్టీలలో మావోయిస్టులు తుపాకీ గొట్టం ద్వారానే హక్కులను సాధించుకుందామనే ఆలోచనతో పోరాటం చేస్తున్నారు. వారు చేస్తున్న పోరాట రూపం తప్పు కావచ్చు. కానీ లక్ష్యం సరైనదే.



నరేంద్రమోదీ, అమిత్‌షాలు వామపక్ష పార్టీలే ప్రధాన బద్ధశత్రువులుగా చూస్తున్నారు. వామపక్ష భావాలు కలిగిన వారిపై ఉపా, రాజద్రోహం కేసులు పెడుతూ బెయిల్ రాకుండా సంవత్సరాల తరబడి జైల్లోనే ఉంచటం చూస్తున్నాము. ఇప్పుడు మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా వందలమంది మావోయిస్టులను బలిగొంటున్నారు. వచ్చే ఏడాదికి నక్సలైట్‌లను నిర్మూలిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటనలు ఇస్తున్నారు. దానికి కారణం భారతదేశంలో వామపక్ష పార్టీలు లేకుండా చేయాలనే దుర్బుద్ధి తప్ప మరొకటి కాదు.

మావోయిస్టు పార్టీలే కాదు... పార్లమెంట్ పంథాలో పనిచేస్తున్న వామపక్షాలు కూడా అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటున్నాయి. ప్రజాస్వామ్యంలో ఓట్లు కీలకమైనందున ఓట్లు రాబట్టడానికి వామపక్షేతర పార్టీలు అడ్డమైనదారులు తొక్కుతూ అధికారమే పరమావధిగా ఓటర్లను ప్రభావితం చేసే సాధనాలను ఆశ్రయిస్తున్నాయి. డబ్బు, మద్యం, సంక్షేమ పథకాల ఎర చూపి అరచేతిలో స్వర్గం చూపిస్తున్నాయి. అందుకే అవి గెలుస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రజలు గెలవాలి. కాని దోపిడీ శక్తులూ, వారికి అండగా ఉండే మతోన్మాద శక్తులూ అధికారం హస్తగతం చేసుకుంటున్నాయి. దీంతో కార్మికులు, కూలీలు, బడుగు బలహీనవర్గాల శ్రమకు తగ్గ ఫలితం రావడం లేదు. సామాజిక న్యాయం నినాదానికే పరిమితం అయ్యింది.

వామపక్ష పార్టీలు ఎక్కడ అణచివేతలు, దోపిడీ ఉంటాయో అక్కడే ఉంటాయి. కొన్ని పార్టీల వారిని ఉగ్రవాదులుగా ముద్రవేసి వారిని నిర్మూలిస్తామని ప్రభుత్వం ప్రకటిస్తున్నది. అయితే ఉగ్రవాదులని అంటున్న వారికీ ప్రజా మద్దతు ఉన్న విషయాన్ని మరువరాదు. ఇదే తరుణంలో మావోయిస్టులు కూడా అంతర్మథనం చేసుకుని ప్రత్యామ్నాయ ఆలోచనలకు పదును పెట్టాలి.

ప్రజలు తమ వంతుగా ప్రజాస్వామ్య ఫలాలు పొందడానికి పాలకులను ఆలోచింప చేసే విధంగా చైతన్యాన్ని ప్రదర్శించాలి. ప్రభుత్వ దమన చర్యలను ప్రజాస్వామ్య పద్ధతులలో మావోయిస్టులు తిప్పిగొట్టాలి. 'కన్నుకు కన్ను... చావుకు చావు' అనే సిద్ధాంతం నుండి కాకుండా కమ్యూ నిస్టులు ఐక్య పోరాటం చేసి అణచివేతలను వర్గ రహిత సమాజాన్ని నిర్మించాలి.

మితవాద, మతవాద శక్తుల నుండి దేశం తీవ్ర ప్రమాదం ఎదుర్కొంటున్న ఈ దశలో వామపక్ష, ప్రజాతంత్ర, ప్రగతిశీల శక్తులన్నీ ఐక్యంగా దానిని తిప్పికొట్టాలి. అందుకు తరుణమిదే!

వ్యాసకర్త సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యులు

మాటలంటే మాటలా?

ఏ సందర్భంలో చెప్పాల్సిన మాట ఆ సందర్భంలో చెప్పి, తన మాటల వల్ల అటు ఇతరులకూ నొప్పి కలగకుండా, ఇటు తానూ ఇబ్బందిపడి నొచ్చుకొనే పని లేకుండా, తప్పించుకొనే వాడు ధన్యుడు అని సుమతీ శతకం నీతి. దీనికి, 'ఎక్కడి మాటలు అక్కడ చెప్పేసి, పబ్బం గడిపేసుకొని, పారిపోవటం ఉత్తమ మార్గం!' అని అర్థం చెప్తే, అది కొంత వంకరగా, నకారాత్మకంగా ఉంటుంది. అది 'లౌక్యం' అవుతుంది కానీ సత్పురుషుడు అనుసరించాల్సిన 'నీతి'గా అనిపించదు.

సుమతీకారుడి సూక్తిని సకారాత్మకంగానే అర్థం చెప్పుకోవచ్చు. మనిషి లోక వ్యవహారాలలో, మాటలను ఎప్పుడూ ఆచి తూచి వాడాలి. ఎందుచేత? మరీ కరకుగా, పరుషంగా, నిక్కచ్చిగా మాట్లాడితే, ఎదుటి వాడిని నిష్కారణంగా నొప్పించిన వాళ్ళమవుతాం. అలాగని మరీ మెతకదనంగా పోతే, ఎదుటివాడు దాన్ని మన బలహీనతగా, పిరికితనంగా భావించి, మనల్ని నొప్పించే పరిస్థితికి దారితీయవచ్చు. అయితే, అదీ ఇదీ రెండూ జరగకుండా, జాగ్రత్తగా మాట్లాడటం కత్తిమీద సాములాగా కష్టమైన విషయం. కాబట్టి, మధ్యేమార్గంగా, అవసరమైన సందర్భాలలో మాత్రమే, అవసరమైనంత వరకూ మాత్రమే మాట్లాడి, ఆపైన మౌనం వహిస్తే, అతి ప్రసంగం వల్ల వచ్చే సమస్యల నుండి తప్పించుకోవచ్చు. నిగ్రహంతో, ఉపాయంతో, అనవసరపు సమస్యలు రేకెత్తకుండా నివారించుకోవటం తప్పు కాదు, పలాయనమూ కాదు. అది సత్పురుషుడి కర్తవ్యమే.

తిక్కన ఉద్యోగ పర్వంలో విదురుడు కూడా ఇలాంటి హితవే చెప్తాడు. **'ఎదిరికి హితమును, నిజమును,/ మదికింపును కాగ పలుకు మాటలు పెక్కె/ యొదవినను లెస్స,...'** మాట్లాడితే ఎదుటి వారికి హితం కలిగించే మాటలు మాట్లాడాలి. సత్యమే మాట్లాడాలి, అసత్యం కూడదు. అది కూడా ఎదుటివాడి మనసుకు 'ఇంపు'గా, ప్రియంగా ఉండేలా మాట్లాడాలి. ఈ నియమాలు పాటించగలిగితే, ఎన్ని మాటలు మాట్లాడినా, కొంత అధిక ప్రసంగం చేసినా మంచిదే. తప్పులేదు. అలా కాకుండా, ఆ నియమాలు పాటించలేకపోతే? అదీ ఆయనే చెప్పాడు. **'.... అటు గాకన్,/ 'ఇది, అది' అనక. ఊరకునికి ఎంతయు ఒప్పున్!'** ఇదీ, అదీ అని ఏమీ మాట్లాడకుండా, మౌనంగా ఊరుకోవటమే శ్రేష్ఠం. మైత్రీ–వైరమూ, శాంతీ–అలజడీ, పుణ్యం–పాపం... ఇవన్నీ మాట్లాడే పద్ధతి వల్ల కలిగే ఫలితాలే!

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** శు.దశమి ప.2.23 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** శతభిషం ఉ.6.32 వరకు, తదుపరి పూర్వాభాద్ర తె.5.08 వరకు (తెల్లవారితే మంగళవారం), **వర్జ్యం:** ప.12.34 నుండి 2.02 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.09 నుండి 12.57 వరకు, తదుపరి ప.2.25 నుండి 3.13 వరకు, **అమృతఘడియలు:** రా.9.31 నుండి 11.01 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.05, **సూర్యాస్తమయం:** 5.23.

క్లుప్తంగా...

ఆధ్యాత్మిక వేత్త కందాడై రామానుజాచార్యులు అస్తమయం



నాగోలు: ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ప్రవచకులు, సంస్కృత పండితులు డాక్టర్ కందాడై రామానుజాచార్యులు (80) ఆదివారం కొత్తపేట డివిజన్‌లోని న్యూ నాగోలు కాలనీలోని ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచారు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. 1944లో సూర్యాపేట జిల్లా, చీదెల్ల గ్రామంలో ఆయన జన్మించారు. రామానుజాచార్యులకి ఓ కుమారుడు, కుమార్తె ఉ న్నారు. ఆయన నగరంలోని ఓ సంస్కృత కాలేజీ ప్రిన్సిపాల్‌గా రిటైర్ అయ్యారు. అనేక సంవత్సరాలుగా ప్రవచనాలు చేస్తున్నారు. కందాడై రామానుజాచార్యులు అస్తమించిన విషయం తెలుసుకున్న అహోబిల రామానుజ జీయర్ స్వామి, దేవనాథజీయర్ స్వామిలు ఆయన నివాసానికి వచ్చి పార్థివదేహం వద్ద నివాళులు అర్పించారు. రామానుజాచార్యులు ఆధ్యాత్మికరంగానికి మహోన్నత సేవలు అందించారని ప్రశంసించారు. నాగోలు శ్మశాన వాటికలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు.

విషాద 'సాగరం'

- సాగర్ వెనుక జలాల్లో మునిగి యువకుని మృతి
- మృతుడు సికింద్రాబాద్ వాసి

చందంపేట: సాగర్ వెనుక జలాల్లో మునిగి ఒక యువకుడు మృతి చెందాడు. నల్లగొండ జిల్లా నేరెడుగొమ్ము మండలం వైజాగ్ కాలనీలో జరిగిన ఈ విషాద సంఘటన వివరాలివి. సికింద్రాబాద్‌లోని బోయినపల్లికి చెందిన బొమ్ము అనిల్ (23) ప్రైవేట్ కొరియర్ సంస్థ ఉద్యోగిగా జీవనం సాగిస్తున్నాడు. అనిల్ తన ఇద్దరు స్నేహితులతో కలిసి ఆదివారం వైజాగ్ కాలనీకి విహారయాత్రకు వచ్చాడు. స్నేహితులందరూ కలిసి స్నానం చేసేందుకు సాగర్ వెనుక జలాల్లోకి దిగారు. ఈ క్రమంలో అనిల్ నీటిలో మునిగిపోగా.. స్నేహితులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి గజ ఈతగాళ్లతో గాలించగా.. అప్పటికే అనిల్ విగత జీవిగా కనిపించాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీశ్ తెలిపారు.

ముగ్గురిపై పిచ్చికుక్క దాడి

- ఒకరి పరిస్థితి విషమం


రేష్మాబేగం చేతికి గాయాలు


గాయపడిన అరవింద్‌కుమార్


తీవ్రంగా గాయపడిన దానయ్య

బంట్వారం: పిచ్చికుక్క దాడిలో ముగ్గురు గాయపడగా.. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వికారాబాద్ జిల్లా బంట్వారం మండల కేంద్రంలో ఆదివారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. గ్రామానికి చెందిన అరవింద్ కుమార్ (5), రేష్మాబేగం (30), దానయ్య (60)పై ఒక పిచ్చికుక్క దాడి చేసింది. అరవింద్‌కుమార్, రేష్మాబేగంపై ఉదయం దాడి చేసిన శునకం.. మధ్యాహ్నం ఇంటి ఎదుట నిద్రిస్తున్న దానయ్యను కూడా తీవ్రంగా గాయపరిచింది. గ్రామస్తులు 108కు సమాచారం ఇవ్వడంతో అరవింద్‌కుమార్, రేష్మాబేగం తాండూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. తీవ్రంగా గాయపడిన దానయ్యను సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

గేదెను కాటేసిన కలుషిత జలం

చౌటుప్పల్ రూరల్: పరిశ్రమ కలుషిత నీరు తాగి గేదె మృత్యువాత పడింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని ఆరెగూడెం గ్రామంలో ఆదివారం జరిగిన ఈ సంఘటనపై బాధితుడు బాలకృష్ణ తెలిపిన వివరాలివి. ఆరెగూడెం గ్రామానికి చెందిన గుండెబోయిన బాలకృష్ణ డెయిరీ ఫాం నిర్వహిస్తున్నారు. దివీస్ పరిశ్రమ వల్ల భూగర్భ జలాలు కలుషితమై పంటలు పండకపోవడంతో డెయిరీ ఫాం నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం బోరు నీటిని తాగి.. రూ.1.1 లక్షల విలువైన గేదె మృతి చెందింది. పరిశ్రమల వల్ల కలుషితమైన బోరునీటిని తాగడం వల్లే తన గేదె చనిపోయిందని.. పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

రేపటి నుంచి మెథడిస్ట్ క్రిస్టియన్ జాతర

ధారూరు: లక్షలాది మంది భక్తులు హాజరయ్యే మెథడిస్ట్ క్రిస్టియన్ జాతర మంగళవారం ప్రారంభం కానుంది. ఈ నెల 17 వరకు నిర్వహించనున్న ఈ జాతరకు బిషప్‌లతో పాటు దేశ, విదేశాల నుంచి క్రైస్తవ భక్తులు పెద్దఎత్తున హాజరు కానున్నారు. 35 వేల ఎకరాల్లో ఆరు లక్షల మంది యాత్రికుల కోసం నిర్వాహకులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. సీసీ కెమెరాలతో పాటు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

ప్రతి గింజా కొంటాం

- 70–75 శాతం మిల్లర్లు సహకరిస్తున్నారు
- సహకరించని ప్రాంతాల్లో కార్పొరేషన్ ద్వారా కొనుగోళ్లు
- ఏపీలో 100శాతం బ్యాంకు గ్యారంటీలు.. ఇక్కడ 10–25 శాతమే
- మిల్లర్ల సంఘం సమ్మతించిన తర్వాతే ముందుకు పోతున్నాం
- ధాన్యం కొనుగోళ్లకు రూ.30 వేల కోట్ల సమీకరణ

'సాక్షి'ప్రత్యేక ఇంటర్వ్యూలో పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రైతు పండించిన ప్రతి గింజకు మా ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తుంది. 7,750 ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెరిచాం. ఇది గత ప్రభుత్వం కంటే చాలాఎక్కువ. కేంద్రాల్లో పనిచేసే సిబ్బందికి శిక్షణ ఇచ్చి అన్ని సదుపాయాలు కల్పించాం. ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన నిధులు కూడా సమీకరించాం. రూ.30 వేల కోట్ల వరకు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. 70–75 శాతం మిల్లర్లు ధాన్యం కొనుగోళ్లకు సహకరిస్తున్నారు. వారు సహకరించని ప్రాంతాల్లో పౌరసరఫరాల సంస్థ ద్వారా మార్కెట్ కమిటీల ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తాం. రైతులెవరూ ఆందోళన పడొద్దు'అని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోళ్లపై ఆదివారం ఆయన 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: కొన్ని ప్రాంతాల్లో మిల్లర్లు సహకరించక రైతులు ఇబ్బంది పడుతున్నారు కదా ?

ఉత్తమ్: ధాన్యం కొనుగోళ్లకు సహకరించాలని మిల్లర్లకు మరోసారి విజ్ఞప్తి చేస్తున్నాం. రైతులకు మద్దతు ధరకన్నా, తక్కువ చెల్లింపులు చేస్తే కఠిన చర్యలు తప్పవు. మిల్లర్లు సహకరించని ప్రాంతాల్లో రైతులకు ఇబ్బంది కలగకుండా పౌరసరఫరాల సంస్థ ద్వారా కొనుగోళ్లు చేసి గోదాముల్లో నిల్వ చేసేందుకు ఏర్పాట్లు చేశాం. ఎక్కడా మేజర్ సమస్యల్లేవు.

ప్రశ్న: బ్యాంకు గ్యారంటీ నిబంధన ఉపసంహరించాలని మిల్లర్లు కోరుకుంటున్నారు కదా?

ఉత్తమ్: గత ప్రభుత్వం మిల్లర్ల వద్ద స్టాక్ ఉంచి ఏ సెక్యూరిటీ తీసుకోలేదు. ఏపీలో 100 శాతం సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించి మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. మన దగ్గర సైతం ప్రారంభ దశలో మిల్లర్ల ట్రాక్ రికార్డు ఆధారంగా స్టాక్ విలువలో 10 శాతం, 20 శాతం, 25 శాతాన్ని సెక్యూరిటీ డిపాజిట్‌గా తీసుకోవాలని నిర్ణయించాం. రాష్ట్ర మిల్లర్ల సంఘం ఒప్పుకున్న తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నాం. బాండ్ పేపర్‌పై పూచీకత్తు రాసిచ్చి కూడా ధాన్యం కొనుగోలు చేసే అవకాశాన్ని కల్పించాం.

ప్రశ్న: మిల్లర్లకు ఏమైనా వెసులుబాటు కల్పిస్తారా?

ఉత్తమ్: ఏపీతో పోల్చితే రాష్ట్రంలో బ్యాంకు గ్యారంటీలు చాలా తక్కువే. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మిల్లర్లకు టన్నుకు రూ.10 చొప్పున మిల్లింగ్ చార్జీలు చెల్లించగా, ఇప్పుడు మేము దొడ్డు రకానికి రూ.40, సన్న రకానికి రూ.50 చొప్పున పెంచాం. ఏపీలో డిఫాల్ట్ అయిన మిల్లర్ల నుంచి 150 శాతం జరిమానా వసూలు చేస్తే, మన దగ్గర 120 శాతమే వసూలు చేస్తున్నాం.గతంలో మిల్లర్లకు సీఎంఆర్ ధాన్యం కేటాయింపుల్లో చాలా అవినీతి జరిగేది. ఇప్పుడు శాస్త్రీయ సిద్ధాంతం ఆధారంగా ఏ మిల్లర్‌కు ఎంత ఇవ్వాలో నిర్ణయించి ఇస్తున్నాం.

ప్రశ్న: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కూడా రైతులు ఇబ్బంది పడుతున్నట్టు వార్తలొచ్చాయి ?

ఉత్తమ్: ఉమ్మడి నల్లగొండ జిల్లాల్లో సజావుగా ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఒకరిద్దరు మినహా స్థానిక మిల్లర్లందరూ సహకరిస్తున్నారు. (మంత్రి ఉత్తమ్ సూర్యాపేట, నల్లగొండ, భువనగిరి జిల్లాల కలెక్టర్లకు అప్పటికప్పుడు ఫోన్ చేసి పరిస్థితిని ఆరా తీశారు. కలెక్టర్ల నుంచి మంచి ఫీడ్‌బ్యాక్ ఉందని చెప్పారు.)

ప్రశ్న: ఈ సారి రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి వచ్చింది.ఎలాంటి ఏర్పాట్లు చేశారు ?

ఉత్తమ్: గతంలో ఎన్నడూ లేనంతగా రాష్ట్రంలో ఈసారి రికార్డు స్థాయిలో 66.7లక్షల ఎకరాల్లో 40 లక్షల మంది రైతులు 155 మెట్రిక్ టన్నుల ధాన్యం పండించారు. ధాన్యం కొనుగోలు చేసిన మూడు నాలుగు రోజుల్లోనే వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులను జమ చేస్తాం. కాళేశ్వరం ప్రాజెక్టుతోనే రాష్ట్రంలో వరి ధాన్యం పెరిగిందని గత బీఆర్ఎస్ ప్రభుత్వం చెప్పుకున్నదంతా అబద్ధమని ఈసారి తేటతెల్లమైంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నుంచి చుక్కనీరు సరఫరా చేయకపోయినా ఈ ఖరీఫ్‌లో రికార్డు స్థాయిలో ధాన్యం పండింది.

ప్రశ్న: సన్నాలకు రూ.500 బోనస్ చెల్లిస్తామన్నా, రైతులు వ్యాపారులు, మిల్లర్లకు నేరుగా అమ్ముకుంటున్నారు కదా ?

ఉత్తమ్: కేంద్రం ప్రకటించిన మద్దతు ధరతో దొడ్డు రకం ధాన్యం, దానికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి మరో రూ.500 బోనస్ చెల్లించి సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నది. కొనుగోలు కేంద్రాలకు సన్న రకం ధాన్యం ఎంత వచ్చినా బోనస్ చెల్లించి కొనుగోలు చేస్తాం. పండించిన ధాన్యం అమ్ముకునే విషయంలో రైతులపై ఆంక్షలు లేవు. సన్నాలకు మద్దతు ధర రూ.2320కు బోనస్ రూ.500 కలిపితే వచ్చే ధర కంటే అధిక ధరతో అమ్ముకునే అవకాశం వస్తే రైతులకు, ఆర్థిక వ్యవస్థకు, రాష్ట్రానికి మంచిది.

ప్రశ్న: రైతులు సన్నాలను ప్రభుత్వానికి అమ్మకపోతే వచ్చే సంక్రాంతి నుంచి రేషన్‌షాపుల్లో సన్న బియ్యం పంపిణీ ఎలా చేస్తారు ?

ఉత్తమ్: రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీకి ఇబ్బంది లేకుండా అవసరమైన సరుకు సమీకరణ చేస్తాం. ఇబ్బందులేమీ రావు.

ప్రశ్న: ధాన్యం సేకరణలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని బీఆర్ఎస్, బీజేపీ ఆరోపణలు చేస్తున్నాయి ?

ఉత్తమ్: నల్లగొండ జిల్లాలో రైతులు రోడ్లపై ఆరబోసుకున్న ధాన్యం వీడియోలు తీసి రైతులు రోడ్లపై పారబోశారని బీఆర్ఎస్ వారు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. 17శాతం, ఆలోపే తేమ ఉండాలని కేంద్రమే నిర్దేశించింది. మద్దతు ధర సైతం కేంద్రమే నిర్ణయించింది. దాని ప్రకారమే ధాన్యం కొనుగోళ్లు చేస్తుంటే బీజేపీ నేతలు కేంద్రాలకు వెళ్లి ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉంది.

ప్రియురాలి తండ్రిపై ప్రేమికుడి కాల్పులు

- లవర్‌ను తనకు దూరం చేస్తున్నారని దుశ్చర్య
- యువతి తండ్రి కంటిలో నుంచి దూసుకెళ్లిన బుల్లెట్
- నిందితుడు అరెస్టు... ఎయిర్‌గన్, పిస్టల్ స్వాధీనం


నిందితుడు బల్వీర్


పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎయిర్‌గన్, పిస్టల్

నాగోల్: ప్రేమించిన యువతిని తనకు దూరం చేశారన్న కోపంతో అమ్మాయి తండ్రిపై ఓ యువకుడు కాల్పులకు తెగబడ్డాడు. ఈ దాడిలో అమ్మాయి తండ్రి కన్ను కోల్పోయాడు. ఈ ఘటన హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. సరూర్‌నగర్ వెంకటేశ్వర కాలనీ రోడ్డు నెంబర్ 14లోని మల్లికారాణి అపార్ట్‌మెంట్‌లో పెరిశెట్టి రేణుక ఆనంద్ (57) నివాసం ఉంటున్నారు. ఆయనకు ఇద్దరు సంతానం. చిన్న కుమార్తె పాఠశాలల్లో చదివే సమయంలో తన క్లాస్‌మేట్ ఆయన గోగికర్ బల్వీర్‌తో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి బల్వీర్ ఆమెను ప్రేమిస్తున్నానని వేధించేవాడు. ఆ యువతి దుండిగల్‌లోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో చేరటంతో బల్వీర్ కూడా అక్కడే చేరాడు. అక్కడ కొంత కాలం వారు కలిసిమెలిసి తిరిగారు. ఈ విషయం ఇంట్లో తెలిసిన యువతి తండ్రి ఆనంద్ తన కూతురిని ఇబ్బందులకు గురిచేయవద్దని బల్వీర్‌ను హెచ్చరించాడు.

పగ పెంచుకొని పక్కా ప్లాన్‌తో కాల్పులు

ఆరు నెలల క్రితం బల్వీర్ తన స్నేహితుడు గోపికి ఫోన్ చేసి తన ప్రేమకు అడ్డు వస్తున్న ఆనంద్‌ను చంపేస్తానని బెదిరించాడు. కొద్దిరోజుల క్రితం ఆనంద్ ఇంటివద్దకే వచ్చిన బల్వీర్.. 'నీ కూతుర్ని ప్రేమిస్తున్నాను'అని గొడవ చేసి 'ఎన్ని రోజులున్నా నిన్ను చంపేస్తా'అని బెదిరించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం బల్వీర్ తల్లిదండ్రులను పిలిపించిన ఆనందర్.. వారి సమక్షంలో బల్వీర్‌కు కౌన్సిలింగ్ ఇచ్చి పింపించారు. ఆనంద్ తన కూతురిని ఇటీవలే అమెరికాకు పంపించాడు. దీంతో పగ పెంచుకొన్న బల్వీర్ ఆనంద్‌ను హత్య చేయాలని పథకం వేశాడు. షూటింగ్ ప్రాక్టీస్ కోసం తెచ్చుకొన్న ఎయిర్‌గన్, షార్ట్ గన్‌తో ఆదివారం మధ్యాహ్నం ఆనంద్ ఇంటికి వచ్చి ఆయనతో గొడవ పడ్డాడు. వెంటనే ఎయిర్‌గన్‌తో లీగల్ పోలీస్, లీగల్ పోలీస్ అని గట్టిగా అరుస్తూ కాల్పులు జరిపాడు. బుల్లెట్ ఆనంద్ కుడికన్నుపై తగిలి తీవ్ర గాయమైంది. వెంటనే అక్కడ నుంచి వెళ్లిపోయిన బల్వీర్.. పక్కనే ఉన్న అంబితా శ్రీనిలయం అపార్ట్‌మెంట్‌లో ఉన్న ఆనంద్ కారును ధ్వంసం చేసి తన బైక్‌పై పారిపోయాడు. గాయపడిన ఆనంద్‌ను స్థానికులు ఎల్వీ ప్రసాద్ కంటి దవాఖానకు తరలించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి బల్వీర్‌ను అరెస్టు చేసినట్లు సరూర్‌నగర్ సీఐ సైదిరెడ్డి తెలిపారు. నిందితుడి నుంచి ఎయిర్‌గన్, షార్ట్‌గన్ (పిస్టల్), బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొన్నట్లు వెల్లడించారు.

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం


కాలిపోతున్న కారు

మంచిర్యాల క్రైం: ఇంజిన్ ఆన్ చేసి నిలిపి ఉంచిన కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగి దగ్ధమైన ఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌లో ఆదివారం జరిగింది. ఎస్సై ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన పిట్టల రాజేశ్ సింగరేణి ఉద్యోగి. మంచిర్యాల జిల్లా మందమర్రిలోని తన స్నేహితుడి వివాహానికి ఉదయం కారులో బయల్దేరాడు. మంచిర్యాల శివారు రాజీవ్‌నగర్ వద్ద కారు ఇంజిన్ ఆన్‌లోనే ఉంచి బయటకు దిగాడు. ఈ క్రమంలో కారులో షార్ట్‌సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వగా.. పోలీసులు చేరుకునేలోపే కారు పూర్తిగా దగ్ధమైంది. రాజేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'బీసీలకు బీజేపీనే సానుకూలం'

సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం పాటుపడేది కేవలం బీజేపీ మాత్రమేనని ఆ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ వ్యాఖ్యానించారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కులగణనకు బీజేపీ అనుకూలమా.. వ్యతిరేకమా? అంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. కులం పేరిట రిజర్వేషన్లు ఉండొద్దని ఎస్సీ, ఎస్టీ, బీసీలను అవమానించింది కాంగ్రెస్ పార్టీయే అని ఆరోపించారు. కులగణనతో బీసీలకు ఏవిధంగా మేలు చేస్తారో ప్రభుత్వం చెప్పాలన్నారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో జాతీయ బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించారని, ఉన్నత విద్యలో 27 శాతం రిజర్వేషన్లు కల్పించామని, అనేక రాష్ట్రాల్లో బీసీలే సీఎంలుగా ఉన్నారని ఆనంద్‌గౌడ్ గుర్తు చేశారు.

ధాన్యం కొనాలి.. మద్దతు ధర చెల్లించాలి

- మిర్యాలగూడలో రోడ్డెక్కిన అన్నదాతలు
- ధాన్యం పోటెత్తడంతో కొనుగోళ్లు నిలిపేసిన మిల్లర్లు
- రైతుల రాస్తారోకో..జడ్చర్ల–కోదాడ రహదారిపై నిలిచిన ధాన్యం ట్రాక్టర్లు


అవంతీపురం వద్ద జడ్చర్ల-కోదాడ రోడ్డుపై ధర్నా చేస్తున్న రైతులు

మిర్యాలగూడ: ధాన్యం కొనాలని..మద్దతు ధర కల్పించాలని అన్నదాతలు రోడ్డెక్కారు. ఈ ఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పరిధిలోని అవంతీపురం వద్ద ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం ఒక్కరోజే మిర్యాలగూడ పరిధిలోని రైస్ మిల్లులకు 3వేల ట్రాక్టర్లకుపైగా ధాన్యం తరలివచ్చింది. దీంతో కోదాడ రోడ్డు వైపు యాద్గార్‌పల్లి మిల్లుల్లో ఉదయం పూట ధాన్యం నిల్వలు భారీగా పేరుకుపోయాయని, నిల్వ సామర్థ్యం లేదని ఉదయం 11గంటల వరకు ధాన్యం కొనుగోళ్లు నిలిపివేశారు. దీంతో మద్దతు ధరకు వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలంటూ రోడ్లపైనే ట్రాక్టర్లు నిలిపి రైతులు రాస్తారోకో చేశారు. మరోవైపు నల్లగొండ రోడ్డులో వేములపల్లి మండల పరిధిలోని రైస్ మిల్లుల వద్ద ట్రాక్టర్లు భారీ ఎత్తున తరలివచ్చాయి. ఒక ట్రాక్టర్ ప్రమాదానికి గురై రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో 2 గంటల పాటు ధాన్యం ట్రాక్టర్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగాయి. వెంటనే అధికారులు ఆ ట్రాక్టర్‌ను తొలగించడంతో పలు మిల్లుల వద్ద ధాన్యం కొనుగోళ్లు చేపట్టారు. మహీంద్ర, పద్మ చింట్లు తదితర ఎర్ర రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,150 నుంచి రూ.2,250 వరకు ధర వేస్తున్నారని రైతులు యాద్గార్‌పల్లి మిల్లుల వద్ద, వేములపల్లి మండల పరిధిలోని మిల్లుల వద్ద ధర్నా చేశారు.

అదనపు కలెక్టర్, ఎమ్మెల్యే సమీక్షించినా...

ధాన్యానికి మద్దతు ధర ఇవ్వాలంటూ శనివారం మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మిర్యాలగూడ ఏరియా రైస్ మిల్లర్లతో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ 3గంటల పాటు సమీక్షించారు. సన్నరకం ధాన్యానికి రూ.2,320 నుంచి రూ.2,400 వరకు కొనుగోలు చేయాలని సూచించారు. దీనికి రైస్ మిల్లర్లు అంగీకరించారు. కానీ, ఆదివారం మిల్లుల వద్ద భారీగా ట్రాక్టర్లు బారులుదీరడంతో పచ్చి గింజ, తేమ అధికంగా ఉందని, ధాన్యం రంగు మారిందని పలు సాకులతో రూ.2,150 నుంచి రూ.2,350 వరకు కొనుగోలు చేశారు. ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్ చెప్పినా కూడా మద్దతు ధర చెల్లించకుండా కేవలం రూ.2,300లోపు ధరకు చాలా ధాన్యం కొనుగోలు చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు చేయాలని మిల్లర్లను ఆదేశించారు.

పచ్చి వడ్లు అని ధర తగ్గిస్తున్నారు



వడ్లలో నాణ్యత లేదని, పచ్చిగా ఉన్నాయని, తేమ శాతం అధికంగా ఉందని, తాలుగింజలు ఉందని సాకు చూపి మిల్లర్లు తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. క్వింటాకు రూ.2,250కే కొన్నారు. అధికారులు మిల్లుల వద్దకు రాకపోవడం వల్లే రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. ఇప్పటికైనా అధికారులు క్షేత్ర పర్యటన చేసి మద్దతు ధర ఇప్పించాలి.

– వీరబోయిన లింగయ్య, రైతు, పాములపహాడ్

ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం



మిర్యాలగూడ పరిసర ప్రాంతాల మిల్లులకు ఆదివారం సుమారు 3వేలకు పైగా ట్రాక్టర్లలో ధాన్యం వచ్చింది. రైతులు సహకరిస్తే కొనుగోళ్లు వేగవంతమవుతాయి. ఆదివారం ఉదయం 10గంటల వరకు కొనుగోలు కాస్తా మందగించాయి. మధ్యాహ్నం 1గంట వరకు కొనుగోలు చేశాం. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొస్తే రూ.2,320కు పైగా ధర చెల్లిస్తున్నాం. ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం. తడిసి రంగు మారిన ధాన్యాన్ని కూడా కొనాలని అన్ని మిల్లులకు ఫోన్లు చేసి చెప్పాం.

– కర్నాటి రమేశ్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

రామగుండం ఎన్టీపీసీకి ప్రతిష్టాత్మక అవార్డులు



అవార్డు అందుకుంటున్న కార్పొరేట్ కమ్యూనికేషన్ ఎగ్జిక్యూటివ్ రూపాలి రంజన్

జ్యోతినగర్ (రామగుండం): తన అత్యుత్తమ పనితీరుతో రామగుండం ఎన్టీపీసీ ప్రతిష్టాత్మక పీఆర్‌సీఐ (పబ్లిక్ రిలేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా–2024) ద్వారా మూడు విభాగాల్లో ఎక్సలెన్స్ అవార్డులు సొంతం చేసుకుంది. కర్ణాటక రాష్ట్రం మంగళూరులోని మోతీ మహల్‌లో శనివారం 18వ గ్లోబల్ కమ్యూనికేషన్ సదస్సు–2024 జరిగింది. కార్యక్రమానికి హాజరైన ప్రముఖ నటుడు, దర్శకుడు, నిర్మాత రవికిరణ్, ఆ రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పి.కృష్ణ భట్ చేతుల మీదుగా ఎన్టీపీసీ కార్పొరేట్ కమ్యూనికేషన్ ఎగ్జిక్యూటివ్ రూపాలి రంజన్ ఈ అవార్డులు అందుకున్నారు. అంతర్గత కమ్యూనికేషన్ ప్రచారానికి బంగారు, కార్పొరేట్ కమ్యూనికేషన్ ఎక్సలెన్స్‌లో కాంస్యం, మ్యూజిక్ వీడియో విభాగంలో ప్రోత్సాహక అవార్డులు లభించాయని అధికారులు వివరించారు.

మరింత పెరిగిన కీర్తి



పీఆర్‌సీఐ నుంచి ప్రతిష్టాత్మక మూడు అవార్డులను సాధించడంతో ఎన్టీపీసీ కీర్తి మరింత పెరిగింది. అవార్డులు రావడంలో అధికారుల, ఉద్యోగుల కృషి ఎంతో ఉంది. రామగుండం–తెలంగాణ ప్రాజెక్టు అధికారులు, ఉద్యోగులు భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు సాధించేలా కృషి చేయాలి.

– కేదార్ రంజన్ పాండు, ఎన్టీపీసీ సదరన్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

పెళ్లి ఇంట విషాదం

- కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- నవ వధువు సోదరుడు, స్నేహితురాలు మృతి


మునిరాజీ


సంకీర్తన్

జగిత్యాల క్రైం: ఆర్టీసీ బస్సు కారును ఢీకొన్న సంఘటనలో నవవధువు సోదరుడు, ఆమె స్నేహితురాలు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన ఆదివారం వేకువజామున జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ శివారులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని శివాజీనగర్‌కు చెందిన వలిపిరెడ్డి రాజమల్లు, లక్ష్మి కూతురు సంఘవి పెళ్లి ఈనెల 8న జనగామకు చెందిన ఓ యువకుడితో హన్మకొండలో జరిగింది. శనివారం రాత్రి రిసెప్షన్ వేడుకలో పాల్గొన్న సంఘవి సోదరుడు సంకీర్తన్ (30), హైదరా బాద్‌లో సంఘవితో కలిసి పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతి జిల్లా నారాయణవనంకు చెందిన సాధు మునిరాజీ (25)తోపాటు తల్లి లక్ష్మి, తండ్రి రాజమల్లు కారులో జగిత్యాలకు వస్తున్నారు. ధరూర్ సమీపంలోకి రాగానే జగిత్యాల డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు వీరి కారును ఎదురుగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో సంకీర్తన్‌తోపాటు మునిరాజీ అక్కడికక్కడే చనిపోయారు. లక్ష్మి, రాజమల్లు పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రూరల్ సీఐ వై.కృష్ణారెడ్డి, ఎస్సై సుధాకర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సంకీర్తన్ మేనమామ ఫిర్యాదు మేరకు ఆర్టీసీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. పెళ్లైన రెండురోజులకే సోదరుడితో పాటు స్నేహితురాలు మృతి చెందడంతో సంఘవి తీవ్రంగా రోదించింది. గాయాలతోనే ఉన్న తండ్రి రాజమల్లు సంకీర్తన్ చితికి నిప్పంటించడం స్థానికులను కలచివేసింది.

తమ్ముడు కొట్టాడని.. బిడ్డలతో కలిసి అన్న ఆత్మహత్య

- కొడుకు, కూతురును నడుముకు కట్టుకొని..
- చింతల చెరువులో దూకిన తండ్రి
- సిద్దిపేట జిల్లాలో విషాద ఘటన


అద్వేష్‌నంద


త్రివేణి హాసిని


తేలు సత్యం

సిద్దిపేట కమాన్: తమ్ముడు తీసుకున్న డబ్బులు ఇవ్వకపోగా చెప్పుతో కొట్టి అవమానించాడన్న మనస్తాపంతో ఓ తండ్రి తన ఇద్దరు పిల్లలతో కలిసి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకొన్నాడు ఎనిమిదేళ్ల కుమారుడు, ఆరేళ్ల కూతురును నడుముకు చున్నీతో కట్టుకుని చెరువులో దూకడంతో తండ్రితోపాటు అభంశుభం తెలియని ఇద్దరు చిన్నారులు కూడా మరణించారు. ఈ విషాద ఘటన సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. చిన్నకోడూరు మండలం కస్తూరుపల్లికి చెందిన తేలు సత్యం (48)కు గతంలో వివాహం జరగ్గా భార్య అనారోగ్యంతో మరణించింది. 2016లో శిరీషను రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి కుమారుడు అద్వేష్‌నంద (8), కూతురు త్రివేణి హాసిని (6) సంతానం. పట్టణంలోని నెహ్రూ పార్క్ వాసవీనగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. సత్యం స్థానికంగా ఓ ప్రింటింగ్ షాప్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ప్రభుత్వ టీచర్ అయిన తన సోదరుడు శ్రీనివాస్‌కు గతంలో రూ.5.5 లక్షలు ఇచ్చాడు. ఇటీవల సత్యం ఆరోగ్యం దెబ్బతినటంతో ఆ డబ్బు తిరిగి ఇవ్వాలని 20 రోజుల క్రితం అడిగాడు. దీంతో శ్రీనివాస్ తన అన్నను తిట్టి, చెప్పుతో కొట్టి ఇంటి నుంచి బయటకు పంపించాడని కుటుంబ సభ్యులు తెలిపారు. సొంత తమ్ముడే దారుణంగా అవమానించటంతో సత్యం తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. శనివారం రాత్రి తన ఇద్దరు పిల్లలను పానీపూరీ తినిపిస్తానని బయటకు తీసుకెళ్లాడు. ఎంతకూ ఇంటికి రాకపోవడంతో కంగారుపడిన కుటుంబసభ్యులు పలుచోట్ల గాలించి చివరకు పోలీసులకు సమాచారం అందించారు. ఆదివారం ఉదయం పట్టణ శివారు చింతల చెరువు కట్టపైన సత్యం ద్విచక్ర వాహనాన్ని గుర్తించారు. చెరువులో గాలించగా ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాలను పోలీసులు బయటకు తీయించారు. చిన్నారుల మృతదేహాలను చూసి తల్లి గుండెలవిసేలా విలపించారు. ఘటనా స్థలాన్ని సిద్దిపేట ఏసీపీ మధు, టూటౌన్ సీఐ ఉపేందర్ పరిశీలించారు. మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడు ఆత్మహత్యకు ముందు తమ మరణానికి కారణాన్ని తెలుపుతూ తన మొబైల్‌లో తీసుకున్న సెల్ఫీ వీడియో, సూసైడ్‌నోట్‌ను బైక్‌లో నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తన భర్త, ఇద్దరు పిల్లల మరణానికి కారణమైన మరిది శ్రీనివాస్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య శిరీష ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కంటెయినర్‌లో మంటలు

- 8 కార్లు దగ్ధం..రూ. 2 కోట్ల మేర నష్టం
- గాయాలతో బయటపడిన డ్రైవర్


పూర్తిగా దగ్ధమైన కంటెయినర్, అందులోని 8 కొత్త కార్లు

జహీరాబాద్: కార్ల లోడు తో వెళుతున్న ఓ కంటెయినర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో పూర్తిగా ఆ కంటెయినర్ దగ్ధమైంది. అందులోఉన్న 8 కార్లు సైతం బుగ్గి అ య్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. గుజరాత్ నుంచి 8 టాటా ఎక్సాన్ కొత్త కార్లతో ఓ కంటెయి నర్ బయలుదేరింది. మార్గమధ్యలో ఆదివారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం రంజోల్ గ్రామం వద్ద 65వ జాతీయ రహదారి బైపాస్ వద్దకు రాగానే ఆ కంటెయినర్‌కు ఆకస్మికంగా మంటలు అంటుకున్నాయి. డ్రైవర్ మేవారామ్ మీనా గమనించి వాహనాన్ని ఆపే ప్రయత్నం చేయగా, ఒంటికి మంటలు అంటుకొని గాయపడ్డారు. ఇది గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే సీఐ శివ అగ్నిమాపక అధికారులకు సమాచారంగా ఇవ్వగా, మూడు ఫైరింజన్‌లకు అక్కడకు చేరుకొని మంటలు ఆర్పాయి. అప్పటికే కార్లు పూర్తిగా కాలిపోయాయి. దాదాపు రూ. 2 కోట్ల వరకు నష్టం వాటిల్లి ఉంటుందని, ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ పేర్కొన్నారు. గాయపడిన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రహదారిపై కంటెయినర్ కాలుతున్న సమయంలో దట్టమైన మంటలు, పొగ ఎగిసిపడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ప్రమాదానికి గల కారణం తెలియలేదన్నారు.



నూతన సీజేఐ జస్టిస్ ఖన్నా ప్రమాణ స్వీకారం నేడు

పదవీ కాలం ఆరు నెలలే | మే 13న పదవీ విరమణ

సాక్షి, న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు 51వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నా రు. రాష్ట్రపతి భవన్‌లో ఉదయం 10 గంటలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనతో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. జస్టిస్ ఖన్నా ఆరు నెలల పాటు సీజేఐగా కొనసాగుతారు. ఆయన పదవీ కాలం వచ్చే ఏడాది మే 13వ తేదీన ముగియనుంది. ప్రస్తుత సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ఆదివారం పదవీ విరమణ చేశారు. ఆయన సిఫార్సు మేరకు నూతన సీజేఐగా జస్టిస్ ఖన్నాను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం అక్టోబర్ 24న నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే.

న్యాయ వ్యవస్థతో సుదీర్ఘ అనుబంధం

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న జస్టిస్ సంజీవ్ ఖన్నాకు న్యాయ వ్యవస్థతో సుదీర్ఘ అనుబంధం ఉంది. ఆయన 1960 మే 14న జన్మించారు. ఆయన తండ్రి జస్టిస్ దేవ్‌రాజ్ ఖన్నా ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. జస్టిస్ ఖన్నా ఢిల్లీలోని మోడ్రన్ స్కూల్‌లో చదువుకున్నారు. సెయింట్ స్టీఫెన్స్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ అనంతరం ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన క్యాంపస్ లా సెంటర్‌లో న్యాయ విద్య అభ్యసించారు. 1983లో బార్ కౌన్సిల్ ఆఫ్ ఢిల్లీలో అడ్వొకేట్‌గా చేరారు. తొలుత తీస్‌హజారీ కాంప్లెక్స్‌లోని జిల్లా కోర్టుల్లో, తర్వాత ఢిల్లీ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. ఆదాయపు పన్ను విభాగంలో సీనియర్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా పని చేశారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా సేవలందించారు. ఢిల్లీ హైకోర్టులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, అమికస్ క్యూరీగా ఎన్నో క్రిమినల్ కేసుల్లో సమర్థంగా వాదించి పేరు తెచ్చుకున్నారు. 2005 జూన్ 24న ఢిల్లీ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఏడాది తిరగకుండానే శాశ్వత న్యాయమూర్తి అయ్యారు. 2019 జనవరి 18న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. హైకోర్టు న్యాయమూర్తుల్లో ఆయన కంటే 32 మంది సీనియర్లున్నా వారిని కాదని జస్టిస్ ఖన్నాకు పదోన్నతి దక్కడం వివాదాస్పదంగా మారింది. అయినా ఆయన నియామకాన్ని కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. పలు కీలక తీర్పులు ఇచ్చిన సుప్రీంకోర్టు ధర్మాసనాల్లో జస్టిస్ ఖన్నా సభ్యుడిగా ఉన్నారు. మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని రద్దు చేసిన ధర్మాసనంలో ఆయన సభ్యుడు. ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టివేశారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) వాడకాన్ని సమర్థించారు. బ్యాలెట్ పేపర్ విధానంలో ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను తిరస్కరించారు. ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేశారు. పెండింగ్ కేసుల పరిష్కారంపై జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రత్యేక శ్రద్ధ చూపుతారని పేరుంది. అనవసరమైన వాయిదాలకు తావు లేకుండా వేగంగా న్యాయం చేకూర్చడంలో ఆయన దిట్ట అని న్యాయవాద వర్గాలు చెబుతాయి.

ఇక ఇంట్లోనే మార్నింగ్ వాక్

తెల్లవారుజామునే ట్రాక్ ప్యాంట్, ఆఫ్ హ్యాండ్స్ టీ షర్ట్‌తో ఢిల్లీ వీధుల్లో వాకింగ్ చేయడం జస్టిస్ ఖన్నాకు చాలా ఇష్టం. అనేక సందర్భాల్లో ఆయన మార్నింగ్ వాక్ గురించి ప్రస్తావించారు. "ఉదయాన్నే వాకింగ్ చేస్తే రోజంతా మనసు ప్రశాంతంగా ఉంటుంది. మంచి ఆలోచనలు వస్తాయి" అంటారాయన. సీజేఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా ఇకపై మార్నింగ్ వాక్‌కు ఆయన స్వస్తి పలకనున్నట్లు తెలిసింది. వాకింగ్‌తో పాటు జిమ్ వంటి కసరత్తులన్నీ ఇంట్లోనే చేయనున్నారు.

కశ్మీర్‌లో ఉగ్ర కాల్పులు...
సైనికాధికారి వీరమరణం
ముగ్గురు జవాన్లకు గాయాలు

జమ్మూ/శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులు మరోసారి పేట్రేగిపోయారు. తమ గ్రామంలోని మైనారిటీ హిందువులు, సిక్కుల రక్షణ కోసం గ్రామాలు ఏర్పాటుచేసుకున్న ఇద్దరు విలేజ్ డిఫెన్స్ గార్డ్(వీడీజీ)లను అపహరించి చంపేసిన ఉగ్రవాదుల కోసం సైన్యం గాలింపు చేపట్టగా ఉగ్రవాదులే మెరుపుదాడి చేశారు. ఈ పరస్పర కాల్పుల ఘటనలో ఆర్మీలోని జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ (జేసీఓ) అయిన నయీబ్ సుబేదార్ రాకేశ్‌కుమార్ వీరమరణం పొందారు. ముగ్గురు జవాన్లకు తీవ్ర గాయాలయ్యాయి. వారి పరిస్థితి విషమంగా ఉంది.



కిష్త్వార్ జిల్లాలో గురువారం ఇద్దరు వీడీజీలను కాల్చేసిన ఉగ్రవాదులను వేటాడేందుకు సైన్యం రంగంలోకి దిగింది. భర్త్ లోయ ప్రాంతంలో వారు నక్కారన్న సమాచారంలో ఆదివారం ఉదయం గాలింపు చేపట్టారు. ఉగ్రవాదులు సైన్యంపై తూటాల వర్షం కురిపించడంతో జేసీఓ రాకేశ్ తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసినట్టు సైన్యం 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. అక్కడ నక్కిన ముగ్గురు ఉగ్రవాదుల కోసం గాలిస్తున్నామని తెలిపింది.

సుదీర్ఘ ఎన్‌కౌంటర్!

శ్రీనగర్ పరిధిలోని జబర్వాన్ పర్వతప్రాంతంలో ఉగ్రవాదులు ఈ స్థాయిలో కాల్పులకు తెగించడం గత రెండు దశాబ్దాల్లో ఇదే తొలిసారి. ఆదివారం దాల్ సరస్సు సమీపంలోని నిషాత్ ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ఉదయాన్నే కాల్పుల మోతతో స్థానికులు భయభ్రాంతులయ్యారు.

ఆదివాసీ సీట్లే కీలకం!

జార్ఖండ్‌లో హోరాహోరీ ● 13న తొలి దశలో 43 స్థానాల్లో పోలింగ్



ఎన్డీఏ, ఇండియా కూటముల అమీతుమీకి జార్ఖండ్‌లో సర్వం సిద్ధమైంది. అసెంబ్లీ ఎన్నికల పోరులో భాగంగా 13వ తేదీన తొలి దశలో 43 స్థానాల్లో పోలింగ్ జరగనుంది. మిగతా 38 సీట్లకు నవంబర్ 20న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలతో పాటు పోలింగ్ జరగనుంది. 23న రెండు రాష్ట్రాల ఫలితాలు ఒకేసారి వెల్లడవుతాయి. జార్ఖండ్‌లో సంఖ్యాధికులైన ఆదివాసీలే ఈసారి కూడా పార్టీల గెలుపోటములను నిర్ణయించనున్నారు. మొత్తం 81 అసెంబ్లీ స్థానాల్లో 28 ఎస్టీ రిజర్వుడు సీట్లే కావడం విశేషం. వాటితో పాటు పలు ఇతర అసెంబ్లీ స్థానాల్లోనూ వారు చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉన్నారు. దాంతో ఆదివాసీలను ప్రసన్నం చేసుకోవడానికి అధికార ఇండియా కూటమి, విపక్ష ఎన్డీఏ సంకీర్ణ సారథి బీజేపీ పోటీ పడుతున్నాయి. 2019 ఎన్నికల్లో 28 ఎస్టీ స్థానాలకు గాను ఇండియా కూటమి సారథి జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) ఏకంగా 19 సీట్లలో పాగా వేయడం విశేషం. మొత్తమ్మీద 26 ఎస్టీ స్థానాలూ ఇండియా కూటమి ఖాతాలోకే వెళ్లాయి. బీజేపీకి కేవలం రెండే ఎస్టీ స్థానాలు దక్కాయి. అందుకే ఈసారి ఆదివాసీ స్థానాల్లో పాగా వేయడమే ఆ పార్టీ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా మొదలుకుని బీజేపీ అగ్ర నేతలంతా కాలికి బలపం కట్టుకుని తిరుగుతున్నారు. వారిపై వరాల జల్లు కురిపిస్తున్నారు. బంగ్లాదేశీ చొరబాటుదారులకు జేఎంఎం సంకీర్ణ ప్రభుత్వం ఆదివాసీ హోదా కల్పిస్తూ వారి పొట్ట కొడుతోందని ఆరోపిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ అవినీతిని ప్రధానాస్త్రంగా మలచుకున్నారు. సీఎం హేమంత్ సోరెన్ అవినీతిలో పీకల్లోతున మునిగిపోయారంటూ ఊదరగొడుతున్నారు. బీజేపీని గెలిపిస్తేనే రాష్ట్రం అభివృద్ధి బాట పడుతుందని ప్రచారం చేస్తున్నారు. ఇండియా కూటమి తరఫున హేమంత్‌కు దన్నుగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్ర నేతలు రాహుల్ గాంధీ ప్రచార రంగంలో ఉన్నారు. ప్రియాంక కూడా ఒకట్రెండుసార్లు ప్రచారంలో పాల్గొన్నారు. ఈసారి ఇండియా కూటమిలో జేఎంఎం 43, కాంగ్రెస్ 30, ఆర్జేడీ 6, వామపక్షాలు 3 చోట్ల పోటీలో ఉన్నాయి. ఎన్డీఏ కూటమిలో బీజేపీ, ఆల్ జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్ (ఏజేఎస్‌యూ), జార్ఖండ్ వికాస్ మోర్చా (జేవీఎం), జేడీ(యూ) కలసి పోటీ చేస్తున్నాయి. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో జేఎంఎం 30 స్థానాలు గెలిచి ఏకైక పెద్ద పార్టీగా నిలిచింది. బీజేపీ 25 సీట్లు గెలుచుకోగా కాంగ్రెస్‌కు 16 దక్కాయి. జేవీఎంకు 3, ఏజేఎస్‌యూకు 2 సీట్లొచ్చాయి. కాంగ్రెస్, ఆర్జేడీ మద్దతుతో జేఎంఎం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

తొలి దశ గణాంకాలు...

పోలింగ్ తేదీ	నవంబర్ 13
పోలింగ్ జరిగే స్థానాలు	43
బరిలో మొత్తం అభ్యర్థులు	683

అసెంబ్లీలో బలాబలాలు

(మొత్తం స్థానాలు 81)	
ఇండియా కూటమి	44
జేఎంఎం	25
కాంగ్రెస్	17
సీపీఐ(ఎంఎల్)	1
ఆర్జేడీ	1
ఎన్డీఏ కూటమి	30
బీజేపీ	25
ఏజేఎస్‌యూ	3
జేడీ(యూ)	1
స్వతంత్రుడు	1
ఖాళీలు	7

బంధువులు, వారసుల జోరు

జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ వారసుల హడావుడి మామూలుగా లేదు. ఈసారి ఏకంగా 25కు పైగా స్థానాల్లో నేతల బంధుమిత్రులు బరిలో ఉన్నారు. జేఎంఎంను వీడి బీజేపీలో చేరిన మాజీ సీఎం చంపయ్ సోరెన్ కుమారుడు బాబూలాల్ సోరెన్, మరో మాజీ సీఎం రఘుబర్ దాస్ కోడలు పూర్ణిమా సాహు, ఇంకో మాజీ సీఎం అర్జున్ ముండా భార్య మీరా, మరో మాజీ సీఎం మధు కోడా భార్య గీత తదితరులు ఈ జాబితాలో ఉన్నారు. జేఎంఎం నుంచి సీఎం హేమంత్ సోరెన్ భార్య కల్పన ఈసారి ఎన్నికల అరంగేట్రం చేస్తున్నారు. ఆయన సోదరుడు బసంత్ సోరెన్, వదిన సీతా సోరెన్ కూడా పోటీలో ఉన్నారు. జేఎంఎం నుంచి 15 మంది దాకా నేతల వారసులు రంగంలో దిగారు.

వలసదారులే ప్రధానాంశం!

నిరుద్యోగం, ధరల పెరుగుదల, సాగు సంక్షోభం, గ్రామీణుల్లో నిరాశా నిస్పృహలు తదితర సమస్యలెన్నో జార్ఖండ్‌ను పట్టి పీడిస్తున్నాయి. అయితే బీజేపీ వ్యూహాత్మకంగా వలసల అంశాన్ని తలకెత్తుకుంది. వలసదారుల సంక్షోభాన్ని ప్రధాన ఎన్నికల అంశంగా మార్చేందుకు శాయశక్తులా ప్రయత్నించింది. జార్ఖండ్ జనాభాలో ఏకంగా 35 శాతం మంది వలసదారులే కావడం విశేషం. బంగ్లాదేశ్ నుంచి వచ్చిపడుతున్న వలసలు ఆదివాసీల మనుగడనే ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయని బీజేపీ నేతలంతా గట్టిగా ప్రచారం చేస్తున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

కెనడాలో ఖలిస్తానీ ఉగ్రవాది...
అర్ష్ దల్లా అరెస్ట్

ఒట్టావా/న్యూఢిల్లీ: ఖలిస్తానీ ఉగ్రవాది అర్ష్‌దీప్ సింగ్ గిల్ అలియాస్ అర్ష్ దల్లాను కెనడా పోలీసులు అరెస్ట్‌చేశారు. అక్టోబర్ 28 తేదీలో ఒంటారియో ప్రావిన్స్‌లోని మిల్టన్ పట్టణంలో జరిగిన కాల్పులతో దల్లాకు సంబంధముందని పోలీసులు అనుమానిస్తున్నారు. దల్లాను కెనడా పోలీసులు గత మంగళవారం అరెస్ట్ చేసిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. భారత్‌లో ఖలిస్తానీ వేర్పాటువాదాన్ని ప్రోత్సహిస్తున్న నిషేధిత ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్ (కేటీఎఫ్)కు అధిపతిగా ఉన్న హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్య తర్వాత దల్లానే కేటీఎఫ్‌కు తాత్కాలిక చీఫ్‌గా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.



పంజాబ్‌లోని మోగా జిల్లాకు చెందిన దల్లా పలు నేరాభియోగాల్లో అరెస్ట్ తప్పించుకునేందుకు కెనడా పారిపోయాడు. నాలుగేళ్లుగా అక్కడి నుంచి భారతవ్యతిరేక కార్యకలాపాలు కొనసాగిస్తున్నాడు. భారత్ అతన్ని ఉగ్రవాదిగా ప్రకటించింది. దల్లా గ్యాంగ్‌లో సభ్యులైన షూటర్లు నవ్‌జ్యోత్ సింగ్, అమర్‌ప్రీత్ సింగ్‌లను పంజాబ్‌లోని ఫరీద్‌కోట్‌లో ఆదివారం అరెస్ట్ చేశారు.


ఆలయం ఘర్షణ కేసులో నలుగురి అరెస్ట్

కెనడాలో బ్రాంప్టన్‌లోని హిందూసభా మందిర్ ఆలయ ప్రాంగణంలో భక్తులు, వృద్ధులపై సిక్కు వేర్పాటువాదుల దాడి, ఘర్షణ కేసులో నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. మరోవైపు ఢిల్లీలోని చాణక్యపురి ప్రాంతంలోని కెనడా హైకమిషన్ కార్యాలయం వద్ద సిక్కు నిరసనకారులు ఆందోళనకు దిగారు. దాంతో హుటాహుటిన అక్కడ భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

కులగణన, రుణమాఫీ

ప్రభుత్వోద్యోగులకు మళ్లీ పాత పెన్షన్ విధానం | మహారాష్ట్రలో ఎంవీఏ మేనిఫెస్టో

ముంబై: మహారాష్ట్రలో అధికారంలోకి రాగానే కులగణన ప్రారంభిస్తామని విపక్ష మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) హామీ ఇచ్చింది. 9 నుంచి 16 ఏళ్లలోపు బాలికలకు సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్లు ఉచితంగా ఇవ్వనున్నట్లు ప్రకటించింది. మహిళా ఉద్యోగులకు నెలసరి సమయంలో రెండు ఐచ్ఛిక సెలవులు మంజూరు చేయనున్నట్లు వెల్లడించింది. 'మహారాష్ట్రనామ' పేరిట ఎంవీఏ ఎన్నికల మేనిఫెస్టోను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదివారం విడుదల చేశారు. మహిళా స్వయం సహాయక సంఘాల కోసం ప్రత్యేకంగా సాధికారత విభాగం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. శిశు సంక్షేమం కోసం డెడికేటెడ్ మినిస్ట్రీ ఏర్పాటు చేస్తామన్నారు. అర్హులైన మహిళలకు రూ.500 చొప్పున ధరతో ప్రతిఏటా ఆరు వంట గ్యాస్ సిలిండర్లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.



ఎంవీఏ మేనిఫెస్టోలోని కీలక అంశాలు...

- రూ.3 లక్షల దాకా రైతు రుణమాఫీ. రుణాలు సక్రమంగా చెల్లించేవారికి రూ.50 వేల ప్రోత్సాహకం
- 2.5 లక్షల ప్రభుత్వోద్యోగాల భర్తీ
- బాలికలకు ఏటా రూ.లక్ష నగదు
- ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాల్లోని వితంతువులు, చిన్నారులకు ఆర్థిక సాయం
- యువత సంక్షేమానికి కమిషన్. డిగ్రీ, డిప్లొమా చేసిన నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల భృతి
- నూతన ఇండస్ట్రియల్ పాలసీ. ఎంఎస్ఎంఈ శాఖ.
- అసంఘటిత కార్మికుల సంక్షేమానికి కార్పొరేషన్
- నిత్యావసరాల ధరల నియంత్రణ
- నెలకు 300 యూనిట్ల దాకా విద్యుత్‌పై 100 యూనిట్ల రుసుం మాఫీ
- ప్రభుత్వోద్యోగులకు మళ్లీ పాత పెన్షన్ విధానం

కుల గణనపై బీజేపీ నేతలది తప్పుడు ప్రచారం: ఖర్గే

పలు సామాజికవర్గాల స్థితిగతులను సమగ్రంగా తెలుసుకోవడానికే కులగణన తప్ప సమాజాన్ని కులాలవారీగా విభజించడానికి కాదని ఖర్గే చెప్పారు. ఆ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి అమలు చేయాల్సిన విధానాల రూపకల్పనకు ఆ డేటా తోడ్పడుతుందన్నారు. కులగణనపై బీజేపీ అసత్య ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. మేనిఫెస్టో విడుదల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కులాలవారీగా జనాభా లెక్కల సేకరణతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రదర్శిస్తున్న రెడ్ బుక్ రాజ్యాంగం కాదని, అర్బన్ నక్సలైట్లకు ప్రతీక అని మోదీ, బీజేపీ నేతలు చేస్తున్న ఆరోపణలపై ఖర్గే మండిపడ్డారు. రాజ్యాంగంపై కనీస అవగాహన కూడా లేని మోదీని మళ్లీ ప్రాథమిక పాఠశాలలో చేర్చాలని ఎద్దేవా చేశారు. 2017 జూలై 16న ఇలాంటి రాజ్యాంగ ప్రతినే అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు మోదీ అందజేశారన్నారు.

మతమార్పిడి నిరోధ చట్టం

అల్పాదాయ కుటుంబాలకు ఉచిత రేషన్ | 25 హామీలతో బీజేపీ మేనిఫెస్టో


ముంబై: మహారాష్ట్రలో అధికారంలోకి వస్తే కఠినమైన నిబంధనలతో మత మార్పిడి నిరోధక చట్టం తెస్తామని బీజేపీ ప్రకటించింది. అల్పాదాయ కుటుంబాలకు ఉచితంగా రేషన్ సరుకులు అందజేస్తామని, యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి పరిశ్రమల అవసరాలకు తగ్గట్టు తీర్చిదిద్దుతామని పేర్కొంది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కోసం 'సంకల్ప పత్రం -2024' పేరిట బీజేపీ మేనిఫెస్టోను కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదివారం విడుదల చేశారు. మేనిఫెస్టోలో 25 హామీలను పొందుపర్చారు.



- బలవంతపు, మోసపూరిత మత మార్పిడులను అడ్డుకోవడానికి కఠిన చట్టం
- లడ్కీ బెహన్ యోజన కింద మహిళలకు ఆర్థిక సాయం నెలకు రూ.1,500 నుంచి రూ.2,100
- యువతకు 25 లక్షల ఉద్యోగాల సృష్టి. 10 లక్షల మంది విద్యార్థులకు నెలకు రూ.10 వేల స్టైపెండ్
- అక్షయ్ అన్న యోజన కింద అల్పాదాయ వర్గాలకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ఉచితంగా రేషన్ సరుకులు
- అడ్వాన్స్‌డ్ రోబోటిక్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ట్రైనింగ్ హబ్‌గా మహారాష్ట్ర అభివృద్ధి
- ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆకాంక్ష సెంటర్ల ద్వారా కొత్తగా 10 లక్షల మంది బిజినెస్ లీడర్ల తయారీ
- 2027 నాటికి 50 లక్షల మంది లఖ్‌పతీ దీదీల సృష్టి. 500 సంఘాలతో పారిశ్రామిక క్లస్టర్
- ఆధునిక ఏరోనాటికల్, స్పేస్ మాన్యుఫ్యాక్చరింగ్ సెంటర్లుగా నాగపూర్, పుణే, ఛత్రపతి శంభాజీనగర్, నాసిక్, అహిల్యానగర్

అధికారం కోసం ఓటు బ్యాంకు రాజకీయాలా: అమిత్ షా

జల్‌గావ్/బుల్ధానా: మహారాష్ట్రలో విపక్ష మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) బుజ్జగింపు, ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని అమిత్ షా ఆరోపించారు. రాజకీయ అవసరాల కోసం ఏ స్థాయికైనా దిగజారడం ఆ కూటమికి అలవాటేనన్నారు. ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటూ ఉలేమా కౌన్సిల్ చేసిన డిమాండ్‌కు పీసీసీ అధ్యక్షుడు నానా పటోలే అంగీకరించారన్నారు. ఆదివారం మహారాష్ట్రలోని జల్‌గావ్, బుల్ధానాల్లో ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో అమిత్ షా ప్రసంగించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లు లాక్కొని ముస్లింలకు కట్టబెట్టానికి ఎంవీఏ కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి ఉందని గుర్తుచేశారు. ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలంటే ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లలో కోత పెట్టాల్సి ఉంటుందన్నారు. ఎంవీఏ నేతలు అధికార దాహంతో బడుగు బలహీన వర్గాలకు అన్యాయం చేయడానికి సిద్ధపడుతున్నారని విమర్శించారు.



అరిజోనాలోనూ ట్రంపే

ఆయనకు మొత్తం 312 ఎలక్టోరల్ ఓట్లు | ట్రంప్‌కు 50.5 శాతం ఓట్లు హారిస్‌కు 47.9 శాతం ఓట్లు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఇప్పటికే విజయకేతనం ఎగరేసిన రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ తన మెజారిటీని మరింత పెంచుకున్నారు. మొత్తం 50 రాష్ట్రాల్లో 49 ఫలితాలు ఇప్పటికే వెలువడగా చివరిదైన అరిజోనా కూడా ఆదివారం ఆయన వశమైంది. దాంతో మొత్తం ఏడు స్వింగ్ రాష్ట్రాలూ ట్రంప్ ఖాతాలోకే వెళ్లాయి. 11 ఎలక్టోరల్ కాలేజీ ఓట్లున్న అరిజోనాలో విజయంతో ట్రంప్ మొత్తం 312 ఓట్లు సాధించారు. 2016లో తొలిసారి నెగ్గినప్పుడు సాధించిన 304 ఓట్ల మార్కును ఆయన అలవోకగా దాటేయడం విశేషం. డెమొక్రాట్ల అభ్యర్థి, ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ 226 ఓట్లకే పరిమితమయ్యారు. దేశవ్యాప్తంగా దాదాపు 95 శాతం ఓట్ల లెక్కింపు పూర్తయింది. ఇప్పటిదాకా ట్రంప్ 7,55,81,082 (50.5 శాతం) ఓట్లు సాధించారు. హారిస్‌కు 7,17,08,435 (47.92 శాతం) ఓట్లు దక్కాయి. మొత్తమ్మీద 31 రాష్ట్రాలు ట్రంప్ పరం కాగా హారిస్ 19 రాష్ట్రాలతో పాటు డీసీని దక్కించుకున్నారు. అరిజోనాలో 2020లో జో బైడెన్ నెగ్గారు. 1996లో బిల్ క్లింటన్ తర్వాత అక్కడ గెలిచిన తొలి డెమొక్రాట్ నేతగా నిలిచారు. ఆ రాష్ట్రంపై బాగా ప్రభావితం చూపే సరిహద్దు భద్రత, వలసలు, అక్రమ వలసదారుల నేరాలు, గతేడాది రికార్డు స్థాయి వలసలు తదితరాలపై ట్రంప్ చేసిన విస్తృత ప్రచారం ఆయనకు బాగా కలిసొచ్చింది.

హౌస్‌లోనూ మెజారిటీ దిశగా...

నాలుగేళ్ల తర్వాత తొలిసారి సెనేట్‌పై ఆధిక్యం సాధించిన రిపబ్లికన్ పార్టీ, ప్రతినిధుల సభలో కూడా మెజారిటీని నిలుపుకునే దిశగా సాగుతోంది. 435 సీట్లలో మెజారిటీ మార్కు 218 కాగా వారికిప్పటికే 216 సీట్లు దక్కాయి. డెమోక్రాట్లు 209 స్థానాల్లో నెగ్గారు. 100 సీట్లున్న సెనేట్‌లో రిపబ్లికన్లకు 52, డెమొక్రాట్లకు 47 సీట్లు వచ్చాయి.

ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల మధ్య...
చిచ్చుకు కాంగ్రెస్ కుట్ర

వారి రిజర్వేషన్లు దోచుకునే పన్నాగం: మోదీ
- జార్ఖండ్ వనరులన్నీ జేఎంఎం కూటమి లూటీ
- అవినీతిపరులను వదిలే ప్రసక్తే లేదన్న ప్రధాని

బొకారో: దేశంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల మధ్య చిచ్చుపెట్టి అధికారం దక్కించుకోవాలన్నదే కాంగ్రెస్ వ్యూహమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దుయ్యబట్టారు. "ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లు దోచుకోవడానికి కాంగ్రెస్ రాజకుటుంబం కుట్రలు చేస్తోంది. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఆ వర్గాల ఐక్యతను కాంగ్రెస్ వ్యతిరేకిస్తూనే వస్తోంది. వాటి మధ్య ఐక్యత లేనంతకాలం కేంద్రంలో అధికారం చలాయించి దేశాన్ని లూటీ చేసింది" అని ఆరోపించారు. మనం సురక్షితంగా ఉండాలంటే కలసికట్టుగా ఉండాలని మరోసారి పిలుపునిచ్చారు. ఆదివారం జార్ఖండ్‌లోని బొకారో, గుమ్లా పట్టణాల్లో అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభల్లో మోదీ మాట్లాడారు. రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్-జేఎంఎం కూటమి ఓబీసీలను కులాలవారీగా ముక్కలు చేయజూస్తోందని మండిపడ్డారు. ఉప కులాల మధ్య మంటలు పెట్టి చలి కాచుకోవాలని చూస్తోందన్నారు.

మాఫియాల భరతం పడతాం

జార్ఖండ్‌లో తిష్టవేసిన అక్రమ వలసదార్లను వెళ్లగొట్టాలంటే, అవినీతిని అంతం చేయాలంటే బీజేపీ గెలవాలని మోదీ అన్నారు. "జేఎంఎం కూటమి పాలనలో పిడికెడు ఇసుక కూడా దొరక్క ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పాలకులు మాత్రం ఇసుక దోచుకున్నారు. ఖనిజ సంపద, అడవులు, కొండలు, నదులు, బొగ్గు అన్నీ లూటీ చేశారు. కోట్లు కొల్లగొట్టారు. రిక్రూట్‌మెంట్ మాఫియా, పేపర్ లీక్ మాఫియాను సృష్టించారు. అవినీతి నేతను వదిలే ప్రసక్తే లేదు. వారిని జైలుకు పంపుతం. మేం గెలిచాక జార్ఖండ్‌ను అభివృద్ధి చేస్తాం" అని మోదీ ఉద్ఘాటించారు. గిరిజనులు ఉన్నత స్థానాలకు చేరితే కాంగ్రెస్ ఓర్వలేదని ఆరోపించారు. గిరిజన బిడ్డ ద్రౌపదీ ముర్ము రాష్ట్రపతి కాకుండా అడ్డుకొనేందుకు ప్రయత్నించిందన్నారు. ఆమెను ఇప్పటికీ అవమానిస్తూనే ఉందని ఆక్షేపించారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

జమ్మూకశ్మీర్‌లో తొలిసారి ఒక ముఖ్యమంత్రి భారత రాజ్యాంగంపై ప్రమాణ స్వీకారం చేశారని మోదీ అన్నారు. "ఇది అంబేడ్కర్‌కు దక్కిన ఘన నివాళి. అక్కడ ఆర్టికల్ 370ని మళ్లీ తేవాలని కాంగ్రెస్, మిత్రపక్షాలు ప్రయత్నిస్తున్నాయి. అదే జరిగితే అక్కడ రాజ్యాంగం మరోసారి అమలవకుండా పోతుంది. మన సైనికులు ఉగ్రవాదులతో తలపడాల్సి వస్తుంది" అన్నారు.

రాంచీలో రోడ్ షో

జార్ఖండ్ రాజధాని రాంచీలో మోదీ ఆదివారం 3 కిలోమీటర్ల మేర రోడ్ షో నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపులా బారులు తీరిన ప్రజలకు అభివాదం చేస్తూ ఆయన ముందుకు సాగారు.



రాంచీలో ఆదివారం జరిగిన రోడ్ షోలో ప్రజలకు ప్రధాని మోదీ అభివాదం

ఐరాస సదస్సుకు అఫ్గానిస్తాన్

కాబూల్: అజర్‌బైజాన్‌లో ఈ నెల 11 నుంచి మొదలయ్యే ఐరాస వాతావరణ సదస్సు కాప్-29లో పాలుపంచుకోనున్నట్లు అఫ్గాన్‌లోని తాలిబన్ ప్రభుత్వం ప్రకటించింది. అఫ్గానిస్తాన్‌లో 2021లో అధికారం చేపట్టాక తాలిబన్ ప్రతినిధులు పాల్గొనే మొదటి కాప్29 సదస్సు ఇదే కానుంది. అజర్‌బైజాన్ రాజధాని బాకుకు ఇప్పటికే తమ సాంకేతిక ప్రతినిధి వర్గం వెళ్లిందని అఫ్గాన్ జాతీయ వాతావరణ పరిరక్షణ ఏజెన్సీ ఆదివారం 'ఎక్స్'లో ప్రకటించింది.

జనవరి 13 నుంచి మహా కుంభమేళా

సాక్షి, న్యూఢిల్లీ: మహా కుంభమేళాకు ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ సిద్ధమవుతోంది. పన్నెండేళ్లకోసారి జరిగే ఈ జన జాతర వచ్చే జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26వ తేదీ వరకు కొనసాగనుంది. ప్రయాగ్‌రాజ్‌తోపాటు ఇదే సమయంలో హరిద్వార్, నాసిక్, ఉజ్జయినిలలోనూ కుంభమేళా జరపనున్నారు.

సాక్షి
హైదరాబాద్
సోమవారం। 11। నవంబర్। 2024



వ్యాలీ ఆఫ్ స్పోర్ట్స్..
అంతర్జాతీయ క్రీడలకు నగరానికి అవినాభావ సంబంధముంది. దేశ ఖ్యాతిని ప్రపంచదేశాల సరసన అగ్ర స్థానంలో నిలబెట్టిన హైదరాబాదీలు, ఇక్కడ శిక్షణ పొందిన క్రీడాకారులు ఎందరో ఉన్నారు. – సిటీప్లస్‌లో



వెదురుకు మారదాం బ్రదర్..
కొన్నేళ్లుగా ప్రకృతి ప్రేమికులు మాత్రం ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించేందుకు వెదురు బ్రష్‌ల పట్ల అవగాహన కల్పిస్తున్నారు. ప్లాస్టిక్ బ్రష్‌ల స్థానంలో వెదురు వస్తువులను అందుబాటులోకి తెస్తున్నారు. – సిటీప్లస్‌లో

గరిష్ఠం/కనిష్ఠం
31.0/19.0
వాతావరణం
నగరంలో సోమవారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉదయం పొగమంచుతో ఉంటుంది. గరిష్ఠంగా 31, కనిష్ఠంగా 19 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.



సమావేశంలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అభివృద్ధికి సహకరిస్తా
గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

కవాడిగూడ: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ మరింత అభివృద్ధి చెందేందుకు తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. ఆదివారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తెలంగాణ రాష్ట్ర 75వ డైమండ్ జూబ్లీ ఉత్సవాలు దోమలగూడలోని కేంద్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ... భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరిన విద్యార్థులు వసుధైక కుటుంబంలో మంచి పాత్రధారులుగా ఎదుగుతారని చెప్పారు. మంచి నైపుణ్యతతో కూడిన ఇంజినీర్లు, డాక్టర్లుగా తీర్చిదిద్దడంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. క్రమశిక్షణతో పాటు సర్వతోముఖాభివృద్ధి చెందిన విద్యార్థులుగా తయారవుతారని కొనియాడారు. అనంతరం 75 సంవత్సరాలుగా సేవలు అందిస్తున్న సీనియర్ సిటిజన్లను సన్మానించారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ ఆయా ఆయా రాష్ట్రాల విద్యార్థులు ప్రదర్శించిన నాటిక విశేషంగా ఆకట్టుకుంది.



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు







ధార్మిక శక్తి.. దేశభక్తి!

నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో హిందూ ఆధ్యాత్మిక సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 4 రోజులుగా నిర్వహిస్తున్న హిందూ ధార్మిక సేవా మేళా ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కాగా.. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పరమవీరచక్ర పురస్కార గ్రహీత యోగేంద్ర యాదవ్ మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక భావన అందరికీ ముఖ్యమని, అదే స్థాయిలో దేశభక్తి కూడా ఉండాలన్నారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధ సమయంలో జరిగిన కొన్ని అంశాలను ఆయన కళ్లకు కట్టినట్టు వివరించారు. కార్యక్రమంలో పాట్నా హైకోర్టు చీఫ్ జస్టిస్ నర్సింహా రెడ్డి, ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు. –గన్‌ఫౌండ్రి

వడ్డీ డబ్బుల విషయమై గొడవ
బావను చంపిన బావమరిది



మృతుడు సైఫ్ (ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి: వడ్డీ డబ్బుల విషయమై జరిగిన గొడవలో సహనం కోల్పోయిన బావమరిది.. బావ తలపై బండరాయి బాదడంతో అతను అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నరేందర్ చెప్పిన వివరాల ప్రకారం.. వట్టేపల్లి ప్రాంతానికి చెందిన సైఫ్ (39) ప్రైవేట్ ఉద్యోగి. అతడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. సైఫ్ బావమరిది ఆటో డ్రైవర్ మహమ్మద్ ఇస్మాయిల్ ఇదే ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. వీరి మధ్య కొంతకాలంగా డబ్బుల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. బావమరిది ఇస్మాయిల్ వద్ద సైఫ్ రూ.లక్ష అప్పు తీసుకున్నాడు. ఈ డబ్బులకు సైఫ్ కొన్ని రోజులు వడ్డీ సక్రమంగానే కట్టాడు. ఇటీవల కొన్ని రోజులుగా కట్టకపోవడంతో ఆదివారం బావ, బావమరిది మధ్య గొడవ జరిగింది. మాటామాటా పెరిగి బావ సైఫ్ తలపై ఇస్మాయిల్ బండరాయితో బాదాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో సైఫ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలికి చేరుకొని నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్యసాధన దిశగా ముందుకెళ్లాలి
హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్



స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న రంగనాథ్

చిక్కడపల్లి: దృఢ సంకల్పంతో లక్ష్యసాధన దిశగా ముందుకు వెళ్లాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సివిల్స్ అభ్యర్థులకు సూచించారు. ఆదివారం సాయంత్రం గాంధీనగర్‌లోని అశోక్‌నగర్‌లోని సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ, టైలరో ఆర్గనైజేషన్ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన కల్పతరు 3.0 స్కాలర్‌షిప్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన వారికి ఉచిత స్టడీ మెటీరియల్‌ను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ.. వైకల్యం శరీరానికే గాని లక్ష్యానికి కాకూడదన్నారు. మానసిక స్థైర్యంతో ముందుకు పోవాలన్నారు. ఇరవై ఏళ్ల క్రితం అశోక్‌నగర్ రోడ్లపై తిరుగుతూ సివిల్ సర్వీసెస్ కోసం కోచింగ్ తీసుకున్న వారిలో తాను ఒకడినని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ అధినేత బాలలత, టైలరో సీఈఓ జె. ఐశ్వర్య, సెట్విన్ మేనేజింగ్ డైరెక్టర్ కె.వేణుగోపాల్‌రావు, మెట్రో టీవీ ఎండీ జయప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి

చిక్కడపల్లి: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని, ఆరోగ్యవంతమైన పోటీ.. సామాజిక అంశాలపై అవగాహన వల్ల సమాజానికి మేలు కలుగుతుందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి అన్నారు. ఆదివారం సాయంత్రం చిక్కడపల్లిలో పెండేకంటి వెంకట సుబ్బయ్య జ్ఞాపకార్థం నిర్వహించిన మూట్ కోర్టు పోటీల్లో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. న్యాయవాద వృత్తిలో వృద్ధి చెందాలంటే ప్రతిష్టాత్మకమైన న్యాయ శాస్త్ర సాధన అవసరమన్నారు. నల్సార్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నిముషకవి వాసంతి మాట్లాడుతూ.. విద్యార్థులకు రాజ్యాంగం, న్యాయస్థాన కట్టుబాట్లపై వివరించారు. కార్యక్రమంలో ఓయూ ప్రొఫెసర్ బి.విజయలక్ష్మి, వాసవి విద్యా సంస్థల జాయింట్ సెక్రటరీ ఎం.ఆనంద్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ పి.అరవింద పాల్గొన్నారు.

కట్‌కటకు చెక్

- విస్తరణ దిశగా డిస్కం అడుగులు
- కొత్తగా 72 సబ్‌స్టేషన్లకు ప్రతిపాదనలు
- 46 సబ్ స్టేషన్లకు భూ కేటాయింపులు
- మిగిలిన వాటికి తప్పని కొరత

డిమాండ్‌కు తగ్గట్టుగా విద్యుత్ సరఫరా



సాక్షి, సిటీబ్యూరో: భాగ్య నగరం శరవేగంగా విస్తరిస్తోంది. శివారు ప్రాంతాల్లో కొత్త కాలనీలు, గేటెట్ కమ్యూనిటీలు, విల్లాలు, బహుళ అంతస్తులు, పరిశ్రమలు భారీగా పుట్టుకొస్తున్నాయి. ఫలితంగా ప్రతి నెలా కొత్తగా 2500–2800 విద్యుత్ కనెక్షన్లు వచ్చి చేరుతున్నాయి. గ్రేటర్‌లో 60 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉండగా.. ప్రస్తుతం ప్రతి ఇంట్లోనూ దీపాలు, ఫ్యాన్లతో పాటు ఏసీ, కూలర్, రిఫ్రిజిరేటర్, ఇతర విద్యుత్ ఉపకరణాల వినియోగం సర్వసాధారణమయ్యాయి. ఫలితంగా కరెంట్ వాడకం గణనీయంగా పెరిగింది.

పెరిగిన వినియోగం..

గతంలో ఒక కిలోవాట్‌తో సరిపెట్టుకున్న వినియోగదారులు.. ప్రస్తుతం మూడు నుంచి అయిదు కిలోవాట్ల విద్యుత్‌ను ఖర్చు చేస్తున్నారు. ఫలితంగా 2023లో గ్రేటర్ సగటు విద్యుత్ వినియోగం 3,756 మెగావాట్లు ఉండగా, 2024లో 4,352 మెగావాట్లకు చేరుకుంది. రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ మేరకు ఇప్పటికే మెట్రో జోన్‌లో 37, మేడ్చల్ జోన్‌లో 27, రంగారెడ్డి జోన్‌లో 57 పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల (పీటీఆర్) సామర్థ్యాన్ని 12 ఎంవీఏలకు పెంచింది. అయినా.. సబ్‌స్టేషన్లలోని ఫీడర్లపై ఒత్తిడి తగ్గలేదు. సరఫరాలో హెచ్చుతగ్గుల సమస్య తీరడం లేదు. కనీస అంతరాయాలకు అవకాశం లేకుండా భవిష్యత్తులో మరింత మెరుగైన విద్యుత్‌ను సరఫరా చేయాలంటే.. అదనపు సబ్‌స్టేషన్లు నిర్మించాల్సిందేనని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ నిర్ణయించింది.

గ్లోబల్ టెండర్లు..

గ్రేటర్‌లోని పది సర్కిళ్ల పరిధిలో 72 కొత్త 33/11 కేవీ సబ్‌స్టేషన్లకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. వీటిలో ఇప్పటికే 46 సబ్‌స్టేషన్లకు స్థల లభ్యత ఉంది. మిగిలిన వాటికి స్థలం కేటాయించాలని ప్రభుత్వానికి విద్యుత్ పంపిణీ సంస్థ కోరింది. స్థల కేటాయింపు పూర్తి కావడమే ఆలస్యం.. సబ్‌స్టేషన్ల నిర్మాణానికి టెండర్లు పిలవనుంది.

ప్రతిపాదిత సబ్‌స్టేషన్లు

సర్కిల్	ప్రతిపాదిత	భూమి కేటాయించినవి
రాజేంద్రనగర్	13	09
సరూర్‌నగర్	05	04
సైబర్‌సిటీ	07	05
సంగారెడ్డి	12	12
మేడ్చల్	04	03
హబ్సిగూడ	04	04
హైదరాబాద్ సౌత్	12	02
హైదరాబాద్ సెంట్రల్	09	01
బంజారాహిల్స్	05	03
సికింద్రాబాద్	14	02

అంచనాలు పెంచి..

ఇండోర్/అవుట్ డోర్ సబ్‌స్టేషన్ల పనుల సత్వర పూర్తి, నాణ్యత కోసం గతానికి భిన్నంగా ఈసారి గ్లోబల్ టెండర్లను ఆహ్వానించాలని డిస్కం నిర్ణయించినట్లు తెలిసింది. ఆ నిర్ణయాన్ని ప్రైవేటు కాంట్రాక్టర్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. డిస్కం చర్యలతో ఉపాధి కోల్పోయి రోడ్డున పడే స్థితి తలెత్తిందనే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా కాంట్రాక్టర్ల మధ్య ఉన్న పోటీతో డిస్కం నిర్ణయించిన ధర కంటే తక్కువ ధరకే టెండర్ కోట్‌చేసే అవకాశం ఉంది. దీంతో సంస్థకు లబ్ధి చేకూరే అవకాశం ఉం ది. కానీ డిస్కం ఈ అంశాన్ని పట్టించుకోకుండా ఉన్న అంచనాలను 20 శాతానికి పెంచి ప్రభుత్వంలోని పెద్దలకు, కార్పొరేట్ కంపెనీలకు పనులు కట్టబెట్టేందుకు యత్నిస్తోందనే ప్రచారం జరుగుతోంది.

అద్దె ఇళ్లే అడ్డాలు!

- కిరాయికి ఉంటామని చెప్పి అసాంఘిక కార్యకలాపాలు
- అద్దెదారులు ఏం చేస్తున్నారో కనిపెట్టాల్సింది యజమానులే
- ఇక నుంచి అన్ని రకాల నేర విచారణల్లో ప్రాపర్టీల స్వాధీనం

సాక్షి, సిటీబ్యూరో: గోల్కొండ గుల్షన్ కాలనీ నివాసి సయ్యద్ షాహెద్ హుస్సేన్ మణికొండలో ఓ అపార్ట్‌మెంట్‌ను అద్దెకు తీసుకున్నాడు. ఫ్లాట్‌లో కృత్రిమ పద్ధతి ద్వారా 40 పూల కుండీల్లో గంజాయి మొక్కలు పెంచుతున్నాడు. విషయం అందుకున్న పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన ఓ మహిళ శ్రీకృష్ణానగర్‌లో ఇంటిని అద్దెకు తీసుకొని వ్యభిచార గృహం నిర్వహిస్తోంది. పోలీసులు దాడులు చేసి నిందితులను అరెస్ట్ చేశారు.. ఇటీవల నగరంలో అద్దె ఇళ్లు కేంద్రంగా చేసుకొని నేరాలకు పాల్పడుతున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. సొంతవి అయితే పోలీసులు జప్తు చేస్తారనే ఉద్దేశంతో నేరస్తులు అద్దె ఇళ్లవైపే మొగ్గు చూపిస్తున్నారు. అపార్ట్‌మెంట్లు, విల్లాలు, వ్యక్తిగత గృహాలు, ఫాంహౌస్‌లను అద్దెకు తీసుకొని అసాంఘిక, నేరపూరిత, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు సాగిస్తున్నారు.

అద్దె ఇళ్లు సీజ్..

ఇప్పటివరకు నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ పదార్థాలు (ఎన్‌డీపీఎస్) మనీ ల్యాండరింగ్, చిట్ ఫండ్, మానవ అక్రమ రవాణా, టెర్రరిస్ట్ వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాల కేసుల్లో మాత్రమే పోలీసులు ప్రాపర్టీలను స్వాధీనం చేసుకునేవారు. కానీ.. ఇక నుంచి పేకాట, వ్యభిచార గృహం వంటి ఇతరత్రా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్న అద్దె గృహాలు, ఇతరత్రా ప్రాపర్టీలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకోనున్నారు. ముందుగా నిందితులపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి కోర్ట్‌లో హాజరుపరుస్తారు. అనంతరం ఇంటి యజమాని వివరాలు సేకరించి రెవిన్యూ అధికారులకు అందజేస్తారు. నేర ప్రక్రియలో నిందితులతో పాటు యజమాని పాత్ర ఉంటే పోలీసులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా కలిసి సంబంధిత ఇంటిని సీజ్ చేస్తారు. కొన్ని సందర్భాలలో ఇంట్లో కిరాయికి ఉన్నవారు చట్ట వ్యతిరేక కార్యకలాపాలు సాగిస్తుంటే వారితో పాటు ఇంటి యజమానులపై కూడా కేసు నమోదయ్యే ప్రమాదముంది.

సీజ్ చేశాక రికవరీ ఎలా?

కొత్త వ్యక్తులకు ఇళ్లు కిరాయికి ఇచ్చేటప్పుడు యజమానులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. ఎక్కువ అద్దె ఇస్తున్నారు కదా అని పూర్తి వివరాలు తెలుసుకోకుండా ఇంటిని కిరాయికి ఇస్తే ఆపై వచ్చే సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. పోలీస్ కమిషనర్లకు అదనపు జిల్లా మెజిస్ట్రేట్ హోదాలో ప్రాపర్టీలను సీజ్ చేసే అధికారాలు ఉంటాయి. సాధారణంగా ఆయా ప్రాపర్టీలను ఏడాది కాలం పాటు సీజ్ చేస్తారు. కాలపరిమితి ముగిసిన తర్వాత ప్రాపర్టీని రిలీజ్ చేయాలని కోరుతూ స్థానిక న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేయాల్సి ఉంటుంది. యజమాని చర్యల పట్ల సంతృప్తి చెందితేనే ప్రాపర్టీలను రిలీజ్ చేస్తారు.

అద్దెకు ఇచ్చే ముందు ఇవి గమనించాలి..

- ప్రాపర్టీలను అద్దెకు ఇచ్చే సమయంలో ముందుగా కిరాయి దారు నుంచి అండర్ టేకింగ్ తీసుకోవాలి.
- అద్దెదారులుకు సంబంధించిన ఓటర్, ఆధార్, ఇతర పత్రాలను ధ్రువీకరించుకోవాలి.
- కిరాయి ఎక్కువ ఇస్తామని ఆశపెట్టే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలి.
- అపరిచితుల పట్ల తెలిసిన వారి రిఫరెన్స్ తీసుకోవాలి. వారి గురించి చర్చించాలి.
- ఉద్యోగస్తులైతే పనిచేసే కంపెనీ వివరాలు తెలుసుకోవాలి.
- వ్యాపారస్తులైతే అందుకు సంబంధించిన వివరాలను పరిశీలించాలి. చట్టబద్ధమైన వ్యాపారమో కాదో తెలుసుకోవాలి.

69,624 కుటుంబాల సర్వే

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పరిధిలో ఆదివారం వరకు 69,624 కుటుంబాల సర్వే జరిగింది. శనివారం వరకు స్టిక్కర్ల కార్యక్రమమే కొనసాగింది. ప్రస్తుతానికి ఒక్కో ఇంటి సర్వేకు అరగంటకు పైగా సమయం పడుతోందని, ఎన్యుమరేటర్లకు అనుభవం పెరిగే కొద్దీ సమయం తగ్గుతోందని అధికారులు భావిస్తున్నారు. సేకరించిన సమాచారాన్ని వెంటనే డేటా ఎంట్రీ చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు జీహెచ్‌ఎంసీ ఒక ప్రకటనలో పేర్కొంది. సర్వే పత్రాలు భద్రపరిచేందుకు, అవసరమైన సామగ్రి కొనుగోలుకు జోనల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. మరోవైపు.. తమ ఇంటికి ఇప్పటి వరకూ స్టిక్కర్లు అంటించలేదని పలు కుటుంబాల వారు చెబుతున్నారు.

ఆడ పిల్లల సంరక్షణ
చట్టాల్లో విధాన మార్పులు రావాలి

సనత్‌నగర్: ఆడ పిల్లల సంరక్షణకు సంబంధించిన చట్టాల్లో విధాన మార్పులు రావాల్సిన అవసరముందని జాతీయ బాలల హక్కుల సంరక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్) మాజీ చైర్ పర్సన్ శాంతా సిన్హా అన్నారు. బేగంపేటలోని సెస్ ఆడిటోరియంలో ఆదివారం 'తెలంగాణ ఆడ పిల్లల సమానత్వ సమాఖ్య (టాస్) రాష్ట్ర యువ సమ్మేళనం నిర్వహించారు. శారీరక, మానసిక, లైంగిక దాడులు 'ఇక చాలు' అనే అంశంపై ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమ్మేళనంలో శాంతి సిన్హాతో పాటు తెలంగాణ విద్యా మండలి సభ్యురాలు కె. జ్యోత్స్న శివారెడ్డి, ఎంవీ ఫౌండేషన్ చైర్మన్ అండ్ మేనేజింగ్ ట్రస్టీ ఎంబీ విక్రమ్, విమల కటికనేని పాల్గొన్నారు. ప్రముఖ యాంకర్ సుమ కనకాల ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ జిల్లాల్లోని 15–18 సంవత్సరాల మధ్య వయసు బాలికలు సామాజికంగా ఎదుర్కొంటున్న సమస్యలకు కారణాలు, వాటికి దక్కాల్సిన పరిష్కార మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా శాంతా సిన్హా అన్నారు. ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఆర్.వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. కొన్ని జిల్లాల్లో విస్తృతంగా కొనసాగుతున్న 'ఇక చాలు' సంఘాలు త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించేందుకు చక్కటి కార్యాచరణతో ముందడుగు వేస్తున్నాయని పేర్కొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న వక్తలు

మెట్రో లక్ష్యం బహుదూరం

- రోజుకు 16 లక్షల మంది ప్రయాణికులు టార్గెట్
- ఏడేళ్లు గడిచినా రైలు ఎక్కుతోంది 5 లక్షల లోపే..
- అదనపు కోచ్‌లు, లాస్ట్ మైల్ కనెక్టివిటీ కొరత
- వ్యక్తిగత వాహనాల వైపే నగర వాసుల మొగ్గు



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ ప్రజారవాణా రంగంలో పెను మార్పులను తెస్తుందని భావించిన మెట్రోరైల్ ఏడేళ్లుగా ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కి అన్నట్లుగా నడుస్తోంది. మెట్రోరైళ్లను ప్రవేశపెట్టి ఏడేళ్లు దాటినా 5 లక్షల మంది ప్రయాణికుల మార్కును అధిగమించడం లేదు. 5 లక్షల మంది ప్రయాణికులకు అటు ఇటుగానే మెట్రో రైళ్లు నడుస్తున్నాయి. రోజుకు 16 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానానికి చేరవేయాలనే లక్ష్యం కనుచూపు మేరలో కూడా కనిపించడంలేదు. ఎలాంటి లాభ నష్టాలు లేకుండా ప్రయాణికులకు మెరుగైన, పర్యావరణ హితమైన, సత్వర రవాణా సదుపాయాన్ని అందజేయాలంటే నగరంలోని వివిధ మార్గాల్లో నడిచే మెట్రో రైళ్లలో కనీసం 16 లక్షల మంది ప్రయాణం చేయాలి. కానీ ఇప్పుడు 4.5 లక్షల నుంచి 5 లక్షల మంది మాత్రమే ప్రయాణం చేస్తుండటం గమనార్హం. బెంగళూర్‌లో రోజుకు 7.5 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు. ఢిల్లీలో 60 లక్షల మంది మెట్రో సేవలను వినియోగించుకుంటున్నారు. ముంబైలోనూ 5 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు. హైదరాబాద్‌లో మాత్రం మెట్రో ప్రయాణికుల సంఖ్య పెరగడం లేదు.

లాస్ట్ మైల్ కనెక్టివిటీ కొరవడి..

నగరంలో ఏ ఒక్క మెట్రోస్టేషన్‌కు పూర్తిస్థాయిలో లాస్ట్‌మైల్ కనెక్టివిటీ లేదు. వివిధ మార్గాల్లో నడిచే యాప్ ఆధారిత క్యాబ్‌లు, బైక్‌లు, ఆటోలు వంటి వాహనాలే కొన్ని స్టేషన్ల నుంచి పరిమితంగా లాస్ట్ మైల్ కనెక్టివిటీ సదుపాయాన్ని అందజేస్తున్నాయి. అన్ని ప్రధాన రూట్లలో సిటీ బస్సులు తిరుగుతున్నాయి. కానీ మెట్రోస్టేషన్‌ల చుట్టుపక్కల ఉన్న కాలనీల నుంచి ప్రయాణికులకు మెట్రో వరకు చేర్చే ఫీడర్ రూట్లలో ఎలాంటి రవాణా సదుపాయాలు లేవు. ఉదాహరణకు ఉప్పల్ మెట్రో స్టేషన్ నుంచి అమీర్‌పేట్ వరకు మెట్రో చార్జీ రూ.45 మాత్రమే. మెట్రోస్టేషన్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న సరస్వతీనగర్ కాలనీ నుంచి మెట్రో స్టేషన్‌కు వచ్చేందుకు ఆటో చార్జీ రూ.100 వరకు ఉంటుంది. అంటే మెట్రో ఎక్కాలంటే రెట్టింపు చార్జీలను చెల్లించాల్సి వస్తోంది. దీంతో నగరంలోని మెట్రో స్టేషన్లకు చుట్టుపక్కల ఉన్న కాలనీల ప్రజలు ప్రత్యామ్నాయ సదుపాయాలనే ఎక్కువగా వినియోగించుకుంటున్నారు.

వివిధ నగరాల్లో మెట్రో ప్రయాణికుల సంఖ్య..

మెట్రో	రూట్ కిలోమీటర్లు	ప్రయాణికుల సంఖ్య (లక్షల్లో)
ఢిల్లీ	350.4	60
బెంగళూర్	75.2	7.5
ముంబై	59.2	5
హైదరాబాద్	69.2	4.8
చెన్నై	54	3

కోచ్‌ల కొరత.. మహాలక్ష్మి ఎఫెక్ట్

ఇటీవల కాలంలో రద్దీకి తగినవిధంగా సర్వీసులు లభించడం లేదు. మెట్రో ఎక్కినా కిక్కిరిసిన బోగీల్లో నిల్చుని ప్రయాణం చేయాల్సివస్తోంది. దీంతో చాలామంది నిరాశక్తతను చూపుతున్నారు. మెట్రో రైళ్లను ప్రవేశపెట్టినప్పటి ఆసక్తి ఇప్పుడు ప్రయాణికుల్లో కనిపించడం లేదు. రద్దీకి తగిన అదనపు కోచ్‌లు లేకుండాపోయాయి. ప్రభుత్వం గత డిసెంబర్‌లో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పిస్తూ మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టినప్పటి నుంచి మెట్రోల్లో ప్రయాణం చేసే మహిళల సంఖ్య తగ్గుముఖం పట్టింది. మెట్రో స్టేషన్లలో ఇటీవల వరకు ఉన్న ఉచిత టాయిలెట్ సదుపాయాన్ని కూడా తొలగించడం, ప్రయాణ చార్జీల కంటే వాహనాల పార్కింగ్ చార్జీలే రెట్టింపు కావడంతో నగర వాసుల్లో చాలామంది సొంత వాహనాల వినియోగానికే మొగ్గు చూపుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

● మరో ఐదుగురికి తీవ్ర గాయాలు ● అదుపు తప్పి చెట్టును ఢీకొట్టిన కారు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

యాచారం: అతి వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టి, బోల్తా కొట్టడంతో ఇద్దరు యువకులు మృతి చెందారు. మరో ఐదుగురికి తీవ్ర గాయాలై నగరంలోని వివిధ ప్రవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మా సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని హైదరాబాద్–శ్రీశైలం రహదారి ముచ్చర్ల గేట్ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. సీఐ లిక్కి కృష్ణంరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పహాడీషరీఫ్‌కు చెందిన ఇంతియాజ్ ఖాన్ (18), నాయబ్ ఖాన్ (18) తమ స్నేహితులైన అబ్దుల్ సమీర్, అబ్దుల్ షియాజ్ ఖాన్, అబ్దుల్ అజీజ్ ఖాన్, అబ్దుల్ ఖాదర్, అబ్దుల్ పయాజ్‌తో కలిసి మెహిదీపట్నంలోని ఓ ట్రావెల్స్‌కు చెందిన కారును అద్దెకు తీసుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున శ్రీశైలం ప్రాజెక్టు సందర్శనకు బయలుదేరారు. అబ్దుల్ సమీర్ కారు నడుపుతున్నాడు. కారు అతి వేగంగా వెళ్తూ శ్రీశైలం రహదారిపై ముచ్చర్ల గేట్ సమీపంలో చెట్టుకు బలంగా ఢీకొట్టి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన ఇంతియాజ్ ఖాన్, నాయబ్ ఖాన్‌ను నగరంలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. మిగతా ఐదుగురికి తీవ్ర గాయాలు కావడంతో నగరంలోని వివిధ ఆస్పత్రుల్లో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. నిద్రమత్తులో కారును అతి వేగంగా డ్రైవ్ చేయడం వల్లే ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కాప్రాలో కారు బీభత్సం

మద్యం మత్తులో కారు నడిపిన యువకుడు

● పదుల సంఖ్యలో వాహనాలను ఢీ కొట్టిన కారు..
● 15 మందికి పైగా గాయాలు
● దేహశుద్ధి చేసిన స్థానికులు


కారు నడిపిన యువకుడు


పోలీసులకు వివరాలు తెలుపుతున్న స్థానికులు

కుషాయిగూడ: మద్యం మత్తులో ఉన్న యువకుడు కారు నడుపుతూ బీభత్సం సృష్టించాడు. అదుపుతప్పి సుమారు రెండు.. మూడు కిలోమీటర్ల మేర ద్విచక్ర వాహనాలు, కార్లు, పాదచారులను ఢీకొడుతూ పలువురిని గాయపరిచాడు. స్థానికులు వెంబడించి కారు నడుపుతున్న యువకుడిని పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన ఆదివారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాప్రాలో చోటు చేసుకుంది. నేరేడ్‌మెట్‌కు చెందిన యువకుడు లోకేష్ మరో యువతితో కలిసి మద్యం తాగాడు. మద్యం మత్తులో కారును అతి వేగంగా నడుపుతూ వాహనాలను ఢీ కొడుతూ బీభత్సం సృష్టించాడు. కందిగూడ, కాప్రా లేక్ ప్రాంతాల నుంచి నేతాజీనగర్ చౌరస్తా వరకు పదుల సంఖ్యలో వాహనాలు, పాదాచారులను ఢీ కొట్టి భయాందోళనలకు గురిచేశాడు. కొంతమంది యువకులు కారును వెంబడించి ఏఎస్‌రావునగర్ ఏటీఎం వద్ద పట్టుకొని కారు నడుపుతున్న యువకుడికి దేహశుద్ధి చేశారు. ఈ క్రమంలో ఏఎస్‌రావునగర్ ప్రధాన రోడ్డు మార్గంలో సుమారు రెండు గంటల పాటుగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలిసిన కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ అంజయ్య సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. మద్యం మత్తులో ఉన్న లోకేష్‌ను, కారును అదుపులోకి తీసుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. గాయపడ్డ వారు స్థానిక ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నారు. స్వల్పగాయాలతో బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కాగా యువకుడితో పాటుగా కారులో ఉన్న యువతి కూడ మద్యం మత్తులో ఉన్నట్లు తెలిసింది.

దళితబంధు అడిగితే దాడులు చేస్తారా?

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడిని ఖండించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్



ముషీరాబాద్: అర్హులైన ప్రతి దళిత కుటుంబానికి 10 లక్షల రూపాయలతో కూడిన దళిత బంధు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ హుజురాబాద్‌లో ఆందోళన చేస్తున్న దళితులకు మద్దతుగా వెళ్లిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై పోలీసులు విచక్షణారహితంగా దాడి చేయడాన్ని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తీవ్రంగా ఖండించారు. ఒక ఎమ్మెల్యే అని చూడకుండా పోలీసులు పిడిగుద్దులు గుద్దారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుల దాడితో స్పృహ కోల్పోయిన కౌశిక్‌రెడ్డిని పార్టీ నాయకులు, కార్యకర్తలు హుటాహుటిన ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించారని ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారని తెలిపారు. కౌశిక్‌రెడ్డిపై దాడి చేసిన పోలీసులపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఎఫ్‌ఎంటీ థెరపీతో జీర్ణసంబంధ వ్యాధులకు చెక్

సాక్షి, సిటీబ్యూరో: భవిష్యత్తులో జీర్ణసంబంధమైన వ్యాధుల చికిత్సల్లో మల సంబంధమైన ఫీకల్ మైక్రోబయోటా ట్రాన్స్‌ప్లాంట్ (ఎఫ్‌ఎంటీ) థెరపీలు ముఖ్యమైన పాత్రపోషిస్తాయని ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, ఏఐజీ హాస్పిటల్ ఛైర్మన్ డాక్టర్ దువ్వూరు నాగేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం ఏఐజీ ఆస్పత్రిలో జరిగిన అంతర్జాతీయ మెడికల్ సైన్స్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఎఫ్‌ఎంటీ వంటి థెరపీల ద్వారా ప్రధానంగా ఐబిడి (ఇన్‌ఫ్లమెటరీ బౌల్ డిసీజ్), ఐబిఎస్ (ఇరిటబుల్ బౌల్ సిండ్రోమ్), సిడిఐ వంటి వ్యాధులను నయం చేయవచ్చన్నారు. నోబెల్ బహుమతి గ్రహీత డాక్టర్ బారీ మార్షల్ మాట్లాడుతూ...ప్రస్తుతం భారతదేశంలో ప్రమాదకరంగా హెచ్ పైలూరి బ్యాక్టీరియా పెరుగుతోందన్నారు. దీని నివారణకు ప్రజల్లో చైతన్యం రావాల్సి వుందని పేర్కొన్నారు. హెచ్ పైలూరి బ్యాక్టీరియా కారణంగా అల్సర్లు, గ్యాస్ట్రోఎంటరాలజీ క్యాన్సర్లు పెరుగుతున్నాయన్నారు. సదస్సులో మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ ఎంఎస్ ఖురూ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక పాలనలో అసోసియేషన్ల పాత్ర కీలకం


అవార్డులను స్వీకరిస్తున్న కాలనీ ప్రతినిధులు

రాయదుర్గం: స్థానిక పాలనలో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు కీలక పాత్ర పోషిస్తాయని వక్తలు అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలోని సెంటినరీ కన్వెన్షన్ సెంటర్ ఆడిటోరియంలో 11వ నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ముగింపు సమావేశాన్ని ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. స్థానిక సంస్థలు, ప్రజల మధ్య అవినాభావ సంబంధాలు ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అసోసియేషన్లు ప్రజలకు, అధికారులు, స్థానిక పాలకులకు మధ్య వారధిలా వ్యవహరించడం ద్వారా స్థానిక పాలనలో సమస్యలు లేకుండా చేయడానికి అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఏ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ బీబీజే చెలికాని, ఘాజియాబాద్ చీఫ్ కన్వీనర్ కల్నల్ వీర్ చక్ర గ్రహీత టి.పి.త్యాగి, విశాఖపట్నం ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.ఆర్.మూర్తి, హైదరాబాద్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ బి.టి.శ్రీనివాసన్ పాల్గొన్నారు.

గుల్‌మొహర్ పార్కుకు ఉత్తమ అవార్డు..

తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లోని రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లను ఎంపిక చేశారు. వాటి ఆధ్వర్యంలోని ఆకట్టుకునే రీతిలో కొనసాగుతున్న పార్కులను కూడా ఎంపిక చేసి అవార్డులను అందించారు. శేరిలింగంపల్లి పరిధిలోని గుల్‌మొహర్ పార్కు కాలనీకి ప్రాధాన్యం దక్కింది. కాలనీ అధ్యక్షుడు షేక్ ఖాసీమ్, ప్రధాన కార్యదర్శి ఆనంద్ కుమార్, ప్రభాకరచారి. మహ్మద్ షకీల్, సత్యనారాయణలు ఈ అవార్డును అందుకున్నారు.

మెస్ చార్జీల పెంపు హర్షణీయం

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య


బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ హాస్టల్ విద్యార్థుల, గురుకుల విద్యార్థుల మెస్ చార్జీలు పెంచడం హర్షణీయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. నగరంలోని కాలేజీ, హాస్టల్ విద్యార్థులు ర్యాలీలు, సంబరాలు చేపట్టారు. విద్యానగర్, నారాయణగూడ, ఎల్‌బీనగర్, లాలాగూడలో ర్యాలీలు, సంబరాలు చేశారు. నగరంలోని విద్యార్థులు వందలాదిగా ర్యాలీగా బీసీ భవన్‌కు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా ఇప్పటి వరకు 390 సార్లు ధర్నాలు, ర్యాలీలు జరిపామన్నారు. ఇప్పుడు ప్రస్తుతం ప్రభుత దిగి వచ్చి ఉద్యమాలకు స్పందించి రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, హాస్టళ్లు, గురుకుల పాఠశాలల మెస్ చార్జీలను పెంచినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. గురుకులాలు, హాస్టళ్లలో చదువుకునే 7.65 లక్షల మంది విద్యార్థులకు ఈ పెంపుదల ప్రయోజనం చేకూర్చుతుందన్నారు. పెంచిన మెస్ చార్జీలతో గతంలో మాదిరిగా మంచి పౌష్టికాహారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ విద్యార్థి అధ్యక్షులు వేముల రామకృష్ణ, గొరిగె మల్లేష్, నిమ్మల వీరన్న, ఋషికుమార్, నిఖిల్‌పటేల్, రాజేందర్, అనంతయ్య, ప్రీతం, వంశీ, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

మహానగరంలో మేకల వివరాల నమోదు



బంజారాహిల్స్: సామాజిక, ఆర్థిక, కుల గణనలో భాగంగా ఫారంలో ఉన్నవిధంగా నివాసితుల వద్ద ఉన్న పశుసంపద, పెంపుడు జంతువులను సైతం నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ మహానగరంలోని బంజారాహిల్స్ దేవరకొండ బస్తీలో జావెద్ అనే వ్యక్తి తన వద్ద ఏడు మేకలు ఉన్నాయని, మూడు బాతులు ఉన్నాయని, వాటిని కూడా నమోదు చేయాలని ఎన్యుమరేటర్‌కు సమాచారం ఇచ్చారు.

విదేశీ విద్యపై అవగాహన పెరగాలి



సాక్షి, సిటీబ్యూరో: విదేశీ విద్యపై అవగాహన పెరిగేకొద్దీ, మరింత ఎక్కువ మంది విద్యార్థులు అంతర్జాతీయ విద్య చదవడానికి ప్రయత్నిస్తారని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు. నగరానికి చెందిన టెక్సాస్ రివ్యూ ఆధ్వర్యంలో బేగంపేటలోని మారిగోల్డ్ హోటల్‌లో వరల్డ్ ఎడ్యుకేషన్ ఫెయిర్ జరిగింది. ఈ ఫెయిర్‌కు యుఎస్ఏ , యుకె , ఫ్రాన్స్, జర్మనీ సహా 13 దేశాలకు చెందిన 75 పైగా విశ్వవిద్యాలయాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా టెక్సాస్ రివ్యూ సహ–వ్యవస్థాపకుడు సీఈఓ రాజేష్ దాసరి మాట్లాడుతూ యూఎస్, యూకె చాలా మంది విద్యార్థులకు ఇష్టపడే గమ్యస్థానాలు అయినప్పటికీ, అనేక యూరోపియన్ దేశాలు కూడా అసాధారణమైన విద్యా ప్రమాణాలను అందిస్తున్నాయన్నారు.

జలం.. ఆశాజనకం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఏకధాటి వర్షాలు, వరదలతో జిల్లాలోని చెరువులు, కుంటలు నిండుకుండలను తలపిస్తున్నాయి. ఫలితంగా భూగర్భ జలమట్టం అనూహ్యంగా పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి మరింత పైకి చేరుకోవడం విశేషం. బావులు, బోర్లలో చాలా తక్కువ లోతులోనే నీటి ఆనవాళ్లు కన్పిస్తుండడం .. మోటార్లు 24 గంటలు ఆగకుండా పోస్తుండటంతో రైతులు అప్పుడే యాసంగి సాగుకు సిద్ధం అవుతున్నారు. వర్షాకాలంలో జిల్లా వ్యాప్తంగా 1,38,187 ఎకరాల్లో వరి సాగు కాగా, యాసంగిలో ఈ విస్తీర్ణం మరింత పెరిగే అవ కాశం లేకపోలేదు. ఈ మేరకు జిల్లా వ్యవసాయశాఖ అంచనాలు సిద్ధం చేసింది.

87 పిజోమీటర్స్ ఏర్పాటు

భూగర్భ జలాలను గుర్తించేందుకు జిల్లాలో 87 పిజోమీటర్స్ ఏర్పాటు చేశారు. మే నెలలో 14.06 మీటర్ల లోతులో నీటి ఆనవాళ్లు కన్పించగా, సెప్టెంబర్ నాటికి 8.25 మీటర్లకు, అక్టోబర్ నాటికి 7.71 మీటర్లకు చేరింది. ఆమనగల్లు, అబ్దుల్లాపూర్‌మెట్, నందిగామ, బాలాపూర్, కందుకూరు, కేశంపేట, కొందుర్గు మండలాల్లోని పిజోమీటర్లలో ఐదు మీటర్ల కంటే తక్కువ లోతులోనే నీటి ఆనవాళ్లు కన్పిస్తున్నాయి. బహుళ అంతస్తుల నిర్మాణాలు సహా నీటి విని యోగం ఎక్కువగా ఉండే శేరిలింగంపల్లి మండలంలో గత ఏడాదితో పోలిస్తే భూగర్భ జలమట్టం ఈసారి కొంత ఆశాజనకంగా పెరిగినప్పటికీ.. నగరానికి ఆనుకుని ఉన్న కొత్తూరు, మహేశ్వరం, సరూర్‌నగర్ మండలాల్లో మరింత లోతుకు పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది.

సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించాలి


సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ఆరా తీస్తున్న మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్

దుండిగల్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఆయా కుటుంబ సభ్యులు అధికారులకు సహకరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ కోరారు. ఆదివారం నిజాంపేట్, బాచుపల్లిలో నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గౌతమ్ మాట్లాడుతూ ఎన్యుమరేటర్లు నిర్దేశిత ప్రొఫార్మల నమోదు, కోడింగ్‌ను అత్యంత జాగ్రత్తగా నింపాలన్నారు. కార్యక్రమంలో నిజాంపేట కార్పొరేటర్ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ షాబీర్ అలీ, తహశీల్దార్, ఫూల్ సింగ్, నోడల్ ఆఫీసర్ ఇందిరా, సూపర్ వైజర్లు, ఎన్యుమరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అగ్రి–ఫుడ్ సిస్టమ్స్' సదస్సు


కీలీ రోత్‌తో పాటు జర్మనీకి చెందిన ఫైరూజ్ స్తాంబౌలితో పాటు జాతీయస్థాయిలో పలువురు ప్రముఖులు తరలివచ్చారు.

సాక్షి, సిటీబ్యూరో: వ్యవసాయం–ఆహార స్థితిగతులపై నగరానికి చెందిన కెఎల్‌హెచ్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ ఆధ్వర్యంలో అజీజ్‌నగర్ క్యాంపస్‌లో నిర్వహించిన ప్రతిష్టాత్మక ఐఇఇఇ జీఆర్ఏఎస్ఎస్ ఎస్‌వైడబ్ల్యు సదస్సు ముగిసింది. అగ్రి–ఫుడ్ సిస్టమ్స్‌లో మెషిన్ లెర్నింగ్, జీఐఎస్ అనే అంశాన్ని థీమ్‌గా తీసుకుని నిర్వహించిన ఈ సదస్సులో ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయాన్ని ఆహార విధానాలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఏ విధంగా ప్రభావితం చేస్తోంది..అనే అంశంపై ప్రధానంగా చర్చించారు. ఈ సదస్సుకు అమెరికాకు చెందిన ఇన్ఫర్మేషన్ రిసోర్సెస్ ఎట్ ప్లానెట్ వైస్ ప్రెసిడెంట్

తెలంగాణ స్పైసీ కిచెన్‌లో గ్యాస్ లీకేజీ

● భారీ శబ్దంతో పేలుళ్లు
● ఓ మహిళకు గాయాలు.. 10 ఇళ్లు ధ్వంసం


పరిశీలిస్తున్న జూబ్లీహిల్స్ పోలీసులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్–1లోని తెలంగాణ స్పైసీ కిచెన్‌లో ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటలకు జరిగిన గ్యాస్ లీకేజీ కారణంగా జరిగిన బ్లాస్ట్‌లో ఓ మహిళకు తీవ్ర గాయాలు కాగా పదికి పైగా ఇళ్లు ధ్వంసమయ్యాయి. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. తెలంగాణ స్పైసీ కిచెన్‌లో తెల్లవారుజామున కిచెన్ పక్కన ఎనిమిది కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను ఏర్పాటుచేశారు. మరొకటి ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ఉంది. ప్రమాదవశాత్తు గ్యాస్ లీకై హోటల్ మొత్తం నిండిపోయింది. తెల్లవారుజామున 4.30 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా గ్యాస్ బయటకు వెళ్లే క్రమంలో పెద్ద ఎత్తున శబ్దం చేస్తూ పేలిపోయింది. పక్కనే భారీ రిఫ్రిజిరేటర్ ఉండగా ఈ ధాటికి దాని కంప్రెషర్ కూడా పేలిపోయింది. పేలుడు ధాటికి పక్కనే ఉన్న దుర్గాభవానీనగర్ బస్తీ వైపు ప్రహరీ కుప్పకూలిపోయింది. దీనిని ఆనుకుని 10 వరకు ఇళ్లు ఉన్నాయి. ఈ పేలుడుకు రేకుల షెడ్లు మొత్తం ధ్వంసమయ్యాయి. అదృష్టవశాత్తూ ప్రాణాపాయం తప్పింది. పూజ అనే మహిళకు మాత్రం గోడ కూలడంతో బండరాయి తలపై పడి గాయాలయ్యాయి. అంతా నిద్రిస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకోగా అదృష్టవశాత్తూ ప్రహరీగోడ బండరాళ్ల నుంచి ప్రమాదం తప్పింది. హోటల్‌లోకి పైపుల ద్వారా గ్యాస్ కనెక్షన్ ఉంది. ఇది లీక్ అవడం వల్లనే ఈ ప్రమాదం జరిగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. గాయపడ్డ మహిళను ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో మౌనిక, లలిత, పూజ, అంకిత, మంగ్లీ, ఎం.రాజీ, భవానీ, పాండు, కృష్ణవేణి తదితర ఇళ్లు ధ్వంసం కావడంతో వీరంతా రోడ్డున పడ్డారు. సామాన్లన్నీ బూడిదయ్యాయి. కట్టుబట్టలతో వీరంతా రోడ్డునపడ్డారు. ఘటనా స్థలాన్ని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సందర్శించి బాధితులను పరామర్శించారు. న్యాయం చేస్తానని వారికి హామీనిచ్చారు. ఈ ఘటనపై జూబ్లీహిల్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు. మరోవైపు తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనతో భారీ శబ్దాలకు చుట్టుపక్కల నివాసితులంతా ఆందోళనకు గురై భూకంపం వచ్చిందేమోనన్న భయంతో బయటకు పరుగులు తీశారు. చుట్టుపక్కల నివాసితులు ఉలిక్కిపడగా స్థానికంగా ఉద్రిక్తత చోటుచేసుకుంది.


బ్లాస్టింగ్‌లో గాయపడ్డ పూజ




ఇళ్లు ధ్వంసం కావడంతో నిరాశ్రయులైన బాధితులు

మూసీలో పరిశ్రమల వ్యర్థాలు కలవకుండా అరికట్టండి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పృథ్వీరాజ్ తదితరులు

పంజగుట్ట: పరిశ్రమల వ్యర్థాలు, మున్సిపల్ వ్యర్థాలు మూసీలోకి రాకుండా కట్టడి చేయకుండా మూసీ సుందరీకరణ పేరుతో మూసీకి రెండువైపులా పెద్దపెద్ద భవనాలు, మల్టీప్లెక్స్‌లు నిర్మించి ఆదాయమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. మూసీ కలుషితం కావడానికి ముఖ్యకారణం కొన్ని పరిశ్రమలు, ప్రభుత్వం అభివృద్ధి పేరుతో చేస్తున్న విధ్వంసమే అని వారు అభిప్రాయపడ్డారు. క్లైమాట్ ఫ్రంట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో మూసీ సుందరీకరణ సరిపోతుందా ..? ఇంకా ఏం కావాలి అనే అంశంపై మూసీ పుట్టిన అనంతగిరి కొండల నుంచి కృష్ణానదిలో కలిసేవరకు పది రోజులపాటు నిర్వహించిన సర్వే వివరాలను ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో క్లైమాట్ ఫ్రంట్ హైదరాబాద్ ప్రతినిధులు ఆరూయా, జాన్ మైఖేల్, అన్‌మోల్, సీనియర్ పాత్రికేయులు తెలంగాణ విఠల్, పృథ్వీరాజ్‌లతో కలిసి వెల్లడించారు. ఉస్మానియా వర్సిటీ సర్వే ప్రకారం గత రెండు సంవత్సరాల క్రితం మూసీలో 350 మిలియన్ లీటర్లకు పైగా పారిశ్రామిక, హైదరాబాద్ నగర వ్యర్థాలు కలిసేవని, కానీ ప్రస్తుతం 1628 మిలియన్ లీటర్లకుపైగా వ్యర్థాల నీరు కలుస్తుందని వారు పేర్కొన్నారు. సుమారు 70 అడుగులలోతు మేర భూమి కలుషితం అయ్యిందని దీంతో అక్కడున్న వారే ఆ నీరు తాగటం లేదని, పొలాలకు వినియోగించడం లేదన్నారు. వాస్తవానికి నదీ పరీవాహక ప్రాంతాల సుందరీకరణ ప్రతీ రాష్ట్రంలో ప్రతీ దేశంలో చేస్తుంటారని నదికి రెండువైపులా పెద్దపెద్ద భవనాలు, మల్టీప్లెక్స్‌లు నిర్మించి పేదవారికి దూరం చేస్తారని కాని నదీ పరీవాహక ప్రాంతంలో ఉన్న వారిగూర్చి ఎవ్వరూ ఆలోచించరని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు 300 ఇళ్ళు కూల్చేశారని కొన్ని వేల ఇళ్లకు రెడ్‌మార్క్ వేశారని కూల్చిన ఇండ్లకు డబుల్ బెడ్‌రూం ఇస్తున్నామని గొప్పగా చెప్పుకుంటున్న ప్రభుత్వం కనీసం ఆ డబుల్‌బెడ్ రూంలల్లో ఎలాంటి వసతులు లేవన్న విషయాన్ని తెలుసుకోలేకపోతున్నారన్నారు. మూసీని శుద్ధి చేస్తామంటే ఎవ్వరూ వ్యతిరేకించరని కానీ ముందు మూసీలో కలుస్తున్న వ్యర్థాలను పూర్తిగా అరికట్టి నిర్వాసితులకు ఆసరా చూపిన తర్వాతే మూసీ ప్రాజెక్టు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఉమర్, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం



బాధితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న లక్ష్మీబాయి, నర్సింగరావులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వద్ద తెలంగాణ స్పైసీ కిచెన్ హోటల్‌లో జరిగిన భారీ పేలుడు ఘటనతో పక్కనే ఉన్న బస్తీ ఇళ్లు ధ్వంసం అయ్యాయి. పేలుడు ధాటికి హోటల్ గోడలు పగిలి శిథిలాలు పక్కనే ఉన్న బస్తీ ఇళ్లపై పడడంతో వారి ఇళ్లతో పాటు కొంతమంది మహిళలు కూడా గాయాలయ్యాయి. దీంతో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆదేశాల మేరకు జూబ్లీహిల్స్ మాజీ కార్పొరేటర్ మామిడి లక్ష్మీబాయి, నర్సింగరావులు సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. వారి పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. తక్షణ సహాయం కింద రూ.10,000ల ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే దెబ్బతిన్న ఇళ్ల నివాసితులకు ప్రభుత్వం తరుపున సాయం అందేలా కృషి చేస్తానని హామీనిచ్చారు.

ఉచిత వైద్య శిబిరం

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ఆదివారం బంజారాహిల్స్ సిటీన్యూరో సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన ఈ వైద్య శిబిరాన్ని జేఏసీ సెక్రటరీ కిలారు రాజేశ్వరరావు ప్రారంభించారు. కాగా ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. ఇందులో న్యూరాలజీ, ఆర్థోపెడిక్, రుమటాలజీ, పల్మనాలజీ, గైనకాలజీ, కార్డియాలజీ, డెంటల్, నేత్ర పరీక్షలు నిర్వహించారు. అనుభవజ్ఞులైన వైద్యులు ఇక్కడికి వచ్చిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించడమే కాకుండా వైద్య సలహాలు కూడా అందించారు. అలాగే బీపీ, షుగర్, బీఎంఐ, ఆర్‌బీజీ, కొలెస్ట్రాల్, హిమోగ్లోబిన్, ఈసీజీ, 2డీ ఎకో తదితర పరీక్షలు కూడా చేశారు.



జూబ్లీహిల్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించుకుంటున్న కాలనీవాసులు

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

ఓబీసీ సెంట్రల్ కమిటీ జాతీయ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి

కాచిగూడ: ప్రజాపాలన అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఓబీసీ సెంట్రల్ కమిటీ జాతీయ అధ్యక్షురాలు ఎం.భాగ్యలక్ష్మి అన్నారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఓబీసీ సెంట్రల్ కమిటీ 6వ కార్యవర్గ సమావేశం భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ళ పేరుతో మళ్లీ పేద ప్రజలను నయవంచన చేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గజం భూమి కూడా లేని పేద ప్రజలు, కార్మికుల కుటుంబాలకు 100 గజాల స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కట్టిన డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లను పేదలకు పంచాలని అన్నారు. పేద ప్రజల నోటరీ ప్లాట్లను వెంటనే రెగ్యులరైజేషన్ చేసి ఇళ్ళ పట్టాలు ఇవ్వాలని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజా సంఘాల నేతలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని కోరారు. ప్రతి పేద కుటుంబంలోని మహిళలకు కుటీర పరిశ్రమలు, చిన్నచిన్న వ్యాపారాలు చేసుకోవడానికి రూ.3లక్షల సబ్సిడీ రుణం ఇవ్వాలని అన్నారు. వితంతు, వృద్ధుల పింఛన్లను రూ.4వేలకు పెంచాలని, నిరుద్యోగ భృతి రూ.10వేలు చెల్లించాలని అన్నారు. అలాగే జనవరి 3వ తేదీన సావిత్రిబాయి పూలే జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో వి.దానకర్ణచారి, యు.చిన్నయ్య, ఎస్.రవికుమార్ ముదిరాజ్, పొట్లకాయల వెంకటేశ్వర్ ముదిరాజ్, శ్రీనివాస్ గౌడ్, పోషం సునిత, కంటేకార్ పరమేష్, బోనం ఉర్మిళ, సాయిలు, కొడూరి లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ నియామకాల్లో అవకాశం కల్పించండి



హిందీ పండిట్ సర్టిఫికెట్లు ప్రదర్శిస్తున్న సమితి ప్రతినిధులు

పంజగుట్ట: హిందీ ఉపాధ్యాయుల నియామకాల్లో విద్వాన్, మధ్యమ, (విశారద), ప్రవీణ వంటి డిగ్రీలకు అర్హత కల్పించాలని తెలంగాణ హిందీ పండిట్ పరిరక్షణ సమితి ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి ప్రతినిధులు భాస్కర్, మంగతాయారు, అంబాదాస్‌లు మాట్లాడుతూ .. 2014 కంటే ముందే తాము హిందీ ప్రచారసభ హైదరాబాద్, దక్షిణభారత హిందీ ప్రచార్‌సభ, మద్రాస్, వంటి ప్రచార సభల ద్వారా విద్వాన్, మధ్యమ, ప్రవీణ వంటి హిందీ డిగ్రీలను పూర్తిచేసి, హిందీ పండిట్ ట్రెనింగ్ పూర్తి చేసి టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్)లో ఉత్తీర్ణత సాధించామని గుర్తు చేశారు. 2017 వరకు జీవో 1415 ద్వారా హిందీ ఉపాధ్యాయుల నియామకాల్లో తమకు అర్హత కల్పించారని కానీ 2017లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన జీవో 25 ద్వారా తమను హిందీ ఉపాధ్యాయుల నియామకాల్లో అనర్హులుగా ప్రకటించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తమ జీవితాలు రోడ్డు పాలయ్యాయని వారు తెలిపారు. తాము జిల్లా, రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించిన ప్పటికీ ఉపాధ్యాయుల నియామకాల్లో అనర్హులుగా ప్రకటిస్తున్నారన్నారు. ప్రజా ప్రభుత్వంలో తమపై దయతలచి పాత జీవో 1415ను తిరిగి కొనసాగించి తమ జీవితాల్లో వెలుగు నింపాలని విజ్ఞప్తి చేశారు. జరగబోయే గురుకుల, మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయుల నియామకాల్లో తమకు అవకాశం కల్పించాలని వేడుకున్నారు.

ఘనంగా దమస్కస్ చర్చి రజతోత్సవ వేడుకలు



దమస్కస్ చర్చి రజతోత్సవ వేడుకలు

ఖైరతాబాద్ : ఖైరతాబాద్‌లోని దమస్కస్ చర్చి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం చర్చిలో రజతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రెవరెండ్ ఎఆర్‌పాల్ కరుణాకర్ ఆధ్వర్యంలో పాస్టర్ రెవరెండ్ ప్రశాంత్, రెవరెండ్ సుచరిత, పాస్టర్ విక్టర్‌లతోపాటు సంఘ సభ్యులు, కుటుంబ సభ్యులతో వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

సమస్యల నడుమ సాగుతున్న సర్వే..!

- రెండో రోజూ తప్పని కష్టాలు
- గూగుల్ మీట్‌లో గోడు వెళ్లబోసుకున్న ఎన్యుమరేటర్లు
- ఎన్యుమరేటర్లకు నచ్చచెప్పిన అధికారులు



సర్వే నిర్వహిస్తున్న ఎన్యుమరేటర్లు..

బంజారాహిల్స్: సమగ్ర ఇంటింటి సర్వేను ఎన్యుమరేటర్లు సరైన సమాచారంతో తప్పులు లేకుండా వివరాలు నమోదు చేస్తూ పకడ్బందీగా నిర్వహించాలని జీహెచ్‌ఎంసీ సర్కిల్-18 డీఎంసీ ప్రశాంతి సూచించారు. ఎన్యుమరేటర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, గృహ నివాసితులు సర్వేకు సహకరించడం లేదన్న ఆరోపణల మధ్య ఆదివారం ఉదయం ఆమె ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని ఎన్యుమరేటర్లతో గూగుల్ మీట్ నిర్వహించారు. ఖచ్చితమైన సమాచారాన్ని ప్రజలు ఎన్యుమరేటర్లకు అందించి నమోదు చేసుకోవాలని, ప్రతి ఇంటిని సందర్శించి సమగ్ర సమాచారం సేకరించాలని, ప్రజలు ఇచ్చిన సమాచారాన్ని గోప్యంగా ఉంచాలని ఎన్యుమరేటర్లకు ఆమె సూచించారు. అయితే ఇంటింటి సర్వేలో వివరాలు నమోదు చేసుకోవడానికి వెళ్లిన ఎన్యుమరేటర్లకు ఆదివారం కూడా కష్టాలు తప్పడం లేదు. చాలామంది సర్వేకు సహకరించకపోగా వివరాలు అందించేందుకు వెనుకంజ వేస్తున్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో 800 బ్లాక్‌లు ఉండగా 35 మంది సూపర్‌వైజర్‌లు పనిచేస్తున్నారు. ఎక్కడా సర్వేకు ప్రజలు పూర్తిగా సహకరించినట్లు కనిపించలేదు. 75 ప్రశ్నలతో ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లగా వీటిని పూరించడానికి చాలా కష్టపడుతున్నారు. సమగ్ర కుటుంబ సర్వే ఫారంలోని ప్రతి ప్రశ్నకు తప్పనిసరిగా సమాధానం ఉండాలని, పూర్తి అవగాహన చేసుకుని ఫారం నింపాలని అధికారులు ఎన్యుమరేటర్లకు సూచిస్తుండగా ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పడానికి 80 శాతం మంది నిరాకరిస్తున్నారు. దీంతో కాలనీల్లో సర్వే ముందుకుసాగడం లేదు. కుల సర్వే సమగ్ర ఇంటింటి సర్వే చేయడంలో ఎన్యుమరేటర్లు చాలా ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆదివారం కూడా ఫిర్యాదులు అందాయి. సమగ్ర కుటుంబ సర్వేను సూపర్‌వైజర్లు పర్యవేక్షణ చేస్తుండగా వారికి కూడా ఈ ఫిర్యాదులు పెద్ద ఎత్తున అందుతున్నాయి.

గోడు వెళ్లబోసుకున్న ఎన్యుమరేటర్లు..

మరోవైపు అధికారులు నిర్వహించిన గూగుల్ మీట్‌లో ఎన్యుమటరేర్లు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఒక్కో ఫారం పూరించేందుకు అర గంటకు పైగా సమయం పడుతుందని పేర్కొన్నారు. కుటుంబంలో సభ్యుల సంఖ్య ఎక్కువగా ఉంటే మరో 10 నిమిషాలు అదనంగా తీసుకుంటుందని తెలిపారు. తొలి రోజు ఒక్కో ఎన్యుమరేటర్‌కు పది ఫారాలు పూర్తి చేయాలని లక్ష్యంగా విధించారు. ప్రజల నుంచి సహకారం లేకపోవడంతో ఆదివారం నిర్వహించిన గూగుల్ మీట్‌లో ప్రశాంతంగా సర్వే నిర్వహించాలని, తొందరేమీ లేదని అధికారులు సూచించారు. ఇదిలా ఉండగా ఇంకా చాలా ఇళ్లకు స్టిక్కర్లు అంటించలేదు. పలు ఇళ్లకు తాళాలు ఉండడంతో సర్వే కూడా ముందుకుసాగడం లేదు.

రెండోరోజు 1260 గృహాల సర్వే



బంజారాహిల్స్: సమగ్ర ఇంటింటి సర్వేలో భాగంగా ఆదివారం 1260 గృహాల సర్వేను పూర్తి చేసినట్లు జీహెచ్‌ఎంసీ సర్కిల్-18 డీఎంసీ ప్రశాంతి తెలిపారు. సర్కిల్ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వర కాలనీ, షేక్‌పేట డివిజన్ల పరిధిలో ఇంటింటి సర్వేలో భాగంగా సర్వే సాఫీగా జరిగిందని వెల్లడించారు. శనివారం 200 గృహాల సర్వే చేసినట్లు తెలిపారు. శని, ఆదివారాలు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఉండడంతో చాలామంది ఎన్యుమరేటర్లు బీఎల్‌ఓలుగా కూడా విధులు నిర్వహించడంతో సర్వేలో కొంత వెనుకబడడం జరిగిందన్నారు. సోమవారం నుంచి రోజుకు 3000ల చొప్పున గృహాల సర్వే పూర్తి చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రజలు కూడా ఎన్యుమరేటర్లకు పూర్తి సహకారం అందించాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: దివ్యశక్తి, బోరబండ 11కెవీ ఫీడర్లు బేగంపేట, ఎస్‌పిఆర్‌హిల్స్ సబ్‌స్టేషన్ల పరిధిల్లో విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు గ్రీన్‌పార్క్, రెడ్డి ల్యాబ్స్, దివ్యశక్తి, శేషమహల్, టి.అంజయ్యనగర్, ఇందిరానగర్, ఎన్ఆర్‌పురం సైట్-3, 4, 5 ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఆదివారం తెలిపారు. అదేవిధంగా ఎస్ఆర్‌నగర్, ఎస్‌పిఆర్‌హిల్స్ 11కెవీ ఫీడర్లు బేగంపేట, ఎస్‌పిఆర్‌హిల్స్ సబ్‌స్టేషన్ల పరిధిల్లో మరమ్మతుల వల్ల మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ఎస్ఆర్‌నగర్ మెయిన్‌రోడ్డు, కమ్యూనిటీ హాల్ లైన్, ఆంధ్రాబ్యాంక్ లైన్, ఎస్‌బీహెచ్‌లైన్, చైతన్య కాలేజీ, 2ఆర్‌టీ, 3 ఆర్‌టీ క్వార్టర్స్, ఎస్‌పిఆర్ హిల్స్ బస్తీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని దీనిని వినియోగదారులు గమనించాలని సూచించారు.

అశ్వాక్ సేవలు మరువలేనివి

కాచిగూడ: మూసీ పరీవాహక ప్రాంత ప్రజల నివాస హక్కుల సాధన కోసం అశ్వాక్ సేవలు మరువలేనివని పలువురు వ్యక్తులు కొనియాడారు. మానవ హక్కుల వేదిక రాష్ట్రీయ మహాసభలను పురస్కరించుకుని ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మానవ హక్కుల వేదిక సభ్యులు, ఛత్రి సంస్థ వ్యవస్థాపకులు మహమ్మద్ అశ్వాక్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు జీవన్ కుమార్, కొమురయ్య, ప్రొఫెసర్ పద్మజ తదితరులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యాలయ నిర్మాణం కోసం నాంపల్లి భీంరావు బాడా బస్తీలోని ప్రజలను బలవంతంగా తరలించారన్నారు. అప్పటి నుంచి ఆ బస్తీవాసులు తమ ఇళ్లకోసం చేస్తున్న న్యాయ పోరాటానికి మద్దతు తెలుపుతున్నామన్నారు. కార్డన్ సెర్చ్ పేరుతో పోలీసులు అర్ధరాత్రి బస్తీలను చుట్టుముట్టి, ఇళ్లలను తనిఖీలు చేస్తూ మానవ హక్కులను ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. డిసెంబర్ 14, 15 తేదీల్లో అనంతపూర్‌లో జరిగే ఉభయ తెలుగు రాష్ట్రాల మహాసభలను విజయవంతం చేయాలన్నారు. అనంతరం మానవ హక్కుల వేదిక హైదరాబాద్ శాఖకు ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ సమావేశంలో హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.సురేష్ బాబు, ఉపాధ్యక్షులు బిలాల్, వెంకట్ నారాయణ, ప్రధాన కార్యదర్శి సంజీవ్, కార్యదర్శులు శ్రావ్య, రోహిత్‌లు పాల్గొన్నారు.

నియామకం



బంజారాహిల్స్: బహుజన్ సమాజ్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఇమామ్‌గూడకు చెందిన షేక్ ఇమ్రాన్ నియమితులయ్యారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-4లో ఆదివారం బహుజన్ సమాజ్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి దోరపల్లి రమేష్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. నిరుపేదల పక్షాన నిలబడి వారికి ఉచితంగా న్యాయ సేవలు అందిస్తున్న షేక్ ఇమ్రాన్ సేవలను గురించి జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించడం జరిగిందని ఈ సందర్భంగా జిల్లా నేతలు తెలిపారు. మున్ముందు పేదలకు మరిన్ని సహాయ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

ఘనంగా దశాబ్ది ఉత్సవాలు



త్రిపుర్ హైకోర్టు న్యాయమూర్తితో నరేష్

శ్రీనగర్‌కాలనీ: మలేషియా తెలంగాణా అసోషియేషన్ గ్లోబల్ ఆర్గనైజేషన్ ఆఫ్ పీపుల్ సంస్థ ఆధ్వర్యంలో మలేషియా కౌలాంపూర్‌లోని మా ట్రేడ్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో దశాబ్ది ఉత్సావాలు (మైతా) శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలకు నగరానికి చెందిన ప్రముఖ న్యాయవాది, సామాజిక కార్యకర్త సుంకర నరేష్ హాజరై అక్కడ త్రిపుర్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమర్నాథ్‌గౌడ్‌తో పాటు మంత్రి శ్రీధర్‌బాబు, పీసీసీ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ పలువురు సినీ, రాజకీయ ప్రముఖులను కలిసి పలు విషయాలను చర్చించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అ ధ్యక్షులు సైతం తిరుపతి, మాదాసు రమేష్, అగ్ని శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

వెంగళరావునగర్: పని కోసం ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన మధురానగర్ పీఎస్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కడం యశోద తన భర్త నాగరాజుతో కలిసి రహమత్‌నగర్‌లో పదేళ్లుగా నివసిస్తుంది. నాగరాజు అడ్డా కూలీగా పని చేస్తుంటాడు. గతనెల 4వ తేదీ ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి కూలీ పనికోసం వెళ్ళాడు. సాయంత్రం వరకు తిరిగి రాలేదు. ఫోన్‌ను కూడా ఇంట్లో వదిలి వెళ్ళాడు. మూడేళ్ల క్రితం ఒకసారి ఇలాగే వెళ్లి 15 రోజులకు తిరిగి వచ్చాడు. ఈ క్రమంలో గతనెల 4వ తేదీన వెళ్ళిన నాగరాజు తిరిగి వస్తాడని యశోద ఎదురుచూసింది. కానీ ఎన్నిరోజులైనా రాకపోవడంతో మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ సర్వేకు సహకరించాలి

డీఎంసీ మారుతి దివాకర్



సర్వేను పర్యవేక్షిస్తున్న జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ మారుతీ దివాకర్

కాచిగూడ: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుటుంబ సర్వేకు ప్రజలందరూ పూర్తిగా సహకరించాలని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ మారుతి దివాకర్ కోరారు. హిమాయత్‌నగర్ కింగ్ కోఠి ప్రాంతంలో ఎన్యుమరేటర్లపై స్థానికులు దాడి చేశారనే విషయం తమ దృష్టికి వచ్చిందని, తాము సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు ఆయన తెలిపారు. సర్వేకు వచ్చిన ఎన్యుమరేటర్లు అడిగిన అన్ని ప్రశ్నలకు ప్రజలు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని, ప్రజలు ఏమి చెబితే అదే ఎన్యుమరేటర్లు రాసుకుంటారని, ప్రజలు ఈ విషయంలో భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని అన్నారు. వివరాలు సేకరించడంలో ప్రభుత్వం కూడా ప్రజలపై ఒత్తిడి తీసుకురావద్దని సూచించారని అదే విధంగా ఎన్యుమరేటర్లు ప్రజల నుంచి వివరాలను సేకరిస్తున్నారని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదు



ఓటరు నమోదులో బీఎల్‌ఓలు

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని 245 పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం కొత్తగా ఓటు నమోదు, ఇల్లు షిఫ్టింగ్ తదితర 35 దరఖాస్తులను స్వీకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉండి ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు.

బీజేపీకి పెరుగుతున్న ఆదరణ



బీజేపీ సభ్యత్వ నమోదులో నేతలు

వెంగళరావునగర్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో నానాటికీ తమ పార్టీకి ఆదరణ పెరిగిపోతుందని భారతీయ జనతాపార్టీ సీనియర్ నేతలు తెలియజేశారు. యూసుఫ్‌గూడ డివిజన్ వెంకటగిరిలో ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టారు. కాగా డివిజన్‌కు చెందిన అనేక మంది యువతీ యువకులు, మహిళలు వచ్చి తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా నేతలు మాట్లాడుతూ రానున్న గ్రేటర్ ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల తమ పార్టీ అభ్యర్థులే గెలుచుకుంటారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నేతలు బరిగల జ్ఞానేశ్వర్, పులిరామ్, బడుగు సతీష్, కొండ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని గాలికొదిలేసిన మజ్లిస్

కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఆరోపణ


డి-క్లాస్ క్వార్టర్స్‌లో కమ్యూనిటీ హాలును ప్రారంభిస్తున్న కిషన్‌రెడ్డి

నాంపల్లి: మజ్లిస్ పార్టీ అభివృద్ధిని గాలికి వదిలేసిందని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఇక్కడ కొన్ని దశాబ్దాలుగా మజ్లిస్ నేతలే ఎన్నికవుతూ వస్తున్నా నాంపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచన వారికి లేదని అన్నారు. మరోవైపు మజ్లిసేతర ప్రాంతాలకు ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. ఆదివారం నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలోని మల్లేపల్లి డివిజన్ డి-క్లాస్ క్వార్టర్స్, ఆసిఫ్‌నగర్ దయాబాగ్‌లో జీ+1 కమ్యూనిటీ హాళ్ల ప్రారంభోత్సవం జరిగింది. డివిజన్ అధ్యక్షుడు జగన్నాథరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవానికి కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ సికింద్రాబాద్ పార్లమెంట్ సభ్యుడిగా తాను ఎన్నికయ్యాక నాంపల్లి నియోజకవర్గంలో అనేక రకాల అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాల్లో సుమారు రూ.78 లక్షలతో కమ్యూనిటీ హాళ్లు, ఓపెన్ జిమ్స్, బోర్‌వెల్స్ వంటి సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. జీహెచ్‌ఎంసీ, వాటర్ వర్క్స్ విభాగాలను నిధుల కొరత వేధిస్తోందని పేర్కొన్నారు. కనీసం వీధిదీపాలను కూడా ఏర్పాటు చేయలేని స్థితి ఉందని, జీహెచ్‌ఎంసీ కార్మికులకు వేతనాలు కూడా ఇవ్వడం లేదన్నారు. అంబర్‌పేట, ఖైరతాబాద్, సికింద్రాబాద్, నాంపల్లి, గోషామహల్ ప్రాంతాల్లోని బస్తీలు అభివృద్ధికి నోచుకోవడంలేదని పేర్కొన్నారు. నిధుల కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ జ్యోతి, బీజేపీ నేతలు సందీప్ సాయి, రాహుల్‌చంద్ర, రమేష్, భుజందర్, పవన్, విజయ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

‘టీ-ప్రైమ్’ అమలుపై సీఎం స్పష్టతనివ్వాలి

తెలంగాణ చాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ విజ్ఞప్తి


రియాజ్ ఖాద్రీ
డైరెక్టర్, టెక్‌టిప్

సాక్షి, సిటీబ్యూరో: ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల టీ-ప్రైడ్ తరహాలోనే ఔత్సాహిక మైనారిటీ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే టీ-ప్రైమ్ పథకం అమలుపై ఈ నెల 11న మైనారిటీ సంక్షేమ దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేయాలని తెలంగాణ చాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీస్ ప్రమోషన్(టెక్‌టిప్) వ్యవస్థాపక డైరెక్టర్ అబు ఫతే సయ్యద్ బందగీ బాషా రియాజ్ ఖాద్రీ డిమాండ్ చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆరేళ్ల క్రితం ప్రకటించిన టీ-ప్రైమ్ కేవలం దస్త్రాలకు పరిమితిమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో ‘టెక్‌టిప్’చేసిన ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం 2018 మార్చి 3న జీవో నెంబర్ 16 ద్వారా టీ-ప్రైమ్ స్కీమ్ ప్రకటించిందని పేర్కొన్నారు. ముస్లింల జీవన పరిస్థితి దళితుల కంటే అధ్వానంగా ఉందని సచార్, రంగనాథ్ మిశ్రా కమిటీ సిఫారసులు స్పష్టం చేస్తున్నాయని రియాజ్ ఖాద్రీ తెలిపారు. ఔత్సాహికులను ప్రోత్సహిస్తే మైనార్టీ వర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ముస్లిం మైనారిటీ ఎంటర్‌ప్రెన్యూర్లకు క్రెడిట్ సౌకర్యం, పబ్లిక్, ప్రైవేటు బ్యాంకులతోపాటు స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌ఐడీబీఐ)లు మొండిచేయి చూపుతున్నాయని, మైనారిటీ ప్రాబల్యంగల ప్రాంతాలకు బ్యాంకులు నెగిటివ్, రెడ్‌మార్క్ వేశాయన్న విషయం సైతం సుధీర్ కమీషన్ సర్వేలో వెల్లడైందని గుర్తుచేశారు.

దేశ రెండో రాజధానిగా హైదరాబాద్

లక్ష్య సాధనకు ప్రొఫెసర్ ఉద్యోగాన్ని వదులుకున్నా: వినోద్‌కుమార్



డి-6 యూట్యూబ్ చానెల్ లోగోను ఆవిష్కరిస్తున్న ప్రొ.గాలి వినోద్‌కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: దేశ రెండో రాజధానిగా హైదరాబాద్‌ను ఏర్పాటు చేయాలని పోరాడనున్నట్లు ఓయూ విశ్రాంత ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయమైన రెండో రాజధాని లక్ష్యం కోసం ప్రొఫెసర్ ఉద్యోగాన్ని త్యజించిన్నట్లు చెప్పారు. వినోద్ కుమార్ ఆధ్వర్యంలో తార్నాకలో ఏర్పాటు చేసిన డి-జాక్ కేంద్ర కార్యాలయాన్ని, డి-6 యూట్యూబ్ చానెల్‌ను తమిళనాడుకు చెందిన డీఎంకే ఎంపీ పి.విలస్ వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వినోద్‌కుమార్ మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి కోసం నెలకు రూ.2.30 లక్షల వేతనం లభించే ఓయూ ప్రొఫెసర్ ఉద్యోగానికి ఏడు ఏళ్ల సర్వీసు ఉండగానే స్వచ్ఛంద విరమణ చేసినట్లు చెప్పారు. దేశంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి జరగడానికి భారత్‌కు రెండో రాజధానిగా హైదరాబాద్‌ను చేయాలని అంబేడ్కర్ 1955లోనే ప్రతిపాదించారన్నారు. సత్వర తీర్పుల కోసం సుప్రీంకోర్టు బెంచ్‌ను దక్షిణాదిలో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారని పేర్కొన్నారు. వీటితోపాటు దక్షిణాదిలో అభివృద్ధి మండలి, ఐటీ కారిడార్, ప్రత్యేక రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలని, ఏపీకి ప్రత్యేక హోదా, తెలంగాణ, కర్ణాటక, కేరళ రాష్ట్రాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. త్వరలో వివిధ రాష్ట్రాలలో పర్యటించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డి జాక్ మేధావుల విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.పవన్, సుంకె సంపత్, పీహెచ్ పవన్ కుమార్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆ నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి

టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు దొంతి రాజేశ్


టీయూసీఐ రాష్ట్ర మహాసభల్లో మాట్లాడుతున్న దొంతి రాజేశ్

సుందరయ్య విజ్ఞానకేంద్రం: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) రాష్ట్ర అధ్యక్షుడు దొంతి రాజేశ్ డిమాండ్ చేశారు. పార్లమెంటులో చర్చ జరగకుండా, కేంద్ర కార్మిక సంఘాల ప్రతినిధులతో సంప్రదించకుండా లేబర్ కోడ్స్‌ను ప్రవేశపెట్టడం సరికాదన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీయూసీఐ 3వ రాష్ట్ర మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా రాజేశ్ మాట్లాడుతూ బడా కార్పొరేట్ కంపెనీల దోపిడీకి అనుకూలంగా చట్టాలను సవరించడం కార్మికుల విద్రోహ చర్య అని అన్నారు. ప్రజాస్వామిక దేశంలో కార్మికులు, కర్షకుల సంక్షేమం, వారి అభివృద్ధికి కృషి చేయాల్సిన ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడటం అప్రజాస్వామికమని విమర్శించారు. అన్నం పెట్టే రైతుల నోట్లో మట్టికొడుతున్నారే తప్ప వారికి గిట్టుబాటు ధర కల్పించడంలేదన్నారు. కార్మిక, కర్షక కేంద్ర సంఘాలు ఈ నెల 26న తలపెట్టిన హెచ్చరిక అర్జీలను అధికారులకు ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చార్లెస్ జార్జ్, ఏపీ అధ్యక్షుడు మరీద్ ప్రసాద్, కర్ణాటక కార్యదర్శి బసవలింగప్ప, ఏఐకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సుదమల్ల భాస్కర్, కార్యదర్శి మాన్య బుజేందర్, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ రుద్రంగి సుధా, మహ్మద్ కాశీ, యాకయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

భూపరిరక్షణ పెద్ద టాస్క్!

- రెవెన్యూ శాఖకు సవాల్‌గా మారిన ప్రభుత్వ, అసైన్డ్ భూముల గుర్తింపు
- ఇంటి దొంగలను కట్టడి చేయలేక పోతున్న యంత్రాంగం
- క్షేత్రస్థాయిలో వీఆర్‌ఓ, వీఏఓలు లేకపోవటంతో తప్పని ఇబ్బందులు
- పైలెట్ ప్రాజెక్టు కింద భూసర్వేకు ప్రత్యేక చర్యలు



సాక్షి, సిటీబ్యూరో: నగరశివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ, అసైన్డ్ భూముల పరిరక్షణకు అధికారయంత్రాంగం సవాల్‌గా మారుతోంది. ఇంటి దొంగలను కట్టడి చేయటంలోనూ విఫలమవుతోందన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ధన, అధికార బలమున్న పెద్దలకు తలొగ్గి కొందరు ఉద్యోగులు అప్పనంగా ప్రభుత్వ, అసైన్డ్ భూములను కట్టబెడుతున్నారు. మరికొందరు అమ్యామ్యాలకు లాలూచి పడి భూమార్పిడిలో ఉన్న లోసుగులను అనుకూలంగా మలచుకుని తప్పుడు చర్యలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ భూములను రక్షించాల్సిన కొందరు రాజకీయ పెద్దలు వాటిని భక్షించేందుకు పన్నుతున్న కుట్రల్లో పలువురు అధికారులు, ఉద్యోగులు బలవుతున్నారు. దీంతో భూపరిరక్షణ పెద్ద టాస్క్‌గా తయారైంది. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ, అసైన్డ్ భూములకు రక్షణ కవచంగా నిలిచి వాటి అక్రమణపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు చేరవేసే వీఆర్‌ఓ, వీఏఓల వ్యవస్థను గత ప్రభుత్వం సంబంధిత శాఖ నుంచి తప్పించి ఇతర శాఖల్లో సర్దుబాటు చేయటంవల్ల కూడా భూపరిరక్షణ రెవెన్యూ శాఖకు సవాల్‌గా నిలుస్తోంది. ఈ క్లిష్ట తరుణంలో ప్రభుత్వ భూముల పరిరక్షణ ధ్యేయంగా పైలెట్ ప్రాజెక్టు కింద సర్వే నిర్వహించి, సాంకేతికంగా కీహోల్ మార్కస్ లాంగ్వేజ్(కేఎంఎల్) మ్యాప్ (గూగుల్)లో పొందుపరిచేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.

మండలాలవారీగా భూముల గుర్తింపు..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 15 మండలాల పరిధిలో గతంలో గుర్తించిన ప్రభుత్వ, అసైన్డ్ భూముల వివరాలను మరోసారి పరిశీలించి, వాటి పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై వ్యూహాత్మకంగా వ్యవహరించాలని రెవెన్యూ యంత్రాంగం భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే భూపరిరక్షణకు జిల్లా, రెవెన్యూ డివిజన్ స్థాయిల్లో సర్వే నిర్వహించేందుకు తగిన కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నారు. ప్రభుత్వ, అసైన్డ్ భూముల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, విధివిధానాలపై కూడా కసరత్తు చేస్తోంది. ప్రభుత్వ, అసైన్డ్ భూములను సంరక్షించే బాధ్యత ఆర్‌ఐ, డీటీ, తహసీల్దార్లపైనే ఉందని పేర్కొంటున్న జిల్లా యంత్రాంగం గుర్తించిన ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రహరీ, పెన్సింగ్ వంటి రక్షక చర్యల ఆవశ్యకతపై కూడా దృష్టి సారిస్తోంది.

కబ్జాదారుల కబంధహస్తాల్లో..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 11 మండలాల పరిధిలో దాదాపు 269 సర్వే నంబర్లలో 5,195 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు గుర్తించిన రెవెన్యూశాఖ, ఇందులో ఎన్ని భూములు కబ్జాకు గురయ్యాయి. ఎంత సంరక్షణలో ఉందన్న సమాచారాన్ని మాత్రం చెప్పలేకపోతోంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం బాలానగర్ మండలంలో 700 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు తెలుస్తోంది. శామీర్‌పేట మండలంలో 420 ఎకరాలు, దుండిగల్ గండి మైసమ్మ మండలంలో 425 ఎకరాలు, మేడిపలి మండలంలో 900 ఎకరాలు, ఘట్కేసర్ మండలంలో 500 ఎకరాలు, కాప్రా మండలంలో 400 ఎకరాలు, కీసర మండలంలో 417 ఎకరాలు, కుత్బుల్లాపూర్ మండలంలో 600 ఎకరాలు, బాచుపల్లి మండలంలో 360 ఎకరాలు, ఉప్పల్ మండలంలో 333.13 ఎకరాలు, మల్కాజిగిరి మండలంలో 113.06 ఎకరాలు, మేడ్చల్ మండలంలో 37 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు రెవెన్యూ శాఖ రికార్డులు చెబుతున్నాయి.

అసైన్డ్ భూములెక్కువనే...

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 2004 సంవత్సరానికి ముందు 116 రెవెన్యూ గ్రామాలు, పలు ప్రాంతాలు, బస్తీల పరిధిలో 8,230 మంది పేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ లబ్ధిదారులకు 11,384 ఎకరాల ప్రభుత్వ భూములను అసైన్డ్ చేశారు. ఈ అసైన్డ్ భూములన్నీ వ్యవసాయ పంట సాగు, ఇళ్ల స్థలాల కోసం పంపిణీ చేశారు. ఘట్‌కేసర్ మండలంలోని 17 గ్రామాల్లో 1610 ఎకరాలు, శామీర్‌పేట మండలంలోని 30 గ్రామాల్లో 1451 ఎకరాలు, కీసర మండలంలోని 16 గ్రామాల్లో 1,500 ఎకరాలు, మేడ్చల్ మండలంలోని 29 గ్రామాల్లో 4,400 ఎకరాలు, ఉప్పల్ మండలంలోని 6 రెవెన్యూ గ్రామాల్లో 286 ఎకరాలు, కుత్బుల్లాపూర్ మండలంలోని 18 గ్రామాల్లో 855 ఎకరాల అసైన్డ్ భూములను అప్పటి ప్రభుత్వం నిర్ణయంలో భాగంగా రెవెన్యూ యంత్రాంగం పంపిణీ చేయగా, ఇందులో చాలామేరకు వెంచర్లు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, అపార్టుమెంట్లు, ఇండిపెండెంట్ ఇళ్లు, ప్రైవేట్ విద్యా సంస్థలు, ఆసుపత్రులుగా మారినట్లు తెలుస్తోంది.

వివాదంలో చిక్కిన భూములివే..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో భూవివాదాలు అధికంగా ఉన్నాయి. రెవెన్యూ శాఖ రికార్డుల ప్రకారం వివాదస్పద భూములు 12,073.17 ఎకరాలు ఉన్నాయి. ఇందులో సివిల్ కోర్టు పరిధిలో వివాదంలో ఉన్న భూములు 2,485 ఎకరాలు కాగా, రెవెన్యూ కోర్టు పరిధిలో 904 ఎకరాలు ఉన్నట్లు రెవెన్యూశాఖ గుర్తించింది. ఇతర వివాదాలతోపాటు ఎండోమెంట్, వక్ఫ్, పారెస్టు, వ్యక్తిగత వివాదాల పరిధిలో 2,466 ఎకరాలు ఉన్నట్లు రెవెన్యూ శాఖ పేర్కొంటున్నది. అసైన్డ్ భూముల కేటాయింపుల్లో భాగంగా 1603 ఎకరాల భూములు కూడా వివాదాల్లో ఉన్నాయి.

కోర్టుల్లో కేసులు ఇలా..

మేడ్చల్ జిల్లాలో భూసంబంధిత కోర్టు కేసులు 706 ఉండగా, ఇందులో మల్కాజిగిరి రెవెన్యూ డివిజన్ పరిధిలో 349, కీసర డివిజన్‌లో 357 ఉన్నట్లు తెలుస్తోంది. వివిధ కోర్టుల్లో ఉన్న కేసుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. సుప్రీం కోర్టులో ఒకటి కాగా, హైకోర్టులో 481, జిల్లా కోర్టులో 65, లోకాయుక్త కోర్టులో 57, ఎల్‌డీ కోర్టులో 63, సివిల్ కోర్టులో ఆరు కేసులు కొనసాగుతున్నాయి. కోర్టు ధిక్కారంలో 35 ఉన్నట్లు రెవెన్యూ శాఖ రికార్డుల బట్టి తెలుస్తోంది.

నగరంలో నేడు

- జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో మౌలానా ఆజాద్ స్మారక ఉపన్యాసం ఉదయం 10 గంటలకు జరుగుతుంది.
- సిక్కుల మత గురువు గురునానక్ 555వ జయంత్యుత్సవాల్లో భాగంగా సికింద్రాబాద్‌లోని గురుద్వార్‌లో సాయంత్రం 4 గంటలకు నగర కీర్తన్ కార్యక్రమం జరుగుతుంది.
- ఎన్టీఆర్ స్టేడియంలో సాయంత్రం 5.30 నుంచి రాత్రి 10 గంటల వరకు భక్తిటీవీ కోటి దీపోత్సవం జరుగుతుంది.
- కేంద్రీయ విద్యాలయ సంఘటన్ ఆధ్వర్యంలో తిరుమలగిరిలోని కేంద్రీయ విద్యాలయంలో ఉదయం 10 గంటలకు నేషనల్ లెవెల్ రాష్ట్రీయ ఏక్తా పర్వ్ కార్యక్రమం జరుగుతుంది.
- కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివాల్యుయేషన్, అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్ నెం.3 లోని కాలేజీ క్యాంపస్‌లో క్లైమేట్ ఛేంజ్‌పై సదస్సు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

కోటి దీపోత్సవానికి ప్రత్యేక బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: ఎన్టీఆర్ స్టేడియంలో మొదలైన కోటి దీపోత్సవాలకు హాజరయ్యే భక్తుల కోసం వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. మియాపూర్, జేఎస్‌టీయూ, కూకట్‌పల్లి, ఉప్పల్, కోఠి, సికింద్రాబాద్, ఈసీఐఎల్, మెహిదీపట్నం తదితర ప్రాంతాల నుంచి ఈ బస్సులు రాకపోకలు సాగించనున్నాయి. ఈ నెల 25వ తేదీ వరకు ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు పేర్కొన్నారు. ప్రతిరోజు సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రత్యేక బస్సుల పూర్తి వివరాలు, సమాచారం కోసం కోఠి, రేతిఫైల్‌లోని ఆర్టీసీ సహాయకేంద్రాలను సంప్రదించవచ్చు. సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు 99592 26160(కోఠి), 99592 26154(రేతిఫైల్).

వైభవంగా రాజరాజేశ్వర స్వామి కళ్యాణం

హాజరైన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభినంద్‌కుమార్ శావిలీ


రాజరాజేశ్వరి కళ్యాణంలో పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభినంద్‌కుమార్ శావిలీ

కవాడిగూడ: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఎన్‌టీఆర్ స్టేడియంలో భక్తి టీవీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోటి దీపోత్సవం ఆదివారం రెండోరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అత్యంత వైభవోపేతంగా వేములవాడ శ్రీరాజరాజేశ్వరిస్వామి కళ్యాణం నిర్వహించారు. అనంతరం పార్వతీ పరమేశ్వరులను పల్లకీపై కోటిదీపోత్సవ ప్రాంగణంలో ఊరేగించారు. ఈ సందర్భంగా కుర్తాలం శ్రీ సిద్దేశ్వరీ పీఠం సిద్ధేశ్వానంద భారతీస్వామి అనుగ్రహభాషణం చేయగా, శ్రీ నండూరి శ్రీనివాస్ ప్రవచనామృతం వినిపించారు. శివనామస్మరణతో ఎన్‌టీఆర్ స్టేడియం అంతా ఆధ్యాత్మికత శోభను సంతరించుకుంది.

ఏఐడీఆర్‌ఎం మహాసభల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కూనంనేని సాంబశివరావు, చాడ వెంకట్‌రెడ్డి

కాచిగూడ: అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం(ఏఐడీఆర్‌ఎం) 2వ జాతీయ మహాసభల పోస్టర్‌ను ఆదివారం హిమాయత్‌నగర్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, బాలనరసింహలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ సమైక్యత, సమగ్రతల కోసం లౌకిక విలువల కోసం నేటి యువతరం కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం మౌలిక పునాదులుగా ఉన్న ప్రజాస్వామ్యం, ఫెడరలిజం, సామాజిక న్యాయం, లౌకితత్వం నాలుగు మూల స్తంభాలను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దళిత హక్కుల ఉద్యమం రాష్ట్ర అధ్యక్షుడు కె.ఏసురత్నం, మారుపాక అనిల్ కుమార్, జె.కుమార్, ఏ.రాజ్‌కుమార్, సిహెచ్ శ్రీనివాస్, ఉమా మహేష్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అపర్ణా నియోమాల్ షాపింగ్ ఫెస్టివల్


విజేతలకు బహుమతులు అందించే కార్యక్రమంలో నిర్వాహకులు

శేరిలింగంపల్లి: నల్లగండ్లలో ప్రముఖ రియల్ ఎస్టేట్‌సంస్థ అపర్ణా కన్‌స్ట్రక్షన్ అండ్ ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో అపర్ణా నియోమాల్‌లో నెలరోజుల బహుమతి పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారంరాత్రి నిర్వహించారు. నెలరోజులపాటు సాగిన ఈ లక్కీడ్రా ముగింపు కార్యక్రమంలో 16 మంది విజేతలకు ప్రత్యేక బహుమతులు అందించారు. రూ.4,999 లేదా అంతకంటే ఎక్కువ కొనుగోళ్లు చేసినవారు బహుమతుల్లో టీవీఎస్ అపాచి ఆర్‌ఆర్ 310 మోటార్‌సైకిల్ కూడా ఉన్నాయి. ఆటోమొబైల్ భాగస్వామి అభినవ్ టీవీఎస్ ఎలక్ట్రానిక్ భాగస్వామి, క్రోమా నుంచి ప్రీమియం ఎలక్ట్రానిక్స్‌తో అనుబంధంతో వాషింగ్ మెషీన్, రిఫ్రిజిరేటర్, లెడ్ టీవీ, వాటర్ ప్యూరిఫైయర్, ఎయిర్‌ఫ్రైయర్ ఇతర ఉపకరణాల వంటివి విలాసవంతమైన గడియారాలు బహుమతిగా ఇచ్చే భాగస్వామి కమల్ వాచ్‌కో గొప్ప బహుమతి టీవీఎస్ అపాచి ఆర్‌ఆర్ 310 అందించబడింది. విజేతలను అపర్ణా నియో సెంటర్ హెడ్ సునీల్ ద్వివేది సత్కరించారు. ఈ కార్యక్రమంలో నియోమాల్ ఇన్‌చార్జీ సునీల్, ఇతర ఉద్యోగులు, వినియోగదారులు పాల్గొన్నారు.

ఏఐ గ్లోబల్ కేంద్రంగా హైదరాబాద్

టీహబ్‌లో సీఏఐఆర్‌ఎల్ ప్రారంభ కార్యక్రమంలో జయేశ్ రంజన్


టీహబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

రాయదుర్గం: హైదరాబాద్ నగరాన్ని ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, పరిశ్రమల గ్లోబల్ కేంద్రంగా మార్చడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ అన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో సమన్విత కృత్రిమ మేధస్సు పరిశోధనా ప్రయోగశాలల ఫౌండేషన్(సీఏఐఆర్‌ఎల్)ను ఆన్‌లైన్ కార్యక్రమం ద్వారా ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఏఐ ఆధారిత స్టార్టప్‌లు, బాధ్యతాయుత ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అభివృద్ధి, ఆవిష్కరణలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని అన్నారు. విద్యా, పరిశ్రమలు, ప్రభుత్వం మధ్య సమన్వయాన్ని కుదుర్చుకోవడమే సీఏఐఆర్‌ఎల్ లక్ష్యంగా పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం జరిగిన చర్చా కార్యక్రమంలో కొలబెర్రీ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ రామమోహన్ మనమసా సీఏఐఆర్‌ఎల్ లక్ష్యాలను వివరించగా, కొలబెర్రీ ఇంక్ యూఎస్‌ఏ వ్యవస్థాపకుడు, సీఈఓ రామ్ కాటమరాజా ఏఐ పరిశోధన, పరిసరాలు, భారత్‌లో సీఏఐఆర్‌ఎల్ ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం పరిశ్రమలు, సమాజంలో కృత్రిమ మేధస్సు భవిష్యత్తు అనే అంశంపై ప్యానల్ చర్చకు ఎలాంకో డైరెక్టర్ రియు క్లినికల్ డెవలప్‌మెంట్ నిపుణుడు డాక్టర్ సూరజ్ బన్సాలీ సమన్వయం చేశారు. ప్యానల్ చర్చలో ఐటీ గురు, కేఎంఐటీ అండ్ ఎన్‌జీఐటీ ఇంజనీరింగ్ కాలేజీల చైర్మన్ నీలగొర్తి, ఫాబా సెక్రెటరీ జనరల్ డాక్టర్ రత్నాకర్, ప్రొఫెసర్ రెడ్డన్న, అగ్రి ఇన్నోవేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ దునిశాల పాల్గొన్నారు.

తెలంగాణ డ్రగ్స్ ఫ్రీ 2కే రన్ పోస్టర్ ఆవిష్కరణ


గచ్చిబౌలిలో 2కే రన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వేంరెడ్డి నరేందర్‌రెడ్డి

రాయదుర్గం: తెలంగాణ విద్యాసమితి ఆధ్వర్యంలో డిసెంబర్ 21న నిర్వహించే తెలంగాణ డ్రగ్స్ ఫ్రీ 2కేరన్ కార్యక్రమం పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. నగరంలోని నెక్లెస్ రోడ్డులో రన్ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమం పోస్టర్‌ను గచ్చిబౌలిలోని రోలింగ్ హిల్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యసలహాదారు వేంరెడ్డి నరేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు పెండెం తారక్‌గౌడ్, అందె రవికుమార్, లయన్స్‌క్లబ్ మెంబర్స్ కెరీర్ అశోక్‌నాయుడు, రమేష్ బెల్లంకొండ, రామ్‌ప్రసాద్, భరత్ దాచేపల్లి, రామ్‌గౌడ్, ప్రిన్సిపల్ సుజాతా హరికృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తా: నీలిమ


మల్లికార్జునఖర్గే బహిరంగ సభలో వేదికపై కోట నీలిమ

సనత్‌నగర్: ఏఐసీసీ తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. మహారాష్ట్రలోని అమరావతి పార్లమెంట్ నియోజకవర్గ ఏఐసీసీ పరిశీలకురాలిగా ఆమె నియమితులైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఆమె చురుకుగా పాల్గొంటున్నారు. అమరావతి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని తియోసా అసెంబ్లీ సెగ్మెంట్‌లో జరిగిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బహిరంగ సభకు ఆమె హాజరయ్యారు. ఈ సభ ఏర్పాట్లను ఆమె పర్యవేక్షించడంతోపాటు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన పార్టీ వ్యూహాలు, చేపట్టే కార్యక్రమాలు, పరిస్థితులపై కూలంకషంగా వివరించారు. మహారాష్ట్ర ఎన్నికల్లో ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని నీలిమ అన్నారు.

బీసీలకు జరిగే అన్యాయాలపై రెడ్‌బుక్

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం



కాచిగూడ: బీసీలకు జరుగుతున్న అన్యాయాలపై జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు రెడ్‌బుక్ రాస్తున్నామని ఆ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అన్నారు. బీసీల సమస్యలను విస్మరిస్తున్న పార్టీలను, బీసీల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తున్న అధికారుల వివరాలు, బీసీలపై అన్యాయంగా దాడులకు పాల్పడుతున్న సమాచారాన్ని రెడ్‌బుక్‌లో రాస్తున్నామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎప్పటికైనా బీసీలు రాజ్యాధికారంలోకి వస్తారని, అధికారంలోకి రాగానే బీసీలకు అన్యాయం చేసిన, చేస్తున్నవారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. బీసీ యువజన, విద్యార్థి, మహిళా సంఘాలు కూడా రెడ్‌బుక్ రాయాలని సూచిస్తున్నామని తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు ఆదివారం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. హైదరాబాద్ మణికొండకు చెందిన సట్లూరి కావ్య, రాఘవేంద్ర అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసి ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళాన్ని అందచేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించగా, వేదపండితులు ఆశీర్వచనం అందచేశారు. అనంతరం దాతలకు ఆలయ ఈవో కెఎస్ రామారావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.


దాతలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు

మురిసిన ముక్తినూతలపాడు

మోడల్ కాలనీలో ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో ముక్తినూతలపాటి వారి కుటుంబసభ్యులు

సనత్‌నగర్: ముక్తినూతలపాడు.. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా ఒంగోలు సమీపంలో ఉన్న ఓ గ్రామం. ఆ ఊరు పేరే వారి ఇంటి పేరు కూడా. ఒకరు, ఇద్దరు కాదు.. 200 మందికిపైగా ముక్తినూతలపాటి కుటుంబసభ్యులు ఒకచోట చేరి సందడి చేశారు. తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడెక్కడో స్థిరపడ్డ కుటుంబీలను ఆత్మీయసమ్మేళనం పేరిట కలుసుకుని ఆత్మీయానురాగాలను పంచుకున్నారు. ఇందుకు సనత్‌నగర్ ప్రాంతంలోని మోడల్ కాలనీ ‘సంస్కృతి’క మ్యూనిటీ హాల్ వేదికైంది. ముక్తినూతనపాటి వారి కుటుంబసభ్యులు సందడి చేశారు. అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. వయస్సును మరిచి ఆటపాటలతో హుషారెత్తించారు. మోడల్ కాలనీ ఉపాధ్యక్షుడు, జీహెచ్‌ఎంసీ ఆసరా కమిటీ ఖైరతాబాద్ సర్కిల్ ఉపాధ్యక్షుడు, ముక్తినూతలపాడుకు చెందిన జేఎస్‌టీ సాయి ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనానికి 92 ఏళ్ల వృద్ధులు మొదలు చిన్నపిల్లలు, పసిపాపల వరకు మొత్తం 200 మంది హాజరై ఆద్యంతం ఉల్లాసభరితంగా, ఉత్సాహంగా గడిపారు.

ఇష్టకామేశ్వరి అమ్మవారి పూజతో మొదలై..

మొదటగా ఇష్టకామేశ్వరి అమ్మవారి పూజతో ప్రారంభమైన సమ్మేళనం గ్రామానికి చెందిన ప్రముఖులు, పెద్దల ప్రసంగాలు, సంప్రదాయ నృత్య ప్రదర్శనలు, అన్నమయ్య, త్యాగరాజు, భక్తరామదాసు కీర్తనల ఆలాపనతో మైమరిచిపోయారు. చిన్నారులకు వివిధ రకాల పోటీలు, బహుమతుల ప్రదానోత్సవం..ఇలా ఒక్కటేమిటీ అనేక కార్యక్రమాలతో సంబరంగా సమ్మేళనాన్ని నిర్వహించారు. సీనియర్ సిటిజన్స్‌ను ఆత్మీయ సత్కారం చేశారు. మధ్యాహ్నం మనసారా కబుర్లు చెప్పుకుంటూ కలిసి భోజనాలు చేశారు. సాయంత్రం వరకు ఆనందంగా గడిపిన గ్రామస్తులు ఆత్మీయ సమ్మేళనం పంచిన మధుర జ్ఞాపకాలతో తిరుగు పయనమయ్యారు. ముక్తినూతనపాడుకు చెందిన రామకృష్ణ, ఉమామహేశ్వర ప్రసాద్, భుజంగరావు, మారుతీ సుబ్రమణ్యం, విశ్వేశ్వర్‌రావు, గిరిజ, జయలక్ష్మీ తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, సోమవారం, 11, నవంబర్, 2024



బాల్య శుక్లాలపై నిర్లక్ష్యం వద్దు..

ఉత్సాహంగా అవగాహన వాక్..

హాజరైన సంగీత దర్శకుడు తమన్, నటుడు విశ్వకార్తికేయ

బంజారాహిల్స్: ఎల్వీప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి 14వ తేదీ వరకూ నిర్వహించే బాలల నేత్ర సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం అవగాహనా వాక్‌ను నిర్వహించారు. 'బాల్య శుక్లాలు-పిల్లల చూపుపై వాటి ప్రభావం-త్వరిత గుర్తింపు-చికిత్స ప్రాధాన్యత' థీమ్‌తో ఈ వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కల్లం అంజిరెడ్డి ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన వాక్‌ను సినీ సంగీత దర్శకుడు తమన్ ఎస్, నటుడు విశ్వ కార్తికేయలు ప్రారంభించారు. దాదాపు 300 మంది చిన్నారులు, వారి తల్లిదండ్రులు ప్లకార్డులు చేతబూని బాల్య శుక్లాలపై అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా తమన్ మాట్లాడుతూ ఈ వాక్‌లో పాల్గొనడం తనకెంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. అయితే పిల్లల కంటి సమస్యలను త్వరితగతిన గుర్తించగలిగితే వారి సమస్యలను దూరం చేయవచ్చని, ఆ దిశగా తల్లిదండ్రులు అవగాహన పొందాలని కోరారు. ఎల్వీ ప్రసాద్ చైల్డ్ సైట్ ఇన్‌స్టిట్యూట్ అధిపతి డాక్టర్ రమేష్ కెకున్నయ్య మాట్లాడుతూ రోగ నిర్ధారణను త్వరితగతిన గుర్తించి చికిత్స అందించడం ద్వారా అత్యుత్తమ ఫలితాలు ఉంటాయన్నారు. బాల్య కంటి శుక్లం చికిత్స చేయకుండా వదిలేస్తే, చివరకు పునరుద్ధరించలేని విధంగా హాని చేయవచ్చన్నారు. ఈ నెల 14 వరకూ ఎల్వీప్రసాద్ ఆస్పత్రి ఆవరణలో చిత్రలేఖనం, ఫ్యాన్సీ డ్రెస్, వక్తృత్వ, క్లే మౌల్డింగ్, బ్రెయిలీ చదవడం, పోటరీ సెషన్లు నిర్వహించి బాలల దినోత్సవం రోజున బహుమతులు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



కళింగలో పట్టు ప్రదర్శన..

చేనేతను ప్రతి ఒక్కరూ ఆదరించాలన్న సాత్విక గుప్తా



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 కళింగ కల్చరల్ హాలు వేదికగా ప్రతిష్టాత్మక 'జాతీయ పట్టు వస్త్ర ప్రదర్శన' ఆదివారం ప్రారంభమైంది. ఈ ప్రదర్శనను రాష్ట్రీయ గౌరవ్ అవార్డ్స్ ఫౌండర్, ఆక్యుపేషనల్ హెల్త్ ఎన్విరాన్మెంటల్ సేఫ్టీ ఆఫీసర్ సాత్విక గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కళింగ కల్చరల్ హాలులో కొలువుదీరిన చేనేత కారులు వస్త్రోత్పత్తులు మన సాంస్కృతిక వైభవానికి నిదర్శనంగా నిలుస్తున్నాయని తెలిపారు. భారతీయ సంస్కృతిలో పట్టు, హ్యాండ్లూమ్స్ వస్త్రోత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందని సాత్విక గుప్తా అన్నారు. ఈ సందర్భంగా చేనేత కారులతో వాటి తయారీ విధానం, ప్రత్యేకత గురించి తెలుసుకున్నారు. అనంతరం జాతీయ పట్టు వస్త్ర ప్రదర్శన నిర్వాహకులు జయేష్ గుప్తా మాట్లాడుతూ.. ఈ నెల 17 వరకూ కొనసాగుతున్న ప్రదర్శనలో దేశంలోని 14 రాష్ట్రాలకు చెందిన చేనేత కారులు, చేతిపని బృందాలు తమ సిల్క్, హ్యాండ్లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్స్ వంటి 75 వేల రకాల ఉత్పత్తులను అందుబాటులో ఉంచారని వివరించారు.



నూతనోత్సాహంతో గుర్తింపు..

క్రీడలో రాణించాలనే తపనకు నూతనోత్సాహాన్ని, అంతకు మించిన గుర్తింపును తెస్తున్నారు. ఇందులో భాగంగానే సెయిలింగ్‌లో ఎంతో శ్రమించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాను. వైఏఐ జూనియర్ నేషనల్స్ 2022 ఆప్టిమిస్టిక్ బాలికల విభాగంలో కాంస్యం, మాన్‌సూన్ రేగట్టా 2023 ఇదే విభాగంలో బంగారు పతకంతో వివిధ జాతీయ స్థాయి పోటీల్లో పతకాలను సాధించాను. పీవీ సింధూ, సానియా మీర్జాలాగే నేను అంతర్జాతీయ స్థాయి పతకాలను సాధించి దేశానికి, నగరానికి గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో ఉన్నాను.

– దీక్షిత, కొమురవెల్లి

హైదరాబాద్ అంటే బిర్యానీ, బాహుబలి, బ్యాడ్మింటన్..!! గతంలో అప్పటి రాష్ట్రపతి నగరానికి విచ్చేసిన సందర్భంలో అన్న మాటలివి. అంటే నగరంలో అంతర్జాతీయ క్రీడలు అంతటి ప్రశస్తిని సాధించుకున్నాయి. బ్యాడ్మింటన్ మాత్రమే కాదు హాకీ, టెన్నిస్, క్రికెట్, చెస్, రన్నింగ్ ఈ మధ్య కాలంలో రెజ్లింగ్ వంటి విభిన్న క్రీడాంశాల్లో హైదరాబాద్ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించారు. అనాదిగా కొనసాగుతున్న ఈ ఆనవాయితీని ప్రస్తుత తరం క్రీడాకారులు కూడా కొనసాగిస్తున్నారు. ఇప్పటికే గుర్తింపు పొందిన క్రీడల్లోనే కాకుండా తమకంటూ ప్రత్యేక గుర్తింపును పొందేందుకు వినూత్న క్రీడలు, అథ్లెటిక్స్‌ను ఎంచుకుని ఆయా విభాగాల్లో రాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో భవిష్యత్తు తరం దృష్టి సారించిన క్రీడలు, అందులోని ప్రత్యేకతలను ఓసారి తెలుసుకుందామా..!!

– సాక్షి, సిటీబ్యూరో

హైదరాబాద్ వైబ్స్



వ్యాలీ ఆఫ్ స్పోర్ట్స్..

అంతర్జాతీయ క్రీడలకు అడ్డాగా హైదరాబాద్

- ఇప్పటికే క్రికెట్, బ్యాడ్మింటన్, టెన్నిస్ వంటి క్రీడల్లో గ్లోబల్ మెడల్స్
- ఆర్చరీ, స్కేటింగ్, సెయిలింగ్ వంటి క్రీడాంశాలపై దృష్టి సారించిన ఈ తరం
- ఒలింపిక్సే లక్ష్యంగా శిక్షణ, వినూత్న క్రీడాంశాలే ఆకర్షణ

అంతర్జాతీయ క్రీడలకు హైదరాబాద్ నగరానికి ఆనాటి నుంచే అవినాభావ సంబంధముంది. దేశ ఖ్యాతిని ప్రపంచదేశాల సరసన అగ్ర స్థానంలో నిలబెట్టిన హైదరాబాదీయులు, ఇక్కడ శిక్షణ పొందిన క్రీడాకారులు ఎందరో ఉన్నారు. క్రికెట్‌లో అజహరుద్దీన్, వెంకటపతిరాజు, వీవీఎస్ లక్ష్మణ్, మిథాలీరాజ్ ప్రస్తుతం మహ్మద్ సిరాజ్, టెన్నిస్‌లో సానియా మీర్జా, బ్యాడ్మింటన్‌లో పీవీ సింధూ, సైనా నేహ్వాల్, రన్నింగ్‌లో పీటీ ఉష, చెస్‌లో ద్రోణవల్లి హారిక, రెజ్లింగ్‌లో నిఖత్ జరీనా ఇలా ఒక్కొక్కరూ ఒక్కో క్రీడలో అత్యుత్తమ నైపుణ్యాలను కనబర్చి ఆయా క్రీడాంశాల్లో భారత్‌కు అంతర్జాతీయ స్థాయి గుర్తింపును తీసుకొచ్చారు. అదే విధంగా వ్యక్తిగతంగానూ చరిత్రలో తమకంటూ కొన్ని పేజీలను రాసుకుని భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలిచారు. ఇదే తరహాలో ఈ తరం క్రీడాకారులు ఇప్పటికే గుర్తింపు పొందిన క్రీడలు కాకుండా వినూత్నంగా ఎంపిక చేసుకుని ఒలింపిక్స్ స్థాయిలో క్రీడా నైపుణ్యాలను కనబరుస్తున్నారు.

సెయిలింగ్ టాప్.. స్కేటింగ్ రాక్..

ప్రస్తుత తరం.. హైదరాబాదీ క్రీడాకారులు ఆర్చరీపై ప్రత్యేక దృష్టి సారించారు. నగరం వేదికగా ఈ వారసత్వ క్రీడపై పలువురు ఆసక్తి కనబరుస్తున్నారు. అంతేకాకుండా ఈ సారి జరిగిన ఒలింపిక్స్‌లో తెలుగు కుర్రాడు ధీరజ్ ఆర్చరీలో నాలుగో స్థానంలో నిలిచి భవిష్యత్ ఆర్చరీని శాసించేది మేమేనని హింట్ ఇచ్చాడు. నగరం వేదికగా 150 మంది ఆర్చరీ అథ్లెట్లు ఉన్నారని ఓ అంచనా. జాతీయ స్థాయిలో హైదరాబాద్ ఆర్చరీ టీం ద్వితీయ స్థానంలో ఉందని క్రీడారంగ నిపుణులు పేర్కొన్నారు. 2028 ఒలింపిక్సే లక్ష్యంగా ఈ క్రీడాకారులు సన్నద్ధమవుతున్నారు.

నా విద్యార్థులే నిదర్శనం..

రానున్న కాలంలో ఆర్చరీలో హైదరాబాద్ క్రీడాకారులు టాప్‌లో ఉంటారనడంలో ఎలాంటి సందేహం లేదు. దీనికి నిదర్శనం నా విద్యార్థులే.. నా వద్ద శిక్షణ పొందుతున్న విద్యార్థులు జాతీయ స్థాయిలో టాప్ 2లో ఉన్నారు. 2028 ఒలింపిక్సే లక్ష్యంగా ఇద్దరు అమ్మాయిలు, ముగ్గురు అబ్బాయిలను సన్నద్ధం చేస్తున్నాను.

– రాజు, ప్రముఖ కోచ్, ఆర్చరీ నేషనల్ చాంపియన్

రోయింగ్‌లోనూ రాణిస్తూ..

ఇదే కోవలో రోయింగ్ కూడా రాణిస్తుంది. రోయింగ్ క్రీడాకారులు జాతీయ స్థాయిలో తమ సత్తా చాటుతున్నారు. అంతాగా ప్రచారంలోకి రాకపోయినప్పటికీ.. స్కేటింగ్‌లో కూడా హైదరాబాదీలు అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్ సాధిస్తున్నారు. వీటితో పాటు రైఫిల్ షూటింగ్‌లో కూడా నగరవాసులు గురి పెట్టారు. ఇప్పటికే నేషనల్స్‌లో పతకాలు సాధించడమే కాకుండా గ్లోబల్ వేదికపై మరోసారి గురి చూసి షూట్ చేయడానికి సన్నద్ధమౌతున్నారు. మరో వైపు స్విమ్మింగ్‌లోనూ మనం ముందంజలో ఉన్నాం. గత ఐదేళ్లలో నగరానికి చెందిన స్విమ్మర్లు జాతీయ స్థాయిలో పతకాల పంట పండిస్తున్నారు. అయితే వినూత్నంగా పికిల్ బాల్ వంటి సరికొత్త క్రీడలను నగరవాసులు తెరపైకి తీసుకొస్తున్నారు.

సెయిలింగ్‌లోనూ..

దీంతో పాటు సెయిలింగ్‌లోనూ హైదరాబాద్ భవిష్యత్ ఆశాకిరణంగా కనిపిస్తుంది. ఈ ఏడాది నేషనల్స్‌లో హైదరాబాదీ సెయిలర్స్ గోవర్ధన్, దీక్షిత కొమురవెల్లి వంటి సెయిలర్స్ టాప్-1లో కొనసాగుతుండటం విశేషం. అంతేకాకుండా ప్రీతీ కొంగర వంటి నావికులు ఒలింపిక్సే లక్ష్యంగా శిక్షణ పొందుతున్నారు.



సహజ సిద్ధంగా లభించే వెదురుతో తయారు చేసిన బ్రష్‌లు ఎప్పుడైనా చూశారా.. వినడానికి కాస్త కొత్తగా అనిపించినా ఈ రకం బ్రష్‌లు చాలా కాలంగా వినియోగంలో ఉన్నాయి. ఉదయం లేచి ప్లాస్టిక్‌తో తయారైన బ్రష్‌లు వినియోగిస్తున్నంతగా వెదురు బ్రష్‌లకు ప్రచారం లభించలేదు. అయితే గత కొన్నేళ్లుగా ప్రకృతి ప్రేమికులు మాత్రం ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించేందుకు వెదురు బ్రష్‌ల పట్ల అవగాహన కల్పిస్తున్నారు. ప్లాస్టిక్ బ్రష్‌ల స్థానంలో వెదురు వస్తువులను అందుబాటులోకి తెస్తున్నారు. పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, తదితర ప్రదేశాల్లో తమవంతు కృషి చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఇప్పటి వరకూ సుమారు 30 వేల మంది ఇలా ప్లాస్టిక్ నుంచి వెదురు బ్రష్‌లకు మారినట్లు పేర్కొంటున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

వెదురుకు మారదాం బ్రదర్..

ప్లాస్టిక్ బ్రష్‌లకు ప్రత్యామ్నాయంగా..

మూడేళ్లుగా అవగాహనా కార్యక్రమాలు

నగరంలో విరివిగా 'విశ్వ' ఎక్స్‌చేంజ్ స్టాల్స్

30 వేల మందిలో మార్పుకు దోహదం

నగరంలోని కేబీఆర్ పార్కు, యూసఫ్‌గూడ, కృష్ణకాంత్ పార్కు, మన్సూరాబాద్ పెద్దచెరువు, పీర్జాగూడ, భాగ్యనగర్ నందనవనం పార్కు తదితర ప్రదేశాల్లో విశ్వ సస్టైనబుల్ ఫౌండేషన్ సభ్యులు వెదురు బ్రష్‌ల వినియోగం గురించి అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాకుండా ఎక్స్‌చేంజ్ కార్యక్రమంలో సేకరించిన ప్లాస్టిక్ బ్రష్‌లను విశాఖలోని రివర్స్ ఇంజినీరింగ్ ప్లాంట్‌కు తరలించి, పెట్రోల్, డీజిల్, కిరోసిన్ తయారీకి వినియోగిస్తారని నిర్వాహకులు చెబుతున్నారు. ప్రతి శనివారం, ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకూ ఈ టూత్ బ్రష్‌ల ఎక్స్‌చేంజ్ కార్యక్రమం ఉంటుంది. హైదరాబాద్‌తో పాటు బెంగళూరులోనూ ఈ తరహా కార్యక్రమాలను చేపడుతున్నారు. మనమూ ఈ తరహా వెదురు బ్రష్‌లను ట్రై చేద్దామా..



సామాజిక బాధ్యతగానే..

బ్రష్ అనేది నిత్యం ప్రతి ఒక్కరూ వినియోగించే వస్తువు. అయితే మార్కెట్‌లో ఎక్కువగా ప్లాస్టిక్‌తో తయారు చేసినవి ప్రాచుర్యంలో ఉన్నాయి. ఫలితంగా ఎలాంటి దుష్ప్రభావాలు ఉన్నాయి, వాటి స్థానంలో ప్రత్యామ్నాయంగా ఏం చేయాలనేది చెప్పే ప్రయత్నం చేస్తున్నాం. ప్రతి రెండు నెలలకు ఒక బ్రష్ పడేసినా కోట్ల బ్రష్‌లు వ్యర్థాల్లో కలిసిపోతున్నాయి. వాటిని నియంత్రించాలన్నదే మా ఆలోచన. మేం వ్యాపార ధోరణితో కాకుండా సామాజిక బాధ్యతగా ఈ ప్రమోషన్ వర్క్ చేస్తున్నాం. శనివారం కేబీఆర్ పార్కు దగ్గర ఏర్పాటు చేసిన స్టాల్‌కు వాకర్స్ వచ్చి విషయం అడిగి తెలుసుకున్నారు. చాలా మంది మేమూ మారతాం అంటున్నారు. బ్రష్‌లను తీసుకుంటున్నారు.

– అనూప్‌కుమార్, వాలంటీర్, విశ్వ సస్టైనబుల్ ఫౌండేషన్



నెక్సిటీలో కోకో ది గ్రాండ్..!



నగరంలో లగ్జరీ రెస్టారెంట్ ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: ఫుడ్ హబ్‌గా పేరుగాంచిన భాగ్యనగరానికి మరో హాట్‌స్పాట్ వచ్చింది. ముంబైకి చెందిన ప్రఖ్యాత లగ్జరీ ఆసియా డైనింగ్ రెస్టారెంట్ 'కోకో' మన నగరంలో ప్రారంభమైంది. వినూత్న కాంటోనీస్, జపనీస్ వంటకాలు నగరవాసులను నోరూరించేందుకు సిద్ధమైంది. హైటెక్ సిటీలోని ఆర్ఎంజెడ్ నెక్సిటీ టవర్స్‌లో ఈ రెస్టారెంట్ ప్రారంభోత్సవానికి ప్రముఖ నటి పూజా బేడీ, ఐటీ శాఖ స్పెషల్ సెక్రటరీ జయేష్ రంజన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చైనీస్ ఇంటీరియర్ డిజైన్, ఆర్కిటెక్చర్‌తో అద్భుతమైన యాంబియెన్స్‌తో రెస్టారెంట్‌ను తీర్చిదిద్దారు. ప్రారంభోత్సవంలో డింపుల్ హయాతీ, హెబ్బా పటేల్, సిద్ధు జొన్నలగడ్డ, ఆదర్శ్ బాలకృష్ణ తదితరులు హాజరై సరికొత్త రుచులను ఆస్వాదించారు.



నేడు ఏపీ పూర్తి స్థాయి బడ్జెట్

కూటమి ఎన్నికల హామీలు, సూపర్ సిక్స్, రెడ్‌బుక్ అరాచకాలపై జనం ప్రశ్నిస్తుండటంతో డైవర్షన్ రాజకీయాలే లక్ష్యంగా అజెండా

సాక్షి, అమరావతి: సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా ప్రజల కళ్లుగప్పటం... రాష్ట్రంలో జరుగుతున్న అఘాయిత్యాలపై ఎవరూ ప్రశ్నించకుండా రెడ్‌బుక్ అమలుతో దృష్టి మళ్లింపు రాజకీయాలే లక్ష్యంగా సాగుతున్న సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు సోమవారం శాసనసభలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టనుంది. నేడు ఉదయం 9 గంటలకు అసెంబ్లీలోని సీఎం చాంబర్‌లో చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ సమావేశమై బడ్జెట్ ప్రతిపాదనలకు ఆమోదం తెలపనుంది. అనంతరం ఉదయం 10 గంటలకు అసెంబ్లీ, శాసన మండలి సమావేశాలు ప్రారంభమవుతాయి. శాసన సభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. అదే సమయానికి శాసన మండలిలో గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర బడ్జెట్‌ను చదువుతారు. అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టడం పూర్తి అయిన అనంతరం వ్యవసాయ బడ్జెట్‌ను ఆ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సభలో ప్రవేశపెడతారు. మండలిలో మంత్రి నారాయణ వ్యవసాయ బడ్జెట్‌ను చదువుతారు. సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చకుండా మభ్యపెడుతున్న కూటమి సర్కారు అసెంబ్లీ సమావేశాలను సైతం డైవర్షన్ రాజకీయాలకే వినియోగించుకోవాలని ఎత్తుగడ వేసినట్లు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలపై యథేచ్ఛగా జరుగుతున్న అఘాయిత్యాలు, లైంగిక దాడులు, హత్యలు, శాంతి భద్రతల వైఫల్యం నుంచి దృష్టి మళ్లించేందుకు.. ఇప్పుడే కొత్తగా సోషల్ మీడియాలో పోస్టులు వచ్చినట్లు, వాటిపైనే చర్చించాలనే వైఖరితో ప్రభుత్వం ఉందనే అభిప్రాయాన్ని అధికార వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. పలుచోట్ల మైనర్ బాలికలు అత్యాచారాలు, హత్యలకు గురి కావడం నుంచి దృష్టి మళ్లించడమే లక్ష్యంగా సోషల్ మీడియా పోస్టులపై ప్రభుత్వ పెద్దలు ఇటీవల గగ్గోలు పెడుతున్నారు. ఇదే అంశాన్ని అసెంబ్లీలో కూడా ప్రస్తావించాలని సన్నద్ధమైనట్లు సమాచారం. మరోపక్క సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి బడ్జెట్ సమావేశాల్లో గత సర్కారుపై ఆరోపణలు, నిందలు మోపేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేసినట్లు తెలుస్తోంది.

పోర్టులు, మెడికల్ కాలేజీలు అమ్మేస్తూ..

సీ–ప్లేన్‌తో నాటకాలా?

చంద్రబాబును నిలదీసిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్



వైఎస్ జగన్ హయాంలో నిర్మాణం చేపట్టి 35 శాతం పనులు పూర్తిచేసిన మచిలీపట్నం పోర్టు



65 శాతం పూర్తయిన రామయపట్నం పోర్టు

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.13,254.05 కోట్లతో మూడు పోర్టుల నిర్మాణం
- రూ.8,480 కోట్లతో అత్యాధునిక వైద్యం, కొత్తగా 17 మెడికల్ కాలేజీలు
- ఇదంతా అభివృద్ధి కాదా? సంపద సృష్టి కాదా?
- ఈ ఆస్తులు విలువ భవిష్యత్తులో రూ.లక్షల కోట్లు కాదా?



సాక్షి, అమరావతి : 'సీ ప్లేన్ నడిపితే రాష్ట్రాభివృద్ధి జరిగిపోయినట్లా?' అని సీఎం చంద్రబాబును వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలదీశారు. దేశంలో తొలిసారిగా సీ ప్లేన్ నడిపినట్టుగా చంద్రబాబు బిల్డప్ ఇస్తుండటం.. అందుకు ఎల్లో మీడియా డప్పు కొడుతుండటం చూస్తుంటే పిట్టల దొర డైలాగ్‌లు గుర్తుకొస్తున్నాయని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజల సంపదగా నిర్మిస్తూ సృష్టించిన మెడికల్ కాలేజీలు, పోర్టులను ప్రయివేటుపరం చేస్తూ, స్కాంలు చేస్తూ తన మనుషులకు తెగనమ్ముతూ.. వీటన్నింటిపై ప్రజల్లో చర్చ జరగకూడదనే సీ ప్లేన్‌తో అభివృద్ధి జరిగిపోయినట్లు పబ్లిసిటీ స్టంట్లు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ దుర్మార్గపు చర్యలను చివరకు ప్రజలు తప్పక నిలదీస్తారని, ఈ ప్రభుత్వాన్ని ఎండగడతారని హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆ పోస్టులో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..



వైఎస్ జగన్ హయాంలో నిర్మాణం చేపట్టి ప్రారంభించిన కొత్త మెడికల్ కాలేజీలు



20 శాతం పూర్తయిన మూలపేట పోర్టు

1 చంద్రబాబు గురించి చెప్పాలంటే.. మాయ చేస్తాడు, మభ్యపెడతాడు, చివరకు ప్రజలను మోసం చేస్తాడు. ఇందుకోసం ఎన్ని వేషాలు వేయాలో అన్ని వేషాలూ వేస్తాడు. తాజాగా విజయవాడ నుంచి శ్రీశైలం వరకూ సీ ప్లేన్ ద్వారా చేసిన పర్యటన ఇలాంటిదే. సెల్ ఫోన్ తానే కనిపెట్టానని, కంప్యూటర్లు కూడా తానే కనిపెట్టానని రెండు దశాబ్దాలుగా కబుర్లు చెబుతున్న చంద్రబాబు, ఇప్పుడు సీ ప్లేన్ మీద కూడా కహానీలు మొదలెట్టేశారు. దేశంలోనే తొలిసారి అన్నట్టుగా, మరెక్కడా లేదన్నట్టుగా, సీ ప్లేన్ నడిపితే చాలు రాష్ట్రాభివృద్ధి జరిగిపోయినట్లుగా బిల్డప్ ఇస్తున్నారు.

2 సీ ప్లేన్ అన్నది ఇప్పటిది కాదు. దాదాపు 114 ఏళ్ల క్రితమే 1910లో నడిచింది. మన దేశంలో కేరళలో 2013లో మొదలయ్యి తర్వాత నిలిపేశారు. గుజరాత్‌లో 2020లో సర్వీసులు నడవటం మొదలుపెట్టినా అవికూడా పలుమార్లు నిలిచిపోయాయి. ప్రతి రాష్ట్రంలోనూ అనేక రిజర్వాయర్లు, డ్యాంలు ఉన్నాయి. మరి ఎందుకు ఆయా రాష్ట్రాల్లో ఇలాంటి ప్రయోగాలు కొనసాగడం లేదు?

3 ఆపరేషన్స్‌లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సాంకేతిక సమస్యలు, ప్రయాణికుల భద్రతాపరమైన అంశాలతోపాటు నిర్వహణా భారం దీనికి ప్రధాన కారణాలని అనేక మీడియా సంస్థలు కథనాలను ప్రచురించాయి. ఇలాంటి 14 మంది ప్రయాణికుల సీ ప్లేన్ సర్వీసులను అభివృద్ధికి ఒక ప్రమాణంగా చంద్రబాబు గొప్పగా చెప్పుకోవడం, దాన్ని ఎల్లో మీడియా కీర్తించడం.. పరస్పరం డప్పాలు కొట్టుకోవడం కాదా?

4 సంపద సృష్టించడమంటే ప్రభుత్వ రంగంలో పోర్టులు నిర్మించి, తద్వారా అభివృద్ధి చేసి.. ప్రభుత్వానికి ఆదాయం కల్పించడం. ప్రభుత్వ రంగంలో మెడికల్ కాలేజీలు కట్టి, ప్రజలకు అందుబాటులో ఉచితంగా నాణ్యమైన, అత్యాధునిక వైద్యాన్ని అందించడం. ఇలాంటివి కాకుండా సీ ప్లేన్ మీద పబ్లిసిటీ స్టంట్లు ఏమిటి?

5 చంద్రబాబూ.. రూ.8,480 కోట్లతో ప్రభుత్వ రంగంలో, మారుమూల ప్రాంతాల్లో అత్యాధునిక వైద్యాన్ని అందుబాటులోకి తెస్తూ, తద్వారా మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రిని తీసుకొస్తూ, కొత్తగా 17 మెడికల్ కాలేజీలు కట్టడం సంపద సృష్టి అవుతుందా? లేక వాటిని ప్రయివేటు పరం పేరుతో మీ మనుషులకు స్కామ్‌లు చేస్తూ అమ్మాలనుకోవడం సంపద సృష్టి అవుతుందా?

6 సుదీర్ఘ తీర ప్రాంతాన్ని వినియోగించుకుని మెరుగైన వాణిజ్యాన్ని, రాష్ట్రానికి అదనపు ఆదాయాన్ని, ప్రజలకు ఉపాధిని, పారిశ్రామిక ప్రగతిని సాధించడానికి ప్రభుత్వ రంగంలో రూ.4,361.91 కోట్లతో మూలపేట, రూ.5,156 కోట్లతో మచిలీపట్నం, రూ.3,736.14 కోట్లతో రామాయపట్నం వద్ద.. మొత్తంగా మూడు పోర్టులను రూ.13,254.05 కోట్లతో నిర్మిస్తే దాన్ని అభివృద్ధి, సంపద సృష్టి అంటారా? లేక సీ ప్లేన్‌లో తిరిగి ఈ పోర్టుల ఆస్తులను మీ వారికి స్కామ్‌ల ద్వారా తెగనమ్మితే దాన్ని అభివృద్ధి, సంపద సృష్టి అంటారా? ప్రభుత్వ రంగ పోర్టుల వల్ల రాష్ట్రానికి ఆదాయం పెరుగుతుందా? లేక ఈ సంపద సృష్టించే వనరులను తెగనమ్మడంతో పాటు, సీ ప్లేన్స్ వల్ల రాష్ట్రానికి సంపద పెరుగుతుందా?

7 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, పోర్టుల రూపేణా మొత్తంగా రూ.21,734 కోట్ల పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రజల ఆస్తి కాదా? ప్రజల కోసం సృష్టించిన సంపద కాదా చంద్రబాబూ? రాష్ట్ర చరిత్రలో ప్రభుత్వ రంగంలో ఇన్ని పెట్టుబడులు ఎప్పుడైనా పెట్టారా? మా హయాంలో నిర్మాణాలు జరుపుకున్న కాలేజీలు, పోర్టులన్నీ కూడా ప్రత్యక్ష సాక్ష్యాలుగా ఇవాళ రాష్ట్ర ప్రజల కళ్ల ముందు లేవా? ఇవన్నీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సృష్టించిన సంపద కాదా? ఈ ఆస్తులు విలువ భవిష్యత్తులో రూ.లక్షల కోట్లు కాదా? ఇదంతా అభివృద్ధి కాదా?

8 చంద్రబాబూ.. మీరు, మీ పార్టీ నాయకుల అభివృద్ధే రాష్ట్రాభివృద్ధిగా.. మీరు, మీమనుషులు ఆస్తులు కూడబెడితే అది ప్రజల కోసం సృష్టించిన సంపదగా చెప్పుకుంటారు. మీ దృష్టిలో అభివృద్ధి, సంపద సృష్టి అంటే ఇదే. మీ పబ్లిసిటీ విన్యాసాలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. ప్రభుత్వ రంగంలో మంచి స్కూల్స్ లేకుండా చేసి, మంచి వైద్యాన్ని అందించే మెడికల్ కాలేజీలు లేకుండా చేసి, మంచి పోర్టులు లేకుండా చేసి, చివరకు ప్రజల ఆస్తులను వారికి కాకుండా చేసే దుర్మార్గపు చర్యలను ప్రజలు తప్పక నిలదీస్తారు. ఈ ప్రభుత్వాన్ని ఎండగడతారు.



సాయిబాబా స్మారక సభలో మురళీధరన్, మనోరంజన్ మహంతి, నందితా నారాయణ్, వసంత, నందినీ సుందర్, ప్రశాంత్ భూషణ్

పోలీసులే జవాబుదారీగా కమిషన్ ఏర్పాటు చేయాలి

- ఢిల్లీలో జీఎన్ సాయిబాబా సంస్మరణ సభలో సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్
- జైళ్లు టార్చర్ సెల్స్‌గా మారాయంటూ సాయిబాబా భార్య వసంత ఆవేదన

సాక్షి, న్యూఢిల్లీ: ''ప్రొఫెసర్ సాయిబాబా పదేళ్లపాటు జైలు జీవితం అనుభవించారు. ఆయన ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. దానికి బాధ్యులెవరు? అందుకే.. పోలీసులను జవాబుదారీగా చేస్తూ ఒక కమిషన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది'' అని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ చెప్పారు. ఆదివారం ఢిల్లీలోని జవహర్‌భవన్‌లో ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా స్మారక సభ నిర్వహించారు. ఈ సభకు సాయిబాబా సతీమణి వసంతతోపాటు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్, ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ నందినీ సుందర్, ప్రముఖ రచయిత్రి అరుంధతి రాయ్, ఢిల్లీ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (డీయూటీఏ) మాజీ అధ్యక్షురాలు నందితా నారాయణ్, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్ పీఆర్ డీ) ప్రధాన కార్యదర్శి మురళీధరన్, ప్రొఫెసర్ మనోరంజన్ మహంతి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ.. సాయిబాబా జీవితం మానవతావాదానికి నిదర్శనమన్నారు. సాయిబాబా మృతికి న్యాయవ్యవస్థ, మహారాష్ట్ర ప్రభుత్వం, పోలీసులే కారణమని ఆరోపించారు. న్యాయవ్యవస్థ, పోలీసులు వ్యవహరించిన తీరుతోనే ఆయన న్యాయం కోసం సుప్రీంకోర్టు గడపతొక్కాల్సి వచ్చిందని పేర్కొన్నారు. భీమా కోరేగావ్ వంటి అనేక కేసుల్లో చాలా మంది ఎక్కువ కాలం జైలులో ఉన్న తర్వాత నిర్దోషులుగా విడుదల అవుతున్నారని గుర్తు చేశారు. ఈ క్రమంలో పోలీసులను జవాబుదారీ చేస్తూ కమిషన్ ఏర్పాటు చేయాలని.. సుదీర్ఘకాలం జైలులో ఉన్నవారు నిర్దోషులుగా తేలితే సంబంధిత పోలీసులను బాధ్యులను చేయాలని చెప్పారు. అప్పుడే పోలీసు వ్యవస్థ మరింత బాధ్యతతో, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా పనిచేస్తుందన్నారు.


జైళ్లు టార్చర్ సెల్స్‌గా మారాయి: వసంత

దేశంలో జైళ్లు టార్చర్ సెల్స్‌గా మారాయని సాయిబాబా భార్య వసంత కుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏం నేరం చేశారో తెలియకుండానే సాయిబాబా పదేళ్లు జైల్లో నరకం అనుభవించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్లుగా జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీల విడుదల కోసం తన భర్త పోరాటాలు చేశారని.. దానిని కొనసాగించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని చెప్పారు. ''నా చిన్ననాటి స్నేహితుడు, సహచరుడు, నన్ను విడిచి వెళ్లిపోయాడు..'' అంటూ ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. సాయిబాబా ఆశయాలు కొనసాగిస్తే... ఆయన ఎప్పుడూ బ్రతికే ఉంటారని పేర్కొన్నారు.

అదే దుర్మార్గం

ఏపీలో ఆగని తప్పుడు కేసులు, వేధింపులు.. అరెస్టులు

- సజ్జల భార్గవ్‌రెడ్డి, మరో ఇద్దరిపై పులివెందులలో ఎస్సీ, ఎస్టీ కేసు
- తెలంగాణకు చెందిన బద్దం అశోక్‌రెడ్డిపై మంగళగిరిలో కేసు, అరెస్ట్
- రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం ఒక్క రోజే 13 కేసులు నమోదు



సాక్షి నెట్‌వర్క్: ఏపీలో ప్రభుత్వ వైఫల్యాలపై, మోసాలపై, ఇచ్చిన హామీలు అమలు చేయక పోవడంపై ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రభుత్వం మరోమారు డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపింది. ఇందులో భాగంగా సోషల్ మీడియా యాక్టివిస్టులపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తోంది. డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వలేదని అడిగినందుకు, ప్రభుత్వం ఇచ్చే సరుకుల్లో తూకం తేడా ఉందన్నందుకు, పింఛన్లు తెచ్చుకోవడానికి వెళ్లిన వృద్ధులు సొమ్మసిల్లి పడియారని చెప్పినందుకు.. తుదకు కార్టూన్‌ను ఫార్వర్డ్ చేసినందుకు.. ఇలా చిన్న చిన్న విషయాలను సాకు చూపి తప్పుడు కేసులు పెడుతోంది. చెప్పాపెట్టకుండా ఇళ్లకు వచ్చి పోలీసులు ఎత్తుకెళ్లిపోతున్నారు. ఆ తర్వాత కుటుంబ సభ్యులకు సైతం సమాచారం ఇవ్వడం లేదు. కొందర్ని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు వారి ఆచూకీ తెలియనీయకుండా, కోర్టులోనూ హాజరు పరచక పోవడంతో తమ వారు ఏమయ్యారో అని కుటుంబ సభ్యులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. పలువురు బాధితులకు సంబంధించి పెద్ద ఎత్తున చర్చ సాగుతుండటంతో వారి అరెస్టులు చూపక తప్పడం లేదు. పులివెందులలో సజ్జల భార్గవ్‌రెడ్డి, మరో ఇద్దరిపై ఏకంగా ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా ఒక్క ఆదివారం రోజే 13 కేసులు నమోదు చేశారంటే ప్రభుత్వం ఎంత దుర్మార్గంగా వ్యవహరిస్తోందో ఇట్టే తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్ జిల్లా మెండోరాకు చెందిన బద్దం అశోక్‌రెడ్డిపై మంగళగిరి టీడీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీడీపీ, జనసేన నాయకులపై అసభ్యకరమైన పోస్ట్‌లు పెట్టాడని, మహిళా నాయకుల ఫొటోలు మార్ఫింగ్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో అతన్ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించారని మంగళగిరి నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ వెల్లడించారు. అశోక్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసుతో పాటు ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేయడం విస్తుగొలుపుతోంది.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అందాల అడవి రైతు హార్న్‌బిల్

నల్లమల అభయారణ్యంలో ప్రేమ పక్షుల సందడి

- అరుణాచల్‌ప్రదేశ్, కేరళ రాష్ట్రాల పక్షిగా గుర్తింపు
- నాగాలాండ్‌లో ఏటా హార్న్‌బిల్ ఉత్సవాలు

పెద్దదోర్నాల: నల్లమల అభయారణ్యం విభిన్న వన్యప్రాణులకు నెలవు. ఇక్కడి అరుదైన పక్షులు, జంతు జాతులు పర్యావరణ ప్రేమికుల్ని అబ్బురపరుస్తాయి. పక్షిజాతుల్లో అత్యంత అరుదైన జీవనశైలి హార్న్‌బిల్ (ఫారెస్ట్ ఫార్మర్) పక్షుల సొంతం. వీటి స్వభావం అచ్చంగా మనుషుల్ని పోలి ఉంటుంది. మగ పక్షులు కుటుంబ బాధ్యతను మోస్తూ.. ఆడ పక్షులకు అవసరమైన తిండిని సంపాదిస్తూ.. వాటిని గూడు దాటకుండా బాధ్యతగా చూసుకుంటాయి. వీటిని అడవి రైతులుగా పిలుస్తుంటారు. పొడవైన ముక్కు, తోకలతో ఎంతో అందంగా, ఆకర్షణీయంగా కనపడతాయి.



స్వచ్ఛమైన ప్రేమకు ప్రతిరూపం

హార్న్‌బిల్ పక్షులు ఎత్తైన చెట్లలో సహజ సిద్ధంగా ఏర్పడ్డ గూళ్లలో నివసిస్తాయి. మగ పక్షులు పితృస్వామ్యాన్ని బాధ్యతగా నిర్వర్తిస్తూ కుటుంబ పోషణను చూసుకుంటాయి. తల్లి పక్షి గూడులో గుడ్లు పెట్టి పిల్లలను పొదుగుతుంది. పిల్లలతో కలిసి మూడు నెలలపాటు ఎటూ కదలకుండా గూట్లోనే ఉండిపోతుంది. మగ హార్న్‌బిల్ ఆ మూడు నెలలు ఆహారాన్ని సేకరించి.. గూట్లో ఉన్న తల్లి, పిల్ల పక్షులకు నోటిద్వారా అందిస్తుంది. ఆహారం కోసం తిరిగే సమయంలో మగ హార్న్‌బిల్ వేటగాళ్ల బారినపడినా.. ప్రమాదవశాత్తు మరణించినా గూటిలో ఉన్న తల్లి పక్షితోపాటు పిల్ల పక్షులు కూడా ఆకలితో చనిపోతాయే తప్ప ఇంకే ఆహారాన్ని ముట్టవు. దీంతోపాటు హార్న్ బిల్ పక్షుల దాంపత్య జీవనం ఎంతో పవిత్రంగా ఉంటుంది. ఇవి జీవితాంతం ఒకే పక్షితో జత కడతాయే తప్ప మరే పక్షిని దరిచేరనివ్వవు.

నాగాలాండ్‌లో ఏటా ఉత్సవం

హార్న్‌బిల్ పక్షుల జీవన విధానానికి ముగ్ధులైన నాగాలాండ్ వాసులు వాటి పేరిట ఏటా 10 రోజుల పాటు ఉత్సవాన్ని జరుపుకుంటారు. నాగాలాండ్ రాష్ట్ర రాజధాని కోహిమాకు 12 కిలోమీటర్ల దూరంలో గల కిసామాలోని గిరిజనులు హార్న్‌బిల్ ఉత్సవాన్ని సంప్రదాయంగా నిర్వహిస్తారు. డిసెంబర్ 1నుంచి 10వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవంలో చిన్నా పెద్దా తేడా లేకుండా అనేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించుకుంటారు.

రెండు రాష్ట్రాల పక్షి

అరుణాచల్ ప్రదేశ్, కేరళ రాష్ట్రాలు రాష్ట్ర పక్షిగా హార్న్‌బిల్‌ను గుర్తించాయి. ఈ పక్షుల జీవన కాలం 40 నుంచి 50 సంవత్సరాలని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. వీటి పొడవు 95 నుంచి 120 సెంటీమీటర్లు కాగా.. రెక్కలు విప్పినప్పుడు వీటి వెడల్పు 151 సెంటీమీటర్ల నుంచి 178 సెంటీమీటర్లు ఉంటుందని పేర్కొంటున్నారు. ఇవి సుమారు 4 కేజీల బరువు ఉంటాయి.

ఫారెస్ట్ ఫార్మర్

హార్న్‌బిల్ మగ పక్షి పండ్లను సేకరించి తల్లి, పిల్లలకు ఆహారంగా అందిస్తుంది. గూడుకు చేరుకున్న పక్షి పండ్ల గింజలను తొలగించి మరీ పిల్లలు, తల్లి నోటికి అందిస్తుంది. అలా అందిస్తున్నప్పుడు.. అది వదిలేసిన గింజలు నేలపై పడి.. అడవిలో మొలకెత్తి చెట్లుగా ఎదుగుతాయి. అందుకే.. ఈ పక్షిని అడవి రైతుగా పేర్కొంటారు.


సభలో మాట్లాడుతున్న డీజేహెచ్‌ఎస్ అధ్యక్షుడు బొల్లోజు రవి


ఫ్యూచర్ సిటీకి జర్నలిస్టులు

- డీజేహెచ్‌ఎస్ సభ్యుల సందర్శన
- వీలైనంత త్వరగా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ముఖ్యమంత్రికి వినతి

సాక్షి, హైదరాబాద్: డెక్కన్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ (డీజేహెచ్‌ఎస్) సభ్యులు ఆదివారం ఫ్యూచర్ సిటీ (ఫోర్త్ సిటీ)ని సందర్శించారు. ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో డీజేహెచ్‌ఎస్ సభ్యులు అక్కడ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఫోర్త్ సిటీలో ఇళ్ల స్థలాలు ఇస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అందుకోసం చొరవ చూపిన సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సభలో డీజేహెచ్‌ఎస్ అధ్యక్షుడు బొల్లోజు రవి, ఉపాధ్యక్షుడు మరిపాల శ్రీనివాస్, కోశాధికారి చిలుకూరి అయ్యప్ప, డైరెక్టర్లు దండ రామకృష్ణ, డేగ కుమార్, నాగరాజు మాట్లాడారు. ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు వీలైనంత త్వరగా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. హైటెక్ సిటీ, గచ్చిబౌలి తదితర ప్రాంతాలకు దీటుగా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తోందని, ఈ నేపథ్యంలో జర్నలిస్టులకు ఇక్కడ ఇళ్ల స్థలాలు ఇస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు.

కుల సంఘాలు అట్టడుగున్నున్న వారికి అండగా నిలవాలి

తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య



తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం జెండా ఆవిష్కరణ..

పంజగుట్ట (హైదరాబాద్): కుల సంఘాలు కులంలోని అట్టడుగున్నున్న వారికి కూడా సంక్షేమ ఫలాలు అందేలా తోడ్పాటు అందించాలని తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య విజ్ఞప్తి చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం.. సీపీఎం అనుబంధ గిరిజన సంఘానికి గతంలో రాష్ట్ర అధ్యక్షునిగా, కేంద్ర కమిటీలో పనిచేసిన దీరావత్ రవి నాయక్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం ఆవిర్భావ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ముత్తినేని వీరయ్య, రాష్ట్ర గొర్ల పెంపకం దారుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాల్‌రాజ్ యాదవ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన సంఘం ప్రధాన డిమాండ్ అయిన లంబాడీ భాష గ్యార్‌బోలిను.. రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్తామని వీరయ్య తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 3వేల జనాభా ఉన్న ప్రతి తండాను గ్రామ పంచాయతీగా గుర్తించిందని, 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చి గిరిజనాభ్యున్నతికి ఎంతో కృషి చేసిందని బాలరాజ్ యాదవ్ గుర్తు చేశారు. సంఘం ఆధ్వర్యంలో ప్రతీ మారుమూల ప్రాంతాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని రవి నాయక్ తెలిపారు. సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అంగోద్ వెంకన్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శంకర్ నాయక్ పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
సోమవారం ॥ 11-11-2024

లిటిల్ స్టార్స్

మన సంస్కృతి, సంప్రదాయలు, కుటుంబ విలువల్లో 'రక్త సంబంధం' అనే మాట పవిత్రమైనది. సానుకూల శక్తికి నిలువెత్తు అద్దంలాంటిది. సానుకూల శక్తి అనుకున్నది ప్రతికూల శక్తిగా మారితే?

వరం అనుకున్నది శాపం అయితే?

అది అనుభవిస్తే కాని తెలియని బాధ.

చిన్నారుల ఆనందప్రపంచాన్ని జన్యు సంబంధిత వ్యాధి తలసేమియా దూరం చేస్తుంది. ఎప్పుడూ ఆస్పత్రుల చుట్టూ తిరిగేలా చేస్తుంది.

'అందరిలా నేనెందుకు ఉండక లేకపోతున్నాను' అనే ఆవేదనను వారిలో కలిగిస్తుంది.

'లేదు... మీరు అందరిలాగే ఉండాలి. నవ్వాలి. ఆడాలి. ఇంద్రధనుస్సుల పల్లకీలో ఊరేగాలి' అంటూ నడుం కట్టారు చైల్డ్ ఆర్టిస్టులు.

నవంబర్ 14 బాలల దినోత్సవం నేపథ్యంలో... తలసేమియా బారిన పడిన చిన్నారులకు ప్రతి నెల ఉచితంగా రక్తం ఎక్కిస్తూ (బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్), మందులు అందిస్తూ విశేష సేవలు అందిస్తున్న హైదరాబాద్‌లోని 'తలసేమియా సికిల్ సెల్ సొసైటీ'కి బాలతారలను తీసుకువెళ్లింది సాక్షి. సలార్, పుష్ప-2లో నటించిన మోక్షజ్ఞ, పొట్టేల్ సినిమాలో నటించిన తనస్వీ, సరిపోదా శనివారంలో నటించిన అనన్యలు తలసేమియా బారిన పడిన చిన్నారులను ఆత్మీయంగా పలకరించడమే కాదు వారిని నవ్వించారు. తమ డ్యాన్స్‌లతో హుషారెత్తించారు. వారిలో ఆత్మస్థైర్యం నింపారు...



● తలసేమియా బాధిత చిన్నారులతో... బాల తారలు అనన్య, తనస్వీ, మోక్షజ్ఞ

ఇదీ రక్త బంధమే

వారసత్వంగా సంక్రమించే రక్త సంబంధ వ్యాధి (జెనెటికల్ బ్లడ్ డిజార్డర్) తలసేమియా. నివారణ మార్గాలున్నా అవగాహన లేమితో ఈ వ్యాధి బారిన పడిన చిన్నారులు వేల సంఖ్యలో ఉన్నారు. వారు ప్రతీ రెండు, మూడు వారాలకు ఒకసారి తప్పనిసరిగా వారు రక్తం ఎక్కించుకోవాలి. ఇది అత్యంత ఖరీదైనది. ఇలాంటి పరిస్థితులలో హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని 'తలసేమియా, సికిల్ సెల్ సొసైటీ' బాధిత కుటుంబాలకు అండగా ఉంటుంది. ఇక్కడకి వచ్చిన చైల్డ్ ఆర్టిస్టులు తమలాంటి పసిహృదయాలకు ఎందుకు ఇంతటి కష్టం వచ్చిందని విలవిలలాడిపోయారు. లోపలి నుంచి తన్నుకొస్తున్న బాధను దిగమింగుకొని వారికి సంతోషాలను పంచే ప్రయత్నం చేశారు. వారి ఇష్టాలను అడిగి తెలుసుకున్నారు. వారి ఇబ్బందుల గురించి ఆరా తీశారు. 'మీకు మేమున్నాం. మీ సమస్యలపై మా సినిమాల ద్వారా అవగాహన కల్పిస్తాం' అన్నారు.

భయపడితే బతకలేము...



నాకు 6 నెలల వయసులోనే తలసేమియా ఉందని గుర్తించారు. గత 21 ఏళ్లగా ప్రతీ 15, 20 రోజులకు ఒకసారి ఇక్కడ రక్తం ఎక్కించుకుంటున్నాను. మాకు ఐరెన్ లెవల్స్ పెరగకుండా ట్యాబ్‌లెట్‌లు ఇస్తారు. దీని గురించి ఆలోచిస్తూ బాధపడితే జీవితాన్ని ముందుకు సాగించలేను. అందుకే ధైర్యంగా ఉంటాను. ప్రస్తుతం ఎంబీఏ చదువుతున్నాను. నాకు డ్యాన్స్ అంటే ఇష్టం. కొన్ని డ్యాన్స్ పోటీల్లో కూడా పాల్గొన్నాను. మాకు ఈ సెంటర్ అండగా ఉంటోంది.

– మెహవీన్ ఫాతిమా



నేను యూకేజీ చదువుతున్నాను. వారం వారం నాన్న రక్తం కోసం ఇక్కడికి తీసుకువస్తాడు. మొదట్లో చాలా భయమేసేది. ఇప్పుడు భయం లేదు. – నిహారిక

ప్రతి 3 వారాలకు రక్తం ఎక్కించుకోవడం అలవాటైంది. భయం లేదు. 7వ తరగతి చదువుతున్నాను. డ్యాన్సింగ్, సింగింగ్ అంటే చాలా ఇష్టం. నా వ్యాధి గురించి స్కూల్‌లో టీచర్లకు కూడా తెలుసు. చాలా విషయాల్లో సహాయం చేస్తారు, ఫ్రెండ్లీగా ఉంటారు. కానీ ఇక్కడి వచ్చినప్పుడల్లా ఎందుకొచ్చానని బాధగా అనిపిస్తూనే ఉంటుంది.

– సంకీర్తన, కరీంనగర్



తల్లడిల్లిపోయే తల్లులు ఎందరో...

తన బిడ్డ కోసం ప్రతి నెలా ఖమ్మం నుంచి నుంచి హైదరాబాద్‌కు వస్తుంది ఒక తల్లి. ఆమె ఇద్దరు బిడ్డలకూ తలసేమియా సంక్రమించింది. పెద్దపాప బోన్ మ్యారో చికిత్స విఫలమై చనిపోయింది. చిన్నపాపను కాపాడుకోవాలనే దృఢసంకల్పం ఆ తల్లిలో కనిపిస్తోంది. 'ఈ వేదిక నాకు దేవాలయంతో సమానం' అంటుంది. తన చెల్లి కోసం ప్రతీ నెల కడప జిల్లా నుంచి ఇక్కడికి వస్తుంది అర్ఫాన్.

ఇలాంటి తల్లులు ఎంతో మంది తలసేమియా సికిల్ సెల్ సొసైటీలో కనిపిస్తారు. వారి కన్నీళ్లతో మన మనసు తడిసిపోతుంది.

* * *

డాక్టర్ కావాలని ఉంది...

''నేను ఏడో క్లాస్ చదువుతున్నాను. మూడు నెలల నుంచి రక్తం అందిస్తున్నారు. ఈ అవస్థలు చూస్తుంటే..భవిష్యత్‌లో నేను డాక్టర్ అయిపోయి, నాలాంటి పిల్లలకు మంచి వైద్యం అందించాలని ఉంది. గేమ్స్ కూడా బాగా ఆడతాను' అంటుంది ఖమ్మంకు చెందిన దీపిక.

ఈ వారమంతా లిటిల్ స్టార్స్ సందడిని సాక్షి యూట్యూబ్‌లో చూడటానికి ఈ qr కోడ్‌ను స్కాన్ చెయ్యండి

* * *

మా గురించి ఆలోచించండి...

''నేను ఆరేళ్ల నుంచి ఈ సేవలు పొందుతున్నాను. ప్రస్తుతం ఇంటర్ చదువుతున్నాను. మా భోజనం అందరిలానే ఉంటుంది, కానీ పండ్లు తక్కువగా తినాలి. శరీరంలో రక్తం తగ్గినప్పుడు నీరసంగా ఉంటుంది. జ్వరం వస్తుంది. ఒక్కోసారి లేవలేనంతగా కాళ్ల నొప్పులు వస్తాయి. రక్తం తీసుకున్న తరువాత బాగానే ఉంటాం. దయచేసి మా గురించి ఆలోచించండి. మాకు రక్తం అందుబాటులో ఉండాలి. రక్తదాతలు సహకరిస్తేనే మాకు సరిపడా రక్త నిల్వలు ఉంటాయి. ఈ విషయంలో అవగాహన పెరగాల్సిన అవసరం ఉంది. ఇలాంటి కార్యక్రమం సాక్షి నిర్వహిస్తున్నందుకు మనసారా కృతజ్ఞతలు'' అంటుంది గౌసియా.

రక్తదాతలు ముందుకు రావాలి...



తలసేమియాతో నాకు బాబు పుట్టాడు. ఆ సమయంలో దక్షిణాదిలో డాక్టర్లకు కూడా ఈ వ్యాధిపైన అంతగా అవగాహన లేదు. దేశంలోని ఎన్నో హాస్పిటల్‌లు, మెడికల్ కాలేజీలు తిరిగి దీని గురించి తెలుసుకుని మళ్లీ నగరంలోని డాక్టర్లకు అవగాహన కల్పించి బాబుకు చికిత్స అందించాను. నాలాంటి మరో 20 కుటుంబాల వారు కలిసి 1998లో డా. ఏఎస్ కృష్ణకుమారి సహాయంతో ఈ సెంటర్‌ను స్థాపించాం. మా ప్రయత్నంలో ఎందరో సామాజికవేత్తలు, డాక్టర్లు సహకారం అందించారు. విరాళంగా అందించిన స్థలంలో దాతల సహాయంతోనే ఈ సెంటర్‌ను నిర్మించాం. ఇప్పటికి 4199 మంది చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకు 3 లక్షల యూనిట్ల రక్తం అందించాం. ఇంతమందికి సేవలందిస్తున్న ప్రపంచంలో అతి పెద్ద సంస్థ మాదే అని చెప్పడానికి గర్వంగా ఉంది. ప్రస్తుతం నా బాబు లేడు. కానీ నాకు 4199 మంది పిల్లలున్నారు. వీరికి మా సేవలు ఇలానే అందాలంటే రక్తదాతల అవసరం ఎంతో ఉంది. స్వచ్ఛందంగా రక్తదాతలు ముందుకు రావాల్సిన అవసరం ఉంది.

– రత్నావళి, ఫౌండర్, తలసేమియా సికిల్ సెల్ సొసైటీ

తలసేమియా నివారణకు...
హెచ్‌బీఏ-2 అనే పరీక్షను మహిళకు పెళ్లి తర్వాత, గర్భధారణకు ముందు చేయిస్తే తలసేమియాను తేలిగ్గా నివారించవచ్చు.

ప్రభుత్వం ఆదుకోవాలి...



ఇది జెనెటిక్ డిసీజ్ అయినప్పటికీ నివారించగలిగేదే. ఈ వ్యాధుల్లో నివారించగలిగే అవకాశముండటం చాలా అరుదు. బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ ఎంతో ఖరీదైన ప్రక్రియ. ఈ విషయంలో ప్రభుత్వం బాధిత కుటుంబాలకు సహాయసహకారాలు అందించాలి.

- సుమాంజలి, సెక్రటరీ– సీఈఓ

ఈ టెస్ట్ తప్పనిసరి చేయాలి...



మేము ఆశ వర్కర్‌లు, పీహెచ్‌సీలతో కలిసి గర్భిణీ స్త్రీలకు హెచ్‌బీఏ2 టెస్ట్ చేయిస్తున్నాం. ఇప్పటి వరకు 30 వేల మందికి ఈ టెస్టులు చేయించాం. ప్రభుత్వం తరపున ఈ టెస్ట్‌లు అందరికీ తప్పనిసరి చేయాలి.

- చంద్రకాంత్ అగర్వాల్, ప్రెసిడెంట్

ఏడుపొచ్చింది...

ఇక్కడి రాగానే ఏడుపొచ్చేసింది. నాలాంటి చిన్నారులే సెలైన్లు పెట్టుకుని రక్తం ఎక్కించుకుంటుంటే బాధగా అనిపించింది. వారికి సంతోషాలను పంచాలని, వారితో ఆడుకున్నాను. నా పొట్టేల్ సినిమాలోని 'చీమ కాటుకే ఓర్చుకోలేవు ఈ నొప్పి ఎలా భరిస్తావ్' అనే డైలాగ్ చెప్పాను. వర్షిత నాతో చాలా బాగా ఆడుకుంది, జానీ జానీ రైమ్స్ చెప్పింది. వీరందరినీ దేవుడు మంచిగా చూసుకోవాలి.

- తనస్వీ, చైల్డ్ ఆర్టిస్ట్

సినిమా ద్వారా అవగాహన కలిగిస్తాను...

ఈ పిల్లలను చూడగానే కన్నీళ్లు ఆగలేదు. వీరికి ఏదైనా సహాయం చేయాలని గట్టిగా అనుకుంటున్నాను. అందరు పిల్లలతో మాట్లాడాను. సరిపోదా శనివారం.. డైలాగ్ చెప్పాను. నా షూటింగ్స్ గురించి వారు అడిగారు. నాకు రక్తం అంటేనే భయం..అలాంటిది వీరు ప్రతీ నెలా ఎక్కించుకుంటుంటే ఊహించడానికే కష్టంగా ఉంది. నా సినిమాల్లో ఈ వ్యాధి గురించే అవగాహన కల్పించే క్యారెక్టర్ చేసే ప్రయత్నం చేస్తాను.

- అనన్య, చైల్డ్ ఆర్టిస్ట్

పెద్దయ్యాక సహాయం చేస్తాను...

తలసేమియా పిల్లలతో సరదాగా ఆడుకుని ధైర్యం నింపాలని వచ్చాను. ఛత్రపతి డైలాగ్ చెబితే అందరూ చప్పట్లు కొట్టారు. ఇక్కడి అబ్దుల్ నన్ను టీవీలో చూశానని చెప్పాడు. ముఖేష్ నాకు ఫ్రెండ్ అయ్యాడు. తను డాక్టర్ అవుతాడంట. వీరి కోసం నేను డ్యాన్సులు కూడా చేశాను. నేను పెద్దయ్యాక ఇలాంటి వారికి సహాయం చేస్తాను. - మోక్షజ్ఞ, చైల్డ్ ఆర్టిస్ట్

- డి.జి. భవాని
- హనుమాద్రి శ్రీకాంత్
ఫొటోలు: అనీల్ మోర్ల

గమనిక: ఈ రోజు రావలసిన 'సన్నిధి' పేజీకి బదులుగా బాలల దినోత్సవం నేపథ్యంలో 'సాక్షి' నిర్వహిస్తున్న 'లిటిల్ స్టార్స్' పేజీ ఇస్తున్నాం.

సినిమా

ప్రభాస్‌తో ఢీ



● ప్రభాస్ ● డాన్ లీ

హీరో ప్రభాస్, సౌత్ కొరియన్ నటుడు డాన్ లీ సిల్వర్ స్క్రీన్ షేర్ చేసుకోవడం దాదాపు ఖరారు అయిందనే టాక్ వినిపిస్తోంది. ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్' అనే సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా విదేశీ భాషల్లో కూడా రిలీజ్ కానుందని గతంలో మేకర్స్ ప్రకటించారు. అయితే ఈ సినిమాలో సౌత్ కొరియన్ నటుడు డాన్ లీ విలన్‌గా నటిస్తారనే ప్రచారం కొన్నిరోజుల క్రితం జరిగింది. తాజాగా 'సలార్ 2'లోని ప్రభాస్ ఫోటోను డాన్ లీ తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో షేర్ చేశారు. దీంతో ప్రభాస్, డాన్ లీ కలిసి నటించనున్నట్లు తెలుస్తోంది. అయితే 'స్పిరిట్' సినిమాలో డాన్ లీ కనిపిస్తారా? లేకుంటే 'సలార్ 2' సినిమా పోస్టర్‌ను షేర్ చేశారు కాబట్టి ఈ సినిమాలో విలన్‌గా చేస్తారా? అనే విషయాలపై స్పష్టత రావాల్సి ఉంది. 'ది గ్యాంగ్‌స్టర్, ది కాప్, ది డెవిల్', 'మిస్టర్ గో' వంటి సౌత్ కొరియన్ చిత్రాలతో పాటుగా మార్వెల్ ఫిల్మ్ 'ఎటర్నల్స్'లో మంచి రోల్స్ చేసి నటుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు డాన్ లీ.

అలాంటి పాత్రలు చేయను - సమంత



''ప్రస్తుత సమాజంలో మహిళలకు న్యాయమైన ప్రాతినిధ్యం ఉండాలని భావిస్తున్నా. అందుకే సినిమాల్లో రెండు, మూడు సన్నివేశాలకే పరిమితమయ్యే పాత్రలు నేను చేయను'' అంటున్నారు హీరోయిన్ సమంత. వరుణ్ ధావన్, సమంత ప్రధాన పాత్రల్లో రాజ్ అండ్ డీకే దర్శకత్వం వహించిన వెబ్ సిరీస్ 'సిటాడెల్: హనీ బన్నీ'. అమేజాన్ ప్రైమ్‌లో ఈ సిరీస్ ఈ నెల 7 నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. ప్రియాంకా చోప్రా నటించిన హాలీవుడ్ సిరీస్ 'సిటాడెల్'కు ఇది ఇండియన్ వెర్షన్. ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న సమంత 'సిటాడెల్: హనీ బన్నీ' సక్సెస్ పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఇదే వేదికపై సినిమాల్లో మహిళల పాత్రల గురించి ఆమె మాట్లాడుతూ–''ప్రేక్షకులను తక్కువ అంచనా వేయకూడదు. వారు అన్ని విషయాలను గమనిస్తారు. అందుకే ఏం చేసినా బాధ్యతగా చేయాలి. నేను ఒక విషయానికి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పుడు దానికి సంబంధించిన పూర్తి బాధ్యత నాపై ఉంటుంది. అందుకే ఎన్నో విషయాల గురించి ఆలోచించి, పాత్రలను ఎంచుకుంటాను. ప్రస్తుతం సమాజంలో మహిళలకు న్యాయమైన ప్రాతినిధ్యం ఉండాలని భావిస్తున్నా. సినిమాల్లో కూడా రెండు, మూడు సన్నివేశాలకే పరిమితమయ్యే పాత్రలకు నేను దూరంగా ఉంటాను. అలాగే నేను చేసే ప్రకటనల విషయంలోనూ ఆలోచిస్తాను. 'సిటాడెల్: హనీ బన్నీ'లో నటించడం నాకు సవాల్‌గా అనిపించింది. హీరోకు సమానమైన పాత్ర నాది. యాక్షన్ సన్నివేశాల్లోనూ హీరోతో సమానంగా చేశా. కానీ, ఇలాంటి అవకాశాలు అరుదుగా వస్తాయి. ఇలాంటి చాన్స్‌ల కోసం నటీమణులు చాలామంది ఎదురు చూస్తున్నారు. కానీ, నాకు ఇలాంటి అవకాశాలు ఎన్నో వచ్చినా అందులో కూడా కొన్నింటినే ఎంచుకుంటున్నాను. నాకు వచ్చిన ఆఫర్లకు, నేను చేసిన సినిమాలకు మధ్య చాలా వ్యత్యాసం ఉంటుంది'' అని సమంత పేర్కొన్నారు.

అదిరిపోయే స్టెప్పులు



● శ్రీలీల

అల్లు అర్జున్ డ్యాన్స్ మూమెంట్స్ ఇరగదీస్తారు. హీరోకు ఏ మాత్రం తగ్గకుండా స్టెప్పులేస్తారు హీరోయిన్ శ్రీలీల. వీరిద్దరూ కలిసి 'పుష్ప 2: ది రూల్' సినిమాలో ఓ స్పెషల్ సాంగ్ కోసం మరింత అదిరిపోయే స్టెప్పులేస్తున్నారు. హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో వేసిన ప్రత్యేక సెట్‌లో ఈ సాంగ్ చిత్రీకరణ జరుగుతోంది. తాజాగా 'పుష్ప 2: ది రూల్' సినిమాలో శ్రీలీల ప్రత్యేక పాట చేస్తున్నట్లు ప్రకటించి, ఆమె పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రష్మికా మందన్నా హీరోయిన్. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవి శంకర్ నిర్మిస్తున్న 'పుష్ప 2: ది రూల్' సినిమా డిసెంబరు 5న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ వేడుక ఈ నెల 17న పాట్నాలో జరగనున్నట్లు తెలిసింది. 'పుష్ప' తొలి భాగం 'పుష్ప: ది రైజ్' సినిమాలోని 'ఊ అంటావా మావ...' స్పెషల్ సాంగ్ బాగా పాపులర్ అయ్యింది. అల్లు అర్జున్-సమంతల స్టెప్పులకు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. దీంతో 'పుష్ప 2: ది రూల్' సినిమాలో అల్లు అర్జున్-శ్రీలీల చేస్తున్న స్పెషల్ సాంగ్‌పై అంచనాలు భారీ స్థాయిలో ఉన్నాయి. ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. అలాగే ఈ చిత్రం నేపథ్య సంగీతంలో మ్యూజిక్ డైరెక్టర్ తమన్ కూడా భాగమైనట్లు తెలిసింది.


ఆకాశమే మెరుపై నేలను తాకితే..



● సూర్య

'చీకటికోన పులులన్నీ ఏకమై ఉరిమితే... ఆ ఆకాశమే మెరుపై నేలను తాకితే... దానికి కారణం.. ఒక్కటే కదా.. కంగ...' అంటూ మొదలవుతుంది 'కంగువ' సినిమా తెలుగు ట్రైలర్. సూర్య హీరోగా నటించిన పీరియాడికల్ అండ్ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ 'కంగువ'. దిశా పటానీ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో బాబీ డియోల్, యోగిబాబు కీలక పాత్రల్లో నటించారు. కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో 'కంగువ' సినిమా రిలీజ్ ట్రైలర్‌ను ఆదివారం విడుదల చేశారు మేకర్స్. 'నన్ను ఎదురించేది ఎవరు?', 'ఎదిరిస్తాం.. ఎదురు ఇస్తాం..' వంటి డైలాగ్స్ 'కంగువ' తెలుగు ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ సినిమాకు సంగీతం: దేవి శ్రీ ప్రసాద్.

ఢిల్లీ గణేష్ కన్నుమూత



సీనియర్ తమిళ నటుడు ఢిల్లీ గణేష్ (80) కన్నుమూశారు. అనారోగ్య సమస్యలు, వృద్ధాప్యం కారణంగా శనివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో చెన్నై రామాపురంలోని స్వగృహంలో ఆయన తుదిశ్వాస విడిచారు. 1964–74 మధ్య కాలంలో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేశారు ఢిల్లీ గణేష్. కళలపై ఉన్న ఆసక్తితో ఢిల్లీకి చెందిన దక్షిణ భారత నాటక సభలో సభ్యుడిగా చేరారు. అనంతరం సినీ రంగ ప్రవేశం చేశారు. కె.బాలచందర్ దర్శకత్వం వహించిన 'పట్టణ ప్రవేశం'(1976) చిత్రం ద్వారా నటుడుగా పరిచయమయ్యారాయన. 'ఎంగమ్మ మహారాణి' అనే మూవీలో హీరోగా నటించారు కూడా. తమిళంతో పాటు తెలుగు, హిందీ వంటి పలు భాషల్లో సహాయ నటుడిగా, హాస్యనటుడిగా దాదాపు 400కు పైగా చిత్రాల్లో నటించి, ప్రేక్షకులను అలరించారాయన. అలాగే పలు సీరియల్స్‌లోనూ, కొన్ని వెబ్ సిరీస్‌లోనూ నటించారు. ఆయన మంచి నటుడే కాదు.. డబ్బింగ్ కళాకారుడు కూడా. పలువురు ప్రముఖ నటులకు గాత్రదానం చేశారు. ఢిల్లీ గణేశ్ తెలుగులో 'జైత్రయాత్ర, నాయుడమ్మ, పున్నమి నాగు' వంటి చిత్రాల్లో నటించారు. ఆయన మృతికి పలువురు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. నేడు(సోమవారం) ఉదయం 10 గంటలకు చెన్నైలో ఢిల్లీ గణేశ్ అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన కుమారుడు మాధవన్ గణేష్ తెలిపారు.


రెండు ప్రేమకథలు



● సుమంత్, నిధి, శ్రీ విష్ణు

'మేమ్ ఫేమస్' ఫేమ్ సుమంత్ ప్రభాస్ హీరోగా, నిధీ ప్రదీప్ హీరోయిన్‌గా కొత్త సినిమా షురూ అయింది. సుభాష్ చంద్ర దర్శకత్వంలో రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత సురేష్ బాబు కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో శ్రీ విష్ణు క్లాప్ ఇచ్చారు. నిర్మాత అల్లు అరవింద్ స్క్రిప్ట్‌ను యూనిట్‌కు అందజేయగా, దర్శకులు శ్రీకాంత్ ఓదెల, శౌర్యువ్, మహేష్‌బాబు తొలి సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించారు. సుమంత్ ప్రభాస్ మాట్లాడుతూ– ''మేమ్ ఫేమస్' తర్వాత సుభాస్ చంద్ర కథ నచ్చడంతో ఓకే చెప్పాను. అభినవ్ అన్న చాలా ప్యాషనేట్ ప్రొడ్యూసర్'' అన్నారు. ''యూత్‌ఫుల్ మ్యూజికల్ రొమాంటిక్ కామెడీ మూవీ ఇది. ఇందులో రెండు ప్రేమ కథలు ఉన్నాయి. సుమంత్, నిధీలది ఒక లవ్‌స్టోరీ అయితే, తండ్రీకూతుర్లది మరో ప్రేమకథ. హీరోయిన్ తండ్రి పాత్రలో జగపతిబాబు కనిపిస్తారు'' అని సుభాష్ చంద్ర తెలిపారు.

ఏ రోజు చూశానో...



● భరత్ రామ్

'చెక్, బుర్రకథ, రంగ రంగ వైభవంగా' వంటి సినిమాల్లో బాల నటుడిగా నటించిన భరత్ రామ్ 'ఏ రోజైతే చూశానో నిన్ను' అనే సినిమా ద్వారా హీరోగా పరిచయమవుతున్నారు. స్క్రీన్ ప్లే, విజువల్ ఎఫెక్ట్స్‌లో అనుభవం ఉన్న రాజు బొనగాని ఈ మూవీకి దర్శకత్వం వహిస్తున్నారు. ఇనావర్స్ సినిమా ఫ్యాక్టరీ ప్రొడక్షన్ హౌస్ ఈ చిత్రం నిర్మించనుంది. ''ఏ రోజైతే చూశానో నిన్ను' సినిమాకి సంబంధించిన మ్యూజిక్ సిట్టింగ్స్ జరుగుతున్నాయి. అతి త్వరలో హీరోయిన్‌ను ఎంపిక చేసి, డిసెంబరులో చిత్రీకరణ ప్రారంభించనున్నాం'' అని మేకర్స్ తెలిపారు.

తుదిదశలో ఎంపురాన్



● మోహన్‌లాల్

మోహన్‌లాల్ హీరోగా నటించిన మలయాళ బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ 'లూసిఫర్' (2019). ఈ సినిమాకు దర్శకత్వం వహించడంతో పాటు ఓ చిన్న రోల్‌లో నటించారు పృథ్వీరాజ్ సుకుమారన్. కాగా 'లూసిఫర్' సినిమాకు సీక్వెల్‌గా 'ఎల్2: ఎంపురాన్' సినిమా తెరకెక్కుతోంది. ఈ మూవీలో కూడా మోహన్‌లాల్ హీరోగా నటిస్తుండగా, పృథ్వీరాజ్ సుకుమారన్ ఓ పాత్రలో నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా మేజర్ పార్టు చిత్రీకరణ పూర్తయింది. తాజాగా 'ఎల్ 2 :ఎంపురాన్' సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుందని, ఫైనల్ షెడ్యూల్ మొదలైందని పృథ్వీరాజ్ 'ఎక్స్'లో షేర్ చేశారు. ప్యాచ్ వర్క్స్‌తో సహ డిసెంబరులోపే మొత్తం చిత్రీకరణను పూర్తి చేయాలన్నది పృథ్వీరాజ్ టార్గెట్ అని మాలీవుడ్ సమాచారం. లైకా ప్రొడక్షన్స్, ఆశీర్వాద్ సినిమాస్ నిర్మిస్తున్న 'ఎల్2: ఎంపురాన్' సినిమా 2025 మార్చి 25న తెలుగు, తమిళం, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో రిలీజ్ కానుంది.



ఆరో రౌండ్‌లో అరవింద్ చేతిలో అర్జున్ ఓటమి

చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో భారత నంబర్‌వన్, తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్‌కు తొలి ఓటమి ఎదురైంది. చెన్నైలో జరుగుతున్న ఈ టోర్నీలో ఆదివారం జరిగిన ఆరో రౌండ్ గేమ్‌లో అర్జున్ 48 ఎత్తుల్లో భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ అరవింద్ చిదంబరం చేతిలో అనూహ్యంగా ఓడిపోయాడు. అరవింద్ చేతిలో ఓటమితో అర్జున్ లైవ్ ర్యాంకింగ్స్‌లో 2801.8 పాయింట్లతో ప్రపంచ రెండో ర్యాంక్ నుంచి నాలుగో ర్యాంక్‌కు పడిపోవడం గమనార్హం. అమీన్–పర్హామ్ (ఇరాన్) మధ్య గేమ్ 37 ఎత్తుల్లో... మాక్సిమి వాచిర్ లాగ్రేవ్ (ఫ్రాన్స్)–అలెక్సీ సరానా (సెర్బియా) మధ్య గేమ్ 31 ఎత్తుల్లో... అరోనియన్ (అమెరికా)–విదిత్ (భారత్) మధ్య గేమ్ 64 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిశాయి. ఎనిమిది మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య ఏడు రౌండ్లపాటు ఈ టోర్నీ జరుగుతోంది. ఆరో రౌండ్ తర్వాత అర్జున్, అరోనియన్ 4 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నారు. అరవింద్, అమీన్ 3.5 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచారు. ఈరోజు జరిగే చివరిదైన ఏడో రౌండ్ గేముల్లో లాగ్రేవ్‌తో అర్జున్; అరోనియన్‌తో అమీన్; విదిత్‌తో అలెక్సీ; పర్హామ్‌తో అరవింద్ తలపడతారు.

రుత్విక–రోహన్ జోడీకి టైటిల్



సాక్షి, హైదరాబాద్: ఎస్‌ఎండీసీ తెలంగాణ ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో భారత జట్టు మాజీ సభ్యురాలు, తెలంగాణ అమ్మాయి గద్దె రుత్విక శివాని టైటిల్ సాధించింది. గచ్చిబౌలిలోని కొటక్ పుల్లెల గోపీచంద్ అకాడమీలో ఆదివారం ఈ టోర్నీ ముగిసింది. ఐదు విభాగాల్లోనూ (మహిళల సింగిల్స్, డబుల్స్, పురుషుల సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్) భారత క్రీడాకారులకే విన్నర్స్, రన్నరప్ ట్రోఫీలు దక్కడం విశేషం. మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లో రుత్విక శివాని–రోహన్ కపూర్ (భారత్) జంట 21–17, 21–19తో హరిహరన్–తనీషా క్రాస్టో (భారత్) జోడీని ఓడించింది. మహిళల సింగిల్స్ టైటిల్ ఇషారాణి బారువా (భారత్)కు లభించింది. ఫైనల్లో ఇషారాణి 21–15, 9–21, 21–17తో రక్షిత శ్రీ (భారత్)పై గెలిచింది. పురుషుల సింగిల్స్ విభాగంలో తెలంగాణ ప్లేయర్ కాటం తరుణ్ రెడ్డి రన్నరప్‌గా నిలిచాడు. ఫైనల్లో తరుణ్ రెడ్డి 11–21, 14–21తో భారత్‌కే చెందిన రిత్విక్ సంజీవి చేతిలో ఓడిపోయాడు. పురుషుల డబుల్స్ ఫైనల్లో పంజాల విష్ణువర్ధన్ గౌడ్–ఎంఆర్ అర్జున్ (భారత్) జోడీ 19–21, 17–21తో పృథ్వీ కృష్ణమూర్తి–సాయిప్రతీక్ (భారత్) జంట చేతిలో ఓటమి పాలైంది. మహిళల డబుల్స్ ఫైనల్లో ప్రియా కొంజెంగ్‌బమ్–శ్రుతి మిశ్రా (భారత్) ద్వయం 21–18, 21–13తో ఆరతి సారా సునీల్–వర్షిణి (భారత్) జోడీపై గెలిచింది.

సొంతగడ్డపై భారత్‌కు పరీక్ష

నేటి నుంచి ఆసియా మహిళల హాకీ చాంపియన్స్ ట్రోఫీ టోర్నీ

- తొలి మ్యాచ్‌లో మలేసియాతో భారత్ 'ఢీ'
- సాయంత్రం గం. 4:45 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



రాజ్‌గిర్ (బిహార్): పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పొందకపోవడం... ఆ తర్వాత ప్రొ హాకీ లీగ్‌లోనూ ఆడిన 16 మ్యాచ్‌ల్లో కేవలం రెండింటిలో విజయం సాధించడం... వెరసి ఈ ఏడాది భారత మహిళల హాకీ జట్టుకు ఏదీ కలసి రాలేదు. ఈ నేపథ్యంలో సొంతగడ్డపై వరుసగా రెండోసారి జరుగుతున్న ఆసియా మహిళల హాకీ చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు ప్రదర్శనపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. హెడ్ కోచ్ హరేంద్ర సింగ్ పర్యవేక్షణలో సలీమా టెటె సారథ్యంలో భారత బృందం ఈ టోర్నీలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. సోమవారం జరిగే తొలి లీగ్ మ్యాచ్‌లో మలేసియాతో భారత్ తలపడుతుంది. సాయంత్రం 4 గంటల 45 నిమిషాలకు ఈ మ్యాచ్ మొదలవుతుంది. గత ఏడాది రాంచీలో జరిగిన చాంపియన్స్ ట్రోఫీ టోర్నీలో భారత జట్టు విజేతగా నిలిచింది. ఈసారీ టైటిల్ నిలబెట్టుకోవాలంటే టీమిండియా అన్ని రంగాల్లో సమష్టిగా రాణించాల్సి ఉంటుంది. పారిస్ ఒలింపిక్స్ రజత పతక విజేత చైనా, జపాన్, దక్షిణ కొరియా, థాయ్‌లాండ్ జట్లు కూడా ఈ టోర్నీలో ఆడుతున్నాయి. తొలి రోజు జరిగే ఇతర మ్యాచ్‌ల్లో జపాన్‌తో దక్షిణ కొరియా (మధ్యాహ్నం గం. 12:15 నుంచి), చైనాతో థాయ్‌లాండ్ (మధ్యాహ్నం గం. 2:30 నుంచి) తలపడతాయి. సోమవారం మలేసియాతో మ్యాచ్ తర్వాత భారత జట్టు తమ తదుపరి మ్యాచ్‌ల్లో కొరియా (12న)తో, థాయ్‌లాండ్ (14న)తో, చైనా (16న)తో, జపాన్ (17న)తో ఆడుతుంది. లీగ్ దశ ముగిశాక టాప్–4లో నిలిచిన నాలుగు జట్లు సెమీఫైనల్స్ చేరుకుంటాయి. సెమీఫైనల్స్ 19న, ఫైనల్ 20న జరుగుతాయి.

విజయాన్ని వదిలేశారు

రెండో టి20లో భారత్ పరాజయం

- 3 వికెట్ల తేడాతో నెగ్గిన దక్షిణాఫ్రికా
- వరుణ్ మాయాజాలం వృథా
- సఫారీ జట్టును గెలిపించిన స్టబ్స్
- 13న మూడో టి20 మ్యాచ్



నిరాశలో సూర్యకుమార్ బృందం



వరుణ్

పోర్ట్ ఎలిజబెత్: భారత్ చేసింది 124/6. తక్కువ స్కోరే! దక్షిణాఫ్రికా ముందున్న లక్ష్యం 125. సులువైందే! కానీ భారత ఆఫ్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి (4–0–17–5) బిగించిన ఉచ్చు సఫారీని ఓటమి కోరల్లో పడేసింది. ఈ దశలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ట్రిస్టన్ స్టబ్స్ (41 బంతుల్లో 47 నాటౌట్; 7 ఫోర్లు) చేసిన పోరాటం ఆతిథ్య జట్టును గెలిపించింది. ఆదివారం జరిగిన రెండో టి20లో దక్షిణాఫ్రికా 3 వికెట్ల తేడాతో భారత్‌పై గెలిచింది. దాంతో నాలుగు టి20ల సిరీస్‌లో రెండు జట్లు 1–1తో సమంగా నిలిచాయి. 13న సెంచూరియన్‌లో మూడో టి20 జరుగనుంది. మొదట భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 124 పరుగులు చేసింది. హార్దిక్ పాండ్యా (45 బంతుల్లో 39 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) మెరుగ్గా ఆడాడంతే! అనంతరం లక్ష్యఛేదనకు దిగిన సఫారీ జట్టు 19 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 128 పరుగులు చేసి గెలిచింది. కొయెట్జీ (9 బంతుల్లో 19 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) చేసిన కీలక పరుగులు, స్టబ్స్ పోరాటంతో దక్షిణాఫ్రికా పైచేయి సాధించింది.

కష్టాలతో మొదలై...

ఇన్నింగ్స్ మొదలైన తొలి ఓవర్లోనే జాన్సెన్ మూడో బంతికి సంజూ సామ్సన్ (0) క్లీన్‌బౌల్డయ్యాడు.



స్టబ్స్

తర్వాతి కొయెట్జీ ఓవర్ మూడో బంతికి అభిషేక్ శర్మ (4) కీపర్ క్యాచ్ నుంచి రివ్యూతెల్లి బతికిపోయినా... మరో రెండు బంతులకే భారీ షాట్‌కు ప్రయత్నించి జాన్సెన్‌కు క్యాచ్ ఇచ్చి నిష్క్రమించాడు. దీంతో 5 పరుగులకే భారత్ ఓపెనర్లను కోల్పోయింది. ఈ కష్టాలు చాలవన్నట్లు కెప్టెన్ సూర్యకుమార్ (4) సిమ్‌లేన్ బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికిపోయాడు. 15 పరుగులకే టాపార్డర్ కూలిపోగా... పవర్‌ప్లేలో భారత్ 34/3 స్కోరు చేసింది. లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్స్ జోడీ ఠాకూర్ తిలక్ వర్మ (20 బంతుల్లో 20; 1 ఫోర్, 1 సిక్స్), అక్షర్ పటేల్ (21 బంతుల్లో 27; 4 ఫోర్లు) నిలదొక్కుకోకుండా మార్క్‌రమ్ చేశాడు. అతని బౌలింగ్‌లో తిలక్ షాట్ ఆడగా బుల్లెట్‌లా దూసుకొచ్చిన బంతిని మిల్లర్ గాల్లో ఎగిరి ఒంటిచేత్తో అందుకున్నాడు. అక్షర్ పటేల్ (21 బంతుల్లో 27; 4 ఫోర్లు) దురదృష్టవశాత్తూ రనౌటయ్యాడు. పీటర్ వేసిన 12వ ఓవర్లో హార్దిక్ స్ట్రెయిట్ డ్రైవ్ ఆడగా... అది నేరుగా వెళ్లి నాన్–స్ట్రయిక్ ఎండ్‌లోని వికెట్లకు తగిలింది. ఈ లోపే బంతిని అడ్డుకోబోయిన పీటర్ చేతికి టచ్ అయ్యింది. అక్షర్ రీప్లే వచ్చేవరకు వేచిచూడకుండా పెవిలియన్ వైపు నడిచాడు. దీంతో 70 పరుగులకే టీమిండియా సగం వికెట్లను కోల్పోయింది. తర్వాత వచ్చిన రింకూ (9)ను పీటరే అవుట్ చేశాడు. రింకూ ఆడిన షాట్‌ను షార్ట్‌ఫైన్ లెగ్‌లో కొయెట్జీ అందుకున్నాడు. ఎట్టకేలకు 17వ ఓవర్లో పాండ్యా బౌండరీతో జట్టు స్కోరు వందకు చేరింది. జాన్సెన్ వేసిన 18వ ఓవర్లో పాండ్యా 2 ఫోర్లు, ఒక సిక్స్ బాదాడు. చివరి రెండు డెత్ ఓవర్లను కొయెట్జీ, జాన్సెన్ చక్కగా నియంత్రించారు. పాండ్యా ఆఖరిదాకా క్రీజులో ఉన్నప్పటికీ కొయెట్జీ 19వ ఓవర్లో 3 పరుగులే ఇవ్వగా, జాన్సెన్ ఆఖరి ఓవర్లో 6 పరుగులు వచ్చాయి.

వరుణ్ తిప్పేసినా...

సొంతగడ్డపై ప్రత్యర్థి స్వల్ప లక్ష్యమే నిర్దేశించినా... దక్షిణాఫ్రికా ఆపసోపాలు పడి గెలిచింది. హెండ్రిక్స్, కెప్టెన్ మార్క్‌రమ్ (3), జాన్సెన్ (7), క్లాసెన్ (2), మిల్లర్ (0)లను అవుట్ చేసిన వరుణ్ చక్రవర్తి ఆశలు రేపాడు. ఒక దశలో 64/3 వద్ద పటిష్టంగా కనిపించిన సఫారీ అంతలోనే వరుణ్ స్పిన్ ఉచ్చులో పడి 66 పరుగులకే 6 వికెట్లను కోల్పోయి ఓటమి ప్రమాదాన్ని తెచ్చుకుంది. కాసేపటికే సిమ్‌లేన్ (7)ను రవి బిష్ణోయ్ బౌల్డ్ చేయడంతో భారత్ శిబిరం ఆనందంలో మునిగితేలింది. 24 బంతుల్లో 37 పరుగులు చేయాల్సి ఉండగా, అర్ష్‌దీప్ 17వ ఓవర్లో కొయెట్జీ 6, స్టబ్స్ 4 బాదారు. దీంతోనే సఫారీ జట్టు స్కోరు 100కు చేరింది. ఇక 18 బంతుల్లో 24 పరుగుల సమీకరణం వద్ద అవేశ్ బౌలింగ్‌కు దిగడంతో మ్యాచ్ స్వరూపమే మారింది. చెత్త బంతులేసిన అవేశ్ ఖాన్ రెండు ఫోర్లు సహా 12 పరుగులు సమర్పించుకున్నాడు. తర్వాతి ఓవర్ అర్ష్‌దీప్ వేయగా స్టబ్స్ 4, 4, 0, 0, 4, 4లతో ఇంకో ఓవర్ మిగిలుండగానే మ్యాచ్‌ను ముగించాడు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: సామ్సన్ (బి) జాన్సెన్ 0; అభిషేక్ (సి) జాన్సెన్ (బి) కొయెట్జీ 4; సూర్యకుమార్ (ఎల్బీడబ్ల్యూ) (బి) సిమ్‌లేన్ 4; తిలక్ (సి) మిల్లర్ (బి) మార్క్‌రమ్ 20; అక్షర్ (రనౌట్) 27; పాండ్యా (నాటౌట్) 39; రింకూ (సి) కొయెట్జీ (బి) పీటర్ 9; అర్ష్‌దీప్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 14; మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 124. **వికెట్ల పతనం:** 1–0, 2–5, 3–15, 4–45, 5–70, 6–87. **బౌలింగ్:** జాన్సెన్ 4–1–25–1, కొయెట్జీ 4–0–25–1, సిమ్‌లేన్ 3–0–20–1, కేశవ్ 4–0– 24–0, మార్క్‌రమ్ 1–0–4–1, పీటర్ 4–0–20–1.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: రికెల్టన్ (సి) రింకూ (బి) అర్ష్‌దీప్ 13; హెండ్రిక్స్ (బి) వరుణ్ 24; మార్క్‌రమ్ (బి) వరుణ్ 3; స్టబ్స్ (నాటౌట్) 47; జాన్సెన్ (బి) వరుణ్ 7; క్లాసెన్ (సి) రింకూ (బి) వరుణ్ 2; మిల్లర్ (బి) వరుణ్ 0; సిమ్‌లేన్ (బి) బిష్ణోయ్ 7; కొయెట్జీ (నాటౌట్) 19; ఎక్స్‌ట్రాలు 6; మొత్తం (19 ఓవర్లలో 7 వికెట్లకు) 128. **వికెట్ల పతనం:** 1–22, 2–33, 3–44, 4–64, 5–66, 6–66, 7–86. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4–0–41–1, అవేశ్ 3–0–23–0, హార్దిక్ 3–0–22–0, వరుణ్ 4–0–17–5, రవి బిష్ణోయ్ 4–0–21–1, అక్షర్ 1–0–2–0.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీఎస్‌ఆర్‌టీసీ-కర్నూలు జోన్‌లో 295 అప్రెంటిస్‌లు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఏపీఎస్‌ఆర్‌టీసీ), కర్నూలు జోన్.. వివిధ ట్రేడుల్లో అప్రెంటిస్ శిక్షణకు సంబంధించి ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం ఖాళీల సంఖ్య:** 295.

» **కర్నూలు జోన్ పరిధిలోని జిల్లాలు:** కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య. » కర్నూలు–47, నంద్యాల–45,అనంతపురం–53, శ్రీసత్యసాయి–37,కడప–65,అన్నమయ్య–48.
» **ట్రేడులు:** డీజిల్ మెకానికల్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్, ఫిట్టర్, మెషినిస్ట్, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్.
» **అర్హత:** సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మార్కులు, ఇంటర్వ్యూ, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:**ఆన్‌లైన్ ద్వారా »**దరఖాస్తులకు చివరితేది:**19.11.2024
» **సర్టిఫికేట్లు పరిశీలించే స్థలం:** ఆర్‌టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజ్, ఏపీఎస్‌ఆర్‌టీసీ, బళ్లారి చౌరస్తా, కర్నూలు.
» **వెబ్‌సైట్:** https://www.apsrtc.ap.gov.in

ఏపీఎస్‌ఆర్‌టీసీ-విజయవాడ జోన్‌లో 311 అప్రెంటిస్‌లు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఏపీఎస్‌ఆర్‌టీసీ),విజయవాడ జోన్ వివిధ ట్రేడుల్లో అప్రెంటిస్ శిక్షణకు ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం ఖాళీల సంఖ్య:** 311.
» **విజయవాడ జోన్ పరిధిలోని జిల్లాలు:** కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఏలూరు, పశ్చిమ గోదావరి.
» **జిల్లాల వారీగా ఖాళీలు:** కృష్ణా–41, ఎన్టీఆర్–99, గుంటూరు–45, బాపట్ల–26, పల్నాడు–45, ఏలూరు–24, పశ్చిమ గోదావరి–31.
» **ట్రేడులు:** డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్, ఫిట్టర్, మెషినిస్ట్, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్.
» **అర్హత:** అభ్యర్థి సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మార్కులు, ఇంటర్వ్యూ, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.11.2024.
» **సర్టిఫికేట్లు పరిశీలించే స్థలం:** ఆర్‌టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజ్, ఏపీఎస్‌ఆర్‌టీసీ, చెరువు సెంటర్, విద్యాధరపురం, విజయవాడ.
» **వెబ్‌సైట్:** https://www.apsrtc.ap.gov.in

ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్(ఈఐఎల్)లో 12 పోస్టులు

ఢిల్లీలోని ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్(ఈఐఎల్) వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 12.
» **పోస్టుల వివరాలు:** మేనేజర్–04, డిప్యూటీ మేనేజర్–04, జూనియర్ సెక్రటరీ–04. » **విభాగాలు:** రాక్ ఇంజనీరింగ్, జియాలజీ, హైడ్రాలజీ, మైనింగ్, సెక్రటేరియల్ సర్వీసెస్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఈ/బీటెక్,ఎంఎస్సీ,ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** మేనేజర్ పోస్టులకు 36 ఏళ్లు, మిగతా పోస్టులకు 32 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** విద్యార్హతలు, పని అనుభవం, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **పనిచేయాల్సిన ప్రదేశాలు:** ఢిల్లీ, గురుగ్రామ్, చెన్నై, వడోదర, కోల్‌కతా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.11.2024.
» **వెబ్‌సైట్:** https://engine-rsindia.com

» జేఈఈ-మెయిన్ షెడ్యూల్ విడుదల
» రెండు సెషన్లలో జేఈఈ-మెయిన్ 2025
» తొలి సెషన్ జనవరి 22-31, రెండో సెషన్ ఏప్రిల్ 1-8 తేదీల మధ్య
» పేపర్-1 సెక్షన్-బిలో ఛాయిస్ తొలగింపు

ప్రాక్టీస్‌తోనే జేఈఈలో జయం!

జేఈఈ-మెయిన్.. నిట్‌లు, ట్రిపుల్ ఐటీలతోపాటు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇతర టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్స్‌లో.. బీటెక్‌లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష! అంతేకాకుండా ప్రతిష్టాత్మక ఐఐటీల్లో ప్రవేశానికి జరిపే జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ఈ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగానే అభ్యర్థులను ఎంపిక చేస్తారు. దీంతో ఈ పరీక్షకు దేశవ్యాప్తంగా ఏటా లక్షల మంది సన్నద్ధమవుతున్నారు. జేఈఈ -మెయిన్-2025 షెడ్యూల్‌ను ఎన్‌టీఏ తాజాగా విడుదల చేసింది! ఈ నేపథ్యంలో.. జేఈఈ-మెయిన్ పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, బెస్ట్ స్కోర్‌కు ప్రిపరేషన్ తదితర వివరాలు..

గత ఏడాది మాదిరిగానే 2025 జేఈఈ–మెయిన్‌ను ఈ సంవత్సరం కూడా రెండు సెషన్లుగా నిర్వహించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ప్రకటించింది. తొలి సెషన్‌ను జనవరి 22నుంచి 31 వరకు 10 రోజులపాటు; రెండో సెషన్‌ను ఏప్రిల్ 1 నుంచి 8 వరకు ఎనిమిది రోజుల పాటు నిర్వహించనుంది. అభ్యర్థులు తమ ఆసక్తి మేరకు ఒకే సెషన్‌కు లేదా రెండు సెషన్లకు హాజరు కావచ్చు.

జేఈఈ-మెయిన్ పేపర్లు ఇలా

జేఈఈ–మెయిన్‌లో బీఈ/బీటెక్ అభ్యర్థులకు పేపర్–1, బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అభ్యర్థులకు పేపర్–2ఎ, బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్ కోర్సుల విద్యార్థులకు పేపర్–2బి నిర్వహిస్తారు.

అర్హత

ఎంపీసీ గ్రూప్‌తో ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన కోర్సులో 2023, 2024లో ఉత్తీర్ణత సాధించిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. అదేవిధంగా 2025లో ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తుకు అర్హులే.

ఛాయిస్ విధానం తొలగింపు

జేఈఈ–మెయిన్–2025లో పేపర్–1లోని పార్ట్–బిలో ఛాయిస్ విధానాన్ని తొలగించారు. పార్ట్–బిలో ఈసారి అయిదు ప్రశ్నలే అడుగుతారు. విద్యార్థులు ఈ అయిదు ప్రశ్నలకు తప్పనిసరిగా సమాధానం ఇవ్వాలి. ఎలాంటి ఛాయిస్ ఉండదు. మూడు సబ్జెక్ట్‌ల(మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ)లో పార్ట్–ఎ నుంచి 20 ప్రశ్నలు, పార్ట్–బి నుంచి 5 ప్రశ్నలు చొప్పున మొత్తం 75 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు 4 మార్కులు చొప్పున మొత్తం 300 మార్కులకు పేపర్–1ను నిర్వహించనున్నారు.

రెండింటికీ.. ఇలా

జేఈఈ–మెయిన్‌లో మంచి స్కోర్ సాధించడానికి ఆయా సబ్జెక్ట్‌లకు లభిస్తున్న వెయిటేజీని అనుసరిస్తూ ప్రిపరేషన్ సాగించాలి. అదే సమయంలో బోర్డ్ పరీక్షల ప్రిపరేషన్‌ను సమన్వయం చేసుకోవాలి. ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు.. నిర్దిష్ట టైమ్ ప్లాన్‌తో ఒకే సమయంలో రెండు పరీక్షలకు ప్రిపరేషన్ సాగించొచ్చు. జేఈఈ–మెయిన్ జనవరి సెషన్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు డిసెంబర్ నుంచి ఇంటర్మీడియెట్, జేఈఈ–మెయిన్ రెండింటిలో ఉన్న ఉమ్మడి అంశాల పునశ్చరణకు అధిక సమయం కేటాయించాలి. తద్వారా రెండు పరీక్షలకు ఒకే సమయంలో ప్రిపరేషన్ పూర్తవుతుంది.

అప్లికేషన్స్, కాన్సెప్ట్స్

ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఆయా సబ్జెక్ట్‌లకు అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో ప్రిపరేషన్ సాగించాలి. ప్రధానంగా మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్ట్‌ల బేసిక్ కాన్సెప్ట్స్‌పై పట్టు సాధించాలి. వాటిని వాస్తవ పరిస్థితులతో అన్వయం చేసుకుంటూ చదవాలి. అదే విధంగా చదివే సమయంలోనే ముఖ్యమైన ఫార్ములాలు,కీ పాయింట్స్‌ను షార్ట్ నోట్స్‌గా రూపొందించుకోవాలి. ఇది ఇంటర్, జేఈఈ–మెయిన్ రెండు పరీక్షల రివిజన్ పరంగా ఎంతో కలిసొస్తుంది. ఇంటర్ సబ్జెక్ట్‌లపై పూర్తి స్థాయి అవగాహనతో జేఈఈ–మెయిన్‌లోనూ ఉత్తమ ప్రతిభ చూపేందుకు అవకాశం ఉంటుంది.

ప్రాక్టీస్.. ప్రాక్టీస్

ఇంటర్, జేఈఈ–మెయిన్ రెండు పరీక్షల్లో రాణించేందుకు ప్రాక్టీస్ అత్యంత కీలకం. ప్రతిరోజు తాము చదివిన టాపిక్‌కు సంబంధించి అందులోంచి ప్రశ్నలు అడిగే ఆస్కారం ఉన్న అంశాలను ప్రాక్టీస్ చేయాలి. వాస్తవానికి జేఈఈ–మెయిన్ సిలబస్‌లో ఇంటర్మీడియెట్ మొదటి, ద్వితీయ సంవత్సరం సిలబస్ టాపిక్స్‌కు సమ ప్రాధాన్యం ఉంటోంది. కాబట్టి విద్యార్థులు రెండు సంవత్సరాల సిలబస్‌పై పట్టు సాధించేలా కృషి చేయాలి.

సిలబస్ అనుసంధానం

జేఈఈ–మెయిన్ విద్యార్థులు.. మొదటి, ద్వితీయ సంవత్సరం సిలబస్‌ను అనుసంధానం చేసుకుంటూ చదవాలి. ప్రతి చాప్టర్‌కు సంబంధించి మొదటి సంవత్సరం అంశాలతోనూ సమన్వయం చేసుకుంటూ అధ్యయనం చేయాలి. ఫలితంగా సంబంధిత అంశంపై పూర్తి స్థాయిలో అవగాహన లభిస్తుంది. ప్రశ్నను ఎలా అడిగినా సమాధానం ఇచ్చే నైపుణ్యం సొంతమవుతుంది.

న్యూమరికల్ ప్రశ్నలకు

జేఈఈ–మెయిన్ ప్రిపరేషన్‌లో భాగంగా విద్యార్థులు న్యూమరికల్ టైప్ కొశ్చన్స్ ప్రిపరేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. జేఈఈ–మెయిన్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్.. ఈ మూడు సబ్జెక్ట్‌ల నుంచీ అయిదు ప్రశ్నలు చొప్పున న్యూమరికల్ ఆధారిత ప్రశ్నలు అడగనున్నారు. కాబట్టి విద్యార్థులు అప్లికేషన్ ఆధారిత ప్రిపరేషన్‌తోపాటు ఆయా సబ్జెక్ట్‌లలో న్యూమరిక్స్ ఆధారంగా సమాధానం సాధించాల్సిన అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

మాక్ టెస్ట్‌లు

జేఈఈ–మెయిన్, ఇంటర్మీడియెట్‌ల విద్యార్థులు మాక్ టెస్ట్‌లకు హాజరవడం మేలు చేస్తుంది. అదే విధంగా ఇంటర్ ప్రీ–ఫైనల్ టెస్ట్‌లకు హాజరు కావడం, వాటి ఫలితాలను విశ్లేషించుకోవడం ద్వారా ప్రిపరేషన్‌ను మెరుగుపరచుకోవచ్చు. జనవరి సెషన్‌కు హాజరయ్యే విద్యార్థులు అధిక సమయాన్ని పునశ్చరణకు, వీక్లీ టెస్ట్‌లకు, మాక్ టెస్ట్‌లకు కేటాయించాలి.

టైమ్ మేనేజ్‌మెంట్

విద్యార్థులు టైమ్ మేనేజ్‌మెంట్ ఎంతో ముఖ్యమని గుర్తించాలి. ప్రతి రోజు ప్రతి సబ్జెక్ట్ చదివే విధంగా సమయం కేటాయించాలి. ప్రతి సబ్జెక్ట్‌ను కనీసం రెండు గంటలు అధ్యయనం చేయాలి. తమకు బాగా సులభమైన సబ్జెక్ట్‌కు కొంత తక్కువ సమయం కేటాయించి.. క్లిష్టంగా భావించే సబ్జెక్ట్‌లకు కొంత ఎక్కువ సమయం చదవాలి. క్లిష్టంగా భావించిన సబ్జెక్ట్‌లు, అంశాల విషయంలోనూ కనీసం బేసిక్ ఫార్ములాలు తెలుసుకోవాలి. అంతకుముందు రోజు చదివిన అంశాన్ని ఒకసారి పునశ్చరణ చేసుకునే విధంగా కనీసం పది నిమిషాలు కేటాయించాలి.

ఏప్రిల్ సెషన్

ఏప్రిల్‌లో నిర్వహించే రెండో సెషన్‌కు అభ్యర్థుల సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. జనవరి సెషన్‌లో సరైన స్కోర్ సాధించని వారు ఏప్రిల్ సెషన్‌కు హాజరవుతున్నారు. డిసెంబర్‌లో ఇంటర్ సిలబస్ పూర్తి చేసుకున్న విద్యార్థులు.. ఆ తర్వాత సమయంలో జేఈఈ–మెయిన్ పరీక్ష సిలబస్‌ను పరిశీలించి.. దానికి అనుగుణంగా ఫిబ్రవరి చివరి వారం వరకు ప్రిపరేషన్ సాగించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇంటర్ పరీక్షలు పూర్తయిన తర్వాత జేఈఈ–మెయిన్ ఏప్రిల్ సెషన్ తేదీకి మధ్య ఉన్న వ్యవధిని పూర్తిగా రివిజన్, మాక్ టెస్ట్‌ల ప్రాక్టీస్‌కు కేటాయించాలి.

లోపాలు అధిగమిస్తూ

జేఈఈ–మెయిన్ జనవరి సెషన్‌కు హాజరై ఆశించిన స్థాయిలో మార్కులు సాధించలేక పోయిన విద్యార్థులు ఏప్రిల్ సెషన్‌కు హాజరవుతారు. ఈ విద్యార్థులు జనవరి సెషన్‌లో తాము చేసిన పొరపాట్లను గుర్తించి..వాటిని సరిదిద్దుకోవాలి. జనవరి సెషన్ 'కీ' ఆధారంగా, తమ ఆన్సర్ షీట్లను పరిశీలించుకోవాలి. తద్వారా తాము ఇంకా పట్టు సాధించాల్సిన అంశాలను గుర్తించి వాటిపై దృష్టి పెట్టాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **జనవరి సెషన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024,నవంబర్ 22
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్:** పరీక్ష తేదీకి మూడు రోజుల ముందు నుంచి
- **జనవరి సెషన్ పరీక్ష తేదీలు:** 2025 జనవరి 22 నుంచి 31 వరకు
- **ఫలితాల వెల్లడి:** 2025, ఫిబ్రవరి 12



- **రెండో సెషన్ దరఖాస్తు తేదీలు:** 2025 జనవరి 31 నుంచి ఫిబ్రవరి 24 వరకు
- **రెండో సెషన్ పరీక్ష తేదీలు:** 2025 ఏప్రిల్ 1 నుంచి 8 వరకు
- **రెండో సెషన్ ఫలితాల వెల్లడి:** 2025 ఏప్రిల్ 17.
- **వెబ్‌సైట్:** https://jeemain.nta.ac.in

సబ్జెక్ట్ వారీగా ముఖ్యమైన అంశాలు

మ్యాథమెటిక్స్

ఈ సబ్జెక్ట్‌లో రెండు సంవత్సరాల సిలబస్‌కు సంబంధించి ప్రతి చాప్టర్‌ను తప్పనిసరిగా ప్రాక్టీస్ చేయాలి. ముఖ్యంగా 3–డి జామెట్రీ,కో ఆర్డినేట్ జామెట్రీ, వెక్టార్ ఆల్జీబ్రా, ఇంటిగ్రేషన్, కాంప్లెక్స్ నెంబర్స్, పారాబోలా, ట్రిగ్నోమెట్రిక్ రేషియోస్‌పై పట్టు సాధించాలి. వీటితోపాటు క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, థియరీ ఆఫ్ ఈక్వేషన్స్,పెర్ముటేషన్ అండ్ కాంబినేషన్, బైనామియల్ థీరమ్,లోకస్ అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి.

ఫిజిక్స్

విద్యార్థులు కొంత క్లిష్టంగా భావించే ఫిజిక్స్‌లో న్యూమరికల్ అప్లికేషన్ అప్రోచ్‌కు ప్రాధాన్యమివ్వాలి. ఎలక్ట్రో డైనమిక్స్, హీట్ అండ్ థర్మోడైనమిక్స్, మెకానిక్స్, మోడ్రన్ ఫిజిక్స్, ఆప్టిక్స్, ఎస్‌హెచ్‌ఎం అండ్ వేవ్స్‌పై పట్టు సాధించాలి. సెంటర్ ఆఫ్ మాస్, మొమెంటమ్ అండ్ కొలిజన్, సింపుల్ హార్మోనిక్ మోషన్, వేవ్ మోషన్ అండ్ స్ట్రింగ్ వేవ్స్‌పై అవగాహన ఏర్పరచుకుంటే మంచి మార్కులు సొంతం చేసుకోవచ్చు. ప్రిపరేషన్ సమయంలోనే ఆయా అంశాల ప్రాథమిక భావనలను వాస్తవ పరిస్థితులతో అన్వయించుకుంటూ అధ్యయనం చేయాలి.

కెమిస్ట్రీ

విద్యార్థులు కొంత సులభంగా భావించే సబ్జెక్ట్.. కెమిస్ట్రీ. ఇందులో మెరుగైన సన్నద్ధత పొందితే స్కోర్ పెంచుకునే అవకాశం ఉంది. కెమిస్ట్రీలో అడిగే ప్రశ్నలు కెమికల్ బాండింగ్, పీరియాడిక్ టేబుల్, బ్రేకింగ్‌ల మూలాల నైపుణ్యాలను తెలుసుకునే విధంగా ఉంటున్నాయి. కాబట్టి అభ్యర్థులు మోల్ కాన్సెప్ట్, కోఆర్డినేషన్ కెమిస్ట్రీ, ఆల్కహాల్, ఫినాల్స్, ఈథర్స్, పి–బ్లాక్ ఎలిమెంట్స్, అటామిక్ స్ట్రక్చర్, గ్యాసియస్ స్టేట్, ఆల్డిహైడ్స్ అండ్ కీటోన్స్, జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, డి అండ్ ఎఫ్ బ్లాక్ ఎలిమెంట్స్‌పై పట్టు సాధించాలి.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	55	79,486
నిఫ్టీ ▽	51	24,148

విదేశీ సూచీలు

నాస్‌డాక్	19,288	△	18
డోజోన్స్	44,007	△	277
ఎఫ్‌టీఎస్ఈ 100	8,072	▽	68
డాక్స్	19,215	▽	147
షాంఘై	3,452	▽	18
నికాయ్	39,500	△	119

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు (రూ. లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.68	84.70
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	107.61	110.46
€	యూరో	ఎస్‌బీఐ	89.62	92.32
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.27	55.71
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.22	56.41
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.55	66.32
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.51	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.04	23.81
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.89	12.65

ఐపీవోలో 'లక్కు' కుదరాలంటే...



- కిటుకులు తెలియాలి
- ఒకటికి మించిన దరఖాస్తులు
- ఇందుకు బంధు, మిత్రుల సహకారం అవసరం
- ఎన్ఐఐ విభాగంలోనూ పాల్గొనొచ్చు
- వాటాదారుల కోటా మరొక మార్గం



ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో).. ఎక్స్ లేదా వై లేదా జెడ్.. ఇన్వెస్టర్ల నుంచి పదులు, వందల రెట్ల అధిక స్పందన కనిపిస్తోంది. ముఖ్యంగా సంస్థాగత ఇన్వెస్టర్లకు దీటుగా రిటైలర్లూ దూకుడుగా ఐపీవోల్లో బిడ్ వేస్తున్నారు. చాలా ఇష్యూలు లిస్టింగ్‌లో లాభాలు కురిపిస్తుండడంతో ప్రైమరీ మార్కెట్ ఇన్వెస్టర్లకు ఆకర్షణీయంగా మారిపోయింది. ఇది ఏ స్థాయిలో అంటే బీఎస్ఈ ఎస్ఎంఈ, ఎన్ఎస్ఈ ఎమర్జ్ ప్లాట్‌ఫామ్‌లపై లిస్ట్ అయ్యే చిన్న కంపెనీల ఐపీవోలకూ ఎన్నో రెట్ల అధిక బిడ్లు దాఖలవుతున్నాయి. దీంతో ఐపీవో ఆకర్షణీయ మార్కెట్‌గా మారిపోయింది. సామాజిక మాధ్యమాల్లోనూ ఐపీవో పోస్ట్‌లకు మంచి ఫాలోయింగ్ ఉంటోంది. స్పందన పెరిగిపోవడం వల్ల చివరికి కొద్ది మందినే షేర్లు వరిస్తున్నాయి. కానీ, కొన్ని చిట్కాలు పాటించడం ద్వారా డిమాండ్ ఉన్న ఐపీవోలో అలాట్‌మెంట్ అవకాశాలను పెంచుకోవచ్చు. ఇందుకు ఏమి చేయాలన్నది చూద్దాం.

– సాక్షి, బిజినెస్ డెస్క్

తిరస్కరణకు దూరంగా..

కొన్ని తప్పుల కారణంగా దరఖాస్తులు తిరస్కరణకు గురవుతుంటాయి. ఒకటే పాన్ ఆధారంగా వేర్వేరు ఖాతాల నుంచి బిడ్లు వేయడం ఇందులో ఒకటి. బిడ్ వేయడానికి ఉపయోగించిన బ్యాంక్ ఖాతాలోని పేరు, డీమ్యాట్ ఖాతాలోని పేరు ఒకే విధంగా ఉండాలి. ఏదైనా ఐపీవో ఇష్యూ విజయవంతం కావాలంటే కనీసం 90% మేర సబ్‌స్క్రిప్షన్ రావాల్సి ఉంటుంది.


ఒకటికి మించిన దరఖాస్తులు

ఐపీవోలో షేర్ల అలాట్‌మెంట్ అవకాశాలను పెంచుకోవాలంటే, ఒకటికి మించిన పాన్‌ల ద్వారా దరఖాస్తు చేసుకోవడం తెలివైన ఆప్షన్. మనలో కొంత మంది తమకున్న వివిధ డీమ్యాట్ ఖాతాల ద్వారా ఒకటికి మించిన బిడ్లు సమర్పిస్తుంటారు. కానీ, ఒకే పాన్ నంబర్‌పై ఒకటికి మించిన బిడ్లు వేయడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదు. అప్పుడు మొదటికే మోసం వస్తుంది. అన్ని బిడ్లు తిరస్కరణకు గురవుతాయి. ఒకటికి మించిన బిడ్లు వేయడం సెబీ నిబంధనలకు విరుద్ధం. దీనికి బదులు తమ తల్లిదండ్రులు, సోదర సోదరీమణులు, జీవిత భాగస్వామి పేరిట దరఖాస్తు చేసుకోవచ్చు. వివిధ పాన్ నంబర్లతో దరఖాస్తులు సమర్పించడం వల్ల షేర్లు కచ్చితంగా వస్తాయని చెప్పలేం. కానీ కేటాయింపుల అవకాశాలు కచ్చితంగా మెరుగుపడతాయి. కొందరు స్నేహితుల సాయంతోనూ ఒకటికి మించిన దరఖాస్తులు సమర్పిస్తుంటారు. రిటైల్ ఇన్వెస్టర్ల కోటాలో కనీసం ఒక లాట్‌కు బిడ్ వేయాలి. ఒకటికి మించిన లాట్లతో బిడ్లు సమర్పించినప్పటికీ స్పందన అధికంగా ఉంటే, చివరికి ఒక్కటే లాట్ (కనీస షేర్లు) వస్తుంది. ఉదాహరణకు ఇటీవలే ముగిసిన బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ ఐపీవో ఒక లాట్ పరిమాణం 214 షేర్లు. విలువ రూ.14,980. ఒక ఇన్వెస్టర్ రూ.74,900తో ఐదు లాట్లకు బిడ్ వేసినా కానీ, ఒక్కటే లాట్ అలాట్ అయి ఉండేది. ఎందుకంటే ఇష్యూ పరిమాణంతో పోల్చితే 60 రెట్లు అధిక బిడ్లు దాఖలు కావడం గమనార్హం. తమ కుటుంబ సభ్యులు, స్నేహితుల సహకారంతో ఒకటికి మించిన బిడ్లు సమర్పించడం వల్ల కొన్ని సందర్భాల్లో అదృష్టం కొద్దీ ఒకటికి మించిన దరఖాస్తులకు కేటాయింపులు రావచ్చు.



వాటాదారుల కోటా..

ఐపీవోకు వస్తున్న కంపెనీ మాతృసంస్థ (పేరెంట్) అప్పటికే స్టాక్ మార్కెట్లో లిస్ట్ అయి ఉంటే, వాటాదారుల కోటాను ఉపయోగించుకోవచ్చు. ఇటీవలే ముగిసిన బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ ఐపీవోలో బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్ వాటాదారులకు 7.62 శాతం షేర్లను రిజర్వ్ చేశారు. బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ అన్నది బజాజ్ ఫైనాన్స్ సబ్సిడరీ. అలాగే, బజాజ్ ఫైనాన్స్ అన్నది బజాజ్ ఫిన్‌సర్వ్ సబ్సిడరీ. దీంతో రెండు కంపెనీల వాటాదారులకూ షేర్‌హోల్డర్స్ కోటా లభించింది. ఐపీవోకు వస్తున్నది కొత్త కంపెనీ అయితే ఇందుకు అవకాశం ఉండదు. లిస్టెడ్ కంపెనీల సబ్సిడరీలు ఐపీవోలకు వస్తుంటే, ముందుగానే ఆయా లిస్టెడ్ సంస్థలకు సంబంధించి ఒక్క షేరు అయినా డీమ్యాట్ అకౌంట్‌లో ఉంచుకుంటే సరిపోతుంది. ఐపీవోకి సెబీ నుంచి అనుమతి రావడానికి ముందే ఈ పనిచేయాలి.



కసరత్తు అవసరం..

లిస్టింగ్ రోజే లాభాలు తీసుకుందామనే ధోరణితో ఐపీవోల్లో పాల్గొనడం అన్ని సందర్భాల్లో ఫలితమివ్వదు. పైగా ఈ విధానంలో రిస్క్‌ను ఎదుర్కోవాల్సి వస్తుంది. జారీ ధర కంటే తక్కువకు లిస్ట్ అయ్యేవీ ఉంటాయి. అలాంటి సందర్భంలో నష్టానికి విక్రయించకుండా దీర్ఘకాలం పాటు కొనసాగించగలరా? అని ప్రశ్నించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. కేవలం లిస్టింగ్ లాభం కోసం దరఖాస్తు చేసుకుంటే.. లిస్టింగ్ నాడు నష్టం వచ్చినా విక్రయించాల్సిందే. దీర్ఘకాల దృష్టితో దరఖాస్తు చేసుకుంటే, మెరుగైన ఫలితాలు చూడొచ్చు. లిస్టింగ్ ఆశావహంగా లేకపోయినా, కంపెనీ వ్యాపార అవకాశాల దృష్ట్యా పెట్టుబడి కొనసాగించొచ్చు. ఇటీవలి ఐపీవోల్లో చాలా వరకు అధిక వేల్యుయేషన్‌పైనే నిధులు సమీకరిస్తున్నాయి. అలాంటి కొన్ని లిస్టింగ్ తర్వాత ర్యాలీ చేస్తున్నాయి. ఐపీవో ముగిసి లిస్టింగ్ నాటికి మార్కెట్ దిద్దుబాటులోకి వెళితే.. అధిక వ్యాల్యూషన్‌పై వచ్చిన కంపెనీ షేర్లు లిస్టింగ్‌లో నష్టాలను మిగల్చవచ్చు.

బిడ్స్ ఇలా...

త్వరలో ఐపీవోకు రానున్న ప్రముఖ ఎలక్ట్రిక్ టూవీలర్ల కంపెనీ ఏథర్ ఎనర్జీ సైతం లిస్టెడ్ సంస్థ హీరో మోటోకార్ప్ వాటాదారులకు కోటా రిజర్వ్ చేసింది. ఏథర్ ఎనర్జీలో హీరో మోటోకార్ప్‌కు 35 శాతానికి పైగా వాటా ఉండడం ఇందుకు కారణం. రిటైల్ ఇన్వెస్టర్ల విభాగంలో దరఖాస్తు పెట్టుకున్నవారు.. విడిగా వాటాదారుల కోటాలోనూ గరిష్ఠంగా రూ.2 లక్షల విలువకు బిడ్ సమర్పించొచ్చు. రూ.2 లక్షలకు మించి నాన్ ఇనిస్టిట్యూషనల్ కోటాలోనూ పాల్గొనొచ్చు. ఎల్ఐసీ ఐపీవో సమయంలో పాలసీదారుల కోసం విడిగా షేర్లను రిజర్వ్ చేయడం గుర్తుండే ఉంటుంది.

జాక్‌పాట్

డిమాండ్ ఉన్న కంపెనీ షేర్లను సొంతం చేసుకునేందుకు పదుల సంఖ్యలో ఖాతాల ద్వారా అదృష్టాన్ని పరీక్షించుకునే వారూ ఉన్నారు. దీన్నొక ఆదాయ మార్గంగా మలుచుకుని కృషి చేస్తున్నవారు కూడా కనిపిస్తుంటారు. చెన్నైకి చెందిన ఆదేష్ (30) ఇటీవలి బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ ఐపీవోలో జాక్‌పాట్ కొట్టేశాడు. వేర్వేరు పేర్లతో ఉన్న 18 డీమ్యాట్ ఖాతాల ద్వారా షేర్‌హోల్డర్ కేటగిరీ కింద బిడ్లు సమర్పించాడు. అదృష్టం తలుపుతట్టడంతో 14 డీమ్యాట్ ఖాతాలకూ వాటాదారుల కోట కింద కేటాయింపు లభించింది. అలాగే, హెచ్ఎన్ఐ కోటా కింద కూడా దరఖాస్తు చేశాడు. మొత్తం 39 లాట్లు దక్కాయి. అంటే మొత్తం 8,346 షేర్లు అతడిని వరించాయి. ఇష్యూ ధరతో పోల్చితే లిస్టింగ్ రోజున బజాజ్ ఫైనాన్స్ ఒక దశలో 136 శాతం వరకు ర్యాలీ చేయడం గమనించొచ్చు.

రుణం తీసుకుని మరీ..

వ్యాపారం నిర్వహించే హర్ష (25) ఐదు వ్యక్తిగత డీమ్యాట్ ఖాతాలు, ఒక హెచ్‌యూఎఫ్ డీమ్యాట్ ఖాతా ద్వారా బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ ఐపీవోలో పాల్గొన్నాడు. అప్పటికే తనకున్న ఈక్విటీ షేర్లను తనఖాపెట్టి ఎన్‌బీఎఫ్‌సీ నుంచి రూ.కోటి రుణం తీసుకుని మరీ హెచ్ఎన్ఐ విభాగంలో బిడ్ వేశాడు. మొత్తం మీద 19 లాట్లు దక్కించుకున్నాడు.

వాటాదారుల కోటాలో..

ఐటీ ఉద్యోగి అయిన ధీరజ్ మెహ్రా (43) ముందుగానే బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు కొని పెట్టుకున్నాడు. షేర్‌హోల్డర్స్ కోటా కింద బిడ్లు వేశాడు. మొత్తం 11 డీమ్యాట్ ఖాతాలను ఉపయోగించుకున్నాడు. 6 లాట్ల షేర్లు అలాట్ అయ్యాయి.

ఎస్ఎంఈ ఐపీవోలు

మెయిన్‌బోర్డ్ ఐపీవోల్లో రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం ఒక లాట్ (రూ.15,000)కు దరఖాస్తు చేసుకోవచ్చు. అదే ఎస్ఎంఈ ఐపీవో అయితే కనీస లాట్ విలువ రూ.లక్ష, అంతకు మించి ఉంటుంది. కనుక చిన్న ఇన్వెస్టర్లు అందరూ వీటిలో పాలు పంచుకోలేరు. బీఎస్ఈ ఎస్ఎంఈ, ఎన్ఎస్ఈ ఎమర్జ్ ప్లాట్‌ఫామ్‌లపై ఈ కంపెనీలు లిస్ట్ అవుతాయి. ఆరంభ స్థాయిలోని చిన్న, మధ్య స్థాయి కంపెనీలు సులభంగా ప్రజల నుంచి నిధులు సమీకరించి, లిస్ట్ అయ్యేందుకు ఈ వేదికలు వీలు కల్పిస్తుంటాయి. ఇటీవలి కాలంలో ఎస్ఎంఈ ఐపీవోలకు సైతం అనూహ్య స్పందన వస్తోంది. దీనికి కారణం గత రెండేళ్లుగా ఎస్ఎంఈ సూచీ ఏటా 39 శాతం మేర రాబడి ఇస్తోంది. ఇదే కాలంలో నిఫ్టీ 50 రాబడి 15 శాతం (సీఏజీఆర్) కాగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ రాబడి 37 శాతం చొప్పునే ఉంది. లాట్ పరిమాణం ఎక్కువగా ఉండడంతో ఇక్కడ లిక్విడిటీ (వ్యాల్యూమ్) తక్కువగా ఉంటుంది. కనుక ఇన్వెస్టర్లు లిస్టింగ్ లాభాల ధోరణితో కాకుండా, దీర్ఘకాల దృక్పథంతో ఎస్ఎంఈ ఐపీవోల్లో పాల్గొనడం మంచిది.

నాన్ ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల విభాగం (ఎన్ఐఐ)



అధిక నెట్‌వర్త్ కలిగిన ఇన్వెస్టర్లు ఈ విభాగంలోనే బిడ్లు వేస్తుంటారు. ఇందులో రూ.2–10 లక్షల బిడ్లను స్మాల్ హెచ్ఎన్ఐ కేటగిరీగా, రూ.10 లక్షలకు మించి బిగ్ హెచ్ఎన్ఐ విభాగంగా పరిగణిస్తుంటారు. బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్‌కు రూ.2–10 లక్షల విభాగంలో విలువ ప్రకారం చూస్తే 32 రెట్లు అధికంగా బిడ్లు వచ్చాయి. రూ.10 లక్షలకు పైన కేటగిరీలో 50 రెట్ల బిడ్లు దాఖలయ్యాయి. బిడ్ల విలువతో సంబంధం లేకుండా ప్రతి దరఖాస్తును సమానంగా పరిగణించి, అధిక సబ్‌స్క్రిప్షన్ వచ్చినప్పుడు లాటరీ ఆధారంగా కేటాయింపులు చేస్తారు. ఇనిస్టిట్యూషన్స్ మినహా వ్యక్తులు ఎవరైనా ఈ విభాగంలో బిడ్లు వేసుకోవచ్చు. తద్వారా కేటాయింపుల అవకాశాలను పెంచుకోవచ్చు. ఒక అధ్యయనం ప్రకారం స్మాల్ హెచ్ఎన్ఐ విభాగంలో 3.6 శాతం, బిగ్ హెచ్ఎన్ఐ విభాగంలో 12 శాతం మేర షేర్లను పొందే అవకాశాలు ఉంటాయి. అందుకే ఎన్ని రెట్లు అధికంగా బిడ్లు వచ్చాయనే దానికంటే మొత్తం దరఖాస్తులు ఎన్నన్నేది చూడడం ద్వారా కేటాయింపు అవకాశాలను తెలుసుకోవచ్చు.

రుణంతో దరఖాస్తు...

పేరున్న, వృద్ధికి పుష్కల అవకాశాలున్న కంపెనీ ఐపీవోకు వచ్చింది. దరఖాస్తుకు సరిపడా నిధుల్లేవు. అప్పుడు ఐపీవో ఫండింగ్ (రుణం రూపంలో నిధులు సమకూర్చుకోవడం) ఉపయోగపడుతుంది. కేవలం ఒక లాట్‌కు పరిమితం కాకుండా, పెద్ద మొత్తంలో దరఖాస్తు చేసుకునేందుకు ఐపీవో ఫండింగ్ సాయపడుతుంది. ఒక్కో పాన్‌పై గరిష్ఠంగా రూ.కోటి వరకు ఫండింగ్ తీసుకోవచ్చు. కొన్ని సంస్థలు కనీసం రూ.25 లక్షల పరిమితిని అమలు చేస్తున్నాయి. సాధారణంగా రూ.10లక్షలకు మించిన కేటగిరీలో పాల్గొనే హెచ్ఎన్ఐలు ఈ సదుపాయాన్ని వినియోగించుకుంటుంటారు. రుణ కాలవ్యవధి 6 రోజులుగా ఉంటుంది. 20–30 శాతం వరకు వడ్డీ పడుతుంది. ఫండింగ్ కోసం రుణం ఇచ్చే సంస్థ వద్ద ఖాతా తెరవాలి. అలాగే ఆ సంస్థతో భాగస్వామ్యం కలిగిన బ్రోకరేజీ వద్ద డీమ్యాట్ ఖాతా తెరవాల్సి ఉంటుంది. తనవంతు మార్జిన్‌ను ఇన్వెస్టర్ సమకూర్చుకోవాలి. అప్పుడు మిగిలిన మొత్తాన్ని ఇన్వెస్టర్ ఖాతాకు ఎన్‌బీఎఫ్‌సీ బదిలీ చేస్తుంది. ఒప్పందం ప్రకారం కేటాయించిన షేర్లపై ఎన్‌బీఎఫ్‌సీకి నియంత్రణ ఉంటుంది. లిస్టింగ్ రోజే విక్రయించాల్సి ఉంటుంది. కేటాయించిన ధర కంటే తక్కువకు లిస్ట్ అయితే, మిగిలిన మేర ఇన్వెస్టర్ చెల్లించాలి. లాభం వస్తే, ఎన్‌బీఎఫ్‌సీ వడ్డీ, ఇతర చార్జీలు చెల్లించి మిగిలిన మొత్తాన్ని ఇన్వెస్టర్ వెనక్కి తీసుకోవచ్చు.




జాగ్రత్త అవసరం..

ఇక ఎస్ఎంఈ ఐపీవోల్లో మరింత జాగ్రత్తగా మసలుకోవాలి. ఆరంభ స్థాయి, చిన్న కంపెనీలు కావడంతో వ్యాపారంలో అన్నీ రాణిస్తాయని చెప్పలే. పైగా ప్రమోటర్ల సమర్థత గురించి తెలుసుకోవడానికి సరిపడా సమాచారం లభించదు. ఎస్ఎంఈ విభాగంలో నాణ్యమైన, పేరున్న కంపెనీల ఐపీవోలకే పరిమితం కావడం ద్వారా రిస్క్‌ను తగ్గించుకోవచ్చు. ఎస్ఎంఈ ఐపీవోల పట్ల తగినంత శ్రద్ధ తీసుకోవాలని సెబీ ఇప్పటికే ఇన్వెస్టర్లకు సూచించింది. ట్రాఫిక్‌సాల్ ఐటీఎస్ టెక్నాలజీస్ అనే ఎస్ఎంఈ రూ.45 కోట్లతో ఐపీవో ఇష్యూ చేపట్టగా 345 రెట్ల స్పందన వచ్చింది, అయితే ఈ సంస్థ వెల్లడించిన సమాచారంలో లోపాలపై ఓ ఇన్వెస్టర్ చేసిన ఫిర్యాదు మేరకు, సెబీ జోక్యం చేసుకుని లిస్టింగ్‌ను నిలిపివేయించింది. సదరు కంపెనీ ఐపీవో పత్రాలపై సెబీ దర్యాప్తు చేస్తోంది. మెయిన్‌బోర్డ్ ఐపీవోకు సెబీ అనుమతి మంజూరు చేస్తుంది. ఎస్ఎంఈలకు అయితే బీఎస్ఈ లేదా ఎన్ఎస్ఈ ఆమోదం ఉంటే సరిపోతుంది.

రూ.1.5 కోట్లు ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలి?

ఒక ప్రాపర్టీ అమ్మగా రూ.1.5 కోట్లు వచ్చాయి. వచ్చే 12 ఏళ్ల వరకు వీటితో నాకు అవసరం లేదు. కనుక వీటిని ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేద్దామని అనుకుంటున్నాను. నేను సహేతుక స్థాయిలో రిస్క్ తీసుకోగలను. ఏ తరహా మ్యూచువల్ ఫండ్స్ పథకాలు ఎంపిక చేసుకోవాలి? రూ.1.5 కోట్లను మొత్తం ఎన్ని నెలల కాలంలో ఈక్విటీల్లోకి మళ్లించాలి? నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 ఇండెక్స్ మాదిరి ఇండెక్స్ ఫండ్స్ ఎంపిక చేసుకోవచ్చా? – రాజన్



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రిసెర్చ్

ప్రాపర్టీ అమ్మగా వచ్చిన రూ.1.5 కోట్లు.. మీ మొత్తం సంపద విలువలో 50–60 శాతంగా ఉంటే కనుక, ఇక్కడి నుంచి మూడేళ్ల కాలంలో ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. మీరు ఇన్వెస్ట్ చేసిన వెంటనే మార్కెట్ ఓ పది శాతం మేర పడిపోతే అప్పుడు భావోద్వేగ పరమైన రిస్క్ సులభంగా అధిగమించేందుకు ఇలా చేయాలి. ఒకవేళ మీరు చెప్పిన రూ.1.5 కోట్లు మీ మొత్తం సంపదలో కేవలం 10–15 శాతంగానే ఉంటే అప్పుడు ఆరు నెలల నుంచి ఏడాది కాలంలో పలు వాయిదాలుగా ఈక్విటీ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. 12 ఏళ్ల కాలం ఈక్విటీ పెట్టుబడులకు అనుకూలమైనది. కనుక మీ పెట్టుబడుల్లో 20–50 శాతం మేర మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్, మైక్రోకాప్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. అదే సమయంలో లార్జ్‌క్యాప్ ఫండ్స్‌కు ఎక్కువ మొత్తం కేటాయించుకోవడం వల్ల అనిశ్చిత సమయాల్లో పోర్ట్‌ఫోలియోకి స్థిరత్వం ఉంటుంది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 ఇండెక్స్ ఫండ్ మంచి ఆప్షన్. ఇది ప్యాసివ్ పథకం. కనుక నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 ఇండెక్స్‌లోని కంపెనీల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. యాక్టివ్‌గా పనిచేసే మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఫండ్స్‌ను సైతం పరిగణనలోకి తీసుకోవచ్చు. యాక్టివ్, ప్యాసివ్ ఫండ్స్ మిశ్రమంగా ఉండడం పోర్ట్‌ఫోలియోకి మంచిది. సరైన యాక్టివ్ ఫండ్స్‌ను ఎంపిక చేసుకోవడం కష్టంగా అనిపిస్తే, అప్పుడు ప్యాసివ్ ఫండ్స్‌కు పరిమితం కావొచ్చు.

ఒకే సూచీని అనుసరించి పనిచేసే వివిధ ఇండెక్స్ ఫండ్స్ ఎన్ఏవీల్లో వ్యత్యాసం ఎందుకు ఉంటుంది? – వేణుగోపాల్

ఒకే సూచీని అనుసరించి ఇన్వెస్ట్ చేసే వివిధ ఇండెక్స్ ఫండ్స్ అన్ని ఒకేసారి కాకుండా వివిధ సమయాల్లో ప్రారంభమవుతుంటాయి. ఉదాహరణకు 2000 సంవత్సరంలో ప్రారంభమైన ఇండెక్స్ ఫండ్ ఎన్ఏవీ.. 2022లో ప్రారంభమైన ఇండెక్స్ ఫండ్‌తో పోల్చితే 22 ఏళ్ల కాలం పాటు వృద్ధి చెందుతూ వచ్చింది. కనుక దీర్ఘకాలంగా పనిచేస్తున్న ఇండెక్స్ ఫండ్స్ ఎన్ఏవీ ఎక్కువగా ఉంటుంది. ఎన్ఏవీ రూ.10 అయినా లేక రూ.100 అయినా ఇండెక్స్ పనితీరు ఆధారంగానే రాబడులు ఉంటాయని అర్థం చేసుకోవాలి. ఇండెక్స్‌లో ఎంత శాతం మేర మార్పు వచ్చిందన్నదే ముఖ్యంగా చూడాలి కానీ, ఎన్ఏవీ కాదు. సెన్సెక్స్ 10 శాతం పెరిగితే అప్పుడు సెన్సెక్స్‌లో ఇన్వెస్ట్ చేసే వివిధ ఫండ్స్ ఎన్ఏవీ రూ.10, రూ.100గా ఉన్నప్పటికీ అవి కూడా 10 శాతమే పెరిగి ఉంటాయ్. కనుక ఎన్ఏవీతో సంబంధం లేకుండా ఇండెక్స్ ఆధారితంగా పథకం ఎన్ఏవీలో వృద్ధి ఉంటుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

11-11-2024	
విశాఖ	550–00
చిత్తూరు	593–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	560–00
విజయవాడ	565–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	555–00
వరంగల్	557–00
రిటైల్ ధర	6.15

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
గణాంకాలు, ఫలితాలపై మార్కెట్ దృష్టి | ఏషియన్ పెయింట్స్ లాభం డౌన్

స్టాక్స్ వ్యూ

డాక్టర్ లాల్ పాథ్ ల్యాబ్స్ — బ్రోకరేజ్: ఎమ్‌కే గ్లోబల్ — కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 3,059 **టార్గెట్:** రూ. 3,400

ఎందుకంటే: డయాగ్నోస్టిక్స్ సేవల దిగ్గజం డాక్టర్ లాల్ పాథ్ ల్యాబ్స్ ఈ ఏడాది(2024–25) రెండో త్రైమాసికంలో మెరుగైన ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో మార్జిన్లు 1.1 శాతం బలపడ్డాయి. ఇందుకు స్వస్థ్‌ఫిట్ పనితీరుతోపాటు.. 'సబర్బన్'(డయాగ్నోస్టిక్స్) సహకరించింది. త్రైమాసికవారీగా సబర్బన్ మార్జిన్లు 6 శాతానికి పుంజుకున్నాయి. శాంపిల్ విభాగం పరిమాణం వార్షికంగా 8.6 శాతం వృద్ధి చూపింది. ఇందుకు అధిక బేస్ కొంత కారణంకాగా..



యాజమాన్యం ఈ ఏడాది 15–20 ల్యాబ్‌లను జత చేసుకోవాలని చూస్తోంది. పోటీని దెబ్బకొట్టే ధరల తగ్గింపునకు స్వస్తి పలుకుతుండటంతోపాటు.. సబర్బన్ జోరందుకుంటున్న నేపథ్యంలో రానున్న మూడేళ్ల కాలం(2024–27)లో సంస్థ ఆదాయంలో 13 శాతం వార్షిక వృద్ధికి వీలున్నట్లు భావిస్తున్నాం. పటిష్ట బ్యాలన్స్‌షీట్, డయాగ్నోస్టిక్స్ పరిశ్రమలోనే అత్యుత్తమ మార్జిన్లు, మెరుగుపడుతున్న రిటర్న్ రేషియోలు కంపెనీ షేరుకి ఆకర్షణను తెస్తున్నాయి. తాజా త్రైమాసికంలో వాటాదారులకు షేరుకి రూ. 6 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. రూ. 10.6 కోట్ల పెట్టుబడి వ్యయాలు వెచ్చించింది. ఖాతా పుస్తకాలలో రూ. 1,100 కోట్ల నికర నగదును నమోదు చేసింది. ఈ విభాగంలో ఆర్గనైజ్డ్ సంస్థల నుంచి పెరుగుతున్న పోటీ, ప్రత్యర్థి కంపెనీల చౌక ధరల పోటీ, నిబంధనల సవరణలు, హెల్త్‌కేర్ సర్వీసుల ధరలపై పరిమితులు వంటి అంశాలను కీలక రిస్కులుగా పరిగణించవచ్చు.

టీవీఎస్ మోటార్ కంపెనీ — బ్రోకరేజ్: షేర్‌ఖాన్ — కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 2,467 **టార్గెట్:** రూ. 2,839

ఎందుకంటే: ద్విచక్ర, త్రిచక్ర వాహన దిగ్గజం టీవీఎస్ మోటార్ ఈ ఏడాది(2024–25) రెండో త్రైమాసికంలో అంచనాలకు అనుగుణమైన పనితీరు చూపింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో 11.7 శాతం నిర్వహణ(ఇబిటా) మార్జిన్లు సాధించింది. ఆదాయం 13 శాతంపైగా ఎగసి రూ. 9,228 కోట్లను తాకగా.. అమ్మకాల పరిమాణం 14 శాతం పుంజుకుంది. అయితే సగటు విక్రయ ధరలు(ఏఎస్‌పీ) 0.9 శాతం నీరసించాయి. ఇందుకు చౌక మోడల్ ఈవీ ఐక్యూబ్ అమ్మకాలు ఊపందుకోవడం ప్రభావం చూపింది. ఇబిటా 20 శాతం జంప్ చేసి రూ. 1,080 కోట్లకు చేరింది. ఇబిటా మార్జిన్లు



0.7 శాతం బలపడ్డాయి. వెరసి వరుసగా ఐదవ త్రైమాసికంలోనూ 11 శాతానికి మించిన ఇబిటా మార్జిన్లు సాధించింది. కాగా.. ఈ ఏడాదికి పీఎల్ఐ లబ్ధిని ఆర్థిక ఫలితాలలో ఇప్పటికింకా మదింపు చేయవలసి ఉంది. దేశీ మార్కెట్లో ఐక్యూబ్(ఈవీ) విజయవంతంకావడంతో విదేశాలకు సైతం ఐక్యూబ్ వాహనాల ఎగుమతులను చేపట్టింది. ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధం(అక్టోబర్–మార్చి)లో మరో ఈవీ మోడల్‌ను ప్రవేశపెట్టే యోచనలో కంపెనీ ఉంది. అసంఖ్యాక మోడళ్లకు అవకాశమున్న ఈవీ విభాగంలో కంపెనీ మల్టిపుల్ ప్రొడక్టుల విడుదలపై దృష్టి పెట్టింది. తద్వారా సస్టెయినబుల్ బిజినెస్ మోడల్‌ను అనుసరిస్తోంది. దీంతో విభిన్న ఉపవిభాగాలలో సమయానుగుణ ప్రొడక్టులను ప్రవేశపెట్టడం ద్వారా వృద్ధి అవకాశాలను అందిపుచ్చుకునే వీలున్నట్లు భావిస్తున్నాం.

రోడ్డుపై వెళ్తుంటే ఎవరో పలకరించారు.. ఎక్కడో చూసినట్టు అనిపిస్తున్నా వారెవరో వెంటనే గుర్తుకు రాదు.. ఏదో కొనుక్కొద్దామని దుకాణానికి వెళ్లారు.. వెళ్లాక అదేమిటో గుర్తుకు రాక కాసేపు తలగోక్కుంటారు.. వామ్మో మతిమరపు వచ్చేస్తోందని ఆందోళనపడుతుంటారు. కానీ ఏదో డిటర్జెంట్ ప్రకటనలో మరక మంచిదే అన్నట్టుగా.. 'మరపు మంచిదే'నని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. మతి మరవకుంటే మనిషి మనుగడ ఆగిపోయినట్టేనని తేల్చి చెప్తున్నారు. మరి మతిమరపు ఎందుకు మంచిదో మర్చిపోకుండా తెలుసుకుందామా..

మతి మరవండి.. మంచిదే!



జ్ఞాపకం.. మరపు.. ఎలా జరిగేది?

మెదడులోని న్యూరాన్ కణాల మధ్య ఏర్పడే బంధాలు (సినాప్సెస్) ఎంత బలంగా ఉంటే.. అక్కడ నిక్షిప్తమైన జ్ఞాపకం అంతగా మనలో నాటుకుపోయి ఉంటుంది. ఏదైనా పనిని ప్రత్యేక శ్రద్ధతో, ఏకాగ్రతతో, ఇష్టంతో చేసినప్పుడు.. ఒకే పనిని తరచూ చేస్తూ ఉన్నప్పుడు.. ఆ అంశానికి సంబంధించిన సినాప్సెస్ అంత బలంగా ఏర్పడి, జ్ఞాపకం (మెమరీ)గా మారుతాయి. ఆ పని లేదా అంశానికి సంబంధించి ప్రతిసారీ ప్రత్యేకంగా ఆలోచించాల్సిన అవసరం లేకుండా.. ఆటోమేటిక్ మెమరీగా నిక్షిప్తం అవుతాయి. అదే మనం దేనిపై అయినా సరిగా దృష్టిపెట్టనప్పుడు సినాప్సెస్ బలహీనంగా ఉండి.. ఆ అంశం సరిగా రిజిస్టర్ కాదు. ఇలాంటి వాటిని మెదడు ఎప్పటికప్పుడు తొలగిస్తూ 'క్లీన్' చేస్తూ ఉంటుంది. అదే మతిమరపు. మనుషుల్లో వయసు పెరిగినకొద్దీ.. మెదడుకు ఏకాగ్రత, ఫోకస్ చేసే శక్తి వంటివి తగ్గిపోతాయి. దీనికి ఇతర కారణాలూ తోడై అల్జీమర్స్ వంటి సమస్యలు వస్తుంటాయి.

కొత్త 'దారి' కోసం.. పాత దాన్ని మరుగుపరుస్తూ..

రోజువారీ జీవితంలో కొత్త అంశాలను నేర్చుకోవడానికి, జ్ఞాపకాలను అప్‌డేట్ చేసుకోవడానికి మతిమరపు తప్పనిసరి అని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. మనిషి పరిణామక్రమానికి, మనుగడకు ఇదీ కీలకమని తేల్చి చెప్తున్నారు. ఉదాహరణకు కొన్నేళ్లుగా రోజూ ఒకేదారిలో ఆఫీసుకు వెళుతూ ఉంటారు. ఆ మార్గం, మధ్యలోని సిగ్నళ్లు, మలుపులు, స్పీడ్ బ్రేకర్లు.. ఇలా అన్ని అంశాలు బలంగా రిజిస్టరై.. ఆటోమేటిక్ మెమరీగా మారుతాయి. కానీ ఉన్నట్టుండి ఒకరోజు ఆ రోడ్డు మూసేయడంతో.. కొన్నిరోజులు పూర్తిగా కొత్త దారిలో ఆఫీసుకు వెళ్లాల్సి వస్తుంది. ఇలాంటి సమయంలో మెదడులోని ఆ రోడ్డు మెమరీలో మార్పులు జరుగుతాయి. మనం వెళ్లే కొత్త దారిలోని సిగ్నళ్లు, మలుపులు, స్పీడ్ బ్రేకర్లు వంటివి బలంగా రిజిస్టర్ అవడం మొదలవుతుంది.




ఇందుకోసం మన మెదడు మొదటి రోడ్డుకు సంబంధించిన సినాప్సెస్‌ను బలహీనం చేస్తుంది. అంటే పాత డేటాను కొంతమేర మరుగుపరుస్తూ.. కొత్త అంశానికి అప్‌డేట్ అవుతుంది. ఇలా చేయకపోతే జ్ఞాపకాలు చిక్కుముడి పడి (మెమరీ క్లట్టర్) సమస్యాత్మకంగా మారుతాయి. ప్రతిష్టాత్మక నోబెల్‌ను గెలుచుకున్న శాస్త్రవేత్త ఎరిక్ కండెల్ తన పరిశోధనల్లో ఈ విషయాన్ని గుర్తించారు.

మరిచిపోకుంటే.. మనుగడకే ముప్పు

మరుపు లేకుంటే ఎంత ప్రమాదమనే దానికి శాస్త్రవేత్తలు ఎన్నో ఉదాహరణలు చూపుతున్నారు. ఉదాహరణకు 'పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్ (పీటీఎస్‌డీ)'.. అంటే ఏదైనా ప్రమాదానికి, భయోత్పాత ఘటనకు లోనైనప్పుడు ఆ జ్ఞాపకాలు లోతుగా నిక్షిప్తమైపోయి, నిత్యం వెంటాడుతూ ఉండే పరిస్థితి. ప్రమాదాలకో, దారుణ ఘటనలకో గురైనవారు.. తరచూ అవి తమ కళ్ల ముందే మళ్లీ, మళ్లీ జరుగుతున్నట్టుగా భ్రాంతి చెందుతూ బాధపడుతుంటారు. డిప్రెషన్‌లోకి వెళ్లిపోతారు. సాధారణ జీవితం గడపలేరు. ఇక పరిణామక్రమానికీ.. మతిమరపు, జ్ఞాపకాల అప్‌డేషన్‌కు లింకు ఉందని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. ఒకప్పుడు మనుషులు గుహల్లో ఉంటూ, వేటాడే బతికేవారు.. నీటికోసం సమీపంలోని కొలను దగ్గరికి వెళ్లేవారు. ఓసారి అలా వెళ్లినప్పుడు.. విషపూరిత పాములు, క్రూర జంతువులు కనిపిస్తే.. ఆ ప్రాంతం ప్రమాదకరమని మెదడులో జ్ఞాపకం అప్‌డేట్ అవుతుంది. ఈసారి వెళ్లినప్పుడు జాగ్రత్తగా ఉండటంగానీ, మరో కొలనును వెతుక్కోవడంగానీ చేసేలా ప్రేరేపిస్తుంది. ఈ లక్షణం కూడా మానవ పరిణామానికి తోడ్పడిందని శాస్త్రవేత్తలు చెప్తున్నారు.





మరపు శాశ్వతం కాదు.. మళ్లీ రావొచ్చు..

ఒకసారి ఆటోమేటిక్/దీర్ఘకాలిక మెమరీగా నిక్షిప్తమైన జ్ఞాపకాలు.. అంత త్వరగా వీడిపోవని, అవి మరుగునపడతాయని.. సరైన ప్రేరణ ద్వారా వాటిని తిరిగి పొందవచ్చని అమెరికన్ సైకాలజిస్టులు రోజర్ బ్రౌన్, డేవిడ్ మెక్‌నీల్ 1960వ దశకంలోనే ప్రతిపాదించారు. ఇటీవల చేసిన ప్రయోగాల్లో కొందరు శాస్త్రవేత్తలు దీనిని ప్రయోగాత్మకంగా నిరూపించారు. ఉదాహరణకు మొదట చెప్పుకొన్నట్టు రోడ్డుపై వెళ్తుండగా కనబడిన వ్యక్తి పేరు వెంటనే గుర్తుకురాదు. కానీ ఆ పేరు ఏ అక్షరంతో మొదలవుతుందో గుర్తుంటుంది. 'అరె నాలుకపైనే ఉంది, బయటికి రావట్లేదు' అని మనం అనుకుంటూ ఉంటాం. ఆ వ్యక్తి ఊరి పేరో, బంధుత్వమో, మరొకటో ప్రస్తావించగానే.. పేరు ఠక్కున గుర్తొస్తుంది. అంటే తగిన ప్రేరణతో జ్ఞాపకం వచ్చేస్తుందన్న మాట.

ఎలా చూసినా.. మరీ మర్చిపోయేంత కాకుండా.. కాస్త మరపు మంచిదే.

– సాక్షి సెంట్రల్ డెస్క్

నిధులు.. నియామకాలు!

యూనివర్సిటీల్లో నాణ్యత మెరుగుకు కావాల్సినవి ఇవే
ఆర్థిక సమస్యలతో కునారిల్లుతున్న రాష్ట్ర వర్సిటీలు

సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్యకు ఊపిరిపోసే విశ్వవిద్యాలయాలను ప్రక్షాళన చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు తగిన సిఫారసులు చేస్తూ నివేదికలు ఇవ్వాలని కొత్త వైస్ చాన్స్‌లర్లను ఆదేశించింది. అవసరమైతే కన్సల్టెన్సీల సేవలను ఉపయోగించుకోవాలని సూచించింది. అయితే సిబ్బంది కొరత, మౌలిక వసతుల లేమి, గాడి తప్పిన పాలన..వర్సిటీల్లో ప్రధాన సమస్యలని వీసీలు పైకి చెబుతున్నా, తగిన మొత్తంలో నిధులు ఇవ్వడంతో పాటు, పెద్ద సంఖ్యలో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులు భర్తీ చేస్తేనే వర్సిటీల్లో బోధనతో పాటు అన్ని అంశాల్లోనూ నాణ్యత మెరుగవుతుందనే అభిప్రాయం ఉంది. రాష్ట్రంలోని ఏ వర్సిటీకీ న్యాక్ అత్యుత్తమ గ్రేడ్ ఎ ప్లస్ ప్లస్ లేకపోవడాన్ని విద్యారంగ నిపుణులు గుర్తు చేస్తున్నారు. అయితే నిధులు, బోధనా సిబ్బంది కొరత చెప్పడానికి వీసీలు సాహసించడం లేదని అంటున్నారు.

ఆర్థిక అంశాలే కీలకం


రాష్ట్రంలోని వర్సిటీలను అధ్యాపకుల కొరత వేధిస్తోంది. ఒక్కో వర్సిటీలో ఇప్పటికీ 74 శాతం వరకు ఖాళీలున్నాయి. 2,825 అధ్యాపక పోస్టులు మంజూరైతే, ఉన్న రెగ్యులర్ సిబ్బంది కేవలం 873 మంది మాత్రమే. మిగతా వాళ్ళంతా తాత్కాలిక ఉద్యోగులే. దీంతో బోధనలో జవాబుదారీతనం లోపిస్తోందని, ఫలితంగా విద్యా ప్రమాణాలు అడుగంటిపోతున్నాయనే విమర్శలున్నాయి. ఇతర అంశాలను పక్కనబెడితే నిధుల కొరతే ప్రధాన సమస్య అని వీసీలు భావిస్తున్నారు. పోస్టుల భర్తీకి కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డును గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కానీ నియామకాలు జరగలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఇటీవలే వీసీల నియామకం చేపట్టింది. వీరి నివేదికల అనంతరం సమస్యల పరిష్కారం దిశగా ఏ మేరకు నిధులు సమకూరుస్తుందో వేచిచూడాల్సిందే.

మసక బారుతున్న ఓయూ వైభవం

వందేళ్ల చరిత్ర ఉన్న ఉస్మానియా వర్సిటీకి న్యాక్ ఎ ప్లస్ గుర్తింపు ఉంది. కానీ ప్రస్తుతం ఓయూ వైభవం మసక బారుతోందనే అభిప్రాయం ఉంది. పరిశోధనలు తగ్గాయి. బోధన సిబ్బంది కొరతతో కేంద్ర ప్రభుత్వ శాఖలు పరిశోధన ప్రాజెక్టులు తగ్గించాయి. 2020–21లో రూ.52.45 కోట్ల ప్రాజెక్టులొస్తే, 2022–23 నాటికి ఇది రూ.24.75 కోట్లకు తగ్గింది. రెండేళ్ళలోనే 53 శాతం పడిపోయింది. ప్రభుత్వం 1,267 అధ్యాపక పోస్టులు మంజూరు చేసినా 340 మందే ఉన్నారు. కాంట్రాక్టు అధ్యాపకులతో కాలం వెళ్ళదీయాల్సిన పరిస్థితి ఉంది.

జేఎన్‌టీయూహెచ్‌కు జవసత్వాలెలా?

సాంకేతిక విద్యకు కీలకమైన ఈ విశ్వవిద్యాలయం జాతీయ ర్యాంకుల్లో స్థానం దక్కించుకోవడంలో విఫలమవుతోంది. ఇక్కడ 410 అధ్యాపకులుండాలి. కానీ 169 మందే ఉన్నారు. దీంతో కీలకమైన ఇంజనీరింగ్ బోధనలో ప్రమాణాలు దెబ్బతింటున్నాయి. స్కూల్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలను ఇంజనీరింగ్‌లో విలీనం చేశారు. కానీ సిబ్బంది కొరత వల్ల ప్రమాణాలు పెరగడం లేదు. కొత్త ఏఐ కోర్సులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సమకూర్చుకోవడానికి ఏటా రూ.200 కోట్ల మేర నిధులు అవసరమని వర్సిటీ ఉన్నతాధికారులు చెబుతున్నారు.



'తెలంగాణ'కు రూపాయి విదల్చడం లేదు!



ఈ వర్సిటీలో 152 ప్రొఫెసర్ పోస్టులు మంజూరైనా, ఉన్నది కేవలం 61 మంది మాత్రమే. 12 సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులుండగా అకడమిక్ కన్సల్టెంట్లు, పార్ట్ టైం అధ్యాపకులతో నెట్టుకొస్తున్నారు. ఈ వర్సిటీకి పదేళ్ళుగా ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. ఇతరత్రా నిధులతో నెట్టుకొస్తున్నారు. 18 ఏళ్ళలో ఒక్కసారి మాత్రమే ఇక్కడ స్నాతకోత్సవం జరిగింది.

కాకతీయలో వేతనాలకే దిక్కులేదు

కాకతీయ వర్సిటీ తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. బోధన, బోధనేతర సిబ్బంది వేతనాలకు ఏడాదికి రూ.150 కోట్లు అవసరం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్ కింద రూ.97 కోట్లు మాత్రమే వస్తోంది. దీంతో అంతర్గత సమీకరణల ద్వారా రూ.53 కోట్లు సమకూర్చుకుంటున్నారు. 405 రెగ్యులర్ అధ్యాపకులకు గాను 83 మందే ఉన్నారు. 190 మందిని కాంట్రాక్టు, 201 మందిని తాత్కాలిక పద్ధతిలో తీసుకున్నారు. కొత్తగా ప్రవేశ పెట్టిన కోర్సులను కూడా పరిగణనలోకి తీసుకుంటే వెయ్యి మంది వరకూ అధ్యాపకులు ఉండాలని వర్సిటీ వర్గాలంటున్నాయి.

యూనివర్సిటీల్లో బోధన సిబ్బంది పరిస్థితి ఇదీ

యూనివర్సిటీ	మంజూరైన పోస్టులు	ఉన్న సిబ్బంది	ఖాళీలు
ఉస్మానియా	1257	376	891
కాకతీయ	409	86	323
జేఎన్‌టీయూహెచ్	410	169	241
అంబేద్కర్	86	34	52
తెలంగాణ	152	61	91
మహాత్మాగాంధీ	70	35	35
పాలమూరు	95	21	74
శాతవాహన	63	16	47
జేఎన్ఏ ఫైన్ ఆర్ట్స్	55	1 7	58
పీఎస్‌టీయూ	72	14	58
ఆర్జీయూకేటీ	146	19	127

రాష్ట్రంలోని వర్సిటీలకు న్యాక్ గుర్తింపు ఇలా...

వర్సిటీ	గ్రేడ్
ఓయూ	ఎ ప్లస్
కాకతీయ	ఎ ప్లస్
జేఎన్‌టీయూహెచ్	-
పీయూ, ఎంజీయూ	బి
తెలంగాణ	బి
ఆర్జీయూకేటీ	బి
ఆర్కిటెక్చర్	బి
అంబేద్కర్	-
శాతవాహన	-

ల్యాప్‌టాప్‌లు లేని ఆర్జీయూకేటీ

బాసరలోని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ)లో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ లేదు. ల్యాప్‌టాప్‌లు, ఆధునిక వసతులు అందుబాటులో లేవు. 90 మంది బోధన, 100 మంది బోధనేతర సిబ్బంది కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారు. మెస్ నిర్వహణ అక్రమాలకు కేంద్ర బిందువుగా మారడంతో విద్యార్థులు పలుమార్లు ఆందోళనలకు దిగారు. 2008 నుంచి 2024 ఏప్రిల్ మధ్య ఇక్కడ 21 మంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడ్డారు.

'పాలమూరు'వెనుకంజ..

ఈ వర్సిటీకి ఏటా కేటాయించేది రూ.10 కోట్లు. ఇచ్చేది రూ.7 కోట్ల లోపే. కొల్లాపూర్, వనపర్తి పీజీ కేంద్రాల్లో వేతనాలు, ఇతర ఖర్చులకే నెలకు రూ.1.28 కోట్లు అవుతుంది. ఏడు విభాగాలకు 84 పోస్టులు మంజూరైతే 17 పోస్టుల్లోనే అధ్యాపకులున్నారు. వీరిలో ఇద్దరు మాత్రమే ప్రొఫెసర్లు కాగా నలుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు, 11 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన 11 సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులకు రెగ్యులర్ అధ్యాకులు లేరు. 94 మంది తాత్కాలిక అధ్యాపకులతో బోధన కొనసాగుతోంది. అనుమతి వచ్చినా లా కాలేజీ భవన నిర్మాణం పూర్తవ్వలేదు. నలుగురు ఉండాల్సిన బాలికల హాస్టల్‌లో 8 మంది ఉండాల్సిన పరిస్థితి.

నిధుల్లేకుండా మార్పు ఎలా సాధ్యం?



జ్ఞానాన్ని సృష్టించి, పంచే యూనివర్సిటీల పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది. వీటికి వివిధ రూపాల్లో నిధులు సమకూరుతాయి. ఉమ్మడి రాష్ట్రంలో విద్యకు 12 శాతం నిధులిచ్చేవారు. అదిప్పుడు సగానికి పడిపోయింది. యూజీసీ కూడా 60 శాతం నిధులు తగ్గించింది. నిధులే లేనప్పుడు మార్పు ఎలా సాధ్యం? ఢిల్లీలో ఓ సాధారణ కాలేజీకి వెళ్ళా. 250 మంది ఫ్యాకల్టీ ఉన్నారు. మన దగ్గర ఆ స్థాయిలో అధ్యాపకులు ఉండటం లేదు. పాలమూరు లాంటి వర్సిటీకి రూ.8 కోట్లు ఇవ్వడమే కష్టమవుతోంది. ఈ పరిస్థితుల్లో పరిశోధన ఎలా చేయగలరు? వాస్తవ పరిస్థితిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. వర్సిటీల సమస్యలను పరిష్కరించే చిత్తశుద్ధి కార్యాచరణలో కన్పించాలి. వర్సిటీలకు ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛనిస్తేనే మార్పు సాధ్యం.

– ప్రొఫెసర్ హరగోపాల్ (విద్యారంగ నిపుణులు)

అధ్యయనం మొదలైంది



సీఎం ఆదేశాల మేరకు ఉన్నత విద్యలో మార్పుల దిశగా అధ్యయనం చేస్తున్నాం. త్వరలో నిపుణులతో భేటీ ఏర్పాటు చేస్తాం. ఎలాంటి మార్పులు రావాలి? గ్లోబల్ పోటీని తట్టుకునే బోధన ప్రణాళికలేంటి? అనేది అధ్యయనం చేయబోతున్నాం.

– ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి (ఉన్నత విద్యామండలి చైర్మన్)

త్వరలో అందరితో సమావేశం



నివేదిక దిశగా త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తున్నాం. ప్రిన్సిపల్స్, డీన్స్, హెచ్‌వోడీలను పిలుస్తాం. మౌలిక వసతులు, సిబ్బంది కొరత ఇతర అంశాలపై చర్చిస్తాం. నెల రోజుల్లో నివేదిక సమర్పిస్తాం.

– ప్రొఫెసర్ కుమార్ మొలుగారం, వీసీ ఓయూ



శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజల్లో పాల్గొన్న భక్తులు

యాదగిరి క్షేత్రంలో కార్తీక రద్దీ

శ్రీస్వామివారిని దర్శించుకున్న 40 వేల మందికి పైగా భక్తులు

యాదగిరిగుట్ట: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి భక్తుల రద్దీ పెరిగింది. కార్తీక మాసంతో పాటు ఆదివారం సెలవు రోజు కావడంతో జంట నగరాలతో పాటు తెలంగాణ, వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు అధికంగా శ్రీస్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధికంగా క్షేత్రానికి తరలిరావడంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, కొండ కింద పరిసర ప్రాంతాలు, ప్రసాద విక్రయశాల వంటి ప్రదేశాల్లో కిక్కిరిసిపోయారు. దీంతో స్వామివారి ధర్మదర్శనానికి 3గంటలకు పైగా సమయం పట్టగా.. వీఐపీ దర్శనానికి గంటన్నర సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ఇక కార్తీకమాసం సందర్భంగా కొండ కింద గల వ్రత మండపంలో భక్తులు అధికంగా శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజల్లో పాల్గొన్నారు. కొండపైన శివాలయం, ప్రధానాలయం పరిసరాల్లో కార్తీక దీపాలను వెలిగించారు. శ్రీస్వామిని 45వేల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారు. వివిధ పూజలతో శ్రీస్వామి వారి ఆలయానికి నిత్యాదాయం రూ.58,89,688 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

తల్లిదండ్రులకు సమస్యలను వివరిస్తూ కన్నీరు పెడుతున్న విద్యార్థినులు



బోధన లేదు.. భోజనం లేదు

అడిగితే తిడుతున్న హెడ్‌మాస్టర్
బీబీపేట కస్తూర్బా విద్యార్థుల కన్నీరు
హెచ్‌ఎంను సస్పెండ్ చేయాల్సిందే
తల్లిదండ్రులతో కలిసి 5 గంటలు ధర్నా

బీబీపేట: నాణ్యమైన భోజనం పెట్టడంలేదని, చదువు కూడా సరిగా చెప్పటం లేదని కామారెడ్డి జిల్లా బీబీపేట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థినిలు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇదేమిటని అడిగితే హెడ్ మాస్టర్ తిడుతున్నారని కన్నీరు పెట్టుకొన్నారు. హెడ్‌మాస్టర్‌తోపాటు వంటమనిషి, అటెండర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఐదు గంటలపాటు ధర్నా నిర్వహించారు. పాఠశాలకు వారం రోజుల క్రితం ఉన్నతాధికారులు పర్యవేక్షణకు వచ్చిన సమయంలో హెచ్‌ఎం మంగ, వంట సిబ్బంది, అటెండర్ ప్రవర్తన బాగా లేదని ఇంటర్ విద్యార్థులు ఫిర్యాదు చేశారు. దీనిని దృష్టిలో ఉంచుకొని హెచ్‌ఎం తమతో దురుసుగా ప్రవర్తించారని, అసభ్య పదజాలంతో దూషించారని విద్యార్థులు కన్నీరు మున్నీరయ్యారు. విషయం తెలుసుకొని స్కూలుకు వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ధర్నాలో పాల్గొన్నారు. మూడో అంతస్తు నుంచి తమతో బెంచీలు మోయించడంతో గాయాలయ్యాయని, హెచ్‌ఎంతోపాటు మరో ముగ్గురు పాఠశాలలో ఉంటే తాము లోపలికి వెళ్లబోమని విద్యార్థులు భీష్మించుకుని కూర్చున్నారు. వారిని సస్పెండ్ చేస్తామని ఉన్నతాధికారులు వచ్చి చెప్పేవరకు ధర్నా విరమించబోమని పట్టుబట్టారు. పాఠశాలలో భోజనం సరిగా లేదని, తినకుంటే వంట సిబ్బంది తిడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బంది కొరత ఉందని, ఉన్న సిబ్బంది తమ ప్రవర్తనను మార్చుకోవాలని నినాదాలు చేశారు. చివరికి అక్కడకు చేరుకున్న పలువురు విద్యార్థులకు నచ్చజెప్పి పాఠశాల లోపలికి పంపించారు.

గ్రూప్‌-3 హాల్‌టికెట్లు విడుదల

వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచిన టీజీపీఎస్సీ

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–3 పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లను టీజీపీఎస్సీ విడుదల చేసింది. ఈ నెల 17, 18వ తేదీల్లో పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు టీజీపీఎస్సీ కార్యదర్శి ఇ.నవీన్‌నికోలస్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో 1,388 ఉద్యోగాల భర్తీకి సంబంధించి టీజీపీఎస్సీ 2022 డిసెంబర్‌లో నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ఉద్యోగాల కోసం 5.36 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. తాజాగా అభ్యర్థుల హాల్‌టికెట్లు కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఈ హాల్‌టికెట్లు పరీక్ష ప్రారంభానికి గంట ముందు వరకు వెబ్‌సైట్‌లో ఉంటాయని కమిషన్ స్పష్టం చేసింది. తొలిరోజు రెండు సెషన్లు, రెండో రోజు ఒక సెషన్‌లో పరీక్షలు జరుగుతాయి. ఈ నెల 17వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్–1, అదేరోజు మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు పేపర్– 2 పరీక్ష నిర్వహిస్తారు. ఈ నెల 18న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పేపర్–3 పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష సమయం కంటే గంటన్నర ముందు నుంచే అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. పరీక్ష సమయానికి అరగంట ముందే గేట్లు మూసివేస్తారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతించమని టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. ఉద్యోగాల తుది సెలక్షన్ ప్రక్రియ పూర్తయ్యే వరకు అభ్యర్థులు తమ హాల్‌టికెట్లు, ప్రశ్నపత్రాలను జాగ్రత్తగా ఉంచుకోవాలని టీజీపీఎస్సీ సూచించింది. డూప్లికేట్ హాల్ టికెట్లను తర్వాత జారీ చేయబోమని కమిషన్ స్పష్టం చేసింది.

18 నుంచి వ్యవసాయ కోర్సులకు మూడో దశ కౌన్సెలింగ్



సాక్షి, హైదరాబాద్/ఏజీవర్సిటీ: వ్యవసాయ, ఉద్యాన కోర్సుల్లో రెగ్యులర్ కోటా సీట్ల ఖాళీల భర్తీ కోసం ఈనెల 18వ తేదీ నుంచి మూడో దశ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వ్యవసాయ వర్సిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. వ్యవసాయ, ఉద్యాన డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం జరుగుతున్న స్పెషల్ కోటా మొదటి దశ కౌన్సెలింగ్ ఆదివారంతో పూర్తయింది. రెండు దశల్లో జరిగిన రెగ్యులర్ కోటా కౌన్సెలింగ్, అలాగే ఆదివారంతో పూర్తయిన మొదటి దశ స్పెషల్ కోటా కౌన్సెలింగ్ తర్వాత వ్యవసాయ, అనుబంధ కోర్సుల్లో సుమారు 213 ఖాళీలు ఏర్పడినట్లు జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డి.శివాజీ తెలిపారు. బీఎస్సీ (హానర్స్) అగ్రికల్చర్‌లో 80, బీవీఎస్సీ - 08, బీఎస్సీ (హానర్స్) హార్టికల్చర్ - 70, బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్ - 40, బీటెక్ ఫుడ్ టెక్నాలజీలో 15 సీట్లు ఖాళీగా ఉన్నట్టు వివరించారు. 18 నుంచి జరిగే మూడో దశ కౌన్సెలింగ్ ద్వారా ఈ కోర్సులలో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయనున్నట్లు రిజిస్ట్రార్ తెలిపారు. మూడో దశ కౌన్సెలింగ్ షెడ్యూలు, కోర్సుల్లో ఖాళీలు తదితర వివరాలను విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ www.pjtau.edu.inలో పొందవచ్చని ఆయన వివరించారు. మెరిట్ ఆధారంగానే సీట్లను భర్తీ చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రవేశాల్లో దళారుల ప్రమేయం ఉండదని, వారి మాయ మాటలు నమ్మి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మోసపోవద్దని ఆయన సూచించారు.



ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ పథ సంచలన్

నిజామాబాద్ నగరంలో ఆదివారం ఆర్‌ఎస్‌ఎస్ పథ సంచలన్ కార్యక్రమం ఘనంగా జరిగింది. అనంతరం నగరంలోని ఐటీఐ కళాశాల మైదానంలో నిర్వహించిన సమావేశంలో ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ సహ ప్రాంత ప్రచారక్ కల్వగురి ప్రభుకుమార్ మాట్లాడుతూ, హిందువుల ఐక్యతే లక్ష్యంగా ఆర్‌ఎస్‌ఎస్ పనిచేస్తోందని చెప్పారు.

– సాక్షి ప్రతినిధి, నిజామాబాద్



ఆదివారం రాత్రి హైదరాబాద్-విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారిపై చౌటుప్పల్ వద్ద కనిపించిన వాహనాల రద్దీ ఇది. వారాంతం కావడంతోపాటు శుభకార్యాలు ఉండటంతో ప్రజలు పెద్ద సంఖ్యలో ఈ మార్గంలో రాకపోకలు సాగించారు. దీంతో ఇరువైపులా వాహనాలు బారులుతీరి నిదానంగా ముందుకు కదిలాయి. - చౌటుప్పల్

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.



దిష్టిబొమ్మ తగిలిం'చేను'

భవనాలు, అపార్టుమెంట్లకు దిష్టిబొమ్మలు తగిలించడం సాధారణమే. కానీ పంటలకు సైతం దిష్టి తగలకుండా రైతులు వివిధ రకాల బొమ్మలు, ఫ్లెక్సీలు పెడుతున్నారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం ఫకీరాతండాకు చెందిన రైతు బానోతు వినోద్‌కు చెందిన మిరప పంట ఏపుగా పెరిగి పూత, కాతతో కళకళలాడుతోంది. ఈక్రమంలో దిష్టి తగిలి తెగుళ్లు సోకే ప్రమాదం ఉందని.. తోట మధ్యలో 'నన్ను చూసి ఏడవకండిరా'అంటూ ఏర్పాటు చేసిన కోతి ఫ్లెక్సీ ఆకర్షిస్తోంది.

– డోర్నకల్

కవ్వాల్ అడవిలో స్లోవేకియా సైంటిస్ట్‌లు



గేట్ నంబర్ 1 వద్ద స్లోవేకియా దేశస్తులు



మల్యాల వాచ్ టవర్‌పై స్లోవేకియా సైంటిస్టులు

జన్నారం: మంచిర్యాల జిల్లా కవ్వాల్ టైగర్ జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో.. రష్యా సమీప దేశమైన స్లోవేకియాకు చెందిన శిలల అధ్యయన, భూగర్భ జలాల సర్వే డైరెక్టర్ డాక్టర్ మంజూష మహాజన్ తన విద్యార్థులతో కలిసి ఆదివారం పర్యటించారు. డివిజన్‌లోని గేట్ నంబర్–1 నుంచి ఉదయం సఫారీ ద్వారా గోండుగూడ బేస్ క్యాంపు, బైసన్‌కుంట నుంచి మల్యాల వాచ్ టవర్ వరకు ప్రయాణం చేశారు. మధ్యలో అడవులలో నిర్మించిన కుంటలు, గడ్డి మైదానాలను పరిశీలించారు. బైసన్‌కుంటలోని వణ్యప్రాణులకు సంబంధించిన చిత్రాలు, వాటి అస్థి పంజరాలను పరిశీలించారు. భూగర్భ జలాల వివరాలను రేంజ్ అధికారి సుష్మారావు, డీఆర్వో తిరుపతిలను అడిగి తెలుసుకున్నారు. వణ్యప్రాణులు, అడవి అందాలను చూసి ముగ్ధులయ్యారు.

స్వర్ణ తాపడం పనులు ఇక వేగిరం

- ఈ నెల 15 నుంచి విమాన గోపురానికి స్వర్ణ తాపడం రేకులు అమర్చే తొలివిడత పనులు ప్రారంభం
- బ్రహ్మోత్సవాల నాటికి పూర్తి చేసేలా ప్రణాళిక
- స్వర్ణ కవచం నమూనాలకు సీఎం రేవంత్ గ్రీన్‌సిగ్నల్

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనారసింహస్వామి ఆలయ విమాన గోపురం బంగారు తాపడం పనులు శరవేగంగా కొనసాగనున్నాయి. బ్రహ్మోత్సవాల నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో దేవస్థానం అధికారులు ఆ దిశగా చర్యలు వేగిరం చేశారు. మూడు రోజుల క్రితం యాదగిరీశుడి దర్శనానికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. స్వర్ణ తాపడం పనులపై ఆరా తీశారు. స్వర్ణ కవచం నమూనాలను పరిశీలించి ఆమోదించారు.

– సాక్షి,యాదాద్రి

10,500 చదరపు అడుగుల మేర...

మొత్తం 10,500 చదరపు అడుగుల మేర స్వర్ణ తాపడం పనులు చేపట్టాల్సి ఉంది. ఇప్పటివరకు 1,600 చదరపు అడుగుల మేర పూర్తయ్యింది. తొలివిడతలో కార్తీకపున్నమి రోజున ఈనెల 15 నుంచి రెండు వేల చదరపు అడుగుల స్వర్ణ తాపడం రేకులు విమాన గోపురానికి అమర్చే పనులు ప్రారంభించనున్నారు. ఇందుకోసం పరంజి ఏర్పాటు చేస్తున్నారు. ఫిబ్రవరి 20వ తేదీ వరకు విడతల వారీగా తాపడాన్ని అమర్చుతారు. ఫిబ్రవరి 26 నుంచి మహాసంప్రోక్షణ చేపట్టనున్నారు. అనంతరం స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ఆలయ విమాన గోపురం కోసం భక్తుల నుంచి ఇప్పటికే రూ.21 కోట్ల విరాళాలు సమకూరాయి.

అంచనా 60 కిలోల బంగారం

ఆలయ విమాన గోపురం స్వర్ణ తాపడానికి 60 కిలోల బంగారం అవసరం అవుతుంది. ఇప్పటికే 12 కిలోల బంగారాన్ని చెన్నైలోని స్మార్ట్ క్రియేషన్ సంస్థకు దేవస్థానం అప్పగించింది. ఇంకా దేవస్థానం వద్ద ఉన్న 2,300 కిలోల వరకు వెండి కడ్డీలు ఉన్నాయి. ప్రస్తుతం ఆలయ బ్యాంకు ఖాతాలో ఉన్న నిధులతో 20 కిలోలు, దాతల సహకారం మిగతా బంగారం సమకూరే అవకాశముంది.



యాదగిరిగుట్ట ఆలయ విమానగోపురం స్వర్ణకవచం నమూనాను సీఎం రేవంత్‌రెడ్డికి చూపిస్తున్న దేవస్థానం ఈఓ భాస్కర్‌రావు, పక్కన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్

నమూనాలను పరిశీలించి... ఆపై ఆమోదించి....


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ ఇటీవల యాదగిరిగుట్టకు వచ్చిన సందర్భంగా దేవస్థానం, వైటీడీఏ అధికారులతో సమావేశమై ఆలయ అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈఓ భాస్కర్‌రావుతో మాట్లాడి స్వర్ణ తాపడం పనులపై ప్రత్యేకంగా చర్చించారు. స్వర్ణ కవచ నమూనాలను పరిశీలించి సీఎం ఆమోదం తెలిపారు.




సీఎం మార్గదర్శకాల మేరకు స్వర్ణతాపడం పనులు

కార్తీకపౌర్ణమి రోజున విమాన గోపురానికి స్వర్ణ తాపడం రేకులు అమర్చే తొలి విడత పనులు ప్రారంభమవుతాయి. ఇందుకోసం పరంజి, గోవా నిర్మాణం చేస్తున్నాం. స్వర్ణ తాపడానికి 60 కిలోల బంగారం అవసరం అవుతుందని అంచనా వేశాం. బ్రహ్మోత్సవాల వరకు తాపడం పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

– భాస్కర్‌రావు, దేవస్థానం ఈఓ





ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఐటీఐ కళాశాల మైదానంలో నిర్వహించిన 'పథ సంచలన్'కు భారీగా తరలివచ్చిన ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

రక్షకులకు ఆరోగ్య రక్షణ

రేయింబవళ్లు సవాళ్ల మధ్య పనిచేసే పోలీసులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటేనే విధులు నిర్వర్తించగలరు. అందుకోసం సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ సిబ్బందికి హెల్త్ ప్రొఫైల్ రూపొందిస్తున్నారు. ఇందుకోసం గతేడాది నుంచి ఆరు నెలలకోసారి 56 రకాల రక్త పరీక్షలు, ఈసీజీ, రక్తపోటు పరీక్షలు నిర్వహిస్తున్నారు. సిబ్బంది జీవన శైలి, వారి ఆరోగ్య అలవాట్లలో మార్పులను తెలియజేస్తున్నారు.

– సాక్షి, సిద్దిపేట

సిద్దిపేట కమిషనరేట్ పరిధిలో పోలీస్ సిబ్బందికి వైద్య పరీక్షలు

- హోంగార్డు నుంచి అదనపు డీసీపీల వరకు..
- ఆరోగ్యపరంగా మూడు కేటగిరీలుగా విభజన
- సలహాలు, సూచనలు చేస్తున్న వైద్యులు

గతేడాది నుంచి ఆరోగ్య రక్షణ

గతేడాది జనవరి నుంచి సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పోలీసులకు ఆరు నెలలకోసారి వైద్య పరీక్షలు నిర్వహిస్తూ ఆరోగ్య రక్షణ కల్పిస్తున్నారు. ప్రతి ఒక్కరికి వారి జీవన శైలి ఆధారంగానే రక్తపోటు, మధుమేహం, గుండెపోటు వస్తుంటాయి. వీటిబారిన పోలీసులు పడకుండా ఉండేందుకు వైద్య ఆరోగ్య శాఖ నడుం బిగించింది. అందులో భాగంగా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ సిబ్బందికి నాలుగు రకాలుగా వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లాలో 1,449 మంది పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మూడు రకాలుగా విభజన

మొదట సిబ్బందికి ఎత్తు, బరువు, నడుం చుట్టుకొలత, రక్తపోటు పరిశీలిస్తున్నారు. పరీక్షల తర్వాత పోలీస్ సిబ్బందిని మూడు విభాగాలుగా విభజించనున్నారు. సాధారణ ఆరోగ్యవంతులు, భవిష్యత్తులో దీర్ఘకాలిక వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నవారు, ఇప్పటికే వ్యాధులతో బాధపడుతున్న వారిని ఇలా గుర్తిస్తున్నారు. వీరికి మెడికల్ కళాశాల, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య సలహాలు, సూచనలు ఇస్తున్నారు. మొదట అనారోగ్యంతో బాధపడుతున్న వారికి విడతల వారీగా వైద్య చికిత్స అందిస్తున్నారు. పోలీస్ కుటుంబ సభ్యులకు సైతం రక్త పరీక్షలు నిర్వహించనున్నారు.

ఎంతో ఉపయోగకరం

పోలీసుల ఆరోగ్య రక్షణకు ఈ హెల్త్ ప్రొఫైల్ ఎంతో ఉపయోగపడుతోంది. రాష్ట్రంలోనే పైలెట్ ప్రాజెక్ట్‌గా గతేడాది సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించారు. అప్పటి నుంచి పోలీసులకు ఆరు నెలలకోసారి వైద్యపరీక్షలు నిర్వహిస్తూ ఆరోగ్య రక్షణ కల్పిస్తున్నారు.

సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ సిబ్బంది వివరాలు

అదనపు డీసీపీలు	3
ఏసీపీలు	5
సీఐలు	22
ఎస్ఐలు	36
ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు	1,174
హోంగార్డులు	209



హెల్త్ ప్రొఫైల్‌తో ఎన్నో ప్రయోజనాలు

గత ఏడాది నుంచి మాకు రక్త పరీక్షలు నిర్వహించి హెల్త్ ప్రొఫైల్‌ను అందిస్తున్నారు. ఇలా చేయడం వల్ల ఏదైనా అనారోగ్య సమస్య ఉంటే తెలిసిపోతుంది. పోలీస్ అధికారులు సిబ్బందికి ఉచితంగా హెల్త్ ప్రొఫైల్ నిర్వహించడం సంతోషకరం.

– ఉమేశ్, ఏఎస్ఐ, ట్రాఫిక్ సిద్దిపేట

సిబ్బంది ఆరోగ్యమే ముఖ్యం

సిబ్బంది ఆరోగ్య రక్షణ కోసం వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. నివేదికల ఆధారంగా మూడు విభాగాలుగా విభజిస్తున్నాం. అనారోగ్యంతో ఉన్న వారిని గుర్తించి వారికి మెడికల్ కళాశాల ప్రొఫెసర్లు, వైద్యులతో సలహాలు ఇప్పిస్తున్నాం. మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం.

– డాక్టర్ అనురాధ, సీపీ







రక్త పరీక్షల కోసం పోలీస్ సిబ్బంది నమూనాలను సేకరిస్తున్న వైద్య సిబ్బంది

ఇంజినీరింగ్ కార్మికులకు జీఓ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలి

ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు



కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు పారిశుధ్య కార్మికులకు చెల్లిస్తున్న విధంగా జీవో 36 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగాలు పర్మనెంట్ చేయాలని, ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్సీ లక్షణరావు డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం మున్సిపల్ ఫెడరేషన్ రాష్ట్ర సదస్సు జరిగింది. ముఖ్య అతిథి లక్ష్మణరావు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారుతున్నా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల జీవితాల్లో మాత్రం మార్పు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వాటర్ సెక్షన్, స్ట్రీట్ లైటింగ్, టౌన్ ప్లానింగ్, వెటర్నరీ, మెకానికల్, మొక్కల పెంపకం తదితర విభాగాల్లో పని చేసే కార్మికులు ప్రమాదకరమైన విధులు నిర్వహిస్తున్నారని, వారందరికీ ఏ విధమైన రక్షణ గానీ, భద్రత గానీ కల్పించకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వహిస్తున్నాయని విమర్శించారు. ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను శాసనమండలలో ప్రస్తావించి పరిష్కారానికి పీడీఎఫ్ పక్షాన తమవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

గిరిజన బాలిక ఆత్మహత్యాయత్నం

నెల్లూరు సిటీ: తనను ప్రేమించకపోతే చంపేస్తానని ఆరు నెలలుగా ఓ వ్యక్తి బెదిరింపులకు గురి చేయడంతో 9వ తరగతి చదువుతున్న గిరిజన బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా నెల్లూరు రూరల్ మండలం కొత్తవెల్లంటి గ్రామానికి చెందిన జాన్ వరికోత యంత్రం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన 9వ తరగతి చదువుతున్న 16 ఏళ్ల బాలికను తనను ప్రేమించాలని ఆరునెలలుగా వేధిస్తున్నాడు. ఈ విషయం బాలిక పెద్దలకు చెప్పడంతో బాలిక జోలికి రావద్దని పలుమార్లు జాన్‌ను హెచ్చరించారు. అయిప్పటికీ పెళ్లి చేసుకుంటే తననే చేసుకోవాలని, లేకపోతే చంపేస్తానని బెదిరిస్తున్నాడు. దీంతో బాలిక ఈ నెల 7న ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది.బాలికను నెల్లూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు నెల్లూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పొలిటికల్ బాస్‌ల కోసం పనిచేస్తున్న పోలీస్ బాస్

- మాకూ ఒక రోజు వస్తుంది గుర్తు పెట్టుకోండి
- ఏ ఒక్కరిని వదలిపెట్టే పరిస్థితి ఉండదు
- మాజీ మంత్రి విడదల రజిని హెచ్చరిక



పట్నంబజారు: పోలీసు బాస్ పొలిటికల్ బాస్‌ల కోసం పనిచేస్తున్నాడు.. పరిధి దాటి పోలీసులు చేస్తున్న తీరు దారుణం.. గుర్తుపెట్టుకోండి మాకూ ఒక రోజు వస్తుంది.. కచ్చితంగా ఏ ఒక్కరిని వదలిపెట్టబోమని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త విడదల రజిని స్పష్టంచేశారు. శ్యామలానగర్‌లోని ఆమె నివాసంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత ఒక చెడు సంప్రదాయానికి తెరదీశారని, దేశంలో ఎక్కడా లేని విధంగా చంద్రబాబు నీచ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీకి సంబంధించిన సోషల్ మీడియా యాక్టివిస్టులు, సానుభూతిపరులు, అభిమానులపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేయటం ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో ఉన్న వారిపై అక్రమ కేసులు పెట్టి, చిత్రహింసలకు గురి చేస్తూ.. పోలీసుస్టేషన్‌లు ఒక దాని తరువాత ఒకటి మారుస్తూ.. కొడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. హైకోర్టులో స్పష్టంగా అడుగుతున్నప్పటికీ, ఆ కేసులో కాకుండా మరో కేసులో అరెస్ట్ చేశామని, నేరుగా న్యాయస్థానాలలనే మోసం చేసి పోలీసులు పరాకాష్టకు తెరదీశారన్నారు. చిలకలూరిపేటకు చెందిన పెద్దిరెడ్డి సుధారాణి, ఆమె భర్త వెంకటరెడ్డిలను అక్రమంగా అరెస్ట్ చేసి, సిరిసిల్ల నుంచి బలవంతంగా తీసుకునివచ్చి చిలకలూరిపేట టౌన్ స్టేషన్‌లో అక్కడి సీఐ టార్చర్‌కు గురిచేయటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సుధారాణికి సంబంధించి న్యాయస్థానంలో ఆమె ఆవేదన వినేందుకు, స్టేట్‌మెంట్ తీసుకునేందుకు గంట సమయం కేటాయించారంటే.. పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. సోషల్ మీడియా యాక్టివిస్టులను అరెస్ట్ చేసి, చిత్రహింసలు పెట్టి, వేరు వారి పేర్లు చెప్పించేందుకు ప్రయత్నాలు చేయటం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, వారి కుటుంబసభ్యులు, తమపై సోషల్ మీడియా వేదికగా వ్యక్తిగత హననం చేస్తుంటే.. ఫిర్యాదులు చేసినప్పటికీ కనీసం పట్టించుకోకపోవటం సిగ్గుచేటన్నారు. నేను స్వయంగా సాక్ష్యాధారాలతో సహ ఫిర్యాదు చేసినా, డీజీపీ, ఎస్పీ ఇంత వరకు స్పందించకపోవటంపై ప్రశ్నించారు. పోలీసులు తమ పరిధి దాటి స్థానిక ఎమ్మెల్యేలు, టిడిపి ఆదేశాలను అనుసరిస్తున్నారని, రానున్న రోజుల్లో ఏ ఒక్కరికి వదలబోమన్నారు. కూటమి ప్రభుత్వానికి చెందిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పష్టంగా లా అండ్ ఆర్డర్ ఎలా ఉందో చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు.

మీ రుణం మాకొద్దు

ఆహార శుద్ధి పరిశ్రమలకు మోకాలడ్డిన కూటమి ప్రభుత్వం



- పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయిలో రూ.3,559.11 కోట్లతో 27 యూనిట్లు
- తొలిదశలో రూ.1,250 కోట్లతో 10 యూనిట్లు
- రూ.65 కోట్లతో ఉమ్మడి జిల్లాకి ఒకటి చొప్పున 13 మిల్లెట్ యూనిట్లు
- వీటి కోసం 322.61 ఎకరాలు సిద్ధం చేసిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- ప్లగ్ అండ్ ప్లే మోడల్‌లో ఏర్పాటు చేయాలని సంకల్పం..
- రూ.వెయ్యి కోట్లు రుణం ఇచ్చేందుకు ముందుకొచ్చిన సిడ్బీ
- ఈ రుణం మాకొద్దని చెప్పిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం
- ల్యాండ్ బ్యాంక్‌పై కన్నేసిన టీడీపీ ప్రభుత్వంలోని కీలక నేతలు
- అందుకే ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు నిరాకరణ!

సాక్షి, అమరావతి: చెప్పేదొకటి.. చేసేది మరొకటి. పైకి పరిశ్రమలు తెస్తామంటారు.. వస్తున్న పరిశ్రమలకూ మోకాలడ్డుతారు. వాటి కోసం కేటాయించిన స్థలాలను లాగేసుకోవడం ప్రధాన ఉద్దేశం. చంద్రబాబు కూటమి ప్రభుత్వంలోని కీలక నేతల కుతంత్రాలివి. ఇందుకు రాష్ట్రంలో ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటును చంద్రబాబు కూటమి ప్రభుత్వం అడ్డుకుంటున్న వైనమే ఇందుకు తార్కాణం. ఈ పరిశ్రమల కోసం రుణాలిస్తానన్న బ్యాంకుకు తమ 'పాలసీ'మారిందని, రుణం అవసరం లేదంటూ కూటమి ప్రభుత్వం కుండబద్దలు కొట్టింది. వీటికోసం జిల్లా కేంద్రాలకు సమీపంలో సేకరించిన విలువైన భూములపై టీడీపీ పెద్దలు కన్నేసినందునే ప్రభుత్వ 'పాలసీ' మారిందనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. పంట ఉత్పత్తులకు డిమాండ్ కల్పించడం ద్వారా రైతులకు అదనపు లబ్ధి చేకూర్చే లక్ష్యంతో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఆహార శుద్ధి పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి ప్రణాళిక రూపొందించింది. పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయిలో రూ.3,559.11 కోట్లతో 27 ఆహార శుద్ధి యూనిట్లు, రూ.65 కోట్లతో ఉమ్మడి జిల్లాకి ఒకటి చొప్పున 13 మిల్లెట్ యూనిట్లు ఏర్పాటుకు రంగం సిద్ధం చేసింది. తొలుత రెండు దశల్లో రూ.1,250 కోట్లతో 10 ఆహార శుద్ధి యూనిట్లు, 13 మిల్లెట్ యూనిట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వీటి కోసం జిల్లా కేంద్రాలకు సమీపంలోనే 322.61 ఎకరాలు సమీకరణ చేసి లాండ్ బ్యాంకు కూడా ఏర్పాటు చేసింది.

115 కంపెనీలు ఆసక్తి

ఈ పరిశ్రమల ద్వారా వచ్చే 15 ఏళ్లలో పన్ను రూపంలో రూ. 9వేల కోట్ల రాబడితో పాటు జీడీపీ 1,500 కోట్లకుపైగా పెరుగుతుందని అంచనా వేశారు. ప్రభుత్వమే స్వయంగా వీటిని నిర్మించి ఆసక్తి చూపే బహుళ జాతి సంస్థలకు 15 ఏళ్లకు లీజు పద్ధతిలో నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించింది. ముడి సరుకును ఎప్పటికప్పుడు ప్రభుత్వం నిర్దేశించిన కనీస మద్దతు ధరకు రైతులు, రైతు ఉత్పత్తి సంఘాలు, మార్క్‌ఫెడ్, ఆర్బీకేల ద్వారా కొనాలని నిర్దేశించింది. తొలి దశ ప్రాజెక్టుల కోసం ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌కు ఆపరేటర్ల ఎంపిక కోసం టెండర్లు పిలవగా హల్దీరామ్స్, ఐటీసీ వంటి 115 జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు ముందుకొచ్చాయి. వీరికి ప్లగ్ అండ్ ప్లే మోడల్‌లో ఇవ్వాలని సంకల్పించింది. తొలిదశ యూనిట్ల ఏర్పాటు కోసం సిడ్బీ రూ.1,000 కోట్లు రుణం అందించేందుకు ముందుకొచ్చింది. ఇందుకోసం వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.100 కోట్లు మ్యాచింగ్ గ్రాంట్‌ను కూడా విడుదల చేసింది. ఫేజ్–1లో అనంతపురం జిల్లా ధర్మవరం మండలం గరుడంపల్లి వద్ద రూ.72.47 కోట్లతో ఏర్పాటు చేసిన యూనిట్‌తో పాటు ఒక్కొక్కటి రూ.5 కోట్ల అంచనాతో 13 మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు గతేడాది అక్టోబర్‌లో శ్రీకారం కూడా చుట్టారు. ఇలా పరిశ్రమల ఏర్పాటుకు పూర్తిగా రంగం సిద్ధమైన తరుణంలో వచ్చిన చంద్రబాబు కూటమి ప్రభుత్వం.. తాము ఈ పాలసీని పునః సమీక్షిస్తున్నామని, రుణం అవసరం లేదంటూ బ్యాంకుకు చెప్పేసింది. దీంతో ఈ ప్రాజెక్టు ప్రశ్నార్థకంగా మారింది.

రూ.1,000 కోట్ల విలువైన భూములను కొట్టేయాలన్న కుట్రతోనే..

ఆహార శుద్ధి పరిశ్రమలకు జిల్లా కేంద్రాల సమీపంలో సమీకరించిన విలువైన భూములపై టీడీపీ బడా నేతల కన్ను పడినందునే వీటి ఏర్పాటును అడ్డుకుంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పీపీపీ మోడ్‌లో ఇచ్చే పేరుతో వేల కోట్ల విలువైన ఈ భూములను కొట్టేయాలని కుతంత్రం పన్నినట్లు సమాచారం. ప్రభుత్వమే పరిశ్రమలు ఏర్పాటు చేయించి, బహుళ జాతి సంస్థల ద్వారా రైతులకు మద్దతు ధర ఇప్పించేందుకు తలపెట్టిన గొప్ప కార్యక్రమానికి తూట్లు పొడిచి ఆ స్థలాల్లో టీడీపీ నేతలు రియల్ ఎస్టేట్ వ్యాపారానికి రంగం సిద్ధం చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

యూనిట్లు ఏర్పాటు ఇలా..

తొలిదశ : ఒక్కో యూనిట్ పెట్టుబడి - రూ.100 కోట్ల లోపు	రెండో దశ: ఒక్కో యూనిట్ పెట్టుబడి - రూ.100 కోట్లకు పైబడి
వేరుశనగ - అనంతపురం కాఫీ - అరకు మామిడి తాండ్ర - కాకినాడ బెల్లం అనుబంధ ఉత్పత్తుల తయారీ - అనకాపల్లి కందులు - గుంటూరు, ఒంగోలు	అరటి - పులివెందుల టమాటా - నంద్యాల పండ్లు, కూరగాయలు - రాజంపేట
వీటితోపాటు ఉమ్మడి జిల్లాకు ఒకటి చొప్పన 13 మిల్లెట్ యూనిట్లు	సుగంధ ద్రవ్యాలు - నరసరావుపేట)



అడవిలో అమ్మప్రేమ!

పులి - ఆవు.. పాము - కాకి నీతి కథలు అందరికీ తెలిసే ఉంటాయి. కథల సారాంశం ఏదైనా.. అందులో తల్లి ప్రేమ కనిపిస్తుంది. మనుషుల్లోనే కాదు పశుపక్షాదుల్లో కూడా కమ్మనైన అమ్మతనం ఎంతో మధురం. తల్లి జంతువు ప్రేమ ముందు ఏ ప్రాణి అయినా, జీవి అయినా తలవంచక తప్పదు. తన కళ్ల ముందు తన బిడ్డకు కష్టం వస్తే తిరగబడి పోరాడుతుంది. ఇలాంటి దృశ్యాలు ఎక్కువగా అడవుల్లో కనిపిస్తాయి. అతి చిన్న ప్రాణి అయిన గిజిగాడు మొదలు అతి క్రూరమైన జంతువులుగా చెప్పుకునే పులి, చిరుత, ఎలుగుబంటి వంటి జంతువుల వరకు వాటి పిల్లల లాలన చూస్తే 'తల్లి ప్రేమ అడవంతా' అని అనకమానరు.

- ఆత్మకూరు రూరల్

- వన్య మృగాలలో కమ్మనైన అమ్మతనం
- పిల్లల దగ్గరకు వస్తే చీల్చి చెండాడే క్రూరత్వం
- మరికొన్ని జంతువులు, పక్షుల్లో అరుదైన మమకారం

పశుపక్షాదుల్లో తల్లి ప్రేమను దగ్గరిగా పరిశీలిస్తే కొన్ని ఆసక్తికర విషయాలు కనిపిస్తాయి. కోతి, పిల్లులు తమ పిల్లల పెంపకం అందరికీ తెలిసే ఉంటుంది. మాతృప్రేమలో మాత్రం మర్కటాలు మనుషులకే పాఠాలు చెబుతాయి. ఇక పిల్లి నిండు గర్భంతో ఉన్నపుడే తను ప్రసవించే ప్రదేశాన్ని ఎంచుకుని ప్రసవానంతరం కొంత సమయ వ్యత్యాసంతో పిల్లలను కనీసం ఏడు చోట్లకు మార్చడం దాని విశిష్ట లక్షణం. కీటకాలు, పక్షులు, జంతువుల్లో తల్లి ప్రేమ నిశితంగా పరిశీలిస్తే ఔరా.. అనాల్సిందే. నల్లమల అడవుల్లో పెద్దపులులు ప్రధాన రక్షిత జీవి. అంతరించి పోయే దశకు చేరుకుంటున్న వాటి సంతతిని పెంచి పోషించడంలో ఆడ పులులు ఒక యుద్ధమే చేస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. ప్రతి ఈతలోనూ రెండు నుంచి నాలుగు పిల్లలకు జన్మనిచ్చే ఆడపులి వాటిని పెంచడంతో ఎంతో క్లిష్టమైన పరిస్థితిని ఎదుర్కొంటుంది. పులి పిల్లలకు ప్రధాన ముప్పు మగపులుల నుంచే ఉంటుంది. సాధారణంగా పులి తన పిల్లలకు మూడేళ్ల వయస్సు దాటేంత వరకు అవి స్వయంగా తమ ఆహారం సంపాదించుకునే నైపుణ్యం పొందే వరకు తిరిగి సమాగానికి సిద్ధపడదు. అందుకే మగ పులులు ఈ పిల్లలను అడ్డు తొలగిస్తే ఆడపులితో సమాగానికి సిద్ధ పడవచ్చనే ధోరణే పులి పిల్లలకు ప్రమాదం తెచ్చి పెడుతుంది. అందుకే తన సంతానం సమీపంలోకి మగపులి రాకుండా ఆడపులి తరిమి కొడుతుంది. పులిపిల్లలకు మరో ప్రమాదం నక్క, తోడేలు, కొండ్రాసిగాడుగా పిలువబడే దొమ్మలగొండి (హైనా)వంటి స్కావెంజర్ జంతువుల నుంచి కూడా పొంచి ఉంటుంది. తల్లి పులి ఆహారం కోసం వెళ్లినప్పుడు ఈ జంతువులు పులి పిల్లలకు హాని కలిగిస్తాయి. అందుకే తల్లి పులి తన పిల్లలను గుహల్లో, చెట్టు బొరియల్లో ఉంచి వాటి ఉనికి బయటకు తెలియనంతగా జాగ్రత్త పడుతుంది. ఆహార సేకరణ కోసం పెద్దగా పిల్లలను విడిచి దూరం వెళ్లదు. పిల్లలు కాస్త తిరుగాడే వయస్సు వచ్చినపుడు వాటిని వెంట పెట్టుకునే వేటకు ఉపక్రమిస్తుంది. అప్పుడు పులి పిల్లలు మొదట తల్లి చేసే వేట పద్ధతులను పరిశీలిస్తూ మెల్లమెల్లగా వేటాడేందుకు సిద్ధమవుతాయి.



ఆహారం భద్రపరిచి.. కూనల కడుపు నింపి

పిల్లి కుటుంబానికే చెందిన చిరుతపులి (లెపర్డ్) కూడా రెండు నుంచి మూడు పిల్లలను పెడుతుంది. ఇది కూడా పెద్దపులిలాగే పిల్లల కోసం అత్యంత అప్రమత్తంగా సంచరిస్తుంది. పిల్లి జాతిలో పిల్లి తరువాత చెట్టు ఎక్కగలిగే సామర్థ్యం ఉన్న ఏకైక పులి చిరుత మాత్రమే. ఈ ప్రత్యేకతను తన పిల్లలకు ఆహారం దాచి పెట్టే విషయంలో ఉపయోగించుకుంటుంది. పిల్లలను భద్రమైన చోట దాచి వేటకు వెళ్లి తాను చంపి తెచ్చిన వేట జంతువు కళేబరాన్ని పిల్లల ముందు ఆహారంగా వేస్తుంది. అవి తినగా మిగిలిన భాగాన్ని చెట్టు కొమ్మపై భద్రపరచి మరుసటి రోజు మళ్లీ ఆకలిగొన్న పిల్లలకు పెడుతుంది.

అంతా.. ఏకాంతం..



ఎత్తైన, ముదిరిన వృక్షాల కాండాలపై సహజంగా ఏర్పడ్డ తొర్రలను ఆడ హార్న్‌బిల్ గూడుగా ఎంపిక చేసుకుంటుంది. వయస్సు కొచ్చిన మగపక్షి తనతో జతగట్టేందుకు అంగీకరించిన ఆడపక్షితో కలసి ఇలాంటి తొర్రల్లో ప్రవేశిస్తుంది. ఆపై ఆడ పక్షి తొర్ర ప్రవేశ మార్గాన్ని చెట్ల బెరళ్లు, కర్ర పుల్లలు, బంక మట్టితో కలిపి మూసివేస్తుంది. గాలి చొరబడేందుకు మాత్రం చిన్న రంధ్రాన్ని మాత్రం ఉంచుకుంటుంది. సమాగమనంతరం మగ పక్షి మూసిన ప్రవేశ మార్గాన్ని తిరిగి తెరుచుకుని బయటకు వస్తుంది. ఆడపక్షి మాత్రం గుడ్లు పెట్టి వాటిని పొదిగి పిల్లలను చేసే వరకు గూటిలోనే జైలు జీవితం గడుపుతుంది. మూసివేయబడిన తొర్ర ప్రవేశ మార్గానికి ఏర్పరచిన చిన్నపాటి రంధ్రం ద్వారానే ఆడపక్షికి.. మగపక్షి ఆహారాన్ని అందిస్తుంది. అనంతరం ఆడపక్షి గూటి వెలుపలికి వచ్చి పిల్లలున్న గూటిని తిరిగి మూసి వేస్తుంది. ఆ తరువాత పక్షి దంపతులు కలసి పిల్లల పోషణ భారం వహిస్తాయి. పిల్లలకు రెక్కలొచ్చి గాలిలో ఎగిరే వరకు ఈ తరహా రక్షణలోనే వాటి పోషణ సాగుతుంది.



నీ ప్రేమ భల్లూకం గాను..

వన్యప్రాణుల్లో తల్లులన్నింటిలోను ఎలుగుబంటి అమితమైన ప్రత్యేక శైలి కలిగినది. ఆడ ఎలుగు బంటి తన పిల్లలను వాటికి వేగంగా పరిగెత్తగల వయస్సు వచ్చే వరకు తన మూపున మోసుకుని తిరుగుతూ ఉంటుంది. పుట్టలు తవ్వి చెదపురుగులను, చెట్టు ఎక్కి తేనె పట్టును తెచ్చి పిల్లలకు పెడుతూ ఎంతో ప్రేమ పూర్వకంగా పిల్లలను సాకుతుంది. పిల్లలున్న ఎలుగు బంటి మరింత క్రోధంతో సమీపంలోకి వచ్చే జంతువును, మనిషిని చీల్చి చెండాడుతుంది.

- నల్లమలలోని హనీబాడ్జర్ నేల బొరియలలో నివాసం ఏర్పాటు చేసుకుంటుంది. తమ పిల్లలు ఇతర జంతువుల బారిన పడకుండా బొరియలో ప్రత్యేక గదులు తవ్వుకుని రక్షణ కల్పిస్తాయి.
- గిజిగాడు పక్షి అందమైన గూళ్లను అత్యంత భద్రమైన ప్రదేశాలలో(చిటారు కొమ్మలకు నీటి తలం అంచున)కట్టి అందులో గుడ్లను పొదిగి పిల్లలకు నిరంతరం కీటకాలను, ధాన్యం గింజలను ఆహారంగా అందించి పెంచుతుంది.



- కందిరీగలు వివిధ కీటకాల లార్వాలను తీసుకు వచ్చి గూడులో ఉన్న పిల్లలకు ఆహారంగా పెడతాయి.
- తేనె టీగలు తెట్టెలో షట్భుజాకారంలో ఉండే గదుల్లో ఉండే పిల్ల ఈగలకు అవి సేకరించిన మకరందాన్ని ఆహారంగా అందిస్తాయి.



- రేచుకుక్కలు (వైల్డ్ డాగ్స్) వేట జంతువులను చంపి మాంసాన్ని కడుపులో నిల్వ చేసుకుని తమ పిల్లల వద్దకు వెళ్లి వాటి ముందు మాంస కండలను కక్కి తినిపిస్తాయి.



శ్రీవారి దర్శనానికి 20 గంటలు




తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 73,558 మంది స్వామివారిని దర్శించుకోగా 32,678 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.73 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 20 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఆగమోక్తంగా ఆకాశదీపం



శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం ఆకాదీపాన్ని ఆగమోక్తంగా వెలిగించారు. ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రతి రోజూ ఆకాశదీపాన్ని సంప్రదాయబద్ధంగా వెలిగిస్తుంటారు. ఆలయంలోని ఊంజల్‌సేవ మండపం వద్ద ఏర్పాటు చేసిన కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్థూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి దర్శించుకున్నారు.

శాస్త్రోక్తంగా చండీయాగానికి శ్రీకారం



తిరుపతి కల్చరల్ : శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలో కామాక్షి అమ్మవారి చండీయాగానికి ఆదివారం శాస్త్రోక్తంగా శ్రీకారం చుట్టారు. కార్తీకమాసం సందర్భంగా ఆలయంలో విశేష పూజ, హోమ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా తొమ్మిది రోజుల పాటు చండీయాగం జరిపించనున్నారు. ఈమేరకు యాగశాలలో ఉదయం పూజ, నిత్య హోమం, చండీహోమం, లఘు పూర్ణాహుతి, నివేదన, హారతి సమర్పించారు. సాయంత్రం హోమం, చండీ పారాయణం, సహస్రనామార్చన, విశేష దీపారాధన చేపట్టారు.

కాణిపాకంలో పవిత్రోత్సవం



కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో మూడు రోజుల పాటు పవిత్రోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో గురుప్రసాద్ తెలిపారు. ఈనెల 12, 13, 14 తేదీల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సవ పూజలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో భక్తులు విరివిగా పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు. కాగా శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ అలానే కొనసాగింది.

ఘనంగా ముద్దల పండుగ



సిద్ధవటం: కడప జిల్లా సిద్ధవటం మండల కేంద్రంలోని గాంధీవీధిలో ఆదివారం గంగమ్మ ముద్దల పండుగను గ్రామ పెద్దలు ఘనంగా నిర్వహించారు. గంగమ్మకు గాంధీవీధి వాసులు ప్రతి ఏడాది కార్తీక మాసంలో ముద్దల పండుగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా ఆదివారం అమ్మవారి గుడిని పూలతో అలంకరించి అమ్మవారికి అభిషేకం, అలంకరణ, కుంకుమార్చన వంటి పూజలు జరిపారు. మహిళలు అమ్మవారికి బోనాలు, కాయాకర్పూరాలను సమర్పించారు. అనంతరం స్థానికులు అంకాలమ్మ గుడివద్దకు వెళ్లి బోనాలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు.

రత్నగిరిపై భక్తజనసంద్రం



అన్నవరం: రత్నగిరి ఆదివారం భక్తజనసంద్రమే అయ్యింది. సెలవు రోజుతో పాటు కార్తిక శుద్ధ నవమి, సాయంత్రం నుంచి దశమి తిథులు కలసి రావడంతో సత్యదేవుని దర్శించేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. పండితులు వేకువజామున ఒంటి గంటకు ఆలయం తెరచి పూజలు చేశారు. స్వామివారి వ్రతాలు కూడా తెల్లవారుజామున రెండు గంటలకు ప్రారంభించారు. రద్దీ కారణంగా ఉదయం నుంచి అంతరాలయ దర్శనం నిలిపివేశారు.వ్రత మండపాలతో పాటు నిత్యకల్యాణ మండపంలో కూడా వ్రతాలు నిర్వహించారు. సుమారు 60 వేల మంది స్వామి వారిని దర్శించి, పూజలు చేసినట్లు అధికారులు తెలిపారు. స్వామివారి వ్రతాలు 6,200 జరిగాయి మివారి వ్రతాలు వేకువన ఒంటి గంటకే ప్రారంభించనున్నారు. తెల్లవారుజామున రెండు గంటల నుంచి స్వామివారి దర్శనానికి భక్తులను అనుమతించనున్నారు.

బాలాజీ దర్శనం.. భక్తజనం పావనం



మామిడికుదురు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లిలోని శ్రీబాల బాలాజీ స్వామి దర్శనంతో భక్తజనం పావనం అయ్యింది. స్వామివారి దర్శనానికి భారీగా భక్తులు తరలివచ్చారు. స్వామివారి పాత ఆలయంతో పాటు నవీన ఆలయం రద్దీగా మారింది. తొలుత పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి, శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువు దీరిన శ్రీబాల బాలాజీ స్వామివారిని దర్శించుకున్నారు.

కిక్కిరిసిన అంతర్వేది



సఖినేటిపల్లి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. కార్తిక మాసం ఆదివారం శెలవు దినం కావడంతో కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. సాధారణ భక్తులతో పాటు అయ్యప్ప మాలధారులు రావడంతో ఆలయం కిక్కిరిసింది. నారసింహ సుదర్శన హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


అయినవిల్లిలో భక్తుల సందడి



అయినవిల్లి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి గ్రామంలోని విఘ్నేశ్వర స్వామి వారి ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో స్వామికి మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకాలు, ఏకాదశ, లఘున్యాస రుద్రాభిషేకాలు జరిపారు. స్వామికి మహా నివేదన అనంతరం వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

సాక్షి ప్లస్
సోమవారం ॥ 11-11-2024
ట్రావెల్ ఆర్ట్ & కల్చర్

● మౌంట్ అబూ



దిల్‌వాడా... పాలరాతి అద్భుతం





దిల్‌వాడా టెంపుల్స్ అంటే... రిషభనాథ, నేమినాథ, ఆదినాథ, పార్శ్వనాథ, మహావీర ఆలయాల సమూహం. శ్వేతాంబర జైనం అనుసరించిన కథనాల ఆధారంగా నిర్మించిన ఆలయాలే ఇవన్నీ. ఈ ఆలయాల్లోని పూజారులే గైడ్‌లు కూడా. ఒక్కో ఆలయాన్ని చూపిస్తూ వాళ్లు చెప్పే వివరాలన్నీ చారిత్రక ఆధారాలు, హిందూ విశ్వాసాలు, జైన సూత్రాల సమ్మేళనంగా ఉంటాయి. మౌంట్ అబూ టూర్ జాబితాలో తొలి స్థానంలో ఉండేది దిల్‌వాడా జైనమందిరాలే. ఇవన్నీ పాలరాతి నిర్మాణాలే. పాలరాయిని ఏనుగుల మీద కొండమీదకు తరలించారు. అందమైన, లాలిత్యమైన పనితనం చూస్తే రాతిని చెక్కారంటే నమ్మాలనిపించదు. మైనాన్ని కరిగించి మూసలో పోసి ఈ ఆకారాలు తెచ్చారా అనిపిస్తుంది. తామర పూల రెక్కలయితే నిజమైన పూలరెక్కలు ఉండేటంత కోమలంగా కనిపిస్తాయి. స్తంభాల మీద ఉండే సాలభంజికల రూపాలన్నీ ఒకేరకంగా ఉన్నట్లనిపిస్తాయి. కానీ గైడ్ చెప్పిన తర్వాత పరిశీలనగా చూస్తే ఏ ఒక్కటీ మరొక రూపంతో పోలి ఉండదు.



పై కప్పు ప్రత్యేకం

దిల్‌వాడా ఆలయాల స్తంభాలు, గోడలు, లోపలి విగ్రహాల కంటే పై కప్పు గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. పది వాక్యాల్లో చెప్పలేని విషయాన్ని ఒక్క ఫొటో చెప్తుంది. కానీ ఇక్కడ ఫొటోగ్రఫీ నిషేధం. సెల్‌ఫోన్‌కి కూడా అనుమతి లేదు. నాలుగు ఆలయాల నిర్మాణంలో ఉపయోగించిన తర్వాత మిగిలిపోయిన పాలరాయితో మరొక ఆలయాన్ని కట్టారు. ఈ ఆలయాల సమూహంలో మొదట కనిపించేది అదే. ఈ నిర్మాణానికి కూలి తీసుకోలేదట పనివాళ్లు. వాళ్లు ప్రేమకొద్దీ చేసిన నిర్మాణం కాబట్టి దిల్‌వాడా అనే పేరు వచ్చింది. ఆ ఆలయాల సమూహానికి, ఆ ప్రదేశానికి కూడా అదే పేరు స్థిరపడిపోయింది. దిల్‌వాడా ఆలయాలలోకి పర్యాటకులను మధ్యాహ్నం పన్నెండు నుంచి అనుమతిస్తారు. శీతాకాలంలో వెళ్లిన వాళ్లకు వింటర్ ఫెస్టివల్‌లో మేవాడ్ సంప్రదాయ నాట్యాలు అలరిస్తాయి. మౌంట అబూ పర్యటనకు అక్టోబరు నుంచి మార్చి వరకు బాగుంటుంది. డిసెంబర్ 29-31 వరకు వింటర్ ఫెస్టివల్ జరుగుతుంది.

స్పెల్లింగ్ చెక్ చేసుకోవాలి

మౌంట్ అబూ పర్యటనకు గంటలు చాలవు, ఒక రోజంతా కావాలి. ఇది చారిత్రక యాత్ర మాత్రమే కాదు, సాహస యాత్ర కూడ. రాక్ క్లైంబింగ్, మౌంటెయిన్ బైకింగ్ కూడా చేయవచ్చు. పిల్లలతో వెళ్లిన వాళ్లకు వ్యాక్స్ మ్యూజియం, వైల్డ్ లైఫ్ సాంక్చురీ, బర్డ్ సాంక్చురీ పెద్ద అట్రాక్షన్. పర్యాటకులు బస చేయడానికి హోటళ్లు చాలా ఉంటాయి. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునేటప్పుడు పేరులో స్పెల్లింగ్‌ను జాగ్రత్తగా గమనించాలి. కొన్ని సాధారణ హోటళ్లు ఫైవ్ స్టార్ హోటళ్ల పేరుకి ఒక్క అక్షరం మార్చి పేరు పెట్టుకుని ఫైవ్‌స్టార్ చార్జీలు వసూలు చేస్తాయి. ఆ స్థాయి సర్వీస్ మాత్రం అందదు. మౌంట్ అబూ పర్వతం మీదకు ప్రయాణించేటప్పుడు రాజస్థాన్ వంటి ఎడారి రాష్ట్రమంతటికీ సరిపోయినంత పచ్చదనం, చల్లదనాన్ని అంతటినీ ప్రకృతి ఇక్కడే రాశిపోసిందా అనిపిస్తుంది.

- వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

● ఎరవికులమ్

పూలకొండ

పాలకొండ కాదు, పూలకొండే. కేరళ రాష్ట్రాన్ని ప్రకృతి ముద్దుబిడ్డ అని చెప్పాలి. మునార్ టూర్‌లో అట్టుకల్ వాటర్‌ఫాల్స్‌ను పాలకొండతో పోలుస్తారు. జలధార పాలకుండ ఒలికినట్లు ఉంటుందని వర్ణిస్తారు. ప్రకృతి మునార్‌కి ఇచ్చిన వరం అక్కడితో ఆగిపోలేదు. పూలకొండను కూడా ఇచ్చింది. మునార్ అనగానే టీ తోటల విహారంతో సంతృప్తి చెందకుండా టూర్‌ని మరికొంత విస్తరించాలి. ట్రెకింగ్ ఆసక్తి ఉన్న వాళ్లు ఎరవికులమ్ దిశగా అడుగులు వేయాలి.





ఎరవికులమ్... వెస్టర్న్‌ఘాట్‌లో రెండు వేల మీటర్ల ఎత్తున విస్తరించిన కొండ. నీల్‌గిరి థాయ్ వంటి ప్రత్యేకమైన జంతువులను చూడడంతోపాటు నీలకురింజి పూల మొక్కల సౌందర్యాన్ని వీక్షించవచ్చు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఈ నేషనల్ పార్క్‌లో పర్యటనకు అనుమతి ఉండదు. అక్టోబర్ వరకు రోజూ ఏదో ఒక సమయంలో వర్షం కురుస్తూనే ఉంటుంది. కాబట్టి డిసెంబర్, జనవరి నెలలైతే వర్షం లేకుండా మంచుదుప్పటి కప్పుకున్న పర్వతశ్రేణుల్లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించవచ్చు. నీలకురింజి పూసేది పుష్కరానికొక్కసారి మాత్రమే. ఈ పూల వల్లనే ఈ కొండలకు నీలగిరులనే పేరు వచ్చింది. ఈ నీలకురింజి గడచిన 2018లో పూసింది. అంతకు ముందు 2006లో పూసింది. మళ్లీ విరిసేది 2030లో. నీలంలో ఎన్ని షేడ్‌లు ఉంటాయో ఈ పూలను చూసి తెలుసుకోవాల్సిందే. రంగులను సమతూకంగా అద్దడం ప్రకృతికి తెలిసినట్లు మరే చిత్రకారుడికీ తెలియదేమో అనిపిస్తుంది. ఒక రెక్కలోనే పువ్వు మొదలు నుంచి చివరికి షేడ్‌లు మారుతాయి. ఈ చెట్లు కూడా చిన్న గుబురులుగా అందంగా ఉంటాయి. రెండున్నర అడుగుల నుంచి ఐదడుగుల ఎత్తు ఉంటాయి. అక్కడక్కడ కొన్ని చెట్లు 14 నుంచి 15 అడుగులు కూడా పెరుగుతాయి. పన్నెండేళ్లకో సారి పూసే ఈ పువ్వు ఒక ఏడాది ముందు నుంచే ఒక్కో చెట్టు మొగ్గలు తొడుగుతూ ఉంటుంది. ఏడాదికాలం విరిసిన పూలు మెల్లగా వాడిపోయి గింజ రాలిపోతుంది. ఆ గింజలు కొత్తగా మొలుస్తాయి. ఆశ్చర్యంగా 2022లో కూర్గ్ కొండల్లో కొన్ని మొక్కలు పూలు పూశాయి. ప్రకృతి క్యాలెండర్ క్రమం తప్పిందా ఏమిటనే ఆశ్చర్యం కలిగింది. కానీ నీలగిరుల్లో మరెక్కడా ఈ విచిత్రం చోటు చేసుకోలేదు. అయితే ఏటా ఎక్కడో ఓ చోట ఒక చెట్టయినా పూస్తుంటుంది. గైడ్‌లు ఆ పువ్వును చూపించి పన్నెండేళ్లకు పూసినప్పుడు కొండ ఎలా ఉంటుందో ఫొటోల్లో చూపిస్తుంటారు.

నిరాశ మిగిల్చిన పుష్కరం

గడచిన దఫా కురింజి పూసిన 2018లో అధిక వర్షాలతో ఎరవికులమ్ నేషనల్ పార్కు జలమయమైపోయింది. కొచ్చి ఎయిర్‌పోర్టులో రన్‌వే మీద కూడా నీళ్లు నిలిచిపోవడంతో విమానాలు రద్దయ్యాయి. వర్షాలు తగ్గి వాతావరణం చక్కబడిన తరవాత కూడా కురింజి పూల కోసం వెళ్లిన వాళ్లకు నిరాశే ఎదురైంది. వర్షాలకు పూలు రాలిపోయి, వాడిపోయి, చెట్లు పుల్లలుగా మిగిలాయి.



కథక్ నృత్యం

అమెరికాలో... భారతీయ జానపద కథలకు జీవం

అమెరికాలోని కథా డ్యాన్స్ థియేటర్‌లో ప్రాచీన భారతీయ జానపద కథలను కథక్ డ్యాన్స్‌లో లయలుగా చేర్చి నృత్యకారులు అబ్బురపరుస్తున్నారు.



కథక్ నృత్యం జానపద కథల జ్ఞానాన్ని తెలియజేస్తుంది. కథా డ్యాన్స్ థియేటర్ లో 'పంచతంత్ర, ది డ్యాన్సింగ్ టేల్స్ ఆఫ్ విజ్డమ్'ను ప్రదర్శిస్తున్నారు. ఈ విధంగా విదేశాలలో భారత శాస్త్రీయ నృత్య రూపమైన కథక్ ద్వారా ప్రాచీన భారతీయ జానపద కథలకు జీవం పోస్తుంది.

'ఈ థియేటర్ ప్రారంభంలో నా మనుగడే ప్రశ్నార్థకంగా ఉండేది. భారతదేశం నుండి వచ్చిన నేను నా సంస్కృతికి ప్రాతినిధ్యం వహించడం లేదు ఎప్పుడూ బాధగా అనిపించేది. మన పొరుగువారిని కలుసుకోవాలంటే కళలను మించిన మార్గం లేదు. దీంతో 1987లో మా ఇంటి నేలమాళిగలో కథా థియేటర్ కంపెనీని ప్రారంభించాను' అంటూ కథా డ్యాన్స్ థియేటర్ వ్యవస్థాపకుడు, క్రియేటివ్ డైరెక్టర్ రీటా ముస్తాఫీ తొలి రోజుల ప్రయత్నాలను వివరిస్తారు. ముస్తాఫీ, కథక్ క్లిష్టమైన ఫుట్‌వర్క్, హై-స్పీడ్ స్పిన్‌లు, రిథమిక్ ప్యాటర్న్‌లు, సాంస్కృతిక విభజనలను తగ్గించడానికి, కథలను చెప్పడానికి ఉపయోగిస్తూ వచ్చారు.

జంతు కథల ఆధారంగా!

ఇప్పుడు వారాంతాల్లో కథక్ నృత్య ప్రదర్శన ద్వారా నైతిక పాఠాలను బోధిస్తున్నారు. అందుకు, సంస్కృతంలో 2,000 ఏళ్ల క్రితం రాసిన జంతు కథల ఆధారంగా నృత్యాన్ని రూపొందించారు. 'సింహం, నక్క, చిరుత, కాకి' కథలో మొదటిది... ఒక సింహం ఒంటెను వేటాడాలనే ఉద్దేశ్యంతో ఉన్నప్పటికీ దాని ప్రాణాలను విడిచిపెట్టాలని నిర్ణయించుకుంటుంది. ఆ సమయంలో నిజమైన నాయకత్వంలో దయ ఉంటుందని తెలుసుకుంటుంది. రెండవ కథ... 'ది ఎలిఫెంట్ అండ్ ది మౌజ్'లో, ఏనుగులు ఎలుకల సమూహాన్ని తొక్కడం మానుకుంటాయి. ఎలుకలు తరువాత ఏనుగులను వేటగాళ్ల ఉచ్చు నుండి రక్షిస్తాయి. శక్తి పరిమాణంతో సంబంధం లేకుండా పరస్పర గౌరవం విలువను ప్రదర్శిస్తాయి.



చివరి కథ... 'ది ఫిష్ అండ్ ది ఫ్రాగ్'లో, అతి విశ్వాసం ఉన్న చేపలను సమీపంలోని కుటుంబం గురించి కప్ప హెచ్చరిస్తే, అవి విస్మరిస్తాయి. ఫలితంగా వాటిని ఆ కుటుంబం పట్టుకోవడంలో జాగ్రత్త, అవగాహన ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది. ''ఇవి నేను ఎదిగే సమయంలో విన్న కథలు. నా పిల్లలూ ఆ కథలను వింటూ పెరిగారు, ఇప్పుడు నా మనవరాళ్లు కూడా వాటిని చదువుతున్నారు. ఈ కథలు అర్థవంతమైనవి ఎందుకంటే అవి దయగా, తెలివిగా, ధైర్యంగా ఎలా ఉండాలో నేర్పుతాయి' అని ముస్తాఫీ వివరిస్తారు.

ఒక చోట చేర్చే నృత్యం

సెయింట్ లూయిస్ పార్క్‌లోని థియేటర్ డ్యాన్స్ స్కూల్ నుండి కథా డ్యాన్స్ థియేటర్ ప్రొఫెషనల్ కంపెనీకి చెందిన 42 మంది డ్యాన్సర్లు, అప్రెంటిస్‌లు, 8 నుండి 12 సంవత్సరాల వయస్సు గల 20 మంది పిల్లలను ఈ నృత్యం ఒకచోట చేర్చుతుంది. న్యూ ఢిల్లీకి చెందిన కాస్ట్యూమ్ డిజైనర్ మైత్రేయి పహరీ, 50కి పైగా దుస్తులు, 30 మాస్క్‌లను రూపొందించారు, కల్పిత కథల జంతు పాత్రలను డ్యాన్సర్‌లు ధరిస్తారు.

ఈ ప్రదర్శనలో సంజుక్త మిత్రా పెయింటింగ్‌లు, మిన్నియాపొలిస్‌కు చెందిన నిర్మాత జె.డి. స్టీల్, భారతీయ స్వరకర్త జయంత బెనర్జీ స్వరపరిచిన ఒరిజినల్ స్కోర్, కల్పిత కథల ద్వారా ప్రేక్షకులకు మార్గనిర్దేశం చేసే ఆంగ్ల వాయిస్ ఓవర్, కథనం కూడా ఉంటాయి.

సోనమ్ కపూర్
ప్రాచీన కళల సౌధం

బాలీవుడ్ నటి సోనమ్ కపూర్ ఇల్లు భారతీయ హస్తకళ, రాచరికపు వారసత్వ కళతో ఆకట్టుకుంటుంది. ముంబైలో ఉన్న ఆమె ఇల్లు తంజోర్ పెయింటింగ్స్, నాగా ప్యానెల్స్, రాజస్థానీ జాలీస్, జర్దోజీ ఎంబ్రాయిడరీలతో.. రాజ సౌధాలకు మించిన అద్భుతంతో అలరారుతుంటుంది. సోనమ్ ఆంటీ ఎడి 100 ఇంటీరియర్ డిజైనర్ కవితా సింగ్ సోనమ్ ఇంటి డిజైనింగ్‌లో పాలుపంచుకుంది.



గోడలపై తంజోర్ పెయింటింగ్ సేకరణ, మొఘల్ జర్దోసీ కుషన్స్, ఇత్తడి బల్లలు, వెండి విగ్రహాలు... ప్రాచీన కళతో ఉట్టిపడతాయి.

మనం అత్యంత ఇష్టపడే తారల్లో సోనమ్ కపూర్ ఒకరు. ఆమెకు ఇష్టమైనది మాత్రం భారతీయ వారసత్వ కళ అని ఆమె ఇంటిని చూసిన వారికి ఇట్టే అర్థం అవుతుంది. ఇంటీరియర్ డిజైనర్ కవితా సింగ్ ఈ హంగులను ప్రస్తావిస్తూ –



''సోనమ్ ఆసక్తిని లోతుగా పరిశోధించడానికి ఆమెతో కలిసి కొంత కాలం ప్రయాణించాను. సెప్టెంబర్ 2021లో ఆమె నాటింగ్ హిల్ ఫైడ్ – ఎ – టెర్రే, కెన్సింగ్‌టన్ స్టూడియోలు రెండింటినీ చూశాను. వాటి పునరుద్ధరణలో ఆమె ప్రతిభ, కళల పట్ల ఉన్న అవగాహనను చూసి ఆశ్చర్యపోయాను. ఆమె నాతో మాట్లాడుతూ 'నేను నా భర్త ఆనంద్, కొడుకు వాయుతో పంచుకునే ఈ ఇంటిని ఒక మహిళగా, నిర్వాహకురాలిగా, తల్లిగా నాకు ఓ కొత్త అనుభూతిని అందించాలి' అని తెలిపింది. ఈ సందర్భంగా సోనమ్ చెప్పిన విషయాలు కూడా ప్రస్తావించాలి.

ప్రాచీన వస్తువుల సేకరణ

'సినిమా చిత్రీకరణలో భాగంగా చాలా చోట్లకు వెళుతుంటాం. ఆ విధంగా సంవత్సరాలుగా నేను సేకరించిన అన్ని వస్తువులను అలంకరించడానికి ఒక స్థావరం కోసం ఎంతో కాలంగా ఎదురుచూశాను. భారతదేశం అంతటా మురికి హవేలీలు, పురాతన వస్తువుల దుకాణాలు గుండా తిరిగాను. నేను దేనినైనా ప్రేమిస్తే, అది నా ఇంటికి చేరకుండా ఉండదు. లక్ష్మీ నివాస్ ప్యాలెస్‌లో చిత్రీకరణ సమయంలో దొరికిన విశాలమైన బికనీర్ ద్యూరీని మోసుకొచ్చేశాను' అని ఆనందంతో వివరిస్తుంది. ఓ వైపు ప్రాచీన చైనీస్ గ్లాస్ పెయింటింగ్‌లు, మరో ప్రపంచంలా అనిపించే పియరీ ప్యారీ వాల్‌పేపర్‌తో రూపొందించిన గదులు, పాదాల క్రింద హృదయాన్ని మెత్తగా హత్తుకుపోయే ఎరుపు, నారింజల రంగుల తివాచీలు మనల్ని అబ్బురపరుస్తాయి.



అత్త, ఇంటీరియర్ డిజైనర్ అయిన కవితా సింగ్‌తో కలిసి సోనమ్ కూర్చున్న లివింగ్ రూమ్.

అమ్మమ్మ ప్రభావం

కపూర్ సౌందర్య అభిరుచులను ప్రోత్సహించింది ఆమె అమ్మమ్మ. 'మా అమ్మమ్మ ఒక సామాన్యమైన మహిళ, కానీ చాలా చురుకుదనంతో ఉంటుంది' అని గుర్తు చేస్తుకుంటుంది కపూర్. 'అమ్మమ్మ తన మారుతి సుజుకీలో దాదర్ పూల మార్కెట్‌కు ఉదయం 5 గంటలకు తన ఇంటిని సువాసనలతో నింపడానికి స్పీడ్‌గా వెళ్లేది. శాస్త్రీయ సంగీతం, కళలు, తివాచీలను ఆరాధించేది. కరాచీలో విభజనకు ముందు సింధీ కుటుంబం నుండి వచ్చినందున, మా అమ్మమ్మకి తన అభిరుచులపై మంచి ఆసక్తి ఉంది. నాపై ఆమె ప్రభావాన్ని తగ్గించడం కష్టం' అంటుంది. ఇలా సోనమ్ ఇష్టాయిష్టాలను కనుక్కుంటూ ఒక్కో వస్తువును అలంకరణలో భాగం చేసుకుంటూ ఆమె ఇంటిని సుందరంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నించాం.

ఆర్ట్

24 అడుగుల భారీ కళాకృతి

సాంస్కృతిక ఐక్యత, సమాజ స్ఫూర్తి కలిగేలా విశాఖపట్నంకు చెందిన కళాకారుడు మోకా విజయ్ కుమార్ 24 అడుగుల పొడవైన యాక్రిలిక్ కాన్వాస్ పెయింటింగ్ వేసి ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడు.

విశాఖపట్నంలోని డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో ప్రదర్శించిన ఈ కళాకృతి, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లోని 10 జిల్లాల్లో సాంస్కృతిక, సామాజిక, ఆర్థిక ఏకీకరణకు దృశ్యంగా నిలిచింది.

స్థానిక వారసత్వానికి జీవం


స్పష్టమైన రంగులు, క్లిష్టమైన వివరాలతో ఆయా రాష్ట్రాల్లోని కమ్యూనిటీల స్థానిక వారసత్వం, సంప్రదాయాల సారాంశానికి జీవం పోశాడు. కాన్వాస్‌లోని ప్రతి భాగం ఈ ప్రాంతాలలోని ప్రముఖ ప్రదేశాలు, గిరిజన నృత్యాలు, పండగలు, చేతి పనులు, మార్కెట్‌లతో పాటు ఈ ప్రాంతాలకు విలక్షణమైన వృక్షజాలం, జంతుజాలం, ప్రకృతి దృశ్యాలను, వాటితో అనుసంధానంగా ఉండే వ్యక్తుల జీవితాలను కళ్లకు కడుతుంది. ఇవే కాదు గనులు, చిత్రకూట్ జలపాతాలు, కోలాబ్ డ్యామ్, విజయనగరం కోట వంటి మూడు రాష్ట్రాల్లోని 53 ప్రసిద్ధ ప్రదేశాలను చూపుతుంది.



సామాజిక జీవనానికి అంకితం

'ఈ ఆర్ట్ వర్క్‌ను పూర్తి చేయడానికి మూడు నెలల కంటే ఎక్కువ సమయం పట్టింది. సంప్రదాయాలు, వాణిజ్యం ఒకచోట చేర్చే విలువలను పంచుకునే కమ్యూనిటీల సామరస్యపూర్వక సహజీవనానికి ఈ కళాకృతి అంకితం. ఈ జిల్లాలు, రాష్ట్ర సరిహద్దుల్లో విస్తరించి ఉన్నప్పటికీ, నేను నా పని ద్వారా వాటి ప్రత్యేకతలను తెలియజేయాలని ఆశించాను' అని విజయ్ కుమార్ తెలిపారు. డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో ఈ భారీ కళాకృతిని ప్రదర్శించడానికి ఆ శాఖ చొరవ తీసుకోవడం, వారి ప్రాంగణంలో స్థానిక కళ, సంస్కృతిని ప్రోత్సహించే ప్రయత్నాన్ని అంతా అభినందిస్తున్నారు.





మంచి వ్యాపారవేత్తలు దార్శనికతతో వ్యవహరిస్తారు..
లక్ష్య సాధనకు అవిశ్రాంతంగా పనిచేస్తారు...
- జాక్ వెల్చ్, అమెరికన్ వ్యాపార దిగ్గజం

బిజినెస్ రీల్

టాటా ఇండియా ఇన్నోవేషన్ ఫండ్

హైదరాబాద్: వినూత్న వ్యూహాలు, థీమ్‌లతో ప్రయోజనం పొందే కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసే అవకాశాన్ని కల్పిస్తూ టాటా ఇండియా ఇన్నోవేషన్ ఫండ్‌ను ఆవిష్కరించినట్లు టాటా అసెట్ మేనేజ్‌మెంట్ వెల్లడించింది. ఇది నవంబర్ 11 నుంచి 25 వరకు అందుబాటులో ఉంటుంది. కనీసం రూ. 5,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. వివిధ మార్కెట్ క్యాప్‌లు, రంగాలవ్యాప్తంగా ఇన్నోవేషన్ థీమ్ ద్వారా లబ్ధి పొందే సంస్థల సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా దీర్ఘకాలికంగా పెట్టుబడుల వృద్ధికి ఈ ఫండ్ తోడ్పడుతుందని సంస్థ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ రాహుల్ సింగ్ తెలిపారు.

యాక్సిస్ క్రిసిల్-ఐబీఎక్స్ ఇండెక్స్ ఫండ్..

హైదరాబాద్: యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ తాజాగా యాక్సిస్ క్రిసిల్-ఐబీఎక్స్ ఎఎఎ బాండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్-సెప్టెంబర్ 2027 ఇండెక్స్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఇది క్రిసిల్-ఐబీఎక్స్ ఎఎఎ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండెక్స్-సెప్టెంబర్ 2027లోని సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. నవంబర్ 21 వరకు ఈ ఓపెన్ ఎండెడ్ ఫండ్ అందుబాటులో ఉంటుంది. ఇందులో కనీసం రూ. 5,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు.

హింద్ జింక్‌లో వాటా విక్రయం

ప్రభుత్వానికి రూ. 3,449 కోట్లు

న్యూఢిల్లీ: హిందుస్తాన్ జింక్‌లో మైనారిటీ వాటా విక్రయం ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ. 3,449 కోట్లు సమీకరించింది. గత వారాంతాన చేపట్టిన ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్)లో భాగంగా ప్రభుత్వం 1.6 శాతం వాటాను విక్రయించింది. తొలి రోజు సంస్థాగత ఇన్వెస్టర్లకు 1.25 శాతం వాటాకు సమానమైన 5.28 కోట్ల షేర్లను ఆఫర్ చేసింది. అయితే రిటైలర్లు ఆసక్తి చూపకపోవడంతో రెండో రోజుకల్లా సంస్థాగత ఇన్వెస్టర్లు మొత్తం 1.58 శాతం వాటాకు బిడ్స్ దాఖలు చేశారు. నిజానికి గ్రీన్ షూ ఆప్షన్‌తో కలిపి ప్రభుత్వం ఓఎఫ్ఎస్ ద్వారా రెండు రోజుల్లో 2.5 శాతం వాటాను విక్రయించాలని భావించింది. ఓఎఫ్ఎస్‌కంటే ముందు హింద్ జింక్‌లో ప్రభుత్వం 29.54 శాతం వాటాను కలిగి ఉంది. షేరుకి రూ. 505 ఫ్లోర్ ధరలో ప్రభుత్వం ఆఫర్‌కు వచ్చిన విషయం విదితమే.

ఇండియన్ హోటల్స్ చేతికి రాజ్‌స్కేప్

ముంబై: ఆతిథ్య రంగ టాటా గ్రూప్ దిగ్గజం ఇండియన్ హోటల్స్(ఐహెచ్‌సీఎల్) అంబుజా నియోషియా గ్రూప్ సంస్థ రాజ్‌స్కేప్ హోటల్స్‌ను కొనుగోలు చేయనుంది. రూ. 18 కోట్లకు మించకుండా 55 శాతం వాటా కొనుగోలుకి కుదుర్చుకున్న ఒప్పందానికి బోర్డు తాజాగా ఆమోదముద్ర వేసినట్లు ఐహెచ్‌సీఎల్ పేర్కొంది. ట్రీ ఆఫ్ లైఫ్ రిసార్ట్స్ అండ్ హోటల్స్ బ్రాండుతో రాజ్‌స్కేప్.. వారణాసి, డెహ్రాడూన్, ఉదయ్‌పూర్‌వటి తదితర ప్రాంతాలలో 19 రిసార్టులను నిర్వహిస్తోంది. తాజా కొనుగోలు ద్వారా ఎక్స్‌పీరియన్షియల్ లీజర్ విభాగంలో తాజ్ గ్రూప్ హోటళ్ల దిగ్గజం కార్యకలాపాలు మరింత విస్తరించనుంది. 2030కల్లా వీటిని 100కు చేర్చాలని భావిస్తున్నట్లు ఐహెచ్‌సీఎల్ ఎండీ, సీఈవో పునీత్ చాట్వాల్ పేర్కొన్నారు. ప్రస్తుతం అంబుజా నియోషియా గ్రూప్‌తో డార్జిలింగ్, గ్యాంగ్‌టక్‌లలో ఏడు హోటళ్లు, రిసార్టుల నిర్వహణలో భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నట్లు వెల్లడించారు.

ఐహెచ్‌సీఎల్ షేరు ఎన్ఎస్ఈలో రూ. 668 వద్ద ముగిసింది.

సెప్టెంబర్ త్రైమాసిక ఫలితాలు Q2 RESULTS

ఏషియన్ పెయింట్స్ లాభం డౌన్

క్యూ2లో రూ. 694 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం ఏషియన్ పెయింట్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 44 శాతం క్షీణించి రూ. 694 కోట్లకు పరిమితమైంది. డిమాండ్ మందగించడం, ముడివ్యయాల పెరుగుదల, డెకొరేటివ్, కోటింగ్ బిజినెస్ క్షీణించడం ప్రభావం చూపాయి. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 1,232 కోట్లకుపైగా ఆర్జించింది. వాటాదారులకు షేరుకి రూ. 4.25 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. మొత్తం అమ్మకాలు సైతం 5 శాతం నీరసించి రూ. 8,028 కోట్లకు చేరాయి. గత క్యూ2లో రూ. 8,479 కోట్ల టర్నోవర్ సాధించింది. అయితే మొత్తం వ్యయాలు స్వల్పంగా 1 శాతం పెరిగి రూ. 7,093 కోట్లను దాటాయి. ఇతర వనరులతో కలిపి మొత్తం ఆదాయం 5 శాతం తక్కువగా రూ. 8,201 కోట్లను తాకింది. కాగా.. అంతర్జాతీయ అమ్మకాలు నామమాత్ర క్షీణతతో రూ. 770 కోట్లకు పరిమితమయ్యాయి. గత క్యూ2లో సాధించిన రూ. 40 కోట్ల పన్నుకుముందు లాభం (పీబీటీ)స్థానే రూ. 22 కోట్ల నష్టం ప్రకటించింది.

ప్రోవీ ఆదాయం రూ. 296 కోట్లు



ముంబై: ప్రొవెంటస్ అగ్రోకామ్ (ప్రోవీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో రూ. 296 కోట్ల ఆదాయం నమోదు చేసింది. నికర లాభం సుమారు రూ. 5 కోట్లుగా నమోదైంది. సూరత్‌లోని కొత్త తయారీ ప్లాంటు ఈ ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో అందుబాటులోకి వస్తుందని, దీనితో ఉత్పత్తి సామర్థ్యం నాలుగింతలు పెరుగుతుందని సంస్థ తెలిపింది. ప్రీమియం గిఫ్టింగ్ మార్కెట్లో అమ్మకాలు గతేడాదితో పోలిస్తే రెట్టింపు కాగలవని అంచనా వేస్తున్నట్లు సీఈవో దుర్గా ప్రసాద్ ఝూవర్ తెలిపారు. 2028 నాటికి రూ. 1,000 కోట్ల ఆదాయం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు.

గణాంకాలు, ఫలితాలపై దృష్టి

- డాలర్, యూఎస్ బాండ్ ఈల్డ్ కీలకం
- చమురు ధరలు, విదేశీ అంశాల ఎఫెక్ట్
- ఈ వారం ట్రేడింగ్ నాలుగు రోజులే
- మార్కెట్ల ట్రెండ్‌పై నిపుణుల అంచనాలు



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) రెండో త్రైమాసిక ఫలితాల సీజన్ ముగింపునకు వస్తోంది. ఈ బాటలో ఈ వారం మరికొన్ని కార్పొరేట్ దిగ్గజాలు జులై-సెప్టెంబర్(క్యూ2) పనితీరును వెల్లడించనున్నాయి. వీటితోపాటు దేశీ స్టాక్ మార్కెట్లను దేశీ ఆర్థిక గణాంకాలు సైతం ఈ వారం ప్రధానంగా ప్రభావితం చేయనున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. ఈ వారం ఓఎన్‌జీసీ, అపోలో టైర్స్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, హిందాల్కో ఇండస్ట్రీస్, బీఈఎంఎల్, బీఏఎస్ఎఫ్, బాష్, అల్కాజియో, జూబిలెంట్ ఫుడ్, ఎన్ఎండీసీ, బ్లూడార్ట్, బ్రిటానియా, ఫినొలెక్స్ కేబుల్స్, హ్యుందాయ్, ఈఐహెచ్, బటర్‌ఫ్లై గంధిమతి, బ్రెయిన్‌బీస్ సొల్యూషన్స్(ఫస్ట్‌క్రై మాతృ సంస్థ), గ్రాఫైట్, ఎల్జీ ఎక్విప్‌మెంట్స్, శ్రీ సిమెంట్, జైడస్ వెల్‌నెస్ తదితర పలు కంపెనీలు క్యూ2 ఫలితాలు ప్రకటించనున్నాయి.

పావెల్ ప్రసంగం

అక్టోబర్ నెలకు యూఎస్ ద్రవ్యోల్బణ గణాంకాలు 13న వెలువడనున్నాయి. సెప్టెంబర్‌లో 2.4 శాతంగా నమోదైంది. ఇక కీలకమైన వినియోగ ధరల సూచీ సెప్టెంబర్‌లో 3.3 శాతాన్ని తాకింది. శుక్రవారం కీలక అంశాలపై యూఎస్ ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమీ పావెల్ ప్రసంగించనున్నారు. గత వారం చేపట్టిన పాలసీ సమీక్షలో వడ్డీ రేట్లను 0.25 శాతం తగ్గించిన విషయం విదితమే. దీంతో ఫెడ్ ఫండ్స్ రేట్లు తాజాగా 4.5-4.75 శాతానికి చేరాయి. ఇక మరోపక్క జులై-సెప్టెంబర్‌కు జపాన్ జీడీపీ గణాంకాలు ఇదే రోజు వెల్లడికానున్నాయి. ఏప్రిల్-జూన్‌లో జపాన్ జీడీపీ 0.7 శాతం పుంజుకుంది. అక్టోబర్‌కు చైనా పారిశ్రామికోత్పత్తి గణాంకాలు సైతం తెలియనున్నాయి. సెప్టెంబర్‌లో 5.4 శాతం పురోగతి నమోదైంది.

ఇతర అంశాలు

యూఎస్ ప్రెసిడెంట్‌గా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టనుండటంతో డాలరు ఇండెక్స్‌సహా యూఎస్ బాండ్ల ఈల్డ్స్ ఇటీవల బలపడుతూ వస్తున్నాయి. దీంతో డాలరుతో మారకంలో దేశీ కరెన్సీ రూపాయి సరికొత్త కనిష్టాలను తాకుతోంది. 84.38వరకూ పతనమైంది. మరోవైపు రాజకీయ, భౌగోళిక అనిశ్చితుల కారణంగా ముడిచమురు ధరలు ఆటుపోట్లకు లోనవుతున్నాయి. కాగా.. ఈ వారం దేశ, విదేశీ గణాంకాలు సెంటిమెంటుపై ప్రభావం చూపనున్నట్లు స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ రీసెర్చ్ హెడ్ సంతోష్ మీనా పేర్కొన్నారు. వీటికితోడు దేశీ కార్పొరేట్ల క్యూ2 ఫలితాలకూ ప్రాధాన్యత ఉన్నట్లు మాస్టర్ క్యాపిటల్ సర్వీసెస్ డైరెక్టర్ పల్కా ఆరోరా చోప్రా తెలియజేశారు.

గత వారమిలా

విదేశీ ఇన్వెస్టర్ల భారీ అమ్మకాల నేపథ్యంలో దేశీ స్టాక్ మార్కెట్లు గత వారం డీలా పడినట్లు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వీకే విజయకుమార్ పేర్కొన్నారు. ఈ నెలలోనూ అమ్మకాలు కొనసాగే వీలున్నట్లు అంచనా వేశారు. అంతంతమాత్ర క్యూ2 ఫలితాలు, ప్రపంచ అనిశ్చితుల కారణంగా ఈ వారం మార్కెట్లు సైడ్‌వేస్‌లో కదలవచ్చని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వెల్త్ మేనేజ్‌మెంట్, రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా అభిప్రాయపడ్డారు. అయితే ఫలితాల ఆధారంగా కొన్ని స్టాక్స్‌లో యాక్టివిటీకి వీలున్నట్లు తెలియజేశారు. గత వారం సెన్సెక్స్ 238 పాయింట్లు క్షీణించి 79,486వద్ద నిలవగా.. నిఫ్టీ 156 పాయింట్లు కోల్పోయి 24,148 వద్ద ముగిసింది.

ఎఫ్‌పీఐలు

5 రోజుల్లో రూ. 20,000 కోట్లు



ఈ నెలలోనూ విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) దేశీ స్టాక్స్‌లో విక్రయాలకే మొగ్గు చూపుతున్నారు. దీంతో తొలి ఐదు ట్రేడింగ్ సెషన్లలో నికరంగా దాదాపు రూ. 20,000 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. చైనా సహాయక ప్యాకేజీలకు తెరతీయడం, దేశీయంగా మార్కెట్లు సరికొత్త గరిష్టాలకు చేరి ఖరీదుగా మారడం తదితర కారణాలతో కొద్ది రోజులుగా ఎఫ్‌పీఐలు నిరవధిక అమ్మకాలకు పాల్పడుతున్నారు. ఫలితంగా గత నెలలో సరికొత్త రికార్డ్ నెలకొల్పుతూ రూ. 94,017 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించిన విషయం విదితమే. అయితే అంతకుముందు సెప్టెంబర్‌లో గత 9 నెలల్లోనే అత్యధికంగా రూ. 57,724 కోట్లు ఇన్వెస్ట్ చేయడం గమనార్హం! కాగా.. ఇంతక్రితం 2020 మార్చిలో మాత్రమే ఒకే నెలలో అత్యధికంగా రూ. 61,973 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు.

శుక్రవారం సెలవు

గురునానక్ జయంతి సందర్భంగా వారాంతాన(15) ఈక్విటీ మార్కెట్లకు సెలవు. దీంతో ఈ వారం ట్రేడింగ్ నాలుగు రోజులకే పరిమితంకానుంది. కాగా.. అక్టోబర్ నెలకు రిటైల్ ధరల ద్రవ్యోల్బణం(సీపీఐ) గణాంకాలు మంగళవారం(12న) వెలువడనున్నాయి. సెప్టెంబర్‌లో సీపీఐ 5.49 శాతంగా నమోదైంది. టోకు ధరల ద్రవ్యోల్బణం(డబ్ల్యూపీఐ) వివరాలు గురువారం (14న) వెల్లడికానున్నాయి. సెప్టెంబర్‌లో డబ్ల్యూపీఐ 1.84 శాతానికి చేరింది. ఈ బాటలో ప్రభుత్వం శుక్రవారం(15న) అక్టోబర్ నెలకు వాణిజ్య గణాంకాలు విడుదల చేయనుంది.

నష్టాలు తగ్గించుకున్న బజాజ్ హిందుస్థాన్ షుగర్



న్యూఢిల్లీ: బజాజ్ హిందుస్థాన్ షుగర్ సెప్టెంబర్ త్రైమాసికంలో నష్టాలను రూ.76 కోట్లకు తగ్గించుకుంది. క్రితం ఏడాది ఇదే కాలంలో నష్టం రూ.122 కోట్లుగా ఉండడం గమనార్హం. ఆదాయం రూ.1,163 కోట్లుగా ఉంది. చెరకు లభ్యత తగ్గడం, సామర్థ్య వినియోగం తగ్గడం తదితర సవాళ్లను ఎదుర్కొన్నట్టు కంపెనీ తెలిపింది. ''కొన్ని రుణాలు తీర్చివేయడంతో వడ్డీ వ్యయాలు గణనీయంగా తగ్గాయి. చెరకు రైతులకు చెల్లింపులకు లిక్విడిటీ పెరగడం అనుకూలించింది'' అని కంపెనీ తెలిపింది. చక్కెర కనీస ధర కిలోకి రూ.31 నుంచి రూ.39-40కి పెంచాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తుండడం, అధిక ఇథనాల్ ధరలతో భవిష్యత్ పట్ల సానుకూలతను వ్యక్తం చేసింది. సంస్థ నిర్వహణలో 14 షుగర్ ప్లాంట్లు, ఆరు డిస్టిలరీలు ఉన్నాయి.

బెక్టార్స్ ఫుడ్ మిశ్రమ పనితీరు



న్యూఢిల్లీ: బిస్కెట్, బేకరీ ఉత్పత్తుల సంస్థ బెక్టార్స్ ఫుడ్ స్పెషాలిటీస్ సెప్టెంబర్ క్వార్టర్‌లో స్థిరమైన పనితీరు చూపించింది. నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.37 కోట్లతో పోల్చితే 4 శాతానికి పైగా పెరిగి రూ.39 కోట్లకు చేరింది. ఆదాయం ఇదే కాలంలో 20 శాతానికి పైగా ఎగసి రూ.496 కోట్లకు చేరింది. ముఖ్యంగా వ్యయాలు పెరిగిపోవడం లాభాలపై ప్రభావం చూపించింది. వ్యయాలు 22 శాతానికి పైగా పెరిగి రూ.449 కోట్లుగా నమోదయ్యాయి. బిస్కెట్ల (క్రెమికా) విభాగం ఆదాయం 24 శాతం పెరిగి రూ.320 కోట్లుగా ఉంటే.. బేకరీ విభాగం (ఇంగ్లిష్ ఓవెన్) ఆదాయం 19 శాతం పెరిగి రూ.167 కోట్లుగా నమోదైంది.

బీఎస్ఈలో షేరు ఎలాంటి మార్పు లేకుండా రూ.1,813 వద్ద ముగిసింది.

ఏజీఐ గ్రీన్‌ప్యాక్ లాభం 28 శాతం వృద్ధి



గురుగ్రామ్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ప్యాకేజింగ్ ఉత్పత్తుల కంపెనీ ఏజీఐ గ్రీన్‌ప్యాక్ లాభం 28 శాతం వృద్ధి చెంది రూ. 72 కోట్లుగా నమోదైంది. ఆదాయం స్థిరంగా రూ. 599 కోట్లుగా నమోదైంది. ప్రథమార్ధంలో ఆదాయం రూ. 1,166 కోట్లకు చేరగా లాభం 13 శాతం వృద్ధితో రూ. 135 కోట్లకు పెరిగింది. ఉత్పత్తి సామర్థ్యాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవడం, వ్యయాల నియంత్రణపై దృష్టి పెట్టడం తదితర అంశాల తోడ్పాటుతో మెరుగైన ఫలితాలు సాధించగలిగామని సంస్థ సీఎండీ సందీప్ సోమాని తెలిపారు.

పడిపోయిన వెల్‌స్పన్ లాభాలు

క్యూ2లో రూ.283 కోట్లు



న్యూఢిల్లీ: వెల్‌స్పన్ కార్ప్ సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో (క్యూ2) బలహీన పనితీరు చూపించింది. లాభం 27 శాతం తగ్గి రూ.283 కోట్లకు పరిమితమైంది. ఆదాయం సైతం 20 శాతం మేర క్షీణించి రూ.3,364 కోట్లకు పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.386 కోట్లు, ఆదాయం రూ.4,161 కోట్ల చొప్పున ఉండడం గమనార్హం. వ్యయాలు ఇదే కాలంలో రూ.3,820 కోట్ల నుంచి రూ.3,071 కోట్లకు దిగొచ్చాయి. డక్టైల్ ఐరన్ పైపుల సామర్థ్యాన్ని 150కేఎంటీపీఏ నుంచి 250కేఎంటీపీకి పెంచేందుకు, 350కేఎంటీపీఏ సామర్థ్యంతో లాంగిట్యూడినల్ సబ్‌మెర్జ్‌డ్ ఆర్క్ వెల్డింగ్ (ఎల్ఎస్ఏడబ్ల్యూ) పైపుల సామర్థ్యాన్ని సౌదీ అరేబియాలో రూ.1,680 కోట్లతో ఏర్పాటుకు నిర్ణయించింది. భోపాల్‌లో హెచ్ఎస్ఏడబ్ల్యూ పైపుల సామర్థ్యాన్ని 60కిలో మెట్రిక్ టన్నులకు (కేఎంటీపీఏ) పెంచనున్నట్టు ప్రకటించింది.

షిప్పింగ్ కార్ప్ లాభం దూకుడు

క్యూ2లో రూ. 291 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం షిప్పింగ్ కార్పొరేషన్(ఎస్‌సీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం దాదాపు 5 రెట్లు జంప్‌చేసి రూ. 291 కోట్లను అధిగమించింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో కేవలం రూ. 66 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు షేరుకి రూ. 0.5 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మొత్తం ఆదాయం సైతం రూ. 1,162 కోట్ల నుంచి రూ. 1,491 కోట్లకు ఎగసింది. మొత్తం వ్యయాలు రూ. 1,113 కోట్ల నుంచి రూ. 1,195 కోట్లకు పెరిగాయి.

ఫలితాల నేపథ్యంలో ఎస్‌సీఐ షేరు బీఎస్ఈలో 4 శాతం పతనమై రూ. 212 వద్ద ముగిసింది.

పన్ను ఎగవేత.. పలు రకాలు..



కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

పన్ను ఎగవేత చట్టరీత్యా నేరం. అనైతికం. ఆర్థికంగా సంక్షోభం తయారవుతుంది. అయితే, మన చుట్టూ ఉన్న ప్రపంచం అంతా మోసం చేస్తున్నట్లు అనిపిస్తుంది. సినిమాలో 'విలన్' మనకు ఆది నుంచి చివరి వరకు కనిపిస్తాడు. నిజజీవితంలో 'విలన్' విలన్‌లాగా కనిపించడు. ఓ పరోపకారి పాపయ్యలాగా, ఓ మర్యాద రామన్నలాగా అనిపిస్తాడు. వినిపిస్తాడు. కనిపిస్తాడు. ఎంతో మోసం చేస్తాడు. మనం తెలుసుకునే లోపల తెరమరుగవుతాడు.

''మీరు ఇప్పుడే మోసపోయారు'' పుస్తకంలో రచయిత.. మనం ప్రతి రోజూ వైట్‌కాలర్ క్రైమ్ ద్వారా ఎలా మోసపోతున్నామో కళ్ళకి కట్టినట్లు తెలియజేశారు. ''డబ్బుని ఎలా సంపాదించాలి'' అనే పుస్తకంలో రచయిత 'అంకుర్ వారికూ' ఎలా సంపాదించాలి, ఎలా ఖర్చు పెట్టాలి, ఆస్తిని ఎలా ఏర్పాటు చేసుకోవాలని మొదలైన విషయాల మీద ఆచరణాత్మకమైన సలహాలు ఇస్తారు. అలాగే తెలుగు రచయతలు వీరేంద్రనాథ్‌గారు, బీవీ పట్టాభిరాం గారు తమ పుస్తకాల ద్వారా ఎన్నో మంచి విషయాలు చెప్పారు. ఇంత మంది చెప్పినా, ఇన్ని విషయాలు తెలిసినా, షరా మామూలే!

ఒకరిని చూసి ఒకరు. ఆశతో, ప్రేరేపణతో. పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగినట్లు మోసం చేస్తున్నారు. పన్ను ఎగవేస్తున్నారు. శతకోటి దరిద్రాలకు అనంతకోటి మార్గాలున్నట్లు..

- అకౌంట్స్ బుక్స్ నిర్వహించపోవడం, నిర్వహణలో అవకతవకలు, ఆదాయాన్ని తక్కువగా చూపించడం, ఖర్చులను పెంచేయడం
- దురాలోచనలతో బంగారాన్ని .. అంటే ఆభరణాలు, రత్నాలు, డైమండ్లు, వెండి విషయాల్లో సెంటిమెంటు పేరు మీద, పసుపు-కుంకాల పేరు మీద, పెళ్లిళ్ల పేరు మీద కొంటున్నారు. అమ్ముతున్నారు. మళ్లీ కొంటున్నారు. పెట్టుబడికి సోర్స్ చెప్పరు. లాభాన్ని లెక్కించరు. ఆస్తిగా చూపించరు. ''భర్తకే చెప్పం'' అంటారు కొందరు మహిళలు. మీకు గుర్తుండే ఉంటుంది. రైళ్లలో బోగీ ఎక్కే ముందు ఇదివరకు ప్రయాణికుల జాబితా ఉండేది. పేరు, వయస్సు, లింగం, పాన్ నంబరు, మొదలైనవి అందులో ఉంటాయి. బంగారం షాపులవాళ్లు వారి సిబ్బందిని పంపించి ఆ వివరాలను సంగ్రహించేవారు. ఆ జాబితాను తీసుకుని, షాపునకు వచ్చి, అందులోని పేర్ల మీద ఇతరులకు అమ్మేవారు.
- వ్యవసాయ భూమి అంటే ఏమిటో ఆదాయపు పన్ను నిర్వచించినా, గ్రామాల పేరు మార్చి, సరిహద్దులు మార్చి అమ్మకాల్లో మోసం. అలాగే ఆదాయం విషయంలో ఎన్నో మతలబులు.. ఎందుకంటే వ్యవసాయ ఆదాయం, భూమి అమ్మకాల మీద పన్ను లేదు.
- ఇక రియల్ ఎస్టేట్ రంగంలో చెప్పనక్కర్లేదు. నేతి బీరకాయలో నేయి లేదు కానీ రియల్ ఎస్టేట్ రంగంలో ''రియల్'' గానే పన్ను ఎగవేత ఉంది.
- అన్‌లిస్టెడ్ కంపెనీల షేర్లు, స్టాక్స్, క్రయవిక్రయాల్లో ఎన్నో అక్రమమార్గాలు అవలంబిస్తున్నారు.
- పబ్లిక్ కంపెనీల్లో షేరు ప్రీమియం పేరుతో మోసాలు.. అలాగే షేర్స్ అలాట్‌మెంట్‌కి ముందుగా అప్లికేషన్‌తో పాటు వసూలు చేసే మనీతో మోసాలు.
- వ్యాపారంలో సర్దుబాటు హుండీలు సహజం... వీటి మార్పిడి... ఇదొక సరిహద్దుల్లేని వ్యాపారం అయిపోయింది.
- డమ్మీ సంస్థలు.. ఉనికిలో లేనివి.. ఉలుకు లేని..పలుకు లేని.. కాగితం సంస్థలు. కేవలం ఎగవేతకే ఎగబాకే సంస్థలు. దొంగ కంపెనీలు. డొల్ల కంపెనీలు. బోగస్ వ్యవహారాలు. బోగస్ కంపెనీలు.
- క్రిప్టోకరెన్సీల్లో గోల్‌మాల్..ఇలా ఎన్నో.. ముఖ్యంగా సోర్స్ చెప్పకపోవడం, పెట్టుబడికి కానీ.. రాబడికి కానీ వివరణ ఇవ్వకపోవడం, పన్ను ఎగవేతకు పన్నాగం చేయడం. వీటి జోలికి పోకండి.

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

దివ్యాంగులకు ఆరోగ్య బీమా..

ఈ ఐదు తప్పిదాలు చేయొద్దు..





హిమాంశు వాలియా
చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్, స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్

సరైన ఆరోగ్య బీమా పథకమనేది దివ్యాంగులకు ఒక రక్షణ కవచంలాంటిది. ఒక్కొక్కరి అవసరాలు ఒక్కో విధంగా ఉంటాయి కాబట్టి వాటికి అనుగుణంగా తగిన పథకాన్ని తీసుకోగలిగితే ఆర్థిక భద్రత లభిస్తుంది. అయితే, సరైన బీమా పథకాన్ని ఎంచుకోవడంలో ఎన్నో అవరోధాలు ఉంటాయి. అర్థం కాని పరిభాష, పైకి కనిపించని నిబంధనలు, అనేకానేక ఆప్షన్లు మొదలైన వాటితో ఇదో గందరగోళ వ్యవహారంగా ఉంటుంది. ఒక్క చిన్న తప్పటడుగు వేసినా సరైన కవరేజీ లేకుండా పోవడమో, ఊహించని ఖర్చులు పెట్టుకోవాల్సి రావడమో లేక అత్యవసర పరిస్థితుల్లో ఆటంకాలు ఎదురుకావడమో జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో, దివ్యాంగులు ఆరోగ్య బీమాను ఎంచుకునేటప్పుడు నివారించతగిన తప్పిదాలపై అవగాహన కల్పించడం ఈ కథనం ఉద్దేశం. అవేమిటంటే..

కీలక వివరాలను పట్టించుకోకపోవడం: ఆరోగ్య బీమాను ఎంచుకునేటప్పుడు స్పష్టంగా కనిపించే కీలక విషయాలను కూడా అంతగా పట్టించుకోకపోవడమనేది సాధారణంగా చేసే తప్పిదాల్లో ఒకటిగా ఉంటుంది. దివ్యాంగుల విషయానికొస్తే, పాలసీలోని ప్రతి చిన్న అంశమూ ఎంతో ప్రభావం చూపేదిగా ఉంటుంది. కాబట్టి అన్ని నియమ నిబంధనలు, షరతులు, మినహాయింపులు, పరిమితులు మొదలైన వాటి గురించి జాగ్రత్తగా చదువుకోవాలి. నిర్దిష్ట అనారోగ్యాలు, చికిత్సలకు బీమా వర్తించకుండా మినహాయింపుల్లాంటివేమైనా ఉన్నాయేమో చూసుకోవాలి. ఇలాంటి వివరాలను పట్టించుకోకపోతే ఊహించని ఖర్చులు పెట్టుకోవాల్సి రావచ్చు లేదా క్లెయిమ్ పూర్తి మొత్తం చేతికి రాకపోవచ్చు. దీంతో ఆర్థిక సమస్యలు ఎదురుకావచ్చు.

కేవలం ప్రీమియంనే ప్రాతిపదికగా ఎంచుకోవడం: ప్రీమియం అనేది ముఖ్యమైన అంశమే అయినప్పటికీ కేవలం ప్రీమియం తక్కువగా ఉందనే ఆలోచనతో పథకాన్ని ఎంచుకుంటే చాలా ఖరీదైన మూల్యం చెల్లించుకోవాల్సి రావచ్చు. సాధారణంగా ప్రీమియంలు తక్కువగా ఉంటే మన జేబు నుంచి ఎక్కువగా ఖర్చు పెట్టుకోవాల్సి రావచ్చు. కవరేజీ పరిమితంగానే ఉండొచ్చు లేదా దివ్యాంగుల నిర్దిష్ట అవసరాలకు బీమా ఉపయోగపడని విధంగా పరిమితుల్లాంటివి ఉండొచ్చు. ప్రీమియం కాస్త ఎక్కువైనప్పటికీ గణనీయంగా మెరుగైన కవరేజీని ఇచ్చే పథకాన్ని ఎంచుకుంటే మంచిది. దీనివల్ల దీర్ఘకాలంలో డబ్బు ఆదా కావడంతో పాటు ఆరోగ్య సంరక్షణ కూడా మెరుగ్గా ఉంటుంది.

కో-పే, సబ్-లిమిట్స్ తెలుసుకోకపోవడం: క్లెయిమ్ చేసేటప్పుడు చేతికి వచ్చే మొత్తంపై కో-పే, సబ్-లిమిట్స్ అనే కీలకాంశాలు చాలా ప్రభావం చూపుతాయి. కో-పే అనేది క్లెయిమ్ సమయంలో పాలసీదారు తాను భరించేందుకు అంగీకరించే నిర్దిష్ట శాతాన్ని తెలియజేస్తుంది. కో-పే పరిమితులు ఎంత ఎక్కువగా ఉంటే బీమా కంపెనీ చెల్లించే క్లెయిమ్ పేఅవుట్ అంత తక్కువవుతుంది. అలాగే, సబ్-లిమిట్స్ అనేవి నిర్దిష్ట అనారోగ్యాలు లేక చికిత్సలు, అంటే ఉదాహరణకు క్యాటరాక్ట్, మోకాలి మార్పిడి మొదలైన వాటికి వర్తించే కవరేజీ మొత్తాన్ని ఒక స్థాయికి పరిమితం చేస్తాయి. ఈ పరిమితులను చూసుకోకపోతే జేబుకు గణనీయంగా చిల్లు పడే అవకాశం ఉంటుంది.

భవిష్యత్‌ను పరిగణనలోకి తీసుకోకపోవడం: కాలం గడిచే కొద్దీ ఆరోగ్య అవసరాలు మారుతుంటాయి. కాబట్టి భవిష్యత్ అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకునే ప్లాన్‌ను ఎంచుకోవడం కీలకం. దివ్యాంగుల ఆరోగ్య పరిస్థితుల్లో మార్పులు వస్తుంటాయి కాబట్టి అదనపు సంరక్షణ లేక విభిన్నమైన చికిత్సలు అవసరమవుతాయి. ఆరోగ్య బీమా పథకాన్ని ఎంచుకునేటప్పుడు, ప్రస్తుత అవసరాలు మాత్రమే కాకుండా భవిష్యత్‌లో తలెత్తే అవకాశమున్న అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

వివిధ ఆప్షన్లను పరిశీలించకపోవడం: ఆరోగ్య బీమా పథకాన్ని ఎంచుకునేటప్పుడు కనిపించిన మొదటి పథకాన్ని తీసేసుకోకుండా వివిధ ప్లాన్లను పరిశీలించి చూసుకోవాలి. కవరేజీ, ఖర్చులు, ప్రొవైడర్ నెట్‌వర్క్‌లు, అదనపు ప్రయోజనాలపరంగా వివిధ పథకాల్లో మార్పులు ఉంటాయి. పలు ప్లాన్లను పోల్చి చూసుకునేందుకు కాస్త సమయం వెచ్చించాలి. దివ్యాంగులకు సంబంధించి ఒక్కో ప్లాన్‌లో కవరేజీ ఏ విధంగా ఉందనేది పరిశీలించి చూసుకోవాలి. ఇందుకోసం కంపారిజన్ వెబ్‌సైట్ల వంటి సాధనాలను ఉపయోగించుకోవచ్చు. అవసరమైతే బీమా అడ్వైజర్ల సలహా తీసుకోవాలి. ప్లాన్ వివరాలను క్షుణ్నంగా అధ్యయనం చేయాలి. ఇలాంటి విధానాన్ని పాటిస్తే అవసరాలకు తగినట్లుగా ఉండే సమగ్రమైన, చౌకైన పథకాన్ని ఎంచుకోవడానికి వీలవుతుంది. స్థూలంగా చెప్పాలంటే, పాలసీ తీసుకునేటప్పుడు ప్రతి చిన్న అంశాన్ని క్షుణ్నంగా చదువుకోవాలి. ప్రీమియం మాత్రమే చూసుకోవద్దు. కవరేజీ పరిమితులను పరిశీలించుకోవాలి. భవిష్యత్ అవసరాల కోసం ప్లాన్ చేసుకోవాలి. వివిధ ఆప్షన్లను పోల్చి చూసుకోవాలి.

సాక్షి ప్లస్
సోమవారం : 11-11-2024



రన్నరప్ ట్రోఫీతో కిన్‌వెన్ జెంగ్

విన్నర్స్ ట్రోఫీతో కోకో గాఫ్

కోకో గాఫ్... ముగింపు అదిరె...

తొలిసారి డబ్ల్యూటీఏ ఫైనల్స్ టోర్నీ టైటిల్ హస్తగతం

- హోరాహోరీ పోరులో కిన్‌వెన్ జెంగ్‌పై విజయం
- సెరెనా తర్వాత ఈ ఘనత సాధించిన అమెరికన్ ప్లేయర్ కోకో గాఫ్ ఘనత
- రూ. 40 కోట్ల 55 లక్షల ప్రైజ్‌మనీ సొంతం

రియాద్: ఓటమి అంచుల్లో ఉన్నా... ఆందోళన చెందకుండా పోరాడిన అమెరికా టెన్నిస్ స్టార్ కోకో గాఫ్ ఈ ఏడాదిని ఘనంగా ముగించింది. మహిళల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నమెంట్ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో 20 ఏళ్ల కోకో గాఫ్ విజేతగా నిలిచింది. మూడోసారి ఈ టోర్నీలో ఆడుతున్న కోకో గాఫ్ తొలిసారి చాంపియన్‌గా అవతరించింది. 3 గంటల 4 నిమిషాలపాటు హోరాహోరీగా సాగిన సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ మూడో ర్యాంకర్ కోకో గాఫ్ 3-6, 6-4, 7-6 (7/2)తో ప్రపంచ ఏడో ర్యాంకర్, చైనా రైజింగ్ స్టార్ కిన్‌వెన్ జెంగ్‌పై చిరస్మరణీయ విజయం అందుకుంది. విజేతగా నిలిచిన కోకో గాఫ్‌నకు 48,05,000 డాలర్ల (రూ. 40 కోట్ల 55 లక్షలు) ప్రైజ్‌మనీ, 1300 ర్యాంకింగ్ పాయింట్లు... రన్నరప్ కిన్‌వెన్ జెంగ్‌కు 23,05,000 డాలర్ల (రూ. 19 కోట్ల 45 లక్షలు) ప్రైజ్‌మనీ, 800 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఫైనల్ చేరే క్రమంలో ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా (బెలారస్), ప్రపంచ రెండో ర్యాంకర్, డిఫెండింగ్ చాంపియన్ ఇగా స్వియాటెక్ (పోలాండ్)పై గెలిచిన కోకో గాఫ్‌నకు తుది పోరులో గట్టిపోటీనే ఎదురైంది. తొలి సెట్‌ను చేజార్చుకున్న కోకో రెండో సెట్‌లో ఒకదశలో 1-3తో వెనుకబడింది. కానీ వరుసగా మూడుసార్లు కిన్‌వెన్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన కోకో అదే జోరులో సెట్‌ను సొంతం చేసుకొని మ్యాచ్‌లో నిలిచింది. నిర్ణాయక మూడో సెట్‌లో కోకో 3-5తో వెనుకంజలో పడింది. తొమ్మిదో గేమ్‌లో తన సర్వీస్‌ను కాపాడుకున్న కోకో పదో గేమ్‌లో కిన్‌వెన్ సర్వీస్‌ను బ్రేక్ చేసి స్కోరును 5-5తో సమం చేసింది. ఆ తర్వాత ఇద్దరూ తమ సర్వీస్‌లను నిలబెట్టుకోవడంతో టైబ్రేక్ అనివార్యమైంది. టైబ్రేక్‌లో కోకో పైచేయి సాధించి విజయాన్ని ఖరారు చేసుకొని 2014లో సెరెనా విలియమ్స్ తర్వాత ఈ టోర్నీలో విజేతగా నిలిచిన అమెరికా ప్లేయర్‌గా గుర్తింపు పొందింది. ఈ ఏడాది కోకో మొత్తం 54 మ్యాచ్‌ల్లో గెలిచి, 17 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. ఓవరాల్‌గా మూడు టైటిల్స్ (బీజింగ్ ఓపెన్, ఆక్లాండ్ ఓపెన్, డబ్ల్యూటీఏ ఫైనల్స్) సొంతం చేసుకుంది.

మెద్వెదెవ్‌కు షాక్



ట్యూరిన్ (ఇటలీ): పురుషుల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) ఫైనల్స్‌లో ప్రపంచ నాలుగో ర్యాంకర్ డానిల్ మెద్వెదెవ్‌కు తొలి మ్యాచ్‌లో చుక్కెదురైంది. 'ఇలీ నస్టాసే గ్రూప్'లో భాగంగా జరిగిన మ్యాచ్‌లో అమెరికా ప్లేయర్ టేలర్ ఫ్రిట్జ్ ఆద్యంతం అద్భుతంగా ఆడి 6-4, 6-3తో మెద్వెదెవ్‌ను బోల్తా కొట్టించి శుభారంభం చేశాడు. 80 నిమిషాలపాటు జరిగిన ఈ పోరులో ఫ్రిట్జ్ తొమ్మిది ఏస్‌లు సంధించాడు. ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశాడు. నెట్ వద్దకు 11 సార్లు వచ్చి ఐదుసార్లు పాయింట్లు నెగ్గాడు. 21 విన్నర్స్ కొట్టాడు. 19 అనవసర తప్పిదాలు చేశాడు. మరోవైపు మెద్వెదెవ్ 24 అనవసర తప్పిదాలు చేశాడు. ఫ్రిట్జ్ సర్వీస్‌ను బ్రేక్ చేసేందుకు మూడుసార్లు అవకాశం వచ్చినా ఒక్కసారీ సద్వినియోగం చేసుకోలేదు. 'ఇలీ నస్టాసే గ్రూప్'లో వరల్డ్ నంబర్‌వన్ యానిక్ సినెర్ (ఇటలీ), అలెక్స్ డిమినార్ (ఆస్ట్రేలియా) కూడా ఉన్నారు. మరోవైపు 'జాన్ న్యూకోంబ్ గ్రూప్'లో కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్), అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ), కాస్పర్ రూడ్ (నార్వే), ఆంద్రీ రుబ్లెవ్ (రష్యా) ఉన్నారు.



సూపర్ సాల్ట్

- 54 బంతుల్లో 9 ఫోర్లు, 6 సిక్స్‌లతో 103 నాటౌట్
- తొలి టి20లో వెస్టిండీస్‌పై 8 వికెట్ల తేడాతో ఇంగ్లండ్ గెలుపు

బ్రిడ్జ్‌టౌన్: కరీబియన్ జట్టుతో వన్డే సిరీస్‌ను కోల్పోయిన ఇంగ్లండ్ జట్టు టి20ల్లో మాత్రం శుభారంభం చేసింది. తొలి మ్యాచ్‌లో ఓపెనర్ ఫిల్ సాల్ట్ (54 బంతుల్లో 103 నాటౌట్; 9 ఫోర్లు, 6 సిక్స్‌లు) వెస్టిండీస్ బౌలర్లపై చెలరేగాడు. దీంతో 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించిన ఇంగ్లండ్ మూడు టి20ల సిరీస్‌లో 1-0తో ముందంజ వేసింది.. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆతిథ్య విండీస్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. పూరన్ (29 బంతుల్లో 38; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), రసెల్ (17 బంతుల్లో 30; 4 సిక్స్‌లు), షెఫర్డ్ (22 బంతుల్లో 35 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), గుడకేశ్ మోతీ (14 బంతుల్లో 33; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) భారీ సిక్సర్లతో పరుగులు రాబట్టారు. ఇంగ్లండ్ పేసర్ సాకిబ్ 4, స్పిన్నర్ ఆదిల్ రషీద్ 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం ఇంగ్లండ్ 19 బంతులు (3.1 ఓవర్లు) మిగిలుండగానే 16.5 ఓవర్లలో రెండే వికెట్లు కోల్పోయి 183 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ విల్ జాక్స్ (17; 2 సిక్స్‌లు), కెప్టెన్ బట్లర్ (0) నిరాశ పరిచినా... సాల్ట్ దంచేయడంతో ఇంగ్లండ్‌కు లక్ష్యఛేదన కష్టమనిపించలేదు. సాల్ట్, జాకబ్ బెథెల్ (36 బంతుల్లో 58 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) కరీబియన్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. అబేధ్యమైన మూడో వికెట్‌కు వీరిద్దరు 10.1 ఓవర్ల వ్యవధిలోనే చకచకా 107 పరుగులు జోడించారు. సాల్ట్ దూకుడుతో ఇంగ్లండ్ జట్టు 4వ ఓవర్లో 50 పరుగులు, 9.3 ఓవర్లో 100 పరుగులు, 14.2 ఓవర్లలో 150 పరుగుల మైలురాయిల్ని అందుకుంది. ఈ క్రమంలో 25 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్న సాల్ట్ 53 బంతుల్లోనే సెంచరీని అధిగమించాడు.

12 సిక్స్‌లతో లిజెల్ లీ ప్రపంచ రికార్డు

- మహిళల టి20ల్లో ఒకే ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన బ్యాటర్‌గా ఘనత
- బిగ్‌బాష్ లీగ్ మ్యాచ్‌లో 12 సిక్స్‌లు, 12 ఫోర్లు కొట్టిన దక్షిణాఫ్రికా మాజీ బ్యాటర్
- 75 బంతుల్లో 150 నాటౌట్



లిజెల్ లీ

సిడ్నీ: రెండేళ్ల క్రితమే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికినా తనలో ఇంకా విధ్వంసకర ఆట ఆడే సత్తా ఉందని లిజెల్ లీ నిరూపించుకుంది. మహిళల బిగ్‌బాష్ టి20 లీగ్ (డబ్ల్యూబీబీఎల్)లో భాగంగా పెర్త్ స్కార్చర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో హోబర్ట్ హరికేన్స్ జట్టుకు ఆడిన 32 ఏళ్ల లిజెల్ లీ (75 బంతుల్లో 150 నాటౌట్; 12 ఫోర్లు, 12 సిక్స్‌లు) సంచలన ఇన్నింగ్స్ ఆడింది. ఆకాశమే హద్దుగా చెలరేగిన లిజెల్ లీ ఈ టోర్నీ చరిత్రలోనే అత్యధిక వ్యక్తిగత స్కోరు నమోదు చేసిన ప్లేయర్‌గా గుర్తింపు పొందింది. అంతేకాకుండా మహిళల టి20ల్లో ఒకే ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్స్‌లు బాదిన ప్లేయర్‌గా ప్రపంచ రికార్డు నెలకొల్పింది. గతంలో ఈ రికార్డు గ్రేస్ హారిస్ (11 సిక్స్‌లు; ఆస్ట్రేలియా), లౌరా అగాథ (11 సిక్స్‌లు; బ్రెజిల్) పేరిట ఉండేది. లిజెల్ లీ మెరుపులతో హరికేన్స్ జట్టు 72 పరుగుల తేడాతో పెర్త్ జట్టుపై విజయం సాధించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన హోబర్ట్ హరికేన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. అనంతరం లక్ష్యఛేదనలో పెర్త్ స్కార్చర్స్ జట్టు 19.3 ఓవర్లలో 131 పరుగులకు ఆలౌటైంది. సోఫీ డివైన్ (0), పిపారో (0) డకౌట్ కాగా... భారత ప్లేయర్ హేమలత (8), అమీ జోన్స్ (16) ఆకట్టుకోలేకపోయారు.

రన్నరప్ రిషబ్ అగర్వాల్ ద్వయం




భువనేశ్వర్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) ఎం25 పురుషుల టోర్నమెంట్ డబుల్స్ విభాగంలో హైదరాబాద్ ప్లేయర్ రిషబ్ అగర్వాల్ రన్నరప్‌గా నిలిచాడు. ఫైనల్లో రిషబ్-కబీర్ హన్స్ (భారత్) జోడీ 4-6, 3-6తో టాప్ సీడ్ ఇగోర్ అగఫొనోవ్-బొగ్డాన్ బొబ్రోవ్ (రష్యా) జంట చేతిలో ఓడిపోయింది. 84 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రిషబ్-కబీర్ జోడీ తమ సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసింది.

రిత్విక్ జోడీ ఓటమి



మెట్జ్ (ఫ్రాన్స్): మోజెల్లి ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ పోరాటం ముగిసింది. సెమీఫైనల్లో రిత్విక్ (భారత్)-ఫ్రాన్సిస్కో కబ్రాల్ (పోర్చుగల్) ద్వయం 3-6, 6-7 (4/7)తో పియరీ హ్యూజ్ హెర్బర్ట్-అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడీ చేతిలో ఓడిపోయింది. 81 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రిత్విక్ జంట ఐదు ఏస్‌లు సంధించింది. తొలి సెట్‌లో తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి సెట్‌ను చేజార్చుకుంది. టైబ్రేక్‌లో రెండో సెట్‌ను కోల్పోయింది. సెమీఫైనల్లో ఓడిన రిత్విక్-కబ్రాల్‌లకు 9,600 యూరోల (రూ. 8 లక్షల 68 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 90 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

తొలిసారి మెక్‌స్వీనీ, ఇంగ్లిస్‌లకు చోటు



మెక్‌స్వీనీ

సిడ్నీ: గత రెండు పర్యాయాలు సొంతగడ్డపై టీమిండియా చేతిలో 'బోర్డర్-గావస్కర్' సిరీస్ కోల్పోయిన ఆస్ట్రేలియా జట్టు ఈసారి విజయం సాధించాలనే పట్టుదలతో కనిపిస్తోంది. ఈ నెల 22 నుంచి భారత్, ఆస్ట్రేలియా మధ్య ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ప్రారంభం కానుండగా... తొలి మ్యాచ్ కోసం క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) ఆదివారం 13 మందితో కూడిన జట్టును ప్రకటించింది. దేశవాళీల్లో మెరుగైన ప్రదర్శన కనబరిచిన యువ ఆటగాడు నాథన్ మెక్‌స్వీనీ తొలిసారి జాతీయ జట్టులోకి రాగా... వికెట్ కీపర్ జోష్ ఇంగ్లిస్ కూడా మొదటిసారి టెస్టు జట్టుకు ఎంపికయ్యాడు. ఇటీవల భారత్ 'ఎ'తో జరిగిన అనధికారిక టెస్టు సిరీస్‌లో ఆస్ట్రేలియా 'ఎ' జట్టు కెప్టెన్‌గా వ్యవహరించిన మెక్‌స్వీనీ తన ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు.

భారత్‌తో తొలి టెస్టుకు ఆస్ట్రేలియా జట్టు: కమిన్స్ (కెప్టెన్), బోలాండ్, అలెక్స్ క్యారీ, హాజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, ఉస్మాన్ ఖ్వాజా, లబుషేన్, నాథన్ లయన్, మిషెల్ మార్ష్, మెక్‌స్వీనీ, స్టీవ్ స్మిత్, స్టార్క్.

యు ముంబా జోరు



నోయిడా: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్‌లో మాజీ చాంపియన్ యు ముంబా 'హ్యాట్రిక్' విజయం ఖాతాలో వేసుకుంది. నోయిడా వేదికగా జరుగుతున్న రెండో అంచె పోటీల్లో ఆదివారం యు ముంబా జట్టు ఉత్కంఠ పోరులో 35-33తో యూపీ యోధాస్‌పై గెలిచింది. యు ముంబా తరఫున అజిత్ చవాన్, రోహిత్ రాఘవ్ చెరో 8 పాయింట్లతో రాణించగా... యూపీ యోధాస్ తరఫున భరత్ హుడా 11 పాయింట్లతో ఒంటరి పోరాటం చేశాడు. ఆరంభంలో ఆకట్టుకున్న యూపీ జట్టు ప్రత్యర్థిపై పైచేయి కనబర్చినా దాన్ని చివరి వరకు కొనసాగించలేక పోయింది. తాజా సీజన్‌లో యు ముంబా 8 మ్యాచ్‌లాడి 5 విజయాలు, 2 పరాజయాలు, ఒక 'టై'తో 29 పాయింట్లతో పట్టికలో రెండో స్థానానికి చేరింది. మరోవైపు ఎనిమిది మ్యాచ్‌ల్లో ఐదో పరాజయం మూటగట్టుకున్న యూపీ యోధాస్ 20 పాయింట్లతో పదో స్థానంలో ఉంది. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 39-23 పాయింట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై విజయం సాధించింది. హరియాణా స్టీలర్స్ తరఫున రాహుల్ 8 పాయింట్లు... వినయ్, రెజా చెరో 7 పాయింట్లతో సత్తాచాటారు. గుజరాత్ జెయింట్స్ తరఫున రాకేశ్ (7 పాయింట్లు) మినహా మిగతా వారు ఆకట్టుకోలేకపోయారు. హరియాణా 26 పాయింట్లతో ప్రస్తుతం మూడో స్థానానికి ఎగబాకింది. గుజరాత్ జెయింట్స్ 7 పాయింట్లతో చివరిదైన 12వ స్థానంలో ఉంది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో గుజరాత్ జెయింట్స్‌తో పట్నా పైరేట్స్ (రాత్రి 8 గంటలకు), యు ముంబాతో హరియాణా స్టీలర్స్ (రాత్రి 9 గంటలకు) తలపడతాయి.

ఫెర్గూసన్ హ్యాట్రిక్

శ్రీలంకపై 5 పరుగులతో న్యూజిలాండ్ విజయం



ఫెర్గూసన్

దంబుల్లా: న్యూజిలాండ్ పేసర్ లోకీ ఫెర్గూసన్ హ్యాట్రిక్‌తో విజృంభించడంతో... శ్రీలంకతో జరిగిన రెండో టి20 మ్యాచ్‌లో న్యూజిలాండ్ 5 పరుగుల తేడాతో గెలిచింది. ఫలితంగా రెండు మ్యాచ్‌ల సిరీస్ 1-1తో సమంగా ముగిసింది. మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 19.3 ఓవర్లలో 108 పరుగులకు ఆలౌటైంది. విల్ యంగ్ (32 బంతుల్లో 30; 3 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా... చాప్‌మన్ (2), గ్లెన్ ఫిలిప్స్ (4), బ్రేస్‌వెల్ (0), టిమ్ రాబిన్‌సన్ (0) విఫలమయ్యారు. శ్రీలంక బౌలర్లలో హసరంగ 4 వికెట్లు, పతిరణ 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో శ్రీలంక 19.5 ఓవర్లలో 103 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ నిసాంక (51 బంతుల్లో 52; 6 ఫోర్లు) అర్ధశతకంతో మెరిసినా... మిగతా వారు విఫలమయ్యారు. కుశాల్ మెండిస్ (2), కుశాల్ పెరీరా (3), కమిందు మెండిస్ (1), కెప్టెన్ అసలంక (0) నిరాశ పరిచారు. ఆరో ఓవర్ చివరి బంతికి కుశాల్ పెరీరాను అవుట్ చేసిన ఫెర్గూసన్... ఎనిమిదో ఓవర్ తొలి రెండు బంతులకు వరుసగా కమిందు, అసలంకలను పెవిలియన్‌కు పంపి 'హ్యాట్రిక్' పూర్తి చేసుకున్నాడు. చివరి ఓవర్‌లో లంక విజయానికి 8 పరుగులు అవసరం కాగా..రెండు పరుగులు మాత్రమే చేసిన ఆ జట్టు... నాలుగు బంతుల వ్యవధిలో మూడు వికెట్లు కోల్పోయింది. ఈ మూడు వికెట్లు గ్లెన్ ఫిలిప్స్ ఖాతాలోకి వెళ్లాయి. ఫెర్గూసన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', హసరంగకు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డులు దక్కాయి. ఇరు జట్ల మధ్య బుధవారం నుంచి మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ప్రారంభం కానుంది.

5 అంతర్జాతీయ టి20ల్లో హ్యాట్రిక్ తీసుకున్న ఐదో న్యూజిలాండ్ బౌలర్‌గా ఫెర్గూసన్ గుర్తింపు పొందాడు. గతంలో టిమ్ సౌతీ (2 సార్లు: 2010లో పాక్‌పై: 2022లో భారత్‌పై), జేకబ్ ఓరమ్ (2009లో శ్రీలంకపై), మైకేల్ బ్రేస్‌వెల్ (2022లో ఐర్లాండ్‌పై), మాథ్యూ హెన్రీ (2023లో పాకిస్తాన్‌పై) ఒక్కోసారి ఈ ఘనత సాధించారు.



22 ఏళ్ల తర్వాత...

- ఆస్ట్రేలియా గడ్డపై వన్డే సిరీస్ నెగ్గిన పాకిస్తాన్
- మూడో వన్డేలో 8 వికెట్లతో గెలిచిన రిజ్వాన్ బృందం
- రాణించిన షాహీన్, నసీమ్, అయూబ్

పెర్త్: ఆస్ట్రేలియా గడ్డపై స్ఫూర్తిదాయక ప్రదర్శన కనబర్చిన పాకిస్తాన్ జట్టు వన్డే సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఆస్ట్రేలియాలో ఆస్ట్రేలియాపై 2002 తర్వాత పాకిస్తాన్‌కు ఇదే తొలి వన్డే సిరీస్ విజయం కావడం విశేషం. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగిన చివరిదైన మూడో వన్డేలో పాకిస్తాన్ 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. తద్వారా 2-1తో సిరీస్‌ను పట్టేసింది. భారత్‌తో ప్రతిష్టాత్మక 'బోర్డర్-గావస్కర్' సిరీస్‌కు ముందు ప్రధాన ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చిన ఆస్ట్రేలియా జట్టు... అందుకు తగ్గ మూల్యం చెల్లించుకుంది. పాట్ కమిన్స్, స్టీవ్ స్మిత్, జోస్ హాజల్‌వుడ్, మిషెల్ స్టార్క్, లబుషేన్ వంటి ప్రధాన ఆటగాళ్లు లేకుండానే బరిలోకి దిగిన ఆస్ట్రేలియా జట్టు... పాకిస్తాన్‌కు కనీస పోటీనివ్వలేకపోయింది. ఈ సిరీస్‌లోని మూడు మ్యాచ్‌ల్లో ఆస్ట్రేలియా తరఫున ఒక్క బ్యాటర్ కూడా అర్ధ సెంచరీ చేయకపోవడం గమనార్హం. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 31.5 ఓవర్లలో 140 పరుగులకు ఆలౌటైంది. పేస్ బౌలర్ సీన్ అబాట్ (30; 2 ఫోర్లు, ఒక సిక్సర్) టాప్ స్కోరర్ కాగా... తక్కిన వాళ్లంతా విఫలమయ్యారు. జట్టుకు సారథ్యం వహించిన జోష్ ఇంగ్లిస్ (7), జేక్ మెక్‌గుర్క్ (7), మాథ్యూ షార్ట్ (22), ఆరన్ హార్డీ (12), కూపర్ (7), స్టొయినిస్ (8), మ్యాక్స్‌వెల్ (0) ఒకరి తర్వాత ఒకరు పెవిలియన్‌కు వరుస కట్టారు. కూపర్ కానెల్లీ 7 పరుగులు చేసి రిటైర్డ్ హర్ట్ అయ్యాడు. అతను మళ్లీ బ్యాటింగ్‌కు దిగలేదు. పాకిస్తాన్ బౌలర్లలో షాహీన్ షా అఫ్రిది, నసీమ్ షా చెరో 3 వికెట్లు పడగొట్టగా... హారీస్ రవూఫ్ రెండు వికెట్లు తీశాడు. అనంతరం స్వల్ప లక్ష్యఛేదనలో పాకిస్తాన్ జట్టు 26.5 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 143 పరుగులు చేసి గెలిచింది. సయీమ్ అయూబ్ (52 బంతుల్లో 42; 4 ఫోర్లు, 1 సిక్స్), అబ్దుల్లా షఫీఖ్ (53 బంతుల్లో 37; 1 ఫోర్, 1 సిక్స్), బాబర్ ఆజమ్ (30 బంతుల్లో 28 నాటౌట్; 4 ఫోర్లు), కెప్టెన్ మొహమ్మద్ రిజ్వాన్ (27 బంతుల్లో 30 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) తలా కొన్ని పరుగులు చేశారు. తొలి వికెట్‌కు 84 పరుగులు జోడించిన అనంతరం అయూబ్, షఫీఖ్‌ను మోరిస్ ఒకే ఓవర్‌లో ఔట్ చేసినా... బాబర్, రిజ్వాన్ మిగిలిన పని పూర్తి చేశారు. ఆసీస్ బౌలర్లలో లాన్స్ మోరిస్ రెండు వికెట్లు పడగొట్టాడు. మూడు మ్యాచ్‌ల్లో కలిపి 10 వికెట్లు పడగొట్టిన పాక్ పేసర్ హారీస్ రవూఫ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'తోపాటు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు కూడా దక్కింది. ఇరు జట్ల మధ్య గురువారం నుంచి మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్ ప్రారంభం కానుంది.

ఢాకాలో అవామీ లీగ్ ర్యాలీపై దాడి

బంగ్లాదేశ్ పదవీచ్యుత ప్రధాని షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీ తల పెట్టిన ర్యాలీని విద్యార్థి ఉద్యమ నాయకులు భగ్నం చేశారు. ఆదివారం రాజధాని ఢాకాలో నూర్ హొస్సైన్ ఛత్తర్/జీరో పాయింట్ వద్దనున్న అవామీలీగ్ ప్రధాన కార్యాలయానికి తరలివచ్చిన ఆ పార్టీ శ్రేణులపై పలువురు దాడికి దిగారు. వారిని వెంటపడి మరీ కొట్టడంతో కనీసం ఏడుగురు గాయపడ్డారు. ఆ పార్టీకి చెందిన పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దాడికి పాల్పడిన వారిలో యాంటీ డిస్క్రిమినేషన్ స్టూడెంట్ మూమెంట్ కార్యకర్తలతోపాటు ఇతర రాజకీయ గ్రూపుల వారు కూడా ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఆగస్ట్ 5వ తేదీన ప్రధాని షేక్ హసీనాను గద్దె దిగడంతో యాంటీ డిస్క్రిమినేషన్ స్టూడెంట్ మూమెంట్ పాత్ర కీలకమన్న విషయం తెలిసిందే.అవామీ లీగ్ ర్యాలీ విషయమై ఆపద్ధర్మ నేత యూనస్ ప్రతినిధి షఫీక్ ఉల్ ఆలం ఫేస్‌బుక్‌లో..'ప్రస్తుతమున్న అవామీ లీగ్ ఫాసిస్ట్ పార్టీ. బంగ్లాదేశ్‌లో ఫాసిస్ట్ పార్టీ ర్యాలీని అనుమతించేది లేదు. నియంత, జన హననానికి పాల్పడిన షేక్ హసీనా ఆదేశాలతో ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు జరిపేందుకు ప్రయత్నించే వారికి కఠిన చర్యలు తప్పవు' అంటూ హెచ్చరించారు. - ఢాకా


ఢాకాలో నిరసనకారులను చుట్టుముట్టిన పోలీసు బలగాలు

ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ శనివారం వాలెన్సియాలో పెద్ద సంఖ్యలో రోడ్డెక్కిన ప్రజలు



'వరద' వైఫల్యాలపై స్పెయిన్‌లో భారీ నిరసనలు

ప్రభుత్వంపై ఆగ్రహంతో రోడ్డెక్కిన లక్షలాది మంది

వరదల విషయంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ స్పెయిన్‌లో లక్షలాది మంది రోడ్డెక్కారు. ముందస్తు హెచ్చరికలు జారీ చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహించారంటూ వాలెన్సియాలో శని, ఆదివారాల్లో ఆందోళనకు దిగారు. వాలెన్సియా రీజనల్ హెడ్ కార్లోస్ మజోన్ రాజీనామాకు డిమాండ్ చేశారు. దాదాపు 1,30,000 మంది ప్రజలు వీధుల్లోకి వచ్చారు. వాలెన్సియా సిటీ హాల్‌ను బురదతో నింపేశారు. కుర్చీలు, వస్తువులకు నిప్పు పెట్టారు. పలుచోట్ల పోలీసులతో ఘర్షణకు దిగారు. వాలెన్సియా, పరిసర ప్రావిన్సుల్లో ఇటీవల కుండపోత వర్షాలకు వరద ముంచెత్తి 200 మందికి పైగా మరణించడం తెలిసిందే. 80 మందికి పైగా గల్లంతయ్యారు. వేలాది మంది నిర్వాసితులయ్యారు. చాలా ప్రాంతాల్లో ఇప్పటికీ వీధులు బురద, శిథిలాల్లో కూరుకుపోయి ఉన్నాయి. స్పెయిన్ వాతావరణ సంస్థ అక్టోబర్ 25 నుంచే ఈ ప్రాంతానికి తుపాను హెచ్చరికలు జారీ చేసినా వరదలు మొదలయ్యే దాకా వాలెన్సియా అధికారులు ప్రజలను అప్రమత్తం చేయలేదు. వారి అలసత్వం వల్లే భారీ ప్రాణ, ఆస్తి నష్టం జరిగిందని జనం మండిపడుతున్నారు. గత వారం పైపోర్టా పట్టణాన్ని సందర్శించిన స్పెయిన్ రాజు, రాణిపైనా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేయడం తెలిసిందే. అనంతరం ప్రధాని పెడ్రో సాంచెజ్‌పై గుడ్లు తదితరాలు విసిరి నిరసన తెలిపారు. - వాలెన్సియా

రెజ్లింగ్ పాటకు మొసలి హుషారు

90వ దశకంలో టీవీల్లో వచ్చే రెజ్లింగ్ క్రీడకు భారతీయ టీనేజర్లలో క్రేజీ అంతాఇంతా కాదు. అలాంటి క్రేజ్ ఇప్పుడు భారత్‌లో తగ్గిపోయినా అమెరికా తదితర దేశాల్లో ఇంకా ఉంది. వరల్డ్ రెజ్లింగ్ ఎంటర్‌టైన్‌మెంట్(డబ్ల్యూడబ్ల్యూఈ) అభిమానులకు ఒక మొసలి సైతం జతకలిసింది. స్టార్‌వార్స్ ప్రఖ్యాత థీమ్ సాంగ్ అయిన 'ది ఇంపీరియల్ మార్చ్' పాట వినబడగానే ఈ మొసలి హుషారుగా కదలివస్తోంది. గంటలతరబడి కదలకుండా ఉండగలిగే మొసలిలో సైతం మా సాంగ్ కదలిక తెప్పిస్తోందని, మెప్పిస్తోందంటూ పలువురు రెజ్లింగ్ అభిమానులు సంబంధిత వీడియోను తెగ షేర్ చేస్తున్నారు. అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలోని ఎవర్‌గ్లేడ్స్ హాలిడే పార్క్‌లో డార్త్ గేటర్ అనే మొసలి ఉంది. ఇది ఈ పాట వినగానే చేస్తున్న హంగామా చూసి గేటర్‌బాయ్స్ టీవీషో స్టార్ పాల్ బేడార్డ్ సైతం ఆశ్చర్యం వ్యక్తంచేశారు. స్వయంగా మొసలి సమీపానికి వెళ్లి మాంసం ముక్కలను పట్టుకుని థీమ్‌సాంగ్‌ను ప్లే చేయడం, మొసలి వచ్చి హుషారుగా ముక్కలను లటుక్కున మింగేయడం వీడియోలో రికార్డయింది. దీనిని ఇప్పుడు లక్షలాది మంది లైక్‌లు, షేర్‌లు కొడుతున్నారు. - న్యూయార్క్


మొసలికి మాంసాహారం ఎర చూపుతున్న పాల్

బైడెన్ వల్లే ఓడిపోయాం

ఆరోపించిన మాజీ స్పీకర్ నాన్సీ పెలోసీ



వాషింగ్టన్: ఎన్నికల ఫలితాలపై డెమొక్రాట్లలో ఆగ్రహం వెల్లువవుతోంది. పార్టీ హారిస్, బైడెన్ అనుకూల వర్గాలుగా చీలిపోయింది. ఓటమికి కారణం మీరంటే మీరంటూ పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నారు. అమెరికా అధ్యక్షుడు బైడెన్ వల్లే ఈ ఎన్నికల్లో ఓడిపోయామని అమెరికా ప్రతినిధుల సభ మాజీ స్పీకర్ నాన్సీ పెలోసీ ఆరోపించారు. ఆయన పోటీ నుంచి తొందరగా తప్పుకొని ఉంటే డెమొక్రాట్లు మెరుగైన ఫలితాలు సాధించి ఉండేవారన్నారు. అయితే ఓటమికి హారిస్ సాకులు చెబుతున్నారని బైడెన్ మాజీ సహాయకుడు ఆక్సియోస్ చెప్పారు. గెలవకుండానే ఒక బిలియన్ డాలర్లు ఎలా ఖర్చుచేశారని ప్రశ్నించారు. జో బైడెన్‌ను బయటకు నెట్టడానికి మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా సలహాదారులు పార్టీలో అంతర్గత కుమ్ములాటలను బహిరంగంగా ప్రోత్సహించారని ఆరోపించారు. బైడెన్‌ను గద్దె దించడానికి కుట్ర పన్నిన వారే ఎన్నికల్లో ఓటమికి కారణమని డెమొక్రాట్ సెనేటర్ జాన్ ఫెటర్మన్ ఆరోపించారు.

లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు

24 గంటల్లో 40 మంది మృతి

బీరుట్: లెబనాన్‌లోని హెజ్‌బొల్లా ప్రాబల్య ప్రాంతాలపై ఇజ్రాయెల్ దాడులను తీవ్రతరంచేసింది. గత 24 గంటల్లో 40 మంది ప్రాణాలు కోల్పోయారని లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. నౌకాశ్రయ 'టైర్'పట్టణంపై దాడిలో పలువురు చనిపోయారు. ఇక బాల్బెక్ సిటీ శివారు, అల్మాట్ గ్రామం, ఇతర ప్రాంతాలపై దాడిలో 20 మంది చనిపోయారు. వీరిలో హెజ్‌బొల్లా ఉగ్రసంస్థ, అమల్ సహాయక బృందాలకు చెందిన సభ్యులు ఉన్నారని లెబనాన్ పేర్కొంది. హెజ్‌బొల్లా ఆయుధాగారాలపై దాడిచేశామని ఇజ్రాయెల్ తెలిపింది.

ఉత్తరగాజాలో 17 మంది మృతి

యుద్ధం కారణంగా సర్వం కోల్పోయిన శరణార్థులకు ఆశ్రయం కల్పిస్తున్న ఒక పునరావాస గృహంపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసింది. ఈ దాడిలో తొమ్మిది మంది మహిళలుసహా 17 మంది ప్రాణాలు కోల్పోయారు. జబాలియాలోని పట్టణప్రాంత శరణార్థి శిబిరాలుండే ప్రాంతంలో ఈ దాడి జరిగిందని, మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని గాజా సిటీ అల్‌-అహ్లీ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ ఫదీల్ నయీమ్ చెప్పారు. అయితే దాడిని ఇజ్రాయెల్ సైన్యం సమర్థించుకుంది. ఆ ప్రాంతంలో హమాస్ మిలిటెంట్లు ఉన్నారని, దాడి ఘటనపై సమీక్ష కొనసాగుతోందని సైన్యం పేర్కొంది.

'మర్మదేశం' రచయిత


సౌందర రాజన్ కన్నుమూత



మదురై: జనాదరణ పొందిన టీవీ సీరియల్ 'మర్మదేశం' స్క్రీన్‌ప్లే బాధ్యత వహించిన తమిళ నవలా రచయిత ఇందిరా సౌందర రాజన్(65) కన్నుమూశారు. ఆదివారం తన నివాసంలో బాత్రూంలో జారిపడి, అక్కడే తుదిశ్వాస విడిచారని కుటుంబసభ్యులు తెలిపారు. అతీంద్రియ శక్తులే ఇతివృత్తంగా ఈయన పలు రచనలు చేశారు. ఈయన నవల 'ఎన్ పెయర్ రంగనాయకి' తమిళనాడు ప్రభుత్వ అవార్డు గెలుచుకుంది. తల్లిపై ప్రేమతో తన పేరుకు ముందు 'ఇందిర' అని పెట్టుకున్నారు.

స్కూలు భవనం.. బహు బాగుంది

ప్రపంచంలోనే బెస్ట్ బిల్డింగ్‌గా ఎంపిక



సాంస్కృతిక పరిరక్షణ

దక్షిణ సిడ్నీ ప్రాంతంలో ఉన్న ఈ స్కూలు నిజానికి ఆస్ట్రేలియా మూలవాసులతో బలమైన సంబంధాలున్న కమ్యూనిటీ పాఠశాల. 1970 నాటి పాత భవనం శిథిలావస్థకు చేరడంతో కొత్తది నిర్మించాలనుకున్నారు. ఎఫ్‌జెడీసీ స్టూడియో ఆ బాధ్యతలు తీసుకుంది. మూలవాసులతో బంధాన్ని ప్రతిబింబించేలా పాఠశాల హాల్, ఎంట్రన్స్ రిసెప్షన్, తరగతి గదుల్లో స్వదేశీ కళను చిత్రీకరించి సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించారు. పాత పాఠశాల గోడలపై ఉన్న ఆదిమ కుడ్యచిత్రాలను కొత్త భవనంలో పునర్నిర్మించారు. ఆ స్ఫూర్తితోపాటు కొత్త, సమకాలీన అభ్యాస వాతావరణాన్ని సృష్టించారు. ప్రీస్కూల్, కిండర్ గార్టెన్, ప్రైమరీ స్కూల్‌తో 500 మందికి పైగా విద్యార్థుల సామర్థ్యం ఈ కొత్త క్యాంపస్ సొంతం.

గది అంతటా సూర్యకాంతి ప్రసరించేలా రంపం పళ్లను ఆకారంలో రూఫ్.. ఎటు చూసినా పచ్చదనంతో కళకళలాడే ఆవరణలు.. పెద్ద బాస్కెట్‌బాల్ కోర్టు.. అందమైన కమ్యూనిటీ గార్డెన్.. ఓపెన్ ఎయిర్ టెర్రస్.. లోపలి వ్యక్తుల ప్రైవసీకి భంగం కలగకుండా చుట్టూ వంపులు తిరిగిన మెటల్ స్క్రీన్స్.. ఇంకా మరెన్నో ప్రత్యేకతలు. ఇదేదో రియల్ ఎస్టేట్ సంస్థ ప్రకటన కాదు! ఓ స్కూల్ భవన విశేషాలివి. దాంతో ఆకాశహర్మ్యాలను, మ్యూజియాలను, అందమైన విమానాశ్రయాలను కూడా తలదన్ని ప్రపంచంలోనే అత్యుత్తమ భవనంగా ఎంపికైంది. సింగపూర్‌లో జరిగిన ప్రపంచ ఆర్కిటెక్చర్ ఫెస్టివల్ (డబ్ల్యూఏఎఫ్)లో ఈ ఘనత సాధించింది. దీని పేరు డార్లింగ్టన్ పబ్లిక్ స్కూల్. సిడ్నీలోని చిపండేల్‌లో ఉంది.
- సాక్షి, నేషనల్ డెస్క్

ఆరోగ్యం, ఆహ్లాదం

ప్రాథమిక పాఠశాల భవనంలో కాంతికోసం ప్రత్యేకంగా విద్యుత్ అక్కరలేదు. ప్రత్యేకమైన టెర్రస్ ప్రతి గదికీ సూర్యకాంతిని ప్రసరింపజేస్తుంది. అది బాగా వేడిగా కూడా ఉండదు. మృదువైన కాంతి స్థానిక కాసురినా చెట్ల ఆకుల మధ్య నుంచి జాలువారుతున్నట్లుగా ఉంటుంది. ఈ సహజకాంతి విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడుతుంది. పాఠశాల భవనానికి అనుసంధానించి ఉన్న కమ్యూనిటీ హాల్, లైబ్రరీ విద్యార్థులను సమాజంలో భాగం చేస్తున్నాయి.

175 మంది మనసు గెలుచుకుని..

క్రీడలు, రవాణా, ఆరోగ్యం, గృహనిర్మాణం వంటి 18 కేటగిరీల్లో డబ్ల్యూఏఎఫ్ అవార్డులు ఇస్తుంది. 175 మంది ఫెస్టివల్ డెలిగేట్ల ప్యానెల్ అన్ని కేటగిరీలకు చెందిన విజేతల నుంచి 'వరల్డ్ బిల్డింగ్ ఆఫ్ ది ఇయర్' ను ఎంపిక చేస్తుంది. ఈ ఏడాది నేషనల్ స్టార్ అబ్జర్వేటరీ ఆఫ్ సైప్రస్, పోలండ్‌లోని ప్రఖ్యాత బస్ స్టేషన్, టర్కీలోని సోలార్ పవర్ ప్లాంట్ వంటి 220 ప్రాజెక్టులు అవార్డు కోసం పోటీపడ్డాయి. వాటన్నింటినీ తలదన్ని ఒక చిన్న పాఠశాల నెగ్గుకురావడం అసాధారణమని ఎఫ్‌జేసీ స్టూడియో అసోసియేట్ అలెస్సాండ్రో రోసీ అన్నారు. భవనంలో సమయాన్ని గడిపే పిల్లలే నిజమైన విజేతలని అభిప్రాయపడ్డారు. గతేడాది కూడా చైనాలోని ఓ బోర్డింగ్ స్కూల్ ఈ టైటిల్‌ను గెలుచుకోవడం విశేషం.

డెమొక్రాట్లను ఆదుకోండి

- మద్దతుదారులకు ట్రంప్ విజ్ఞప్తి
- సోషల్ మీడియాలో వ్యంగ్యంగా పోస్ట్



వాషింగ్టన్: ఎన్నికల తర్వాత అప్పుల్లో కూరుకుపోయిన డెమొక్రాట్లను ఆదుకోవాలని ట్రంప్ వ్యంగ్య వ్యాఖ్యలుచేశారు. ఈ మేరకు సొంతమీడియాలో ఒక పోస్ట్ చేశారు. ఈ క్లిష్ట సమయంలో వారికి సహాయం చేయడానికి ముందుకు రావాలని రిపబ్లికన్లను కోరారు. ఎన్నికల్లో రికార్డు స్థాయిలో నిధులు సమీకరించిన డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ ప్రచార బృందం... ఎన్నికల అనంతరం 2 కోట్ల డాలర్ల అప్పుల్లో కూరుకుపోయిందని వార్తలొచ్చాయి. సంపన్న దాతలు, హాలీవుడ్ నుంచి డెమొక్రాట్లు మద్దతు కూడగట్టినప్పటికీ, కీలక ఓటరు గ్రూపుల మద్దతును కోల్పోయారని హారిస్ క్యాంపెయిన్ ప్రధాన ఫండ్‌రైజర్ అజయ్ జైన్ భుటోరియా చెప్పారు.

ట్రంప్‌కు బైడెన్ ఆతిథ్యం

ట్రంప్‌తో దేశాధ్యక్షుడు బైడెన్ సమావేశమవుతారని వైట్‌హౌస్ ప్రకటించింది. బైడెన్ ఆహ్వానం మేరకు బుధవారం ఉదయం 11 గంటలకు ఓవల్ కార్యాలయంలో వీరిద్దరూ సమావేశమవుతారని తెలిపింది. సమావేశానికి సంబంధించిన అదనపు వివరాలను వెల్లడిస్తామని వైట్‌హౌస్ ప్రెస్‌సెక్రటరీ కరీన్ జీన్ పియరీ ఒక ప్రకటనలో తెలిపారు. కాబోయే ప్రథమ మహిళ మెలానియా ట్రంప్‌ను ఫస్ట్ లేడీ జిల్ బైడెన్ కూడా వైట్‌హౌస్‌కు ఆహ్వానించినట్లు అధికారి ఒకరు తెలిపారు. ట్రంప్ కొత్త స్టాఫ్ చీఫ్ సూజీ వైల్స్‌తో బైడెన్ స్టాఫ్ చీఫ్ జెఫ్ జియెంట్స్ బుధవారం నాటి సమావేశాన్ని సమన్వయం చేశారని ఇరువర్గాలు వెల్లడించాయి. శాంతియుత అధికార బదిలీలో భాగంగా ఎన్నికల తర్వాత కాబోయే అధ్యక్షుడికి, మాజీ అధ్యక్షుడు ఆతిథ్యం ఇవ్వడం ఆనవాయితీ. అయితే 2020లో బైడెన్‌కు ట్రంప్ ఆతిథ్యం ఇవ్వలేదు. అంతేకాదు 2021లో బైడెన్ ప్రమాణ స్వీకారానికి కూడా ట్రంప్ హాజరు కాలేదు. ప్రథమ మహిళకు ఆతిథ్యం ఇవ్వడం కూడా వైట్‌హౌస్ ఆనవాయితీగా వస్తోంది.

బీజేపీ నేతలు ప్రజానుబంధం

ఏనాడో తెంచుకున్నారు

ప్రియాంకాగాంధీ విమర్శ


కేరళలోని తిరునెల్లి ఆలయాన్ని సందర్శించుకున్న ప్రియాంకా

వయనాడ్: వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గం ఉపఎన్నికల్లో బీజేపీపై కాంగ్రెస్ అభ్యర్థి ప్రియాంకాగాంధీ వాద్రా విమర్శలను పెంచారు. ఆదివారం నైకెట్టి, సుల్తాన్ బతేరీ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఆమె ఎన్నికల ప్రచారర్యాలీల్లో గిరిజనులనుద్దేశించి ప్రసంగించారు. '' ఇక్కడున్న పెద్దవాళ్లలో చాలా మందికి మా నాన్నమ్మ ఇందిరాగాంధీ బాగా తెలిసే ఉంటుంది. గిరిజనులతో ఆమెకు ఎంతో అనుబంధం ఉండేది. ఇక్కడి భూమి, అడవులు, నేల, నీరుతో గిరిజనులు అవినాభావ సంబంధం ఉంది. పేదల అభ్యున్నతి కోసమే అటవీ చట్టం, గ్రామీణ ఉపాధి హామీ పథకం, విద్యాహక్కుచట్టం తెచ్చాం. అదే బీజేపీ నేతలు సొంతవాళ్లనే పట్టించుకుంటూ గిరిజనులను, జనాలను గాలికొదిలేసింది. అసలు బీజేపీ నేతలు ప్రజలతో బంధాన్ని ఏనాడో తెంచుకున్నారు'' అని ప్రియాంక వ్యాఖ్యానించారు.

రోజుకు 1,500!

అక్టోబర్‌లో రష్యా కోల్పోయిన సైనికుల సంఖ్య

- ఇప్పటిదాకా 7 లక్షల మంది మరణం!
- బ్రిటన్ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ వెల్లడి

లండన్: ఉక్రెయిన్‌పై దండెత్తిన రష్యా యుద్ధక్షేత్రంలో భారీగా రక్తమోడుతోందని బ్రిటన్ తాజాగా ప్రకటించింది. సంబంధిత వివరాలను బ్రిటన్ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ టోనీ ర్యాడకిన్ ఆదివారం వెల్లడించారు. గత నెలలో ఉక్రెయిన్ నుంచి భారీ స్థాయిలో ప్రతిఘటన ఎదురవడంతో అక్టోబర్‌లో ప్రతి రోజూ 1,500 మంది రష్యా సైనికులు చనిపోవడమో, తీవ్రంగా గాయపడటమో జరిగిందని టోనీ చెప్పారు. '' 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై దురాక్రమణకు దిగిన రష్యా మొదట్లో పలు ఉక్రెయిన్ ప్రాంతాలను వేగంగా ఆక్రమించుకుంది. కానీ తర్వాత యూరప్ దేశాల దన్నుతో, అధునాతన ఆయుధాల సాయంతో ఉక్రెయిన్ దీటుగా బదులిస్తోంది. ప్రతిఘటనను పెంచింది. దీంతో ఇటీవలి కాలంలో సమరంలో సమిధలవుతున్న రష్యా సైనికుల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. ముఖ్యంగా అక్టోబర్‌లో ప్రతి రోజూ 1,500 మంది సైనికులు ప్రాణాలు కోల్పోవడమో, శరీరభాగాలు కోల్పోవడమో జరిగింది. యుద్ధం మొదలైననాటి నుంచి చూస్తే ఒక్క నెలలో ఇంతటి నష్టం ఇదే తొలిసారి. పుతిన్ రాజ్యవిస్తరణ కాంక్షకు ఇప్పటి దాకా ఉక్రెయిన్ యుద్ధంలో 7,00,000 మంది రష్యా సైనికులు బలయ్యారు. ఆక్రమణతో రష్యా భూభాగం పెరుగుతోంది. జాతీయభావనను పెంచి పుతిన్ రష్యాలో మరింత పాపులర్ అయ్యారు. కానీ ప్రభుత్వ ఖజానా, సైన్యంపరంగా దేశానికి అపార నష్టం వాటిల్లుతోంది. రష్యా ప్రభుత్వ వ్యయంలో దాదాపు 40 శాతాన్ని కేవలం ఈ యుద్ధం కోసమే పుతిన్ కేటాయిస్తున్నారు. ఇది దేశార్థికంపై పెను దుష్ప్రభావం చూపుతుంది. పుతిన్ యుద్ధోన్మాదం లక్షలాది మంది రష్యన్లను కష్టాలపాలుచేస్తోంది. యువతను బలవంతంగా సైన్యంలోకి తీసుకుంటున్నారు. ఎంతో మంది తమ ఆప్తులను యుద్ధభూమిలో కోల్పోతున్నారు'' అని టోనీ అన్నారు. దీనిపై రష్యా నుంచి ఎలాంటి స్పందనా రాలేదు.

రష్యా 145, ఉక్రెయిన్ 70 డ్రోన్లతో దాడులు

మాస్కో/కీవ్: రష్యా, ఉక్రెయిన్‌లు పరస్పరం పెద్ద సంఖ్యలో డ్రోన్లతో దాడులు చేసుకున్నాయి. రష్యా శనివారం రాత్రి 145 షహీద్ డ్రోన్లను ఉక్రెయిన్‌పైకి ప్రయోగించింది. యుద్ధం మొదలయ్యాక ఒకే రాత్రిలో ఇంత భారీ సంఖ్యలో డ్రోన్లను ప్రయోగించడం ఇదే మొదటిసారని ఉక్రెయిన్ ఆర్మీ తెలిపింది. తమ గగనతల రక్షణ వ్యవస్థలు 62 డ్రోన్లను మధ్యలోనే అడ్డుకున్నాయంది. మరో 67 డ్రోన్లు వివిధ ప్రాంతాల్లో పడ్డాయని, 10 వరకు డ్రోన్లు గురితప్పి మాల్డోవా, బెలారస్, రష్యా ప్రాంతాలవైపు దూసుకెళ్లాయని ఉక్రెయిన్ పేర్కొంది. ఆదివారం ఉదయం మాస్కో దిశగా ఉక్రెయిన్ ఆర్మీ అత్యధికంగా 34 డ్రోన్లను ప్రయోగించిందని రష్యా తెలిపింది. ఆరు ప్రాంతాలపైకి మొత్తం 70 డ్రోన్లను ప్రయోగించిందని తెలిపింది. ఈ సంఖ్యలో ప్రయోగించడం ఇదే మొదటిసారని పేర్కొంది. వీటన్నిటినీ కూల్చేశామని వివరించింది. డ్రోన్ శకలాలు పడి రెండో చోట్ల అగ్ని ప్రమాదాలు సంభవించాయి.

టీనేజీ ఇన్‌స్టా యూజర్లు

ఇక వయసు దాచలేరు!

కనిపెట్టేందుకు సిద్ధమైన మెటా • వయసుకు తగ్గ కంటెంట్ అందించే యత్నం

టీనేజీ యూజర్లు అసభ్య, అనవసర కంటెంట్ బారిన పడకుండా, వాటిని చూడకుండా కట్టడిచేసేందుకు, వారి మానసిక ఆరోగ్యం బాగుకోసం సామాజికమాధ్యమం ఇన్‌స్టాగ్రామ్ నడుం బిగించింది. ఇందుకోసం ఆయా టీనేజర్ల వయసును కనిపెట్టే పనిలో పడింది. తప్పుడు క్రిడెన్షియల్స్, సమాచారంతో లాగిన్ అయినాసరే ఇన్‌స్టా గ్రామ్ యాప్‌ను వాడుతున్నాసరే దానిని కనిపెట్టి అడ్డుకునేందుకు కృత్రిమ మేధ సాయం తీసుకుంటామని దాని మాతృసంస్థ 'మెటా'వెల్లడించింది.



ఎలా కనిపెడతారు?

అడల్ట్ క్లాసిఫయర్ పేరిట కొత్త ఏఐ టూల్‌ను మెటా వినియోగించనుంది. దీంతో యూజర్ల వయసును అత్యంత ఖచ్చితత్వంతో నిర్ధారించుకోవచ్చు. ఆన్‌లైన్‌లో ఎలాంటి కంటెంట్‌ను యూజర్ వీక్షిస్తున్నాడు?, ఆ యూజర్ ప్రొఫైల్‌లో పొందుపరిచిన వివరాలతో వయసుపై తొలుత ప్రాథమిక అంచనాకొస్తారు. తర్వాత ఈ యూజర్‌ను ఏఏ వయసు వాళ్లు ఫాలో అవుతున్నారు?, ఈ యూజర్‌తో ఎలాంటి కంటెంట్‌ను పంచుకుంటున్నారు?, ఎలాంటి అంశాలపై ఛాటింగ్ చేస్తున్నారు? ఏం ఛాటింగ్ చేస్తున్నారు? వంటి విషయాలను వడబోయనున్నారు. ఫ్రెండ్స్ నుంచి ఈ యూజర్లకు ఎలాంటి బర్త్‌డే పోస్ట్‌లు వస్తున్నాయి వంటివి జల్లెడపట్టి యూజర్ వయసును నిర్ధారిస్తారు. ఆ యూజర్ 18 ఏళ్ల లోపు వయసున్న టీనేజర్‌గా తేలితే ఆ అకౌంట్‌ను వెంటనే టీన్ అకౌంట్‌గా మారుస్తారు. ఈ అకౌంట్ల వ్యక్తిగత గోప్యత సెట్టింగ్స్ ఆటోమేటిక్‌గా మారిపోతాయి. ఈ యూజర్లకు ఏ వయసు వారు మెసేజ్ పంపొచ్చు? అనేది ఏఐ టూల్ నిర్ణయిస్తుంది. ఈ టీనేజర్లు ఎలాంటి కంటెంట్‌ను యాక్సెస్ చేయొచ్చు అనే దానిపై కృత్రిమ మేథ టూల్‌దే తుది నిర్ణయం. ప్రస్తుతం చాలా మంది టీనేజర్లు లైంగికసంబంధ కంటెంట్‌ను వీక్షించేందుకు, తల్లిదండ్రులకు తెలీకుండా చూసేందుకు తప్పుడు క్రిడెన్షియల్స్, సమాచారం ఇచ్చి లాగిన్ అవుతున్నారు. వీటికి త్వరలో అడ్డుకట్ట పడనుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

వచ్చే ఏడాది షురూ

అడల్ట్ క్లాసిఫయర్‌ను వచ్చే ఏడాది నుంచి అమలుచేసే వీలుంది. 18 ఏళ్లలోపు టీనేజర్ల ఖాతాలను టీన్ అకౌంట్లుగా మారుస్తాయి. అయితే త్వరలో 18 ఏళ్ల నిండబోయే 17, 16 ఏళ్ల వయసు వారికి కొంత వెసులుబాటు కల్పించే వీలుంది. అంటే నియంత్రణ సెట్టింగ్‌లను మార్చుకోవచ్చు. అయితే ఇది కూడా కాస్తంత కష్టంగా మార్చొచ్చు. సామాజికమాధ్యమ వేదికపై హానికర అంశాలను పిల్లలు చూసి వారి మానసిక ఆరోగ్యం దెబ్బతింటోందని ప్రపంచవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తడంతో మెటా ఈ దిశగా యాప్‌లో మార్పులు చేస్తోంది. టీనేజీ అమ్మాయిలపై ఇన్‌స్టాగ్రామ్ పెను దుష్ప్రభావాలు చూపుతోందని ప్రజావేగు ఫ్రాన్సెస్ హాగెన్ సంబంధిత అంతర్గత పత్రాలను బహిర్గతం చేయడంతో ఇన్‌స్టా గ్రామ్ నిర్లక్ష్య ధోరణిపై సర్వత్రా విమర్శలు అధికమయ్యాయి. కొత్త టూల్ కారణంగా టీనేజీ యూజర్ల సంఖ్య తగ్గుముఖం పట్టొచ్చేమోగానీ సమస్యకు పూర్తి పరిష్కారం లభించకపోవచ్చని స్వయంగా మెటానే భావిస్తోంది. ఎవరైనా యూజర్ తాను టీనేజర్‌ను కాదు అని చెప్పి టీన్‌అకౌంట్‌ను మార్చాలనుకుంటే ఆ మేరకు లైవ్‌లో నిరూపించుకునేలా కొత్త నిబంధన తేవాలని చూస్తున్నారు. బయటి సంస్థకు ఈ బాధ్యతలు అప్పజెప్పనున్నారు. సంబంధిత యూజర్ వీడియో సెల్ఫీ లైవ్‌లో తీసి పంపితే ఈ బయటి సంస్థ వీడియోను సరిచూసి అకౌంట్ స్టేటస్‌పై తుది నిర్ణయం తీసుకుంటుంది.

ప్రధాన ఖరీఫ్ పంట ఏది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ జాగ్రఫీ

అనాదిగా భారతదేశం వ్యవసాయ ఆధారిత దేశం. శ్రామిక శక్తిలో మూడింట రెండు వంతులకు వ్యవసాయం, దాని అనుబంధ కార్యక్రమాల వల్లనే జీవనాధారం లభిస్తోంది. అంతేకాకుండా దాదాపు 70 శాతం జనాభా గ్రామాల్లో నివసిస్తూ వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా ఉండటం, భారతదేశ జాతీయ ఆర్థికాభివృద్ధి.. వ్యవసాయ రంగం అభివృద్ధిపై ఆధారపడి ఉండటం, పెరిగే జనాభాకు ఆహారాన్ని అందించడం, అనేక పరిశ్రమలకుముడి సరుకులు అందించే దేశంగా ఉండటం, పెద్ద మొత్తాల్లో విదేశీ మారకద్రవ్యం లభించడం మొదలైన అనేక కారణాల వల్ల భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయాన్ని 'వెన్నెముక' గా చెప్పొచ్చు.

భారతదేశం - వ్యవసాయం

భారతదేశ వ్యవసాయ ఉత్పత్తులు రుతుపవనాలు తెచ్చే వర్షంపైన ఆధారపడి ఉండటం వల్ల భారతదేశ ఆర్థికస్థితిని రుతుపవనాలతో 'జూద మాడటం'తో అనవచ్చు. భారతదేశ వ్యవసాయ రంగంలో ఉత్పత్తి అయిన వాటిలో ఎగుమతి అయ్యే ముఖ్యమైన సరుకులు.. టీ, కాఫీ, ఆముదాలు, వేరుశనగ, పండ్లు, సుగంధ ద్రవ్యాలు, పొగాకు, పత్తి, పంచదార, తోళ్లు, నూనెలు, జనప నార మొదలైనవి.

- 1900కి పూర్వం మన దేశ వ్యవసాయం మరీ పురాతన పద్ధతులలో సాగుతూ ఉండేది. 1908లో బిహార్‌లోని 'పూసా' వద్ద ఒక వ్యవసాయ కళాశాల, పరిశోధనా శాలను స్థాపించారు.
- 1937లో బ్రిటీష్ ప్రభుత్వం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో వ్యవసాయ శాఖల్ని ప్రారంభించింది.
- 1951 తర్వాత భారత వ్యవసాయ రంగంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. అంటే 1951లో మొదటి పంచవర్ష ప్రణాళికను రూపొందించి, అందులో వ్యవసాయ రంగానికి అత్యధికంగా ప్రాధాన్యతను ఇచ్చారు.
- భారతదేశంలో వ్యవసాయ పరిశోధన కేంద్రం న్యూఢిల్లీలో ఉంది.
- వ్యవసాయోత్పత్తులను పెంచడానికి భారత ప్రభుత్వం 1963లో 'వ్యవసాయాభివృద్ధి బోర్డు' ఏర్పాటు చేసింది.

ప్రస్తుతం మనదేశంలో విభిన్న ప్రాంతాల్లో వివిధ రకాలైన వ్యవసాయ పద్ధతులున్నాయి. వీటిని ఆరు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి..

1. విస్థాపన వ్యవసాయం
2. తోట వ్యవసాయం
3. సాంద్ర వ్యవసాయం
4. జీవనాధార వ్యవసాయం
5. విస్తృత వ్యవసాయం
6. మిశ్రమ వ్యవసాయం

1. **విస్థాపన వ్యవసాయం:** దీన్ని స్థలమార్పిడి వ్యవసాయం లేదా సంచార వ్యవసాయం అని కూడా అంటారు. ఇది సాధారణంగా కొండ ప్రాంతాల్లోని గిరిజనులు చేసే వ్యవసాయం.
- ఈ వ్యవసాయంలో చెట్లను నరికి, వాటిని కాల్చి వ్యవసాయ భూములుగా మారుస్తారు. కొన్నేళ్ల తర్వాత అంటే భూసారం తగ్గాక ఆ భూమిని వదిలి, మరొక ప్రాంతానికి వెళ్లి అక్కడ మళ్లీ వ్యవసాయం చేస్తారు. ఇది నిరంతరంగా కొనసాగుతుంది. అందుకే దీన్ని 'నరుకు - కాల్చు' వ్యవసాయం లేదా 'పోడు వ్యవసాయం' అని అంటారు.
- ఇటువంటి వ్యవసాయాన్ని మనదేశంలో వివిధ ప్రాంతాల్లో వివిధ పేర్లతో పిలుస్తారు.

2. **తోట వ్యవసాయం:** దీన్ని వాణిజ్య వ్యవసాయం అని కూడా అంటారు.
- ఈ పద్ధతిని మనదేశంలో బ్రిటీష్ వారు ప్రవేశపెట్టారు.
- లాభం లేదా ధనాన్ని సంపాదించడం కోసం 'నగదు పంటల'ను పండిస్తారు.
- ఈ వ్యవసాయానికి ఎక్కువ పెట్టుబడి, సాంకేతిక పరిజ్ఞానం, భూమి అవసరం.
- గోధుమలు, తేయాకు, కాఫీ, రబ్బరు, బార్లీ, పత్తి, చెరకు, పొగాకు, సుగంధ ద్రవ్యాలు మొదలైన పంటలు వాణిజ్య వ్యవసాయంలో సాగు చేస్తారు.

3. **సాంద్ర వ్యవసాయం:** అధిక జనసాంద్రత ప్రాంతాల్లో ఈ రకమైన వ్యవసాయం చేస్తారు. ఇది అధికంగా వ్యవసాయ శ్రామికులను, అత్యధిక జీవ రసాయనిక ఎరువులను, నీటి పారుదలను ఉపయోగించుకొని అధిక దిగుబడి సాధించే విధానం.

రాష్ట్రాలు/ప్రదేశం	పోడు/విస్థాపన వ్యవసాయం పేర్లు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ	పోడు వ్యవసాయం
కేరళ	పోనమ్
హిమాలయ	ఖిల్
జార్ఖండ్	కురువా
అసోం, ఈశాన్య రాష్ట్రాలు	జూమ్/ఝూం
మధ్యప్రదేశ్	బేవార్, పెండ
ఒడిశా	ధీటి
రాజస్థాన్	వాత్ర

- తక్కువ భూవిస్తీర్ణంలో పురాతన వ్యవసాయ పద్ధతులను ఉపయోగిస్తారు.
- మనదేశంలో గంగానదీ పరీవాహక ప్రాంతం, కృష్ణా, గోదావరి, మహానది, కావేరి డెల్టా ప్రాంతాలు ఈ రకానికి ఉదాహరణగా చెప్పొచ్చు. దీనిలో సరాసరి దిగుబడి ఎక్కువ మోతాదులో ఉంటుంది.

4. **జీవనాధార వ్యవసాయం:** ఆహార అవసరాల కోసం రైతు కుటుంబం అంతా పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడి చేసే వ్యవసాయాన్ని జీవనాధార వ్యవసాయం అంటారు.
- దీనిలో ఆహార పంటలు మాత్రమే పండిస్తారు. కాబట్టి దీనిలో లాభం ఉండదు.
- దీంతో ఎక్కువగా ప్రచ్ఛన్న నిరుద్యోగం ఏర్పడుతుంది.

5. **విస్తృత వ్యవసాయం:** ఎక్కువ విస్తీర్ణం ఉన్న భూమిలో ఎక్కువ పెట్టుబడితో చేసేదాన్ని విస్తృత వ్యవసాయం అంటారు.
- ఈ పద్ధతిలో వ్యవసాయ కూలీలు తక్కువగా ఉంటూ, యంత్రాలను ఎక్కువగా వినియోగిస్తారు.
- ఇందులో సరాసరి దిగుబడి తక్కువ మోతాదులో ఉంటుంది.
- అమెరికా, కెనడా, రష్యా లాంటి దేశాల్లో ఈ పద్ధతి ఎక్కువగా అమల్లో ఉంది.

6. **మిశ్రమ వ్యవసాయం:** వ్యవసాయంతో పాటు పశుపోషణ లేదా కోళ్ల పెంపకం లేదా సెరికల్చర్ లేదా ఎపికల్చర్ వంటి కార్యకలాపాలు చేపడితే దాన్ని మిశ్రమ వ్యవసాయం అంటారు.



భారతదేశంలో పంట కాలాలు

వ్యవసాయ పంటలు రుతువుల మీద, సహజ వనరులైన మృత్తికలు, నీరు, సూర్యరశ్మిపై ఆధారపడి ఉంటాయి. వీటితోపాటు ఉష్ణోగ్రత, ఆర్ద్రత అంశాలు కూడా ప్రధాన మైనవి. ఏ ప్రాంతంలోనైనా రుతువులను బట్టి పంటలు మారుతూ ఉంటాయి.

భారతదేశంలో ప్రధానంగా మూడు రకాల పంటకాలాలు ఉన్నాయి. అవి..

1. ఖరీఫ్ 2. రబీ
3. జయాద్ లేదా జైద్

1. **ఖరీఫ్ (జూన్ నుంచి అక్టోబర్ మధ్య వరకు):**
- నైరుతి రుతుపవనాల రాకతో దాదాపు దేశమంతటా ఖరీఫ్ ప్రారంభమవుతుంది.
- జూన్, జూలైల్లో విత్తనాలు వేసే కాలం ప్రారంభమై సెప్టెంబర్, అక్టోబర్ మధ్య కాలంలో పంటకోతలు ప్రారంభమవుతాయి.
- వరి, మొక్కజొన్న, జొన్న, సజ్జ, కందులు, పెసలు, మినుములు, పత్తి, జనుము, వేరుశనగ, సోయాబీన్ ముఖ్యమైన ఖరీఫ్ పంటలు.

2. **రబీ (అక్టోబర్ మధ్య నుంచి ఏప్రిల్ వరకు):**
- ఈశాన్య రుతుపవనాల రాకతో దేశంలో రబీ కాలం మొదలవుతుంది.
- ఈ కాలంలోని పంటలు పెరిగేటప్పుడు చల్లని వాతావరణం, కోసేటప్పుడు వెచ్చని వాతావరణం అవసరం.
- రబీ పంటను శీతాకాలంలో అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య కాలంలో విత్తి, ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు పంటలు కోస్తారు.
- పశ్చిమ విక్షోభాల వల్ల శీతాకాలంలో సంభవించే కొద్దిపాటి వర్షపాతం రబీ పంటలకు అత్యంత ఉపయోగకరం.
- దీనిలో ముఖ్యమైన పంటలు గోధుమ, బార్లీ, బఠాణీ, శనగ, ఆవాలు, పప్పుధాన్యాలు మొదలైనవి.

3. **జయాద్/ జైద్ (మే నుంచి జూన్ వరకు):**
- రబీ, ఖరీఫ్ పంట కాలాల మధ్య స్వల్ప వ్యవధిలో ఉన్న పంట రుతువును 'జయాద్' అంటారు.
- నీటిపారుదల సౌకర్యం ఉన్న ప్రాంతాల్లో పుచ్చకాయలు, కర్బూజ, దోసకాయ, కూరగాయలు, పశువుల మేత వంటి స్వల్ప కాల పంటలు పండిస్తారు.

భారతదేశంలో ముఖ్య పంటలు

భారతదేశంలో పంటలను ముఖ్యంగా నాలుగు విధాలుగా విభజించొచ్చు. అవి..

1. ఆహార పంటలు
2. నగదు లేదా వాణిజ్య పంటలు
3. తోట పంటలు
4. ఉద్యానవన పంటలు

1. **ఆహారపంటలు:** వరి, గోధుమ, మొక్క జొన్న, జొన్న, సజ్జ, రాగి, పప్పుధాన్యాలు.
2. **నగదు లేదా వాణిజ్య పంటలు:** పత్తి, పొగాకు, జనుము, చెరకు, నూనె గింజలు.
3. **తోట పంటలు:** కాఫీ, టీ, సుగంధ ద్రవ్యాలు, కొబ్బరి, రబ్బరు.
4. **ఉద్యానవన పంటలు:** కూరగాయలు, పండ్లు, పూలు మొదలైనవి.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ప్రధానమైన పంట రుతువులు? (కానిస్టేబుల్ - 2009)
   1) ఖరీఫ్, రబీ 2) ఖరీఫ్, వేసవి
   3) ఖరీఫ్, రబీ, వేసవి
   4) రబీ, వేసవి
2. సాగు చేయడంలో కార్బనిక ఎరువు, సహజ క్రిమినాశనుల మందులను ఉపయోగించే వ్యవసాయం? (కానిస్టేబుల్ - 2009)
   1) జీవనాధార వ్యవసాయం
   2) పోడు వ్యవసాయం
   3) కార్బనిక వ్యవసాయం
   4) మిశ్రమ వ్యవసాయం
3. వ్యవసాయంలో ఖరీఫ్ రుతువు దేన్ని తెలుపుతుంది? (కానిస్టేబుల్ - 2009)
   1) రుతుపవనాల ఆగమనం (జూన్-జూలై)
   2) రుతుపవనాల ఉపసంహరణ (అక్టోబర్- నవంబర్)
   3) వేసవి ఆరంభం (ఏప్రిల్-మే)
   4) పైవేవీ కావు

సమాధానాలు:
1) 3; 2) 3; 3) 1.

మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో ప్రధాన ఖరీఫ్ పంట?
   1) గోధుమ 2) వేరుశనగ
   3) వరి 4) పొగాకు
2. భారతదేశంలో రబీ కాలంలో ప్రధాన పంట ఏది?
   1) వరి 2) గోధుమ
   3) పత్తి 4) సజ్జ
3. 1908లో మనదేశంలో ఎక్కడ వ్యవసాయ కళాశాల, పరిశోధనాశాలను స్థాపించారు?
   1) న్యూఢిల్లీ 2) కటక్
   3) పుణే 4) పూసా
4. కేరళలో పోడు లేదా విస్థాపన వ్యవసాయానికి ఉన్న మరో పేరు?
   1) కురువా 2) పోనమ్
   3) జూమ్ 4) వాత్ర

సమాధానాలు
1) 3; 2) 2; 3) 4; 4) 2.

విద్య, ఉద్యోగ సమాచారం

టీజీ టెట్-2024-II పరీక్ష

తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖ తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) 2024-II నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రభుత్వ ఉపాధ్యాయులుగా నియమితులు కావాలంటే టెట్‌లో అర్హత సాధించడం తప్పనిసరి. టెట్‌ను జిల్లా కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా నిర్వహిస్తారు.

- **అర్హత:** టెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులే టీఆర్‌టీ రాయడానికి అర్హులు. టెట్ పేపర్-1కి ఇంటర్, డీఈడీ అర్హత ఉండాలి. టెట్ పేపర్-2కి డిగ్రీ, బీఈడీ ఉత్తీర్ణులవ్వాలి.
- **పరీక్ష విధానం:** టెట్‌లో రెండు పేపర్లు ఉంటాయి. ప్రాథమిక పాఠశాలల్లోని సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ) ఉద్యోగాలకు అర్హత పొందేందుకు పేపర్-1, ఉన్నత పాఠశాలల్లోని స్కూల్ అసిస్టెంట్(ఎస్‌ఏ) ఉద్యోగాలకు పేపర్-2 పరీక్ష నిర్వహిస్తారు. పేపర్-2లో మళ్లీ గణితం, సైన్స్, సాంఘికశాస్త్రం రెండు వేర్వేరు పేపర్లు ఉంటాయి. ఒక్కో పేపర్‌కు 150 మార్కులు. జనరల్ కేటగిరీలో 90, బీసీలు-75, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 60 మార్కులు సాధిస్తే అర్హత పొందవచ్చు. వారే టీఆర్‌టీ రాసేందుకు అర్హులవుతారు. టెట్ మార్కులకు 20 శాతం, టీఆర్‌టీలో వచ్చిన మార్కులకు 80 శాతం వెయిటేజి ఇచ్చి అభ్యర్థులకు తుది ర్యాంకు నిర్ణయిస్తారు.
- **పరీక్ష విధానం:** ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష జరుగుతుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.11.2024
- **పరీక్ష తేదీలు:** 01.01.2025 నుంచి 20.01.2025 వరకు జరుగుతాయి.
- **పరీక్ష ఫలితాల తేది:** 05.02.2025
- **వెబ్‌సైట్:** https://tgtet2024.aptonline.in

మెకాన్ లిమిటెడ్, రాంచీలో 18 ఎగ్జిక్యూటివ్ పోస్టులు

రాంచీలోని మెటలర్జికల్-ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ లిమిటెడ్(మెకాన్ లిమిటెడ్) ఒప్పంద ప్రాతిపదికన ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 18.
- **పోస్టుల వివరాలు:** డిప్యూటీ మేనేజర్-08, మేనేజర్-08, సీనియర్ మేనేజర్-02.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఆర్క్, బీఈ/బీటెక్(మెకానికల్/సివిల్/ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రికల్/కెమికల్), పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** డిప్యూటీ మేనేజర్ పోస్టులకు 32 ఏళ్లు, మేనేజర్ పోస్టులకు 36 ఏళ్లు, సీనియర్ మేనేజర్ పోస్టులకు 40 ఏళ్లు మించ కూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ, సర్టిఫికేట్‌ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 13.11.2024.
- **వెబ్‌సైట్:** http://www.meconlimited.co.in


ఊయల ఊగే బాలికకు ఏ చలనం ఉంటుంది?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

భౌతిక, రసాయన శాస్త్రం-ఎస్‌జీటీ

మాదిరి ప్రశ్నలు

1. ఉష్ణ అయనీకరణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించినవారు?
   ఎ) ఎం.ఎస్. స్వామినాథన్
   బి) మేఘనాథ్ సాహు
   సి) పి.సి. రే డి) జె.సి. బోస్
2. సెకన్ల లోలకం డోలనావర్తన కాలం ఎంత?
   ఎ) 4 సె. బి) 6 సె. సి) 2 సె. డి) 10 సె.
3. ఫారన్‌హీట్ ఉష్ణమాపకంలోని విభాగాల సంఖ్య?
   ఎ) 100 బి) 212 సి) 32 డి) 180
4. బొగ్గుపులుసు వాయువు అని దేన్ని అంటారు?
   ఎ) NO_2 బి) CO_2
   సి) CO డి) SO_2
5. సముద్ర మట్టం నుంచి ప్రతి 272.7 మీటర్ల ఎత్తుకు పోయేకొద్దీ పీడనం ఎంత తగ్గుతుంది?
   ఎ) 2.54 సెం.మీ. బి) 25.4 సెం.మీ
   సి) 27.2 సెం.మీ. డి) 2.72 సెం.మీ.
6. అణు పరీక్షల నుంచి వెలువడే కాలుష్య పదార్థం?
   ఎ) N_2O బి) CFC
   సి) స్ట్రాన్షియం-90 డి) Co
7. బ్లీచింగ్ పౌడర్ ఫార్ములా ఏది?
   ఎ) CCl_3NO_2 బి) $CHCl_3$
   సి) $CaCl_2$ డి) $CaOCl_2$
8. నీటి శాశ్వత కాఠిన్యానికి కారణం?
   ఎ) కాల్షియం, మెగ్నీషియంల సల్ఫేట్లు, క్లోరైడ్లు
   బి) కాల్షియం, మెగ్నీషియంల బై కార్బొనేట్లు
   సి) జింక్, మెగ్నీషియంల బై కార్బొనేట్లు
   డి) పైవన్నీ
9. గోడ నిలువు స్థితి సరిగా ఉందా? లేదా? అని దేని ద్వారా తెలుసుకుంటారు?
   ఎ) స్పిరిట్ లెవల్ బి) ప్లంబ్ బాంబ్
   సి) కోణమాణిని డి) పైవన్నీ
10. వర్షానికి తడవని దుస్తులను ఏమంటారు?
    ఎ) ఖాదీ బి) పట్టు
    సి) ఉలెన్ డి) కేన్వాస్
11. బట్టలోని నిలువు దారాలను ఏమంటారు?
    ఎ) పడుగు బి) పేక
    సి) షటిల్ డి) హెడిల్స్
12. దుస్తులపై ఏర్పడే సిరా మరకలను దేని ద్వారా తొలగిస్తారు?
    ఎ) బోరాక్స్ బి) హైపో
    సి) బెంజీన్ డి) నిమ్మరసం
13. మొదటి రకం తులాదండానికి ఉదాహరణ?
    ఎ) ట్రాలీ బండి బి) అడకత్తెర
    సి) కత్తెర డి) గ్రావణం
14. ఇనుప పట్టీలకు రంధ్రాలు వేయడానికి ఉపయోగించే పరికరం?
    ఎ) డ్రిల్ బిట్ బి) పోకర్
    సి) రెంచ్ డి) వైస్
15. ఊయల ఊగే బాలికకు ఏ చలనం ఉంటుంది?
    ఎ) డోలన చలనం బి) భ్రమణ చలనం
    సి) కంపన చలనం డి) స్థానాంతర చలనం
16. టపాకాయలో నిల్వ ఉండే శక్తి?
    ఎ) ఉష్ణశక్తి బి) ధ్వనిశక్తి
    సి) రసాయనశక్తి డి) సౌరశక్తి
17. ద్రవాల్లో ఉత్తమ ఉష్ణవాహక పదార్థం?
    ఎ) బ్రోమిన్ బి) పాదరసం
    సి) ఆల్కహాల్ డి) బెంజీన్
18. ఒక పుట్ కాండిల్ ఎన్ని లక్స్‌లకు సమానం?
    ఎ) 12.5 బి) 7.46 సి) 4.12 డి) 10.76
19. దూరదర్శినిలో కాంతిని పరావర్తనం చెందించడానికి ఏ దర్పణాలను ఉపయోగిస్తారు?
    ఎ) కుంభాకార బి) పుటాకార
    సి) సమతల డి) వాలు
20. పరావర్తన ధ్వనిని వినాలంటే పరావర్తన తలం మనకు కనీసం ఎంత దూరంలో ఉండాలి?
    ఎ) 22 మీ. బి) 44 మీ.
    సి) 11 మీ. డి) 5.5 మీ.
21. బైక్రోమేట్ ఘటంలోని డీ పోలరైజర్?
    ఎ) $KMnO_4$ బి) $K_2Cr_2O_7$
    సి) NH_4Cl డి) MnO_2
22. విద్యుత్ బల్బులోని ఫిలమెంట్‌ను దేనితో తయారుచేస్తారు?
    ఎ) ఇనుము బి) జింక్
    సి) రాగి డి) టంగ్‌స్టన్
23. ఆర్ద్రతా శాతాన్ని కొలిచే పరికరం?
    ఎ) హైగ్రో మీటర్ బి) హైడ్రో మీటర్
    సి) ఓల్టా మీటర్ డి) బారో మీటర్
24. దూరదృష్టి దోషం నివారణకు ఉపయోగించే కటకం ఏది?
    ఎ) పుటాకార బి) కుంభాకార
    సి) సమతల పుటాకార డి) ఏదీకాదు
25. తెల్లని రంగు ఉన్న జింక్ ఆక్సైడ్‌ను వేడి చేసినప్పుడు అది ఏ రంగులోకి మారుతుంది?
    ఎ) నలుపు బి) ఎరుపు
    సి) పసుపు డి) ఆరెంజ్
26. ఆక్సీ-ఎసిటలిన్ జ్వాల ఉష్ణోగ్రత?
    ఎ) 2400 °C బి) 3200 °C
    సి) 100 °C డి) 1250 °C
27. కృత్రిమ పెట్రోల్‌ను సంశ్లేషించిన శాస్త్రవేత్త?
    ఎ) కావెండిష్ బి) బెర్జీలియస్
    సి) బెర్జియస్ డి) లెవోయిజర్
28. నూనెల హైడ్రోజనీకరణంలో ఉత్ప్రేరకంగా దేన్ని ఉపయోగిస్తారు?
    ఎ) Fe బి) Mo సి) Pt డి) Ni
29. ఎల్‌పీజీ వంటగ్యాస్‌లో ఉండే వాయువు?
    ఎ) ఈథేన్ బి) ఆక్సిజన్
    సి) ఎసిటలిన్ డి) బ్యూటేన్
30. భాస్వరం రూపాంతరాల్లో అత్యంత చురుకైంది ఏది?
    ఎ) నల్ల భాస్వరం బి) తెల్ల భాస్వరం
    సి) ఎర్ర భాస్వరం డి) స్కార్లెట్ భాస్వరం
31. సూర్యుని తర్వాత కాంతివంతంగా కనిపించే నక్షత్రం ఏది?
    ఎ) ప్రాక్సిమా సెంటావరి బి) సిరియస్
    సి) హైడ్రా డి) హిడా
32. హేలీ తోక చుక్క మళ్లీ ఏ సంవత్సరంలో సూర్యునికి దగ్గరగా వస్తుంది?
    ఎ) 2046 బి) 2025
    సి) 2062 డి) 2086
33. వివిధ రంగుల కాంతుల తరంగదైర్ఘ్యం తగ్గే క్రమం?
    ఎ) ROYGBIV బి) VIBGYOR
    సి) IBGYORV డి) YORGBIV
34. పొడిమంచు అంటే?
    ఎ) ఘన SO_2 బి) ఘన NO_2
    సి) ద్రవ CO_2 డి) ఘన CO_2
35. మానవుడు నీటిలో ఈదడంలో ఇమిడి ఉన్న నియమం ఏమిటి?
    ఎ) న్యూటన్ మొదటి గమన నియమం
    బి) న్యూటన్ రెండో గమన నియమం
    సి) న్యూటన్ మూడో గమన నియమం
    డి) పైవన్నీ
36. అగ్నిమాపక యంత్రంలో ఉపయోగించే వాయువు?
    ఎ) SO_2 బి) CO_2 సి) O_2 డి) H_2
37. సూపర్ ఫాస్ఫేట్ ఆఫ్ లైమ్ ఒక ... ఎరువు?
    ఎ) నత్రజని బి) కాల్షియం
    సి) పొటాషియం డి) ఫాస్ఫేటిక్
38. గెలీనా ధాతువు రసాయన ఫార్ములా?
    ఎ) FeS బి) HgS
    సి) CuS డి) PbS
39. ఇళ్లలో బల్బులను అమర్చే పద్ధతి?
    ఎ) శ్రేణి బి) సమాంతర
    సి) ఎదురెదురు డి) ఏదీకాదు
40. ఉష్ణమాపనిలో ఉపయోగించే ద్రవం?
    ఎ) నీరు బి) HCl
    సి) బ్రోమిన్ డి) పాదరసం
41. రోడ్డు రోలర్ ఏ స్థితిలో ఉంటుంది?
    ఎ) స్థిర నిశ్చల బి) అస్థిర నిశ్చల
    సి) తటస్థ నిశ్చల డి) ఏదీకాదు
42. విమానాల ఎత్తును కొలవడానికి ఉపయోగించే పరికరం?
    ఎ) ఆల్టీ మీటర్ బి) బారో మీటర్
    సి) హైగ్రో మీటర్ డి) లాక్టో మీటర్
43. విద్యుదయస్కాంతాల తయారీకి ఉపయోగించే పదార్థం?
    ఎ) అల్నికో బి) మెత్తని ఇనుము
    సి) ఉక్కు డి) కోబాల్ట్
44. కుళ్లిన కోడిగుడ్ల వాసన కలిగి ఉండే వాయువు ఏది?
    ఎ) HCl బి) SO_2
    సి) H_2S డి) SO_3
45. సిల్వర్ లాటిన్ పేరు ఏమిటి?
    ఎ) నేట్రియం బి) ఆరమ్
    సి) అర్జెంటమ్ డి) స్టానమ్
46. STP వద్ద 24 గ్రా. మీథేన్ ఆక్రమించే ఘనపరిమాణం? (లీటర్లలో)
    ఎ) 22.4 బి) 2.24
    సి) 33.6 డి) 11.2
47. గన్‌పౌడర్‌లో ఉపయోగించేది?
    ఎ) ఇసుక బి) సల్ఫర్
    సి) మెర్క్యూరిక్ పౌడర్
    డి) సోడియం క్లోరైడ్
48. కిందివాటిలో అమ్మోనాల్ సంఘటనం?
    ఎ) NH_4NO_3 + 20% TNT
    బి) $NaNO_3$ + 20% TNT
    సి) NH_4NO_2 + 20% TNT
    డి) NH_4NO_3 + Al పొడి
49. కిందివాటిలో దృష్టి స్థిరత ధర్మం ఆధారంగా సాధ్యపడింది ఏది?
    ఎ) మైక్రోఫోన్ బి) సినిమాటోగ్రఫీ
    సి) టెలివిజన్ డి) టెలిఫోన్
50. కాంతి తీవ్రతకు ప్రమాణం?
    ఎ) ల్యూమెన్ బి) వాట్
    సి) లక్స్ డి) వోల్ట్
51. టెలిగ్రాఫ్ ఆఫీసులో ఉపయోగించే విద్యుత్ ఘటం?
    ఎ) లెక్లాంచి బి) ఓల్టాయిక్
    సి) బైక్రోమేట్ డి) నిర్జల
52. ఫాస్ఫేట్(PO_4) ప్రాతిపదిక సంయోజకత?
    ఎ) 1 బి) 2 సి) 3 డి) 4
53. $CuO + H_2 \rightarrow Cu + H_2O$లో క్షయకరణి ఏది?
    ఎ) CuO బి) Cu
    సి) H_2O డి) H_2
54. దత్తాంశాన్ని టైప్ చేయడానికి వాడే ఇన్ పుట్ సాధనం?
    ఎ) స్కానర్ బి) వెబ్ కెమెరా
    సి) మౌస్ డి) కీబోర్డ్
55. కిందివాటిలో తీగ వాయిద్యానికి ఉదాహరణ?
    ఎ) పిల్లనగ్రోవి బి) బుల్-బుల్
    సి) క్లారినెట్ డి) హార్మోనియం
56. విద్యుత్ నిరోధానికి సంకేతం?
    
57. రెండు దర్పణాల మధ్య కోణం 60° ఉన్నప్పుడు ఏర్పడే ప్రతిబింబాల సంఖ్య?
    ఎ) 4 బి) 6 సి) 11 డి) 5
58. పాస్కల్ దేనికి ప్రమాణం?
    ఎ) సాంద్రత బి) పీడనం
    సి) ఒత్తిడి డి) ఘనపరిమాణం
59. పాదరసం తారతమ్య సాంద్రత?
    ఎ) 0.8 బి) 13.6 సి) 2.5 డి) 8.9
60. 'బ్రిటిష్ పద్ధతి'గా దేన్ని పేర్కొంటారు?
    ఎ) CGS బి) MKS
    సి) S.I. డి) FPS
61. నియమిత ఘనపరిమాణం ఉన్న ద్రవాలను తీసుకోవడానికి వాడే పరికరం?
    ఎ) కొలజాడి బి) బ్యూరెట్
    సి) పిప్పెట్టు డి) కోనికల్ ఫ్లాస్క్
62. వేరు బొడిపెలు ఉండి నత్రజని స్థాపన చేసే మొక్క?
    ఎ) మొక్కజొన్న బి) వరి
    సి) వెదురు డి) చిక్కుడు
63. 8 గ్రా. $CaCO_3$ని వేడిచేస్తే వెలువడే CO_2 భారం?
    ఎ) 2.54 గ్రా. బి) 3.52 గ్రా.
    సి) 35.2 గ్రా. డి) 4.72 గ్రా.
64. కనిపించని సిరా అని దేన్ని అంటారు?
    ఎ) $CaCl_2$ బి) $COCl_2$
    సి) $CoCl_2$ డి) $CaOCl_2$
65. సల్ఫర్ పరివర్తన ఉష్ణోగ్రత ఎంత?
    ఎ) 120 °C బి) 444 °C
    సి) 96 °C డి) 119 °C
66. H_2S తయారీలో ఉపయోగించేది?
    ఎ) ఎర్లన్ మేయర్ ఫ్లాస్క్
    బి) ప్రమాణ కుప్పె
    సి) కిప్పు పరికరం డి) కెలోరీ మీటర్
67. ఉపగ్రహాలు అధికంగా ఉన్న గ్రహం?
    ఎ) శని బి) గురుడు
    సి) అంగారకుడు డి) భూమి
68. బాణాసంచా తయారీలో ఉపయోగించేది?
    ఎ) Be బి) Mg సి) Ca డి) Sr
69. అత్యంత తీయనైన చక్కెర ఏది?
    ఎ) సుక్రోజ్ బి) గ్లూకోజ్
    సి) ఫ్రక్టోజ్ డి) మాల్టోజ్
70. పరమాణు సంఖ్య 26 ఉన్న మూలకం లాటిన్ పేరు?
    ఎ) అర్జెంటమ్ బి) ఫెర్రమ్
    సి) స్టానమ్ డి) ఆరమ్

సమాధానాలు


1) బి	2) సి	3) డి	4) బి	5) ఎ
6) సి	7) డి	8) ఎ	9) బి	10) డి
11) ఎ	12) బి	13) సి	14) బి	15) సి
16) సి	17) బి	18) డి	19) బి	20) సి
21) బి	22) డి	23) ఎ	24) బి	25) సి
26) బి	27) సి	28) డి	29) డి	30) బి
31) బి	32) సి	33) ఎ	34) డి	35) సి
36) బి	37) డి	38) సి	39) బి	40) డి
41) సి	42) ఎ	43) బి	44) సి	45) సి
46) సి	47) బి	48) ఎ	49) బి	50) సి
51) ఎ	52) సి	53) డి	54) డి	55) బి
56) ఎ	57) డి	58) బి	59) బి	60) డి
61) సి	62) డి	63) బి	64) సి	65) సి
66) సి	67) ఎ	68) బి	69) సి	70) బి

కేంద్రక భౌతిక శాస్త్ర పితామహుడెవరు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

భౌతిక శాస్త్రం



మాక్స్‌ప్లాంక్ క్వాంటం సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన (1900లో) తర్వాత భౌతిక శాస్త్రంలో జరుగుతున్న అభివృద్ధి మొత్తాన్ని 'ఆధునిక భౌతిక శాస్త్రం'గా వ్యవహరిస్తారు. ఇతడిని 'ఆధునిక భౌతికశాస్త్ర పితామహుడు' అంటారు. ఈ అధ్యాయంలో ప్రాథమిక కణాలు (ఎలక్ట్రాన్, ప్రోటాన్, న్యూట్రాన్), రేడియో ఐసోటోపులు, X - కిరణాలు, కాస్మిక్ కిరణాలు, సహజ రేడియో ధార్మికత, కేంద్రక విచ్ఛిత్తి, కేంద్రక సంలీనం, అణు రియాక్టర్లు మొదలైనవాటి గురించి తెలుసుకుంటాం.

ఆధునిక భౌతిక శాస్త్రం

పదార్థాన్ని (ఘన, ద్రవ, వాయు) విభజించినప్పుడు చివరగా మిగిలే కణాన్నే 'పరమాణువు' అంటారు. పరమాణువు కేంద్రకాన్ని రూథర్‌ఫర్డ్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. దీని పరిమాణం సుమారుగా ఒక ఫెర్మీకి సమానంగా ఉంటుంది.

1 ఫెర్మీ = 10^{-15} మీ.

పరమాణువు కేంద్రకంలో ధనావేశిత ప్రోటాన్, తటస్థ న్యూట్రాన్లు ఉంటాయి. ఒక ప్రోటాన్, ఒక న్యూట్రాన్‌ను కలిపి 'న్యూక్లియాన్' అంటారు. పరమాణు కేంద్రకంలో ఉన్న ప్రోటాన్ల ధనావేశాన్ని సంతులనం చేయడానికి రుణావేశిత ఎలక్ట్రాన్‌లు కేంద్రకం చుట్టూ వివిధ శక్తి స్థాయిల్లో పరిభ్రమిస్తూ ఉంటాయి. ఈ విధంగా పరమాణువులో ఉండే ప్రోటాన్లు, న్యూట్రాన్లు, ఎలక్ట్రాన్లను 'ప్రాథమిక కణాలు' అంటారు. ప్రాథమిక కణాల్లో మానవుడు ఆవిష్కరించిన మొదటి కణం ఎలక్ట్రాన్ (e^-). వీటినే 'కేథోడ్ కిరణాలు', 'β – కిరణాలు' అని అంటారు.

ఎలక్ట్రాన్ ఆవిష్కరణ

ఎలక్ట్రాన్‌ను మొదటగా ప్లకర్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. ఉత్సర్గ నాళాన్ని ఉపయోగించి ఎలక్ట్రాన్లను ప్రయోగాత్మకంగా కనుగొన్నందుకు జె.జె. థామ్సన్‌కు 1906లో నోబెల్ బహుమతి లభించింది.

ధర్మాలు - ఉపయోగాలు:

- కేథోడ్ కిరణాలకు జి.జె. స్టనీ అనే శాస్త్రవేత్త ఎలక్ట్రాన్ అనే పేరు పెట్టాడు. దీని నుంచే ఎలక్ట్రిసిటీ, ఎలక్ట్రానిక్ అనే పదాలు వచ్చాయి.
- ఎలక్ట్రాన్‌లు ఎల్లప్పుడూ రుజుమార్గంలో ప్రయాణిస్తాయి. దీన్ని నిరూపించిన శాస్త్రవేత్త హిటార్ఫ్.
- కేథోడ్ కిరణాలు ఎల్లప్పుడూ స్థిరమైన వేగంతో ముందుకు కదులుతాయి.
- ఎలక్ట్రాన్‌లు ప్రయాణిస్తున్న మార్గంలో ఫొటోగ్రాఫిక్ ఫిల్మ్‌ను అమర్చినప్పుడు ఫిల్మ్‌పై వాటి ప్రతిబింబాలు ఏర్పడతాయి. ఈ ధర్మాన్ని ఫొటోగ్రాఫిక్ ప్లేట్‌ను ప్రభావితం చెందించడం అంటారు.
- ఎలక్ట్రాన్లకు రుణావేశం ఉంటుందని ఫెరిన్ అనే శాస్త్రవేత్త గుర్తించాడు. వీటి రుణావేశాన్ని ప్రయోగాత్మకంగా నిర్ధారించినందుకు మిల్లికాన్ అనే శాస్త్రవేత్తకు 1923లో నోబెల్ బహుమతి లభించింది.

e^- ఆవేశ విలువ = -1.602×10^{-19} c

- విద్యుత్ , అయస్కాంత క్షేత్రాల్లో ఎలక్ట్రాన్లు ధనపలక వైపు వంగి ప్రయాణిస్తాయి.
- ఎలక్ట్రాన్ ద్రవ్యరాశి 9.11×10^{-31}kg. ద్రవ్యరాశి తక్కువగా ఉండటం వల్ల ఇవి చాలా తేలికగా ఉంటాయి. అందువల్ల ఇవి పరమాణు కేంద్రకం చుట్టూ పరిభ్రమిస్తూ ఉంటాయి.
- విశిష్ట ఆవేశాన్ని జె.జె. థామ్సన్ కనుగొన్నాడు. దీని విలువ..

$$\left(\frac{e}{m}\right) = 1.759 \times 10^{11}\,c\,kg^{-1}$$

- గమనంలో ఉన్న ఎలక్ట్రాన్ రేఖీయ ద్రవ్యవేగం P = mv. ఇది గతిజ శక్తి కలిగి ఉంటుందని విలియం క్రూక్స్ నిరూపించాడు.
- ద్రవ్యరాశి తక్కువగా ఉండటంవల్ల ఎలక్ట్రాన్.. పదార్థం లోపలికి ఎక్కువ లోతు వరకు చొచ్చుకు వెళుతుంది. ఇవి ప్లాటినమ్ (Pt), టంగ్‌స్టన్ (W), మాలిబ్డినమ్ (Mb) లాంటి కఠినమైన లోహాల్లోకి చొచ్చుకు వెళ్లినప్పుడు x– కిరణాలు ఉత్పత్తి అవుతాయి.
- ఒక లోహ పలక ఉపరితలంపై జింక్ సల్ఫైడ్ లేదా బేరియం ప్లాటినో సయనైడ్ లాంటి పదార్థాలతో పూత పూసి, దానిపై ఎలక్ట్రాన్లను పతనం చెందిస్తే దట్టమైన వెలుతురు కనిపిస్తుంది. దీన్ని ప్రతిదీప్తి (Florosence) అంటారు. ఈ ధర్మం ఆధారంగా ఒక ప్రదేశంలో ఎలక్ట్రాన్ల ఉనికిని గుర్తించవచ్చు.
- ఎలక్ట్రాన్లు.. అవి ప్రయాణించే మార్గంలో వాయుస్థితిలో ఉన్న పరమాణువులను ఢీకొని వాటిని అయానీకరణం చెందిస్తాయి. ఒక పరమాణువు బాహ్య కర్పరంలో ఎలక్ట్రాన్‌ను తొలగించడం లేదా అదనంగా చేర్చడాన్ని అయానీకరణం అంటారు. అయానీకరణం జరగాలంటే ఢీకొనే కణానికి ధనావేశం లేదా రుణావేశం ఉండాలి. తటస్థ ఆవేశం ఉన్న (న్యూట్రాన్లు) కణాల వల్ల అయానీకరణం జరగదు.
- గమనంలో ఉన్న ఎలక్ట్రాన్ తరంగ స్వభావాన్ని ప్రదర్శిస్తుంది. దీన్ని నిరూపించినందుకు డీ బ్రోగ్లీ అనే శాస్త్రవేత్తకు 1929లో నోబెల్ బహుమతి వచ్చింది. ఎలక్ట్రాన్ తరంగ స్వభావం ఆధారంగా అన్ని ఎలక్ట్రానిక్ పరికరాలు పనిచేస్తాయి.

ప్రోటాన్

ప్రోటాన్‌ను గోల్డ్ స్టెయిన్ అనే శాస్త్రవేత్త గుర్తించాడు. కానీ ఈ కణాన్ని రూథర్‌ఫర్డ్ ప్రయోగాత్మకంగా కనుగొన్నాడు. ఇతడిని 'కేంద్రక భౌతిక శాస్త్ర పితామహుడు' (Father of Nuclear Physics)గా పేర్కొంటారు. ఇతడి పరిశోధనలకుగాను 1908లో నోబెల్ బహుమతి లభించింది.

ధర్మాలు - ఉపయోగాలు:

- ప్రోటాన్ ఆవేశం విలువ ఎలక్ట్రాన్ ఆవేశం విలువకు సమానంగా ఉంటుంది. ఇది ధనాత్మకంగా ఉంటుంది.
  e = + 1.602×10^{-19} c
- ప్రోటాన్‌లు కూడా వాయుస్థితిలోని పరమాణువులను ఢీకొని వాటిని అయానీకరణం చెందిస్తాయి.
- ప్రోటాన్లు ఫొటోగ్రాఫిక్ ప్లేట్‌ను ప్రభావితం చేస్తాయి.
- విద్యుత్, అయస్కాంత క్షేత్రాల్లో రుణపలక వైపు వంగి ప్రయాణిస్తాయి.
- ప్రోటాన్ ద్రవ్యరాశి 1.67×10^{-27}kg. దీన్ని పరమాణు ద్రవ్యరాశి ప్రమాణంగా పేర్కొంటారు. (ఇది ద్రవ్యరాశిని కొలవడానికి ఉపయోగపడే అతి చిన్న ప్రమాణం. ద్రవ్యరాశిని కొలవడానికి ఉపయోగించే అతిపెద్ద ప్రమాణం చంద్రశేఖర్ లిమిట్
  1 C.S.L. = 1.4 × సూర్యుని ద్రవ్యరాశి
  = $1.4 \times 2 \times 10^{30}$ kg
  = 2.8×10^{30} kg)
- ప్రోటాన్ భారయుతమైంది. ఎలక్ట్రాన్‌తో పోలిస్తే దీని ద్రవ్యరాశి సుమారు 1840 రెట్లు ఎక్కువ. అందువల్ల ప్రోటాన్ ఎల్లప్పుడూ పరమాణు కేంద్రకంలో ఉంటుంది.
- సూర్యుడు, నక్షత్రాల్లో ప్రోటాన్లు (H వాయువు) ఎక్కువగా ఉన్నాయి. ఇవి కేంద్రక సంలీన చర్యల్లో పాల్గొనడం వల్ల సూర్యుడు, నక్షత్రాల నుంచి కాంతి వెలువడుతుంది.

న్యూట్రాన్

న్యూట్రాన్‌ను మొదటగా మేడం క్యూరీ, ఫ్రెడ్రిక్ జోలియట్ క్యూరీ గుర్తించారు. 1932లో దీన్ని చాడ్విక్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. దీనికిగాను అతడికి 1935లో నోబెల్ బహుమతి లభించింది.

ధర్మాలు - ఉపయోగాలు:

- న్యూట్రాన్‌కు ఎలాంటి ఆవేశం ఉండదు.
- విద్యుత్, అయస్కాంత క్షేత్రాల్లో న్యూట్రాన్ ఎటువైపు వంగి ప్రయాణించదు. ఇది రుజుమార్గంలో వెళుతుంది.
- ఆవేశం లేకపోవడం వల్ల న్యూట్రాన్ అయానీకరణ సామర్థ్యం దాదాపు శూన్యం.
- న్యూట్రాన్‌కు ఆవేశం లేకపోవడం వల్ల పదార్థంలో ఎక్కువ లోతుకు (ఎలక్ట్రాన్, ప్రోటాన్లతో పోలిస్తే) చొచ్చుకు వెళుతుంది. కాబట్టి అణు ఇంధనాలైన యురేనియం, థోరియం, ప్లూటోనియంలను విచ్ఛిన్నం చెందించడానికి న్యూట్రాన్లను వాడతారు.
- ఈ కణాలు ఫొటోగ్రాఫిక్ ప్లేట్‌ను ప్రభావితం చేస్తాయి.
- న్యూట్రాన్ ద్రవ్యరాశి ప్రోటాన్ ద్రవ్యరాశికి సమానంగా లేదా స్వల్పంగా ఎక్కువగా ఉంటుంది. న్యూట్రాన్ భారయుతమైన కణం కావడం వల్ల ఎల్లప్పుడూ పరమాణువు కేంద్రకంలో ఉంటుంది.
- తక్కువ వేగంతో ప్రయాణిస్తున్న న్యూట్రాన్‌ను థర్మల్ న్యూట్రాన్ అంటారు.
- స్వేచ్ఛగా ఉన్న ఒక న్యూట్రాన్ సుమారు 13 నిమిషాల్లో విచ్ఛిన్నం చెంది ఒక ప్రోటాన్, ఒక ఎలక్ట్రాన్‌గా విడిపోతుంది. ఈ విధంగా ఏర్పడిన ఎలక్ట్రాన్‌ను β – కిరణం అంటారు.

పరమాణు సంఖ్య: పరమాణు కేంద్రకంలో ఉన్న ప్రోటాన్ సంఖ్యను తెలియజేసేదాన్ని పరమాణు సంఖ్య అంటారు. వీటి సంఖ్య మారితే పరమాణు సంఖ్య కూడా మారి దాని భౌతిక, రసాయనిక ధర్మాలు మార్పు చెందుతాయి.

పరమాణు ద్రవ్యరాశి: పరమాణు కేంద్రకంలోని ప్రోటాన్లు, న్యూట్రాన్ల మొత్తం ద్రవ్యరాశిని పరమాణు ద్రవ్యరాశి అంటారు.

ఉదా: ${}_1H^1$ —— $1p^+ + 0\,{}_0n^1$

${}_6C^{12}$ —— $6p^+ + 6\,{}_0n^1$

${}_{92}U^{235}$ —— $92p^+ + 143\,{}_0n^1$

ఐసోటోపులు: ఒకే పరమాణు సంఖ్య, భిన్నమైన పరమాణు ద్రవ్యరాశులను కలిగి ఉన్న పరమాణువులను ఐసోటోపులు అంటారు. వీటిని ఆస్టన్ కనుగొన్నాడు. పరమాణు కేంద్రకంలో అదనంగా న్యూట్రాన్లు వచ్చి చేరినప్పుడు ఐసోటోపులు ఏర్పడతాయి.

హైడ్రోజన్ ఐసోటోపులు

${}_1H^1$ —— $1p^+ + 0\,{}_0n^1$

${}_1H^2$ —— $1p^+ + 1\,{}_0n^1$

${}_1H^3$ —— $1p^+ + 2\,{}_0n^1$

ఐసోటోపుల్లో ఎలక్ట్రాన్ల సంఖ్య ప్రోటాన్ల సంఖ్యకు సమానంగా ఉంటుంది. కానీ న్యూట్రాన్ల సంఖ్య వేర్వేరుగా ఉంటుంది.


రేడియో ఐసోటోపులు: వీటిని అణు రియాక్టర్లలో ఉత్పత్తి చేస్తారు. ఈ ఐసోటోపులు రేడియో ధార్మికతను ప్రదర్శిస్తాయి.

ఉపయోగాలు:

1. **రేడియో అయోడిన్:** తాగే నీటిలో అయోడిన్ శాతం తక్కువగా ఉంటే గాయిటర్ వ్యాధి వస్తుంది. దీని చికిత్సలో రేడియో అయోడిన్ ఐసోటోపులను వాడతారు.
2. **రేడియో సోడియం:** మానవుని శరీరంలో రక్త సరఫరాలో లోపాలను తెలుసుకోవడానికి, హృదయ స్పందనను నియంత్రించేందుకు ఈ ఐసోటోపును వాడతారు.
3. **రేడియో ఫాస్ఫరస్:** మెదడులో ఏర్పడే కణతిని గుర్తించడానికి, మొక్క నిర్ణీత కాలంలో పీల్చుకున్న నీటి శాతాన్ని, యంత్ర భాగాల అరుగుదల శాతాన్ని అంచనా వేయడానికి ఉపయోగిస్తారు.
4. **రేడియో కోబాల్ట్:** ఈ ఐసోటోపు నుంచి γ – కిరణాలు వెలువడతాయి. γ – కిరణాలకు ఎలాంటి ఆవేశం, ద్రవ్యరాశి ఉండవు. కాబట్టి కేన్సర్ గడ్డలను కరిగించడానికి ఈ కిరణాలను ఉపయోగిస్తారు. ఈ పద్ధతిని కోబాల్ట్ థెరఫీ అంటారు.
5. **కార్బన్ డేటింగ్:** శిలాజాల వయసును అంచనా వేయడానికి ఈ పద్ధతిని ఉపయోగిస్తారు.
   శిలాజాల వయసు = ${}_6C^{14}$ ఐసోటోపుల సంఖ్య / ${}_6C^{12}$ పరమాణువుల సంఖ్య
6. **యురేనియం డేటింగ్:** ఈ పద్ధతిలో భూమి వయసును అంచనా వేస్తారు.

భారత అణుశక్తి సంఘం ముంబైలో బోర్డ్ ఆఫ్ రేడియేషన్ అండ్ ఐసోటోప్ టెక్నాలజీ విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఇక్కడ కావాల్సిన రేడియో ఐసోటోప్‌లను ఉత్పత్తి చేసి వినియోగ స్థలాలకు సురక్షితంగా సరఫరా చేస్తున్నారు. ప్రపంచ దేశాలతో పోలిస్తే రేడియో ఐసోటోప్‌ల ఉత్పత్తి, వినియోగంలో ప్రస్తుతం మనదేశం మొదటి స్థానంలో ఉంది.

Mac Operating System is developed by..



BANK EXAMS

COMPUTER AWARENESS

MODEL QUESTIONS

1. Block on buffer caches is used:
   1) To improve disk performance
   2) To speed up main memory read operation
   3) To handle interrupts
   4) To increase capacity of main memory
   5) None of these
2. An E-R diagram is a graphic method of presenting
   1) Primary keys and their relationships to instances
   2) Entity classes and their relationships to primary keys
   3) Entity classes and their relationships
   4) Primary keys and their relationships
   5) None of the above
3. A hexadigit can be represented by
   1) Three binary (consecutive) bits
   2) Sixteen binary (consecutive) bits
   3) Eight binary (consecutive) bits
   4) Four binary (consecutive) bits
   5) None of the above
4. If a previously saved file is edited ___?
   1) The file must be saved again to store the changes
   2) The changes will automatically be saved in the file
   3) The file will only have to be saved again if it is more than one page in length
   4) Its name must be changed
   5) It cannot be saved again
5. What do we call the HTML codes written in a text editor to make web pages?
   1) Roots 2) HTML tags
   3) Source elements
   4) Source code
   5) None of these
6. What is a portion of a document in which you set certain page formatting options?
   1) Page 2) Document
   3) Section 4) Page Setup
   5) None
7. Which key is used to indent a paragraph in MS word?
   1) Shift 2) Esc 3) Ctrl
   4) Tab 5) None of these
8. In a ring topology, the computer in possession of the______ can transmit data
   1) Packet 2) Data
   3) Token 4) Access method
   5) None of these
9. When you save to ______, your data will remain undamaged even when the computer is turned off.
   1) RAM 2) Motherboard
   3) Auxiliary storage
   4) Primary storage device
   5) None of these
10. A device operating at the physical layer is ________
    1) Bridge 2) Repeater
    3) Router 4) All of the above
    5) None of these
11. What type of computer could be found in a digital watch?
    1) Embedded computer
    2) Super computer
    3) Mainframe computer
    4) Notebook computer
    5) None of these
12. HTTP in URL stands for
    1) Hyper Text to Point
    2) Hyperlink for Tiny Protocol
    3) Highlighted Text through Pictures
    4) Hyper Text Transfer Protocol
    5) None of the above
13. Memory allocation at the dynamic time is known as
    1) Static memory allocation
    2) Demanding 3) Paging
    4) Run time memory allocation
    5) None of the above
14. Network components are connected to the identical cable in the _____ topology
    1) Star 2) Bus 3) Ring
    4) Mesh 5) Mixed
15. A mobile phone number, a date of birth and a customer name are all examples of
    1) A record 2) Data 3) A file
    4) A database 5) None of these
16. In Excel, _____ contains one or more worksheets.
    1) Template 2) Workbook
    3) Active cell 4) Label
    5) None of these
17. Cyberspace is being governed by a system of law and regulation called?
    1) Civil Law 2) Criminal Law
    3) Cyber Law 4) Electronic Law
    5) Cyber Authority
18. Primary memory is used by the:
    1) CPU 2) Input device
    3) User 4) All of these
    5) None of these
19. In Ms- Word, what combination of keys do you press to delete an entire word?
    1) Ctrl + Del 2) Alt + Del
    3) Shift + Backspace
    4) Shift + Alt + Del
    5) None of these
20. Specialized programs that allow particular input or output devices to communicate with the rest of the computer system are called ____.
    1) Operating systems
    2) Device drivers 3) Utilities
    4) Language translators
    5) Connectors
21. ROM and memory differ with respect to which of the following characteristics?
    1) Price 2) Reliability
    3) Speed 4) All of the above
    5) None of these
22. The group of processors combined together to create a program is referred to as
    1) Multi-programming
    2) Multiprocessing
    3) Multitasking
    4) Thrashing 5) None of these
23. Which device is used to access your computer from another computer or for talk over phone?
    1) CD-ROM Drive 2) Modem
    3) RAM 4) Hard Drive
    5) None of these
24. System software does all of the following except
    1) Add graphics and pictures to files.
    2) Coordinate instructions between application software and the computer's hardware devices.
    3) Help manage system resources.
    4) Help run the computer.
    5) None of these
25. What are .bas, .doc and .htm examples of?
    1) Databases 2) Extensions
    3) Domains 4) Protocols
    5) None of these
26. When data changes in multiple lists and all lists are not updated, this causes:
    1) Data redundancy
    2) Information overload
    3) Duplicate data
    4) Data inconsistency
    5) Data repetition
27. Which of the following is not true?
    1) Chatting is like e-mail
    2) Chatting can be done with a single person
    3) Chatting can involve multiple persons
    4) Chatting is an electronic dialogue
    5) None of these
28. ______ is the process of dividing the disk into tracks and sectors.
    1) Tracking 2) Allotting
    3) Crashing 4) Formatting
    5) None of these
29. The computer abbreviation of KiB usually means-
    1) Key Block 2) kibi byte
    3) Kilobyte 4) Kernel Boot
    5) None of these
30. Hardware used to translate words, sounds, images, and actions that people understand into a form that the system unit can process is known as ______
    1) Device drives
    2) Device readers
    3) Input devices
    4) Output devices
    5) None of these
31. The mouse ______ usually appears in the shape of an arrow.
    1) Indicator 2) Marker
    3) Meter 4) Pointer
    5) None of these
32. A tool used to find a synonym or antonym for a particular word
    1) Dictionary 2) Summary
    3) Thesaurus 4) Spell check
    5) None of the above
33. Which of the following protocols is used by Internet mail?
    1) HTTP 2) TCP/IP 3) FTP
    4) HTMP 5) None of these
34. A scripting language similar to HTML and which runs only on a browser is
    1) FORTRAN 2) BASIC
    3) FOXPRO 4) Java script
    5) None of these
35. Generally, you access the Recycle Bin through an icon located-
    1) On the first visible screen
    2) On the hard drive
    3) On the shortcut menu
    4) In the Properties dialog box
    5) None of these
36. The first Computers were programmed using ______
    1) Assembly Language
    2) Machine Language
    3) Source Code 4) Object code
    5) Spaghetti code
37. The programs which are as permanent as hardware and stored in ROM is known as
    1) Hardware 2) Software
    3) Firmware 4) ROM ware
    5) None of these
38. Which computer memory is used for storing programs and data currently being processed by the CPU?
    1) Mass memory
    2) Internal memory
    3) Non-volatile memory
    4) PROM 5) None of these
39. The world's first truly cross-platform programming language is called ______
    1) C++ 2) Java
    3) Visual Basic.NET
    4) Smalltalk 5) None of these
40. ______ software allows the user to speak into the computer rather than type in text.
    1) Speech recognition
    2) Chat 3) Message
    4) All of the above
    5) None of these
41. The _____ folder retains copies of mail that you have in progress but are not yet ready to send.
    1) Drafts 2) Outbox
    3) Address Book 4) Sent Items
    5) None of these
42. Which of the following programming language is used to create programs like applets?
    1) COBOL 2) C Language
    3) Java 4) BASIC 5) None of these
43. Mac Operating System is developed by which company?
    1) IBM 2) Apple
    3) Microsoft 4) Samsung
    5) None of these
44. A characteristic of a file server is which of the following?
    1) Acts as a fat client and is limited to one PC
    2) Manages file operations and is limited to one PC
    3) Acts as a fat client and is shared on a network
    4) Manages file operations and is shared on a network
    5) None of these
45. The access method used for magnetic tape is_____
    1) Direct 2) Random
    3) All of the above
    4) Sequential
    5) None of these
46. What is a serial port that adds a direct connection to a network?
    1) FireWire 2) NIC
    3) USB 4) Internal modem
    5) None of these
47. Which of the following activities is NOT a component of e-business?
    1) Collaboration with business partners
    2) Cash flow management
    3) Customer service
    4) Selling 5) None of these
48. Which of the following is used for close a tab on a browser?
    1) Ctrl + T 2) Ctrl + W
    3) Ctrl + A 4) Ctrl + Y
    5) None of these
49. ____ is the process of carrying out commands.
    1) Fetching 2) Storing
    3) Executing 4) Decoding
    5) None of these

Key

1) 1; 2) 2; 3) 4; 4) 1;
5) 4; 6) 4; 7) 4; 8) 3;
9) 3; 10) 2; 11) 1; 12) 4;
13) 4; 14) 2; 15) 1; 16) 2;
17) 3; 18) 1; 19) 5; 20) 2;
21) 4; 22) 2; 23) 2; 24) 1;
25) 2; 26) 4; 27) 1; 28) 4;
29) 2; 30) 3; 31) 4; 32) 3;
33) 1; 34) 4; 35) 1; 36) 2;
37) 3; 38) 2; 39) 2; 40) 1;
41) 1; 42) 3; 43) 2; 44) 4;
45) 4; 46) 2; 47) 2; 48) 2;
49) 3.